

# అతను - ఆమె - కాలం

## బహుమతి కథల మణిహారం

జి.ఎస్. లక్ష్మి

జి.ఎస్. లక్ష్మి కథలు

# అతను - ఆమె - కాలం

బహుమతి కథల మణిహారం

జి.ఎస్. లక్ష్మి కథలు

# శ్రీ శారదాస్తుతి



చం : జిలి బిలి జుంటి తుమ్మెదలు చేసెడి నాదవు గాన మాధురిన్
ఒలికెడి తీపి తేనె రుచి ఉల్లము నిండుగ నింపి కావవే !
పలుకుల రాణి నీ కృపను పాడిన పాటలు వేయి తీరులై
నెలకొను మాదు కోరికల నిండుగ తీర్చుము తల్లి శారదా !

# అతను - ఆమె - కాలం

**బహుమతి కథల మణిహారం**

రచన

**జి.ఎస్. లక్ష్మి**

# ATANU - AAME - KAALAM

*(Collection of Short Stories)*

**by Garimella Subba Lakshmi**

First Published : December 2015

© : Author

Copies : 500

Cover Design :
**Garimella Subba Lakshmi**

Price : Rs. **150 /-** **US $ 9.99**

Books Available at :
**Smt. G.S. Lakshmi**
2 - 2 - 23 / 7 /1, Bagh Amberpet
Hyderabad - 500 013
Ph : **040 - 27425306**
Cell : **990 864 8068**
E-mail : slalita199@gmail.com

Printed at :
**Sri Uday Printers**
3-5-170 / 1 /8 / 1 / A
Narayanguda, Hyderabad - 29.
**Ph : 040-64511385**

**ALL RIGHTS RESERVED :** Any unauthorized reprint or use of this material is prohibited. No part of this book may be reproduced or transmitted in any form or by any means, electronic or mechanical, including photocopying, recording, or by any information storage and retrieval system without express written permission from the author / publisher.

# అంకితం

**అమ్మా నాన్నల దివ్యస్మృతికి**



## శ్రీ పిడపర్తి సుబ్బయ్యశాస్త్రి, శ్రీమతి పద్మావతి

# ఈ కథలలో ...


| | | |
|---|---|---|
| 1. | ఏది పుణ్యం | 13 |
| 2. | దాంపత్యం | 24 |
| 3. | చందమామ రావె | 37 |
| 4. | పాపం మాలతి | 44 |
| 5. | ఇది ఇలా సాగవలసిందేనా ? | 55 |
| 6. | అతను - ఆమె - కాలం | 60 |
| 7. | నాణానికి మరోవైపు | 68 |
| 8. | పెన్నిధి దొరికింది | 75 |
| 9. | కాస్త ఆలోచిస్తే | 83 |
| 10. | ఇప్పుడైనా చెప్పనీయమ్మా | 96 |
| 11. | మరోకోణం | 106 |
| 12. | ప్రత్యక్ష సాక్షి | 111 |
| 13. | మునిమనవడి సంబరం | 118 |
| 14. | ఒఖ్ఖ రెండు రూపాయలు | 127 |
| 15. | మూర్తిగారొచ్చేరు | 131 |
| 16. | మేడిపండ్లు | 140 |
| 17. | మీరే నేర్వాలి | 148 |
| 18. | కలికి కాత్యాయిని | 154 |
| 19. | ఇస్తినమ్మ వాయినం ... పుచ్చుకుంటినమ్మ వాయినం | 162 |
| 20. | డిజైనర్ ఫుడ్ | 171 |
| 21. | పాత సీసాలో కొత్త సారా | 181 |
| 22. | వెట్టిబాగుల వదిన వ్రతకథ | 190 |
| 23. | జయహో వదినా | 195 |

# ముందుమాట

ఆయిదారు సంవత్సరాల క్రితం అనుకుంటాను. నవ్య కథల పోటీలో గెలిచిన పది కథలలో ఒకటి అనుకుంటాను. అతను - ఆమె - కాలం.

ఆ పది కథలలో నాదీ ఒకటి కావడం ... నాకు సంతోషమే !

లక్ష్మి గారి కథ చదవగానే ... అక్కడే కాస్సేపాగిపోయాను.

కొన్ని కథలలా మనసుకి హత్తుకుంటాయి.

వెంటనే నవ్య వీక్లీ వారు రచయితల సెల్ నెంబర్స్ ఇచ్చే సదుపాయం కల్గించటం వలన నేను వెంటనే లక్ష్మిగారికి కాల్ చేసి అభినందించేను. ఆ కథ ఎందుకు నచ్చిందో ... ఆవిడెందుకు రాశారో అయ్యాక వారిని కలవాలనుకున్నాను. కాని ... అదెందుకో కుదరలేదు.

సరిగ్గా సంవత్సరంన్నర క్రితం నేను ఫేస్‌బుక్‌లో ప్రవేశించాక లక్ష్మిగారు మళ్ళీ తారసపడ్డారు. ఆవిడే ఈవిడని గ్రహించేలోపున ఆమె నాకు మంచి స్నేహితురాలిగా మారేరు. ఈలోపున అడపాదడపా ఆమె బహుమతులు గెలుచుకున్న కథలు చదవుతూనే వచ్చాను.

ఇదిగో ... వాటినే ఆమె మణుల సమాహారంగా పొదిగి మనముందు పుస్తక రూపంలో వెలువరిస్తున్నారు.

విచిత్రంగా ... నాకు నచ్చిన మొదటి కథపేరే ఈ పుస్తకానికి పెట్టడం యాదృచ్ఛికమైనా ... చిత్రమే !

కథలన్నీ ఒక్కొక్కటిగా చదువుతూ వచ్చాను. కథలకి ప్రాణం కథనం. చెప్పాల్సిన విషయాన్ని ఎక్కడ మొదలుపెట్టి ఎలా ముగిస్తే పాఠకుణ్ణి ఆకట్టుకుంటుందో లక్ష్మి గారికి బాగా తెలుసుననిపించింది.

మరొకటి శైలి. కథకి కావాల్సినంత మేరనే భాషని వాడటం ... ఆ భాష

సరళంగా వుండటం చదువరిని కథలోకి తీసుకెళ్ళడానికి ఎలాంటి ఇబ్బందికి గురిచేయకుండా నల్లేరు మీద బండిలా సునాయాసంగా కథ వెంబడి మనల్ని పరుగులు తీయించడంలో లక్ష్మి గారు సఫలీకృతురాలయ్యారనే చెప్పాలి !

లేకపోతే ఇన్ని బహుమతులా !

ఇందులో 23 కథలున్నాయి.

దేనికది ఒక ప్రత్యేకతని సంతరించుకున్నాయి. రోజూ మనకి తారసపడే సంఘటనలే ! అరె, వీటినిలా కథలా రాయొచ్చా అని ఆశ్చర్యానికి గురి చేస్తారు రచయిత్రి.

సహజంగా హాస్య ప్రియత్వం వున్న లక్ష్మిగారు చాలాసార్లు నవ్వుతూ నన్ను ఆగిపోయేలా చేసేరు. మరి కొన్ని చోట్ల బాధతో హృదయం మెలిపడేలా చేసేరు.

అలాంటి కథ 'ఒఖ్ఖ రెండు రూపాయలు'. ఈ కథ ముగించేసరికి నా కళ్ళు తడయిపోయాయి. చాలాసేపు అలా కూర్చుండిపోయాను. ఇచ్చి పోషించిన చేతులు యాచించడం ... అదీ కన్న కొడుకుని ... హృదయం ద్రవించిపోయింది.

"ఇప్పుడైనా చెప్పనీయమ్మా", "అతను - ఆమె - కాలం" మనల్ని ఎంత లోతుగా ఆలోచనకి గురిచేస్తాయో ... "కాస్త ఆలోచిస్తే", "ఇదిలా సాగవలసిందేనా" ... బాధని కల్గిస్తాయి.

వెర్రిబాగుల వదిన కథ చదివి 'అయ్యారే వదిన !' అని తెల్లబోతూ నవ్వుకుంటాం. నవ్వుతూ తెల్లబోతాం.

'పాతసీసాలో కొత్తసారా' ... మన అత్యాధునిక యుగంలో కృతక మర్యాదలని చూపిస్తే ... 'మేడిపండ్లు' కథలో తులసమ్మ వంటమనిషికి చెప్పిన మాట మనసుల్ని ద్రవింపజేస్తుంది.

"నువ్వు వంటల్లో ఉప్పువి. నువ్వు లేకపోతే జరగదు. నేను ఇప్పుడు కరివేపాకుని. లేకపోయినా జరుగుతుందని చెప్పడం ... చివరికి 'వీళ్ళు నా పిల్లలమ్మా' అని చెప్పడంలో ఆ తల్లి ఔదార్యం కనిపిస్తాయి.

రచయిత్రి శైలి గురించి మరోసారి చెప్పక తప్పదు. "కష్టపడటంలో ఆనందాన్ని

నేర్పండి, ప్రకృతితో పరిచయం చెయ్యండి, విజయాన్ని ఓటమిని ఒక్కలా తీసుకోవడం నేర్పండి'' అంటారు 'మీరే నేర్పాలి' కథలో.

కొన్నిచోట్ల చాల చమత్కారంగా సాగేయి సంభాషణలు. పాయసంలో జీడిపప్పు కనిపిస్తే చటుక్కున నోట్లో వేసుకున్నట్లు తెలిసిన మొహం కనిపించగానే లాగి దగ్గర కూర్చోబెట్టుకున్నారని చెప్పడం ... చాల సరైన పోలికగా అనిపిస్తుంది.

మొక్కనాటే ముందు యెరువు వేసినట్లుగా పెళ్ళికి ముందే భార్యపై కొన్ని దురభిప్రాయాల్ని తన బుర్రలో పెట్టేసారని భర్త అనుకోవడం చాల సరిగ్గా చెప్పారని పించింది.

ఈ కథలన్నింటిని చదివేక లక్ష్మిగారు ఎంతటి మంచి కథకురాలో నాకు కూడ అర్థమైంది.

సమాజంలో జరుగుతున్న మార్పుల పట్ల సునిశిత దృష్టి, వాటి పట్ల ఒక అనుకూల దృష్టి ... వాటిని ఏ విధంగా సమర్థించుకుని సరిచేసుకోవాలో అనే అవగాహనతో కథలన్నీ ముందుకు సాగేయి.

ఏదో ఒకటి చెప్పేద్దామని కాకుండా రచయిత్రిగా తనకున్న సామాజిక బాధ్యతని గుర్తెరిగి చాల సామర్థ్యంతో ప్రతి కథని గుండెకు హత్తుకుని, మనసుకి ఎత్తుకుని రాశారని పించింది నాకు.

ఇక శైలి సరేసరి ! ఆ తీగెపాకం గురించి ఎంత చెప్పినా సరిపోదు.

ప్రతికథా ద్రాక్షాపాకమే !

ఇంతటి చక్కటి కథల్ని చిక్కని పాకంలో అద్ది మా కందించినందుకు జి.ఎస్. లక్ష్మి గారిని రచయిత్రిగానే కాకుండా ఒక స్నేహితురాలిగా కూడా మనసారా అభినందిస్తూ వారి కలం మరింత వేగంగా పరుగులు తీయాలని కోరుతూ ....

అభినందనలతో

**మన్నెం శారద**

(రచయిత్రి)

# నా మాట

**పలుకులరాణి ఆ వాగ్దేవికి ప్రణమిల్లుతూ ...**

కదిలించే ఒక భావన మనసులో మొలకెత్తుతుంది. ఆ భావాన్ని తెలిపే అందమైన పదాలకోసం తపన మొదలవుతుంది. పడికట్టు పదాలు ఆ భావానికి ప్రాణం పోస్తాయి. మెదడు దానిని ముస్తాబు చేస్తుంది. అలంకారాలు ఆభరణా లవుతాయి. చక్కని కథ కనులముందు ప్రత్యక్షమవుతుంది. ఆ కథను చూసు కున్నప్పుడు ఆ రచయిత కాని రచయిత్రి కాని తను చేసిన సృజనకు పొందే ఆనందం వెలకట్టలేనిది. ఆ కథ సంపాదకులకు నచ్చి పత్రికలో ప్రచురణార్హమైతే ఆ ఆనందం మరింత యినుమడిస్తుంది. ఆ కథలే కథల పోటీలలో న్యాయనిర్ణేతల తులనాత్మక శక్తికి నిలబడి, గెలిచి, బహుమతులందుకుంటుంటే మరింక ఆ రచయిత (త్రి)కి అంతకంటే ఉత్సాహం కలిగించేది మరొకటి వుండదు కదా ... ప్రస్తుతం నేను అంత ఉత్సాహంగానూ ఈ పుస్తకంలో వివిధ పత్రికలలో బహుమతులు పొందిన నా కథలను పొందు పరిచాను. ఏ కథ అందం ఆ కథదే. ఏ కథ ప్రాముఖ్యత ఆ కథదే.

సమాజంలో కాలంతో పాటు మార్పు రావడం సహజమే. కానీ గత కొన్నేళ్ళుగా ఒక్కసారిగా పెరిగిన సాంకేతికత వలన ప్రపంచమంతా ఒక కుగ్రామంలా కనిపిస్తున్న నేపథ్యంలో అంత త్వరగానూ మనుషుల జీవన విధానంలో వచ్చిన మార్పు ఎటు వంటిదో, దానివలన వారి మనస్తత్వాలు ఏ విధంగా మారాయో, మానవ సంబంధాలూ, అనుబంధాలూ, విలువలూ ఎలా వాటి వాటి అర్థాలను మార్చుకున్నాయో గమనిస్తుంటే కలిగిన ఆలోచనలే నా కథలకు ప్రేరణలు.

అలా మారుతున్న మన సమాజానికి పునాది కుటుంబం. ఒక కుటుంబంలోని వ్యక్తులు ఒకరినొకరు సరిగా అర్థంచేసుకోకపోవడం వల్లా, ఒకరిపై మరొకరికి సరియైన అవగాహన లేకపోవడం వల్లా, ఒకవేళ అవగాహన కలిగివున్నా దానిని ప్రకటించే పద్ధతి తెలియకపోవడం వల్లా కలిగే పరిణామాలను దృష్టిలో వుంచుకుని నేను కథలు రాసాను.

అధికారం చలాయించే భర్తకి ఇల్లాలి ప్రాముఖ్యత తెలియపరిచేలా చెయ్యడం (దాంపత్యం), ఒక వ్యక్తి జీవితంలో రాణించాలంటే అతనికి తల్లి స్ఫూర్తి నందించడం

(ఇప్పుడైనా చెప్పనీయమ్మా), తల్లి పిల్లల మధ్య గల ప్రేమలో ఎంత దైవత్వముందో చూపించడం (చందమామ రావె ...), పిల్లలకి ఏ వయసులో పరిణతి వస్తుందో తల్లిదండ్రులు సరిగా గమనించాలని చెప్పడం (కాస్త ఆలోచిస్తే ...), అప్పటికీ ఇప్పటికీ స్త్రీకి నిజంగా స్వాతంత్ర్యం వచ్చిందా అనే సంశయం (కలికి కాత్యాయిని), ప్రతి విషయాన్నీ వ్యతిరేకభావనతోనే చూడకూడదనీ, చాలా సమస్యలు మనకి మనం సృజించుకున్నవేననీ, తృప్తిగా జీవించడమనేది మన చేతిలోనే వుందనీ, మనలో సానుకూల భావనలను పెంచుకోవాలని చెప్పడం (నాణానికి మరోవైపు), ఈ రోజుల్లో పుణ్యం సంపాదించుకుందుకు చేసే దానధర్మాలంటే యేమిటో కొత్త భాష్యం చెప్పిన పార్వతి కథ (ఏది పుణ్యం) వంటి కథలను చాలామంది మెచ్చుకున్నారు. అంతేకాకుండా సమాజంలో జరిగే కొన్ని తట్టుకోలేని సంఘటనలను చూసినప్పుడు అవి కథలుగా మారాయి. సంఘసేవ పేరుతో బాలలను ఇంట్లో పనివారుగా పెట్టుకోవడం (ఇది ఇలా సాగవలసిందేనా), వృద్ధులైన తల్లిదండ్రులకు చేతిలో రూపాయి మటుకు యెందుకు అనుకునే పిల్లల ఆంతర్యం (ఒఖ్ఖ రెండు రూపాయలు), విద్యార్థి దశలోనే పిల్లలలో చేరుతున్న సంఘ వ్యతిరేక భావనలు (ప్రత్యక్షసాక్షి) వంటి కథలు వీటిని తెలియజేస్తాయి.

వాటితో పాటు తరాల మధ్యగల చక్కటి అనుబంధాలను జెప్పే "పెన్నిధి దొరికింది", "మునిమనవడి సంబరం" కథలు చాలామంది పాఠకులు మెచ్చుకున్నారు. మారుతున్న కాలంతో మనుషుల మనస్తత్వాలలోనూ మార్పులు వస్తాయని, అది గుర్తించి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలనీ "అతను ... ఆమె ... కాలం" అనే కథ చెపుతుంది. సాంకేతికతకు సాంప్రదాయాన్ని జోడించి చెప్పిన కథే "ఇస్తినమ్మ వాయినం ... పుచ్చుకుంటినమ్మ వాయినం" అనే ఆహ్లాదకర కథ. పెళ్ళి వేడుకలలో తొక్కుతున్న కొత్తపుంతలు "పాతసీసాలో కొత్తసారా" అనే హాస్యకథ.

ఇలాగ ఎంత చిన్నదైనా నా చుట్టూ తిరుగుతున్న ప్రతి సంఘటనకు కాస్త కల్పన జోడించి మలచిన కథలను పత్రికా సంపాదకులు ప్రచురించారు. పాఠకులు ఆదరించారు. వాటిలో ప్రత్యేకమైన మణులన్నింటినీ ఏరి కూర్చి చేసినదే ఈ బహుమతి కథల మణిహారం.

ప్రముఖ కథకులు 'వసుంధర' గారు ఒరిస్సా నుండి వ్యక్తిగతంగా నాకు 'దాంపత్యం' కథను ఎలా మార్పుచేయాలో సూచిస్తూ రాసిన ఉత్తరమే నాలో కథలు

రాయగలనన్న నమ్మకం కలిగించింది. వారికి నేను మొట్టమొదటగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ఈ సంపుటిలోని పదహారు కథలు వివిధ పత్రికలలో బహుమతులు అందుకున్నాయి. మిగిలిన ఏడు కథలూ కూడా ప్రముఖులచే ఆదరించబడి, ఇతర భాషలలోకి అనువదించబడ్డాయి. కొన్ని కథలు కథా సంపుటాలలో చోటు చేసుకున్నాయి. ఈ కథలను ప్రచురించిన పత్రికా సంపాదకులకు, వారి వారి సంపుటాలలో వేసుకున్న సంకలనకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపు కుంటున్నాను.

వీటిలో కొన్ని కథలు కన్నడ, తమిళ, ఆంగ్ల భాషలలోకి అనువదించబడి ప్రచురించబడ్డాయి. కన్నడంలోకి శ్రీ కలుమంగి కృష్ణమూర్తి గారు, తమిళంలోకి శ్రీమతి గౌరీ కిరుబందన్ గారూ, ఇంగ్లీషులోకి ప్రొఫెసర్ ఏలేశ్వరపు నాగేశ్వరరావు గారూ అనువదించారు. వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

గర్ల్ విత్ గోల్డెన్ పెన్‌గా పేరొందిన ప్రఖ్యాత రచయిత్రి మన్నెం శారద గారు విలువైన వారి కాలాన్ని నాకోసం వెచ్చించి, ఎంతో ఆత్మీయంగా నా కథల మణిహారానికి ముందుమాట రాశారు. వారికి ఎన్ని రకాలుగా కృతజ్ఞతలు చెప్పుకున్నా తక్కువనే అనుకుంటాను.

కవర్‌పేజీకి ఫోటో అందించిన ప్రియ నెచ్చెలి ఉషారాణికి హృదయ పూర్వక ధన్యవాదాలు. ప్రతి ప్రయత్నంలోనూ నన్ను ఆదరించి ప్రోత్సహిస్తున్న హితులు, సన్నిహితులు, స్నేహితులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ పుస్తకం తీసుకురావడానికి ప్రతి అడుగులోనూ తన సహాయ, సహకారాల నందించి, నా చేయి పట్టుకు నడిపించిన మా వారు విశ్వనాథం గారికి మనఃపూర్వక ధన్యవాదాలు.

చక్కని సలహాల నిచ్చి పుస్తకం అందంగా రావడానికి సహకరించిన శ్రీ ఉదయ్ ప్రింటర్స్ వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

ప్రమదావని, ప్రమదాక్షరి, కథా కుటుంబం, ఫేస్‌బుక్ మిత్రులందరూ నా ఈ ప్రథమ ప్రయత్నాన్ని ఆదరిస్తారని ఆశిస్తాను.

**- జి.ఎస్. లక్ష్మి**

# ఏది పుణ్యం

"**ఇం**తే యింక మనం ... ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు పడుంటాం ... కనీసం పిల్లల భవిష్యత్తైనా చూసుకోవద్దా ? వాళ్ళూ మాలాగే వుండాలా ? ... చూడు ... ఆ సంబంధానికి మీ చలపతి మామయ్య వెళ్ళేట్ట. ప్రయోజకుడు ... ఎంచక్కా కుదుర్చుకుంటాడు కూతురుకా సంబంధం ... మనం మటుకు రూపాయలూ, పైసలూ లెక్కెట్టుకుంటూ యిలాగే వుంటాం ..."

అనంత ప్రవాహంలా సాగిపోతున్న పార్వతి సుప్రభాతానికి దిగ్గున లేచాను. మళ్ళీ దీపకేదో సంబంధం వచ్చినట్టుందే అనుకుంటుంటే చటుక్కున గుర్తొచ్చింది నిన్న రాత్రి నేనూ, పార్వతీ మాట్లాడుకున్న సంబంధం మాట.

"అమ్మా, పొద్దున్నే డిస్టర్బ్ అవకు. డాడీ చెప్పింది అక్షరాలా నిజం. ఏదో సంబంధం చేజారిపోతుందేమోననే ఆతృతతో అలా అంటున్నావు కానీ నీకు మటుకు మనుషుల మనస్తత్వాలు తెలీవా ?" మా అమ్మాయి దీప తల్లిని సమాధానపరుస్తోంది. నా బంగారుతల్లి. ఇంత చిన్న వయసులోనే ఎంత ప్రాజ్ఞత చూపిస్తోందీ ? నా కూతురు కదా మరి. కూతురి మీద ప్రేమతో గుండె నిండిపోయింది.

"ఆ ... తెలుసు ... అన్నీ తెలుసు ... ఇదంతా చూస్తుంటే నాకసలు ఏ విషయం తెలీని మొద్దు మొహాన్నైతే యెంత బాగుండునో అనిపిస్తోంది."

పార్వతి మాటలకి 'ఛుయ్' మన కుక్కర్ శబ్దంతో పాటు 'ఝుయ్' మనే మిక్సీ శబ్దం వంత పలికింది. నాకు తెలుసు పార్వతి ఎటువంటి పరిస్థితిని ఎదుర్కొంటోందో ... కూతురికి పెళ్ళి ప్రయత్నాలు సరిగ్గా చెయ్యలేకపోతున్నామేమో ననే ఆతృత ఆమె చేత అలా పలికిస్తోంది.

నిన్నరాత్రి నాకూ పార్వతికీ మధ్య జరిగిన సంభాషణ గుర్తొచ్చింది. రఘురాంకి తెలిసిన సంబంధం. బాగా ఆస్తిపరులే. కుర్రాడి ఉద్యోగం పర్లేదు. అంతా బానేవుంది. అసలు గొడవెక్కడొచ్చిందంటే వాళ్ళకి కట్నం అఖ్ఖర్లేదుట ... లాంఛనాలూ, ముద్దు ముచ్చట్లూ బాగా జరిపించాలిట.

ఇక్కడే పేచీ వచ్చింది నాకూ, మా ఆవిడకీ. అంతటి ఆస్తిపరులు లాంఛనా లన్నారంటే అది నేను కట్నం అనుకున్నదాన్ని మించిపోతుంది. కట్నం యింతని

తీసుకుంటే అది వేరే మాట. మరింక రెండు కుటుంబాల మధ్య చిన్న చిన్న విషయాలు తప్పితే ఆర్థికపరంగా తేడాలు రావు. ఇటువంటి సంబంధాలైతే అస్తమానం వాళ్ల గొప్పతనం చూపించుకుంటూ, పుట్టింటివాళ్ళని తక్కువచేస్తుంటే అమ్మాయెంత చిన్నబుచ్చు కుంటుందీ ? దేనికీ లేని శక్తి డబ్బుకుంది.

ఇంత వివరించి చెప్పినా అర్థంకాదే ఆవిడగారికి ! ఎంత యుద్ధం చేసింది నిన్న ! నాకు ప్రయోజకత్వం లేదంది. అఖ్ఖర్లేని విషయాలాలోచించి బంగారం లాంటి సంబంధం వదులుకోవడం విజ్ఞత కాదంది. నన్ను వట్టి చేతకానివాడిగా తేల్చి పడేసింది. యిటువంటి సమయంలో నేను మునిమాణిక్యంగారిని గుర్తు చేసుకుంటాను. ఎంత అందంగా చెప్పారా మహానుభావులు ! భార్యాభర్తలిద్దరూ దెబ్బలాడుకుంటే ఒక విధమైన సంగీతం పుడుతుందిట. అంతటి చక్కటి సంగీతాన్ని నిన్న రాత్రి నేనూ, మా ఆవిడా కరువుతీరా ఆస్వాదించాం. బహుశా అది ఈరోజు కూడా కొనసాగుతుందేమో ...

"ఆ సంబంధానికి చలపతి వెళ్ళేట్ట ..." కాఫీ అందిస్తూ నెమ్మదిగా మొదలెట్టింది పార్వతి. అంటే ఆవేశపడకుండా స్థిమితంగా నాతో వాదనకు సిద్ధపడే వచ్చిందన్న మాట.

"మంచిదే కదా ..." అన్నాను ఏ భావమూ బైటకి తెలీకుండా ...

"మనకన్న ఎక్కువివ్వగలడా చలపతి ? పదో పరకో తక్కువైతే అప్పో సొప్పో చేసి పిల్ల పెళ్ళి చేసుకోవాలి కానీ బంగారం లాంటి సంబంధం చేజేతులా వదులు కుంటారా ... ?"

నన్ను ఒప్పించడానికి ప్రయత్నం చేస్తోందని అర్థమైంది.

నచ్చచెప్పడానికి ప్రయత్నించాను.

"చూడు పార్వతీ, ఇది పదీ పరక్కీ సంబంధించిన విషయం కాదు. అమ్మాయి భవిష్యత్తుకి సంబంధించింది. వాళ్ళు డబ్బు మనుషులు. నాకు తెలుసు. ఈరోజు కూడా ఆ తండ్రి కన్సల్టేషన్‌తో రోజుకి మూడువేలు సంపాదిస్తాడు. వాళ్ల కోరికలు కూడా అదే ఎత్తులో వుంటాయి. తప్పులేదు. అది వాళ్ళ విషయం. కానీ నేను ఒక మామూలు గవర్నమెంటాఫీసర్ని. మన ఆర్థిక స్తోమత నీకు తెలియంది కాదు. డొనేషన్ కట్టి రవిని ఇంజనీరింగు చదివిస్తున్నాం. దీప పెళ్ళికి ఏదో కాస్త ఆదా చేసాం. పైన మరికాస్త అప్పు చేయక తప్పదు. కాని మన అంతస్తు దాటి ఇస్తే మన అమ్మాయి అక్కడ ఇమడగలదా ? వాళ్ళు చిన్నచూపు చూడరూ ? నువ్వు కూడా ఆలోచించు."

"పిల్లని పెద్దింట్లో పడెయ్యాలని పెద్దవాళ్ళు చెప్పారు."

"నిజమే. అప్పటి కాలాన్ని బట్టి వాళ్ళలా చెప్పారు. అప్పుడు చిన్నప్పుడే

పెళ్ళిళ్ళు చేసేవారు. అమ్మాయి ఆలోచనలూ, అభిప్రాయాలూ అత్తవారింట్లోనే ఎదిగి బలపడేవి. కాని ఇప్పుడు పెళ్ళి జరిగేటప్పటికే అమ్మాయికి సొంత అభిప్రాయాలూ, ఆలోచనలూ వుంటున్నాయి. వాటికి తేడా వచ్చే ఇంట్లోకి వెడితే అమ్మాయి ఇబ్బంది పడదూ ?''

"తలపాగా చుట్టలేనివాడు తల వంకరన్నాట్ట. అలా వుంది మీరు చెప్పింది. పెళ్ళి చేసుకున్న వాళ్లందరూ కాపరాలు చెయ్యటం లేదా ?''

నాకింక సహనం నశించింది. కావలసినంత సంపాదించలేని నా అసమర్థతను పార్వతి యెద్దేవా చేస్తోంది.

"ఇంత మూర్ఖంగా వాదిస్తావేంటి ? దీప సంతోషంగా వుండాలనే నేనింతగా చెపుతుంటే ...''

హెచ్చిన నా కంఠస్వరానికి దీప, రవి కంగారు పడుతూ వాళ్ల గదిలోంచి బైటకొచ్చారు. నన్ను నేను సంబాళించుకున్నాను. ఇంతలో ఫోను. మా అందర్నీ అర్థవంతంగా చూస్తూ ఫోన్ తీసింది పార్వతి. అందరం ఒక్కసారి సైలంటయిపోయాం. అట్నుంచి మామూలు ప్రశ్నే అనుకుంటాను ...

"ఆ పద్మా ... బిజీదేముందిలే ... చెప్పు ... ఏంటి విషయం ?''

"ఆ ... కుదిరిందా ... అన్ని మాటలూ అయిపోయాయా ... ?'' ఉత్సుకత తొంగి చూసింది పార్వతి మాటల్లో. ఇంక ఇవాళ్టికి నాపనైపోయినట్టే ... అనుకున్నాను.

"ఏమిటీ ? లాంఛనాలు లక్షరూపాయలా ? ఇంకా ...'' అంటోంది పార్వతి.

వెంటనే నేను ఫోనుకున్న స్పీకర్ బటన్ నొక్కాను. అట్నుంచి పార్వతి ఫ్రెండ్ పద్మ గొంతు వినిపిస్తోంది.

"ఆ ... మరే ... అత్తగారికి, ఆడపడుచులకి లాంఛనాలు లక్ష రూపాయలు. అవికాక పానకం బిందెలు వెండివివ్వాలిట. అవెంత బరువుండాలో కూడా చెప్పారుట. వియ్యపురాలికి వెండి బొట్టు పెట్టెలో బంగారం కుంకుమ భరిణె వుండాల్ట. జానెడు వెడల్పు జరీకి తక్కువ కాకుండా నాలుగు కంచిపట్టు చీరలు పెట్టాల్ట. ఆడపడుచులు ముగ్గురికీ వెండి బొట్టు పెట్టెలూ, వెండి కుంకుమ భరిణలూ, వెండి కాటుక్కాయలు చాలుట. కాని వాళ్ళ పెట్టెల్లో అద్దాలకి వెండి ఫ్రేములుండాలిట. పెళ్ళి మూడురోజులూ స్నాతకం దగ్గర్నుండీ పూటకి రెండు స్వీట్లూ, రెండు హాట్లూ చేసినవి చెయ్యకుండా చెయ్యాల్ట. పెళ్ళికూతురికి పాపిడిపిందె, సూర్యచంద్రులు, నాగరం దగ్గర్నుండి మొత్తం పై నుంచి కిందదాకా కనీసం యాభై కాసుల బాల తొడుగుండాల్ట ...''

ఆయాసం తీర్చుకుందనుకుంటాను కాసేపాగింది ఆవిడ గొంతు. స్పీకరు పీక నొక్కింది పార్వతి.

"పద్మా, పిల్లల కాలేజీ టైమైంది. నేను మధ్యాహ్నం ఫోన్ చేస్తాను ..." అంటూ ఫోన్ పెట్టేసింది.

'వర విక్రయం' చదివిన ప్రభావం ఒక్కసారిగా నా మీద పనిచేసింది. వెంటనే అందుకున్నాను.

'పెళ్ళికి వచ్చిన బంధువులందరికీ బట్టలు పెట్టాలిట. బావమరుదులకి బంగారు పొన్నుకున్న చేతికర్ర లివ్వాల్ట. తోడల్లుళ్ళకి కడ్డీ అంచు జరీపంచె లివ్వాల్ట. పొద్దున్నే పసిడి, మధ్యాహ్నం వెండి, సాయంత్రం వజ్రం వియ్యపురాలి మొహాన్న అద్దాల్ట."

నాటకీయంగా చెపుతున్న నా మాటలకి వింటున్న శ్రోతలు ముగ్గురూ ఫక్కున నవ్వారు. వాతావరణం తేలిక పడింది.

కన్నతల్లిగా పార్వతి ఆతృతని అర్థం చేసుకో గలను. అందులోనూ చుట్టపక్కాల దృష్టిలో లౌక్యం తెలీనివాణ్ణి. వున్నవీ లేనివీ చెప్పి పిల్ల పెళ్ళి చెయ్యడం చేతకానివాణ్ణి. ఎంత నా నిజాయితీని, మంచితనాన్నీ అర్థం చేసుకున్నదయినా పార్వతి మధ్య మధ్యలో వాళ్ళ మాటల ప్రభావంలో పడిపోతూంటుంది. ఏం చేస్తాం ? అందరూ నాలా వుండలేరు కదా ! నా జీవితం ఎలా గడిచిందో, ఇక ముందెలా గడుస్తుందో నాకు తెలీదా !

నాకసలు ఉద్యోగం రావడమే ఆలస్యంగా వచ్చింది. ప్రొబేషన్ పీరియడ్ దాటి పర్మినెంట్ అయ్యేవరకూ పెళ్ళి చేసుకోనని భీష్మించుక్కూర్చున్నాను. ఏముంది ? ముప్ఫైకి దగ్గర్లో పెళ్ళైంది. పెళ్ళి, పిల్లలు ఆలస్యమవడం వల్ల రిటైర్మెంటు దగ్గర పడుతున్నా పిల్లలిద్దర్నీ ఇంకా సెటిల్ చెయ్యలేకపోయేను. ఎంత కష్టపడి చదివినా ఈ రిజర్వేషన్ల రోజుల్లో రవిని ఇంజనీరింగులో చేర్పించడానికి డొనేషన్ కట్టక తప్పలేదు. పేరుకి గజిటెడ్ ఆఫీసర్ నన్న పేరే కానీ అయిదో తారీకొచ్చేసరికి అన్ని బిల్లులూ కట్టేసుకుని మళ్ళీ ఫస్ట్ కోసం ఎదురుచూడ్డమే. దీప పెళ్ళి కోసమని ఏదో కాస్త ఆదా చేసినా మరికాస్త అప్పు చేయక తప్పదు. ఈ మహాపట్నంలో ఓ మూల ఓ అపార్ట్‌మెంటుకు స్వంతదారు ననిపించుకుందుకు మొన్నటిదాకా హౌసింగ్ లోన్ తీరుస్తూనే వున్నాను. ఇన్ని విధాలుగా అర్థమయ్యేట్టు చెప్పినా కూడా పార్వతి నేను చెపుతున్నప్పుడు ఎంచక్కా బుర్రూపుతుంది. మళ్ళీ ఎప్పుడో ఒక్కొక్కసారి ఇలాగే ఆవేశపడిపోతుంటుంది. ఏం చేస్తాం ? అందర్లాగే మేమూను.

ఇప్పుడు మా ఇద్దరి మధ్యా తరచుగా జరుగుతున్న వివాదం మా అమ్మాయి

పెళ్ళి విషయం. ఎవరో ఏదో సంబంధం చెపుతారు. వెడదామంటుంది. అందరిళ్ళకీ అలా వెళ్ళిపోవడమే ! మంచీ చెడూ విచక్షణాజ్ఞానం కల మా బంగారుతల్లిని అలా ముందు వెనకా చూసుకోకుండా ఎలా యిచ్చేస్తాం ? యింత చెప్పినా కూడా ఆఫీసుకి బయల్దేరుతుంటే పార్వతి ఒక అడ్రసు కాగితం పట్టుకొచ్చి నా చేతికిచ్చింది.

"ఏంటిది ?''

"అదే ... మొన్న వదినగారిచ్చిన సంబంధం అడ్రసు. ఆఫీసు నుంచి వస్తూ వెడతారని యిచ్చాను.''

నాకు కోపం వచ్చింది. ఆ అబ్బాయికి చదువంతగా లేదు. కుటుంబం కూడా అంతంత మాత్రమే. వాళ్ళకెలా ఇవ్వను నా బంగారుతల్లిని ?

"ఆ పిల్లాడి చదువు బాగా లేదనుకున్నాం కదా. ఎలా వెడతాం ?'' సూటిగా అడిగాను.

పార్వతి గొంతు హెచ్చింది.

"పెద్దది అందదు. చిన్నది నచ్చదు. అసలెప్పటికైనా మీకేం కావాలో మీకు తెలుస్తుందా ?''

"ఆ ... నాకు తగ్గవాళ్ళు నాకొస్తారు. నాకు నచ్చినవాడికే యిస్తాను నా తల్లిని'' ఖచ్చితంగా చెప్పాను.

"మీకు నచ్చినవాళ్ళు దొరకాలని కూర్చుంటే ఇంక మనకా భగవంతుడే దిక్కు ...'' ఇంక నాతో వాదించలేక రెండుచేతులూ యెత్తి దండం పెడుతూ అంది పార్వతి. నేను నవ్వేశాను.

"కరెక్ట్. ఆ భగవంతుడే చూపిస్తాడు ఎవరో ఒకర్ని. చేస్తున్నావుగా ఉపవాసాలు. ఫలించకపోతాయా ... ?''

చిన్నబుచ్చుకున్న పార్వతికి నెమ్మదిగా నచ్చచెప్పి, తగిన సంబంధం తప్పకుండా దొరుకుతుందని ధైర్యం చెప్పి ఆఫీసుకొచ్చాను. పార్వతి కయితే ధైర్యం చెప్పాను కానీ నాకు నేనెలా ధైర్యం చెప్పుకోవాలో అర్థం కాకుండా పోయింది.

ఆలోచిస్తూ ఆఫీసుపని చేసుకుంటున్న నాకు ఆ సమయంలో రఘురాం రాక ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఒక మంచి ప్రపోజల్ తెచ్చాన్రా ...'' అంటూ నా ఎదురుగా కూర్చున్నాడు. ఏమిటన్నట్లు చూశాను.

"కొంతమందిమి కలిసి నార్తిండియా టూర్ పెట్టుకున్నాం. పదిహేను రోజుల టూరు. అటువైపున్న పుణ్యక్షేత్రాలన్నీ దర్శించుకు రావడం. డిసెంబరు సెలవుల్లోనే

కాబట్టి పిల్లల చదువులకి కూడా ఇబ్బంది వుండదు. రానూ పోనూ ఛార్జీలు, బస అంతా కలిపి ఫ్యామిలీకి పదిహేనువేలు. పై ఖర్చులు మరో పదివేలనుకో ...''

వాడి సంగతి నాకు తెలీదా ? వాడు ఆర్గనైజ్ చేసే టూర్‌కి టిక్కెట్లు మిగిలిపోయుంటాయి. వాడు నన్ను పట్టుకున్నాడు. నేనా వాడి మాటల్లో పడేది ? పుణ్యక్షేత్రాలకి నోటితో రానని చెప్పలేక నవ్వుతూ వాడికో నమస్కారం పడేసి ఫైలు ముందుకి లాక్కున్నాను. వాడేమన్నా వూరుకునే ఘటమా ?

"ఒరేయ్ ... మరో రెండేళ్ళలో రిటైరవుతున్నావు. మళ్ళీ యిలాంటి అవకాశం రాదు. ఇంత ఆఫీసరు వయ్యుండి అలా గుమస్తాలా మాట్లాడతావేమిట్రా ?''

వాడు నన్ను రెచ్చగొడుతున్నాడు. వాడిలాగ నాకు తండ్రీ, మావగారూ పొలాలూ, ఇళ్ళూ యివ్వలేదు. అది వాడి అదృష్టం. నాకే విధమైన ఈర్ష్య, అసూయా లేవు. కానీ నా సంగతి తెలిసీ ఎత్తిపొడవడమెందుకు ? నన్ను నేను సంబాళించుకున్నాను.

"నన్ను వదిలెయ్‌రా ...'' వాడు ఊరుకోలేదు.

"చూడు రాజారావ్. చిన్నప్పట్నించీ మనిద్దరం స్నేహితులం. మీ అమ్మగారు, నాన్నగారు ఎంత పుణ్యాత్ములు. నువ్విప్పుడీ పొజిషన్‌లో వున్నావంటే అది పూర్తిగా వాళ్ళు చేసిన పుణ్యఫలమే. కాదంటావా ?''

కాదని ఎలా అనగలను ? మా అమ్మా, నాన్నా చేసిన దానధర్మాలు నాకు తెలీనివా ? అడిగినవారికి లేదనకుండా తృణమో ఫణమో యిచ్చినవాళ్ళు. కాశీ నుంచి రామేశ్వరం దాకా అన్ని క్షేత్రాలూ తిరిగొచ్చినవాళ్ళు. ఈరోజు మేమిలా వున్నామంటే అది ఆ పెద్దలు చేసిన పుణ్యఫలమే అని ఖచ్చితంగా చెప్పుకోవచ్చు. అయినా అసలా సంగతెందుకిప్పుడు ? వాడు మళ్ళీ మొదలుపెట్టాడు.

"ఒరేయ్, నాకు గుర్తున్నంతవరకు నువ్విప్పటికొచ్చి తిరుపతి తప్పితే మరో క్షేత్రం దర్శించలేదు కదూ ... ?''

అవున్నిజమే, అది కూడా మా అబ్బాయి అయిదోయేట వాడి పుట్టు వెంట్రుకలు తీయించడానికి మొక్కు వుంది కనుక బ్రహ్మ ప్రయత్నం మీద వెళ్ళొచ్చాము. అంతే. మళ్ళీ మా బడ్జెట్ మమ్మల్ని ఇల్లు కదల్నివ్వలేదు. అసలా ఆలోచన కూడా మనసులోకి రానివ్వలేదు.

"ఈ అవకాశం వదులుకోకుండా నువ్వూ, పార్వతి నాలుగు పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటే ఆ పుణ్యం మీ పిల్లల్ని కాస్తుంది'' సూటిగా విషయాని కొచ్చాడు రఘురాం. అంతకన్నా సూటిగా నా గుండెలకే తగిలిందా మాట.

"చూడు రాజారావ్. మన జీవితం చాలా యాంత్రికమైపోయింది. మన

సంగతి మనం చూసుకుందుకే ఓపిక అయిపోతోంది. మరి మన పెద్దవాళ్ళూ ? ఊళ్ళ నుంచి పట్నాలకొచ్చి చదువుకునే పిల్లలకి వారాలు ఏర్పాటు చేసేవారు. అన్న దానాన్ని మించిన దానం లేదుకదా ! ఫీజులు కట్టుకోలేని పిల్లలకి ఫీజులు కట్టేవారు. అలా చదువుకున్న వాళ్ళెంతమందో ఈరోజు పెద్ద పెద్ద ఉద్యోగాల్లో వున్నారు. విద్యాదానం ఎంత గొప్పది చెప్పు ? శాంతులూ, హోమాలు చేసి పండితుల్నీ, బ్రాహ్మణుల్నీ తృప్తి పరిచేవారు. ఆ పుణ్యఫలమే కదా మనని కాస్తున్నది. మనం ఈ రోజుల్లో దానధర్మాలు యెలాగూ చెయ్యలేం. ఇటువంటి పుణ్యక్షేత్ర దర్శన ఫలమైనా మన పిల్లల్ని కాస్తే అంతకన్న మనకేం కావాలి ?''

నిజమే ... అన్నదానాలూ, సువర్ణదానాలూ ఎలాగూ చెయ్యలేం. ఈ దైవ దర్శన భాగ్యం వల్ల దీపకి మంచి సంబంధమేదైనా కుదుర్తుందేమో. నాలోని తండ్రి హృదయం మెత్తబడుతోంది. కాని డబ్బు ? ఆ అంకె తల్చుకోగానే గాభరా పుడుతోంది. నా ఆలోచనలని చదివినట్టు రఘురాం అన్నాడు.

''డబ్బు దేముందిలే ? ఆఫీసులో అడ్వాన్సు తీసుకుంటే నెలకింతని తీర్చేయొచ్చు. ఇలాంటి అవకాశం మళ్ళీరాదు. ఏవంటావ్ ?''

బాగా కాలిన ఇనుము మీద సమ్మెట దెబ్బ వేస్తున్నాడు రఘురాం. అవునేమో ... ఒకసారి పార్వతితో మాట్లాడితేనో అనిపించింది. అయినా పార్వతి మటుకు ఎందుకు కాదంటుందీ ? అసలు నేను కనక ఇంత ఆలోచిస్తున్నాను కానీ దైవదర్శన మంటే పార్వతెప్పుడో ఒప్పేసుకుని వుండును. ధైర్యం చేసేసాను.

"సరేరా ... నీ మాట ఎందుక్కాదనాలీ ? దీనివల్ల దీపకి మంచి సంబంధం కుదిరితే అంతకన్నా ఏంకావాలీ ?''

"ఎంత మంచిమాటన్నావురా ... చూస్తూండు. మనం తిరిగొచ్చేటప్పటికి దీపకి చక్కటి సంబంధం రెడీగా వుంటుంది. మరి నేను వస్తాన్రా ...''

రఘురాం వెళ్ళిపోయాడు. ఒక్కక్షణం డబ్బు తొందరపడి ఖర్చు పెడుతున్నానా అనిపించింది. వెంటనే మనసులోనే లెంపలేసుకున్నాను.

దైవదర్శనం అనేది మంచిపనే కదా ! పార్వతికి ఈ విషయం ఫోన్‌చేసి చెపుదామని ఫోన్ తియ్యబోయి ఆగిపోయాను. అబ్బే, ఫోన్లో కాదు. స్వయంగా చెప్పి పార్వతి మొహంలో వెలిగే సంతోషం చూడాలి.

నేను చెప్పబోయే విషయానికి పార్వతి కళ్ళల్లో కనపడే మెరుపు చూడాలని రాత్రి బాగా పొద్దుపోయాక పార్వతికి చెప్పాను. "నీకో మంచి న్యూసోయ్ ...'' అంటూ.

"ఏంటి ?" చూస్తున్న టీ.వి. ప్రోగ్రామ్ కట్టేసి నేను చెప్పేది శ్రద్ధగా వినడానికి నావైపు తిరిగింది.

"రఘురాం ఫ్యామిలీ, మరో కొంతమందీ కలిసి నార్తిండియా వైపు పుణ్య క్షేత్రాలు చూసిరావడానికి వెడుతున్నారు ..."

పార్వతి మొహంలో ఏ భావమూ లేదు. "మన్ని కూడా రమ్మంటున్నారు."

"మననా ... మనకెలా కుదుర్తుందీ ? పిల్లల క్లాసులు పోవూ ... ?"

"డిసెంబరు సెలవుల్లోట ప్రోగ్రామ్"

"అయినా మనకెక్కడ కుదుర్తుందీ ?"

"ఏం ? ఎందుకు కుదరదూ ?" ఎదురుప్రశ్న వేశాను. ఆశ్చర్యంగా చూసింది నావైపు.

"వేలు ఖర్చవుతాయి తెలుసా ..." అదసలు నా డైలాగు. నామాట నాకే అప్పచెప్పింది.

"అవును. ఫ్యామిలీకి పదిహేను వేలు. పైన మరో పదివేలు కావచ్చు."

"అంత డబ్బు ఒక్కసారి ..."

"ఆఫీసులో అడ్వాన్సు తీసుకుంటున్నాను ..."

"అంటే మనం ..." ఆశ్చర్యంగా అడిగింది. ఇదేంటి ? పార్వతి గొంతులో సంతోషం లేదేం ?

"ఊ ... ఆఫీసులో లోన్‌కి అప్లికేషన్ ఇచ్చి వచ్చాను. "నా గొంతేవిటి ... ఏదో తప్పు చేసినట్టు యిలా నీరసపడిపోతోంది ? ఇలా అయితే లాభం లేదు. గొంతు పెంచాను.

"దైవదర్శనమంటే నీకూ యిష్టమే కదా ... ఎప్పట్నించో అడుగుతున్నావు. అందుకే వెంటనే ఒప్పుకున్నాను."

"అయితే మటుకు ... పిల్ల పెళ్ళికుందనగా అన్ని వేలు ఖర్చు పెట్టాలా ? మీరే అంటుంటారుగా ఖర్చులన్నీ ముందే వున్నాయనీ ..."

ఇదేమిటీ ? నేను అనుకున్నదొకటీ జరుగుతున్నది మరొకటిగా అయిందీ ? తీర్థయాత్రలంటే ఎగిరి గంతేస్తుందనుకున్న పార్వతి యిలా మాట్లాడుతోందేమిటీ ?

"అదికాదు పార్వతీ ... మనంతట మనం ఎలాగూ వెళ్ళలేం. నలుగురితో నారాయణా అన్నట్లు నాలుగు పుణ్యక్షేత్రాలు దర్శించుకొస్తే ఆ పుణ్యం వూరికే పోదుకదా... ?"

"ఇంతర్జంటుగా మీకు పుణ్యం మీద అంత ఆసక్తి యెందుకు కలిగిందండీ?" ఆశ్చర్యంగా అడిగింది.

"మరేంలేదు ... రఘురాం బాస్ లేడూ ... పురుషోత్తం ... ఆయన ప్రతి యేడు ఏదోక పుణ్యక్షేత్రానికి వెళ్ళొస్తాట్ట ..."

"ఆయన వెళ్ళేది పుణ్యం కోసం కాదండీ చేసిన పాపం పోగొట్టుకుందుకు. మీరే చెప్తుంటారుగా ... ఆయన ఆ స్థితికి రావడానికి ఎన్ని అడ్డదార్లు తొక్కాడోనని. అలాగే దేవుడిక్కూడా లంచం యివ్వడానికి వెడుతుంటాడేమో ..."

"ప్లీజ్ పార్వతీ ... దేవుడి గురించి వేళాకోళాలొద్దు ..."

"నేను దేవుడి గురించి మాట్లాడలేదు. ఆ పురుషోత్తం ఆలోచన అలాగే వుంటుందని చెప్పాను." ఇంక నేను ఆ పురుషోత్తం ప్రసక్తి ఇక్కడ అప్రస్తుతం అనుకుంటూ, "పోనీ దైవదర్శనం చేసుకుంటే మనకి కాస్త పుణ్యం వస్తుంది కదా ..." అన్నాను.

"మీకంత నమ్మకముంటే తప్పకుండా వస్తుంది. కానీ దానికోసం ఇప్పుడే వెళ్ళాలా ? పిల్లల్ని సెటిల్ చేసేక వెళ్ళొచ్చు కదా !"

"ఉహు కాదు. మనం ఇప్పుడే వెడితే ఆ పుణ్యఫలం వల్ల మన దీపకి మంచి సంబంధమేదైనా కుదరొచ్చు కదా !"

ఇదేమిటీ ... రఘురాం చెప్పినప్పుడు అంత బాగున్న ఈ ఆలోచన ఇప్పుడిలా చప్పబడిపోయిందేమిటీ ? నాలో నాకే అనుమానం మొదలైంది.

పకపకా నవ్వింది పార్వతి.

"అంటే యిప్పుడీ పుణ్యక్షేత్రాలు తిరగడం దీప పెళ్ళికోసమన్నమాట ..."

నాకు పౌరుషం పొడుచుకొచ్చింది. నేనింత సీరియస్‌గా విషయం చెప్తుంటే అలా నవ్వులాటగా తీసిపడేస్తుందేవిటీ ? ఇంకిలా లాభం లేదనుకుంటూ గొంతులోకి గాంభీర్యం తెచ్చుకున్నాను.

"పార్వతీ, మన సంగతి నీకు తెలియంది కాదు. మనకున్నదాంట్లో సర్దుకోవడ మెలాగా అన్నదాంట్లోనే సతమతమయిపోయాం తప్పితే మనిద్దరం అసలు పుణ్య కార్యాల వైపు దృష్టైనా పెట్టేమా ? మన పెద్దవాళ్ళలాగ అన్నదానం కానీ, వస్త్రదానం కానీ చేసామా ? ఇటువంటి అవకాశాలైనా వినియోగించుకోకపోతే ఇంక మనం నరకానికే పోతాం." నాలో తలెత్తిన పాపభీతిని వెలిబుచ్చాను.

"మనం దానాలు చెయ్యటం లేదా ... ఎవరు చెప్పారు ?" ఎదురుప్రశ్న వేసింది పార్వతి.

అదేమిటీ ? నాకు తెలీని దానాలు పార్వతిగానీ ఏమైనా చేస్తోందా ?

"మనం అన్నదానం చేస్తున్నాం. విద్యాదానం చేస్తున్నాం. దీపదానం చేస్తున్నాం. ఇంకా ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా బోల్డు దానాలు చేస్తున్నాం."

అర్థం కాలేదు నాకు.

"అంత గొప్ప దానాలు మనమెక్కడ చేస్తున్నాం చెప్పు. నా చిన్నప్పుడు మా చెల్లెళ్ళు బియ్యం దోసిళ్లతో పట్టుకెళ్ళి దానం చేస్తుండేవారు."

ఒకప్పటి చిన్నప్పటి దృశ్యాలు కళ్ళముందుకొచ్చాయి.

"ఆ రోజులు వేరండీ. బస్తాలతో బియ్యం ఇళ్ళకొస్తే దోసిళ్ళతో దానం చేసేవారు. కానీ, కిలోల్లెక్కన బియ్యం కొనుక్కుని, రాత్రి వండిన అన్నం మిగిలిపోతే ఫ్రిజ్‌లో పెట్టుకుని మర్నాడు పొద్దున్న వేడి చేసుకుని తినే ఈ రోజుల్లో కూడా మనం అన్నదానం, విద్యాదానం చేస్తున్నాం. ఇంకా చాలా చాలా రకాల దానాలు చేస్తున్నాం."

అర్థం కానట్టు చూశాను పార్వతి వైపు.

"చెప్తా వినండి. ప్రభుత్వం ప్రజలకి ఇన్ని రకాల రాయితీలు అందిస్తోంది కదా! ఆ డబ్బంతా ఎక్కడ్నించి వస్తోంది ? ప్రత్యేకంగా వీటికోసం రిజర్వు బ్యాంకేమీ నోట్లు అచ్చెయ్యటం లేదుకదా ? ఆ డబ్బంతా మన దగ్గర పన్నుల రూపంలో వసూలు చేసింది కాదా !"

"అంటే ?"

"ప్రభుత్వం మన నెత్తిమీద రోజురోజుకీ పన్నులభారం పెంచుతోంది. కరెంటు ఛార్జీలు అడ్డూ అదుపూ లేకుండా పెంచేస్తోంది. ఆ డబ్బేం చేస్తున్నట్టు ? ఎంతమందికో ఈ ప్రభుత్వం రాయితీలు కల్పించి మన డబ్బు తీసికెళ్ళి వాళ్ల దోసిట్లో పోస్తోంది. రిజర్వేషన్లంటూ కొంతమందిని ప్రత్యేకించి విడదీసి వారికి తిండిపెట్టి, పాకెట్ మనీలిచ్చి పోషించటం లేదా ? ఆ అన్నదానం చేసిన డబ్బు మనదేకదా !

మంచి రేంక్ వచ్చిన మన రవి డొనేషన్ కట్టి చదువుకుంటున్నాడు. ఎక్కడో వేలల్లో రేంక్ వచ్చిన మరో అబ్బాయి ఫీజే కట్టకుండా చదువుకుంటున్నాడు. అంటే ఆ అబ్బాయి ఫీజు కూడా మనమే కడుతున్నట్టే కదా ! అది విద్యాదానం కాదా ?" పార్వతి తర్కం విచిత్రంగా వుంది.

"చూడు పార్వతీ, ఇది ప్రజాస్వామ్యం. ప్రజలందరూ సమానస్థాయిలో వుండాలనే ప్రభుత్వం వాళ్ళకీ సదుపాయం కల్పిస్తోంది."

"నిజమే. కానీ అది నిజంగా అందవలసిన వాళ్ళకి అందుతోందా ? కూలీలు

కూలీలుగానే వుండిపోతున్నారు. సిటీల్లో పెద్ద పెద్ద ఉద్యోగాల్లో వున్న ఎంతోమంది వారి అసలు ఆదాయాలు చూపించకుండా, ఎక్కడో పల్లెటూళ్ళ అడ్రసులిచ్చి ఆ సదుపాయాల్ని అందవలసినవాళ్లకి అందకుండా ఎలా దుర్వినియోగ పరుస్తున్నారో మీకు తెలీదా ? వాళ్ళు వెళ్ళాలండీ పుణ్యక్షేత్రాలకీ ...''

''ఏమిటి నువ్వంటున్నది ?''

''అవునండీ. ఇంతమంది గొప్పవాళ్లనబడేవాళ్ళు పన్నులు, కరెంటు బిల్లులు కట్టకుండా కోట్లకొద్దీ రూపాయలు ఎగ్గొడుతున్నారు చూడండి ... వాళ్ళు వెళ్ళాలండీ పుణ్యక్షేత్రాలకి. ఇండస్ట్రీలు పెడతామంటూ ప్రభుత్వం దగ్గర కోట్లకొద్దీ రూపాయలు లోన్ తీసుకుని, పలుకుబడితో వాటిని మాఫీ చేయించేసుకుని, విలాసాలనుభవిస్తున్నారే ... వాళ్ళు వెళ్ళాలండీ పుణ్యక్షేత్రాలకి. టన్నులకొద్దీ ఆహారధాన్యాలను ప్రభుత్వం అందచేస్తుంటే, అవి పనిచేసినవారి చేతికందకుండా దొంగతనంగా దారి మళ్ళించి స్వంతం చేసుకుంటున్నారే పెద్ద మనుషులు ... వాళ్ళు వెళ్ళాలండీ పుణ్యక్షేత్రాలకి ... మనం కాదు.''

ప్రవాహంలా బైట పడుతున్న పార్వతి ఆవేశం చూస్తుంటే నాకు నోట మాట రాలేదు.

''నెలజీతంలో నిజాయితీగా పన్నులు, బిల్లులు కడుతున్న మనలాంటివాళ్ళు చేసే దానాల మీదే వీళ్ళంతా బతుకుతున్నారండీ. ఈ పుణ్యం చాలు మనకి. ఇంతకు మించి పుణ్యం కోసమంటూ ఒక్క రూపాయి ఖర్చు పెట్టినా, రేప్పొద్దున్న మన పిల్లకి పెళ్ళికి కావాలంటే ఏ ఒక్కరూ ఒక్క పైసా అయినా రాల్చరండీ. మనమీద మనకున్న నమ్మకమే దీపకి మంచి సంబంధం తెస్తుంది. రవిని జీవితంలో స్థిరపరుస్తుంది. చేతిలోని నీళ్ళ గ్లాసుని చేజార్చుకుని మబ్బులోని వర్షపు నీటిని పట్టుకుందుకు దోసిలి పట్టే దుస్థితికి మనం దిగజారొద్దండీ ... ఇంకొకళ్ళకి అన్యాయం చెయ్యకుండా వుండడమే ఈ రోజుల్లో మనలాంటివాళ్ళు చెయ్యగలిగిన పుణ్యకార్యం. అంతకుమించి పుణ్యం సంపాదించుకునే స్తోమత, శక్తీ మనకి లేదండీ ...''

పార్వతి గొంతు గద్గదమయింది.

నాకు గుండె గొంతులోకొచ్చింది ❋

**రచన - ఇంటింటి పత్రిక : ఏప్రిల్, 2007; కథాపీఠం పురస్కారం**

# దాంపత్యం

**కొండల కోనల సూరీడు**

**కురిసె బంగారు నీరు**

**పిలచె ఉరకేసే ఏరు**

ఎంత చక్కని భావం ! బాలభానుని ఆగమనాన్ని కళ్ళకు కట్టినట్లు ఎంత చక్కని దృశ్యరూపమిచ్చారు ఈ గీతంలో ఆ భావకవి. నిజంగా ఆయన ధన్యజీవి. కళ్ళు మూసుకుని సూరీడు బంగారు నీరు కురిపిస్తున్న కొండకోనల ప్రకృతిని దర్శించుకుంటున్న రాజేశ్వరి ఛెళ్ళుమని తగిలిన లెంపకాయకి ఉలిక్కిపడింది.

"ఏమిటా నిలబడి నిద్రపోవటం ? మొగుడి మొహాన కాస్త కాఫీ నీళ్ళు పోసేదేమయినా వుందా ? లేదా ?" కళ్ళు తెరిచింది రాజేశ్వరి. ఎదురుగా ఎవరూ లేరు. మరి ఇదేమిటి ? భర్త మాటల్లా వినపడ్డాయే ? అనుకుంటుంటే ఆమెలోంచి నిట్టూర్పు బయటకొచ్చింది. ముప్పయేళ్ళనుండి భర్త నోటి నుండి వచ్చే మాటలు ఆఖరికి తన భావాలను కూడా నియంత్రించగలిగేటంతగా తననింకా వెంటాడు తున్నాయని తెలుసుకోగానే రాజేశ్వరికి ఎక్కడలేని నీరసం వచ్చేసింది. అక్కడికక్కడే కూలబడిపోయింది. ఇంక ఈ జన్మకింతేనేమో అనే ఒకరకమయిన నిస్పృహ ఆవరించింది. ఒక్కసారి పెళ్ళి అయిన కొత్తరోజులు గుర్తుకొచ్చాయి. అప్పటిదాకా ఇంట్లో మహాలక్ష్మి వెలిసిందంటూ అమ్మా, నాన్న చేసిన గారం, అన్నదమ్ముల మధ్య ఒక్కతే ఆడపిల్ల అయినందుకు పొందిన అనురాగం తప్ప మరొకటి తెలియని మనసు మాటలు కూడా దురుసుగా మాట్లాడుకోని సంస్కారవంతమయిన కుటుంబంలోంచి వచ్చిన రాజేశ్వరికి, అందరూ చాలా మామూలుగా తిట్టుకునే తిట్లు కూడా శూలాల్లాగే అనిపించేవి. అటువంటి ఇంటి నుంచి వచ్చిన రాజేశ్వరికి మొట్టమొదటిరోజే, ప్రొద్దున్న లేస్తూనే భర్త నుంచి వినపడిన మాటలివి.

"ఏమిటా నిలబడి నిద్రపోవటం ? మొగుడి మొహాన కాస్త కాఫీ నీళ్ళు పోసేదేమయినా వుందా ? లేదా ?"

అప్పుడు మనసుకు తగిలిన దెబ్బ ఇన్నేళ్ళ తర్వాత కూడా ఇంకా పచ్చిగానే వుండడం రాజేశ్వరి ఆశ్చర్యంగా అనిపించింది.

రాజేశ్వరి భావుకురాలు. సూర్యోదయ, సూర్యాస్తమయాల్లో ప్రకృతిలోని అందాలను ఆస్వాదించడానికి ఆమె మనసు తహ తహలాడుతుంది. కాని సరిగ్గా అవే సమయాలు ... ఆమె భర్త రమేశానికి కాఫీలు, టిఫినులు అందించడానికి, ఆమె మనసులోని కోరిక మనసులోనే అణగిపోయింది. ఎప్పుడయినా పైకి లేవబోయినా భర్త టైము సెన్సు గుర్తు రాగానే అవి మాయమయిపోతుండేవి.

రమేశం స్వతహా మంచి మనిషే, దుర్మార్గుడు కాదు. కాని ఆడవారికి కూడా స్పందించే గుణముంటుందనీ, ఆలోచించే మనసుంటుందనీ తెలియనివాడు. భర్త చెప్పిందే భార్యకు వేదం. అతని ఇష్టాయిష్టాలే ఆటోమేటిగ్గా భార్యవీ అయిపోతాయి. భర్త, ఇల్లు, పిల్లలు వీటికి మించి ఆడవారి ఆలోచనలు ఎదగవని రమేశం ప్రగాఢ విశ్వాసం.

అలాగని అతను భార్యకేమీ లోటు చేయలేదు. క్రొత్తగా మార్కెట్లోకి వచ్చిన చీరలన్నీ తెచ్చేవాడు. కొత్తరకమయిన నగ ఏది వచ్చినా చేయించేవాడు. అవన్నీ తగిలించి భార్యని తనతో నలుగురి మధ్యకీ తీసికెళ్ళి తన హోదాని ప్రదర్శించు కునేవాడు. ఆడవారికి కావలసినవి చీరలూ, నగలేననీ, పగలూ, రాత్రీ వాళ్ళు వీటికోసమే అఱ్ఱులు చాస్తుంటారనీ రమేశం ఉద్దేశ్యం. అంతేకానీ ఏదయినా కొనే ముందు "నీకేది కావాలి ?" అని పొరపాటునయినా రాజేశ్వరిని అడగాలని రమేశానికి తోచలేదంటే అది అతని తప్పుకాదు. అతను పెరిగిన వాతావరణం అటువంటిది.

రాజేశ్వరి కూడా సంప్రదాయ కుటుంబం నుండే వచ్చింది. భర్త అభిప్రాయాలకు అనుగుణంగా నడుచుకోవాలని, అత్తగారింట్లో ఆమె ప్రవర్తించే పద్ధతి మీదే పుట్టినింటి గౌరవం పెరుగుతుందనీ తెలిసిన మనిషి. ఇల్లు భర్త మాటమీదే నడవాలని తెలుసు. అలాగే నడుచుకునేది కూడా. కాని చిన్న చిన్న విషయాలు కూడా నోరు విప్పి మాట్లాడే స్వతంత్రం ఆడవారికుండదని తెలీదు. అన్నింటికన్న ఆమె భరించ లేకపోయేది భర్త నోటిని. అది నోరా ! తాటి పట్టా ! అనిపించేది. ముందుకాని వెనుకకాని లకారం లేనిదే రమేశం నోట మాట వచ్చేది కాదు. అందులోనూ అందరికన్న లోకువ భార్య. ఎన్ని మాటలన్నా అదేమిటనడగదు. అడగకూడదు కదా ! ఇంట్లో చిరాకులకీ, ఆఫీసులో టెన్షన్‌లకీ అన్నింటికీ విక్టిమ్ రాజేశ్వరే అయ్యేది. ఆ నోటికి అడ్డూ, ఆపూ వుండేది కాదు. ఒక పదాన్ని పట్టుకుని దాన్ని చీల్చి, చెండాడి, ఎన్ని విధాలుగా దానిని వాగ్బాణాలుగా ప్రయోగించవచ్చో అన్ని విధాలుగానూ ప్రయోగించేవాడు. రాజేశ్వరికి ఆ మాటలు వింటుంటే కడుపులోంచి దుఃఖం ఉబికుబికి వచ్చేది. అలాగే రాజేశ్వరి ఇద్దరు పిల్లలకు తల్లయింది. కొడుకు చంద్రం. కూతురు సరోజ. వాళ్ళిద్దరూ కూడా తల్లికే చేరికయ్యారు. భర్త నుంచి ఏ మాత్రం ఆప్యాయత పొందని రాజేశ్వరి

పిల్లలే లోకంగా గడిపింది. అడుగడుగునా తండ్రి అనే పరుషవాక్యాలూ, ఎప్పుడేమాట వినవలసి వస్తుందోనని తల్లి భయంతో వణికిపోవడాలూ వారికి చిన్నప్పట్నుండే అలవాటయ్యాయి. అన్నింటికన్నా దారుణమయిన విషయమేమిటంటే రమేశం మరీ ఆవేశాన్ని ఆపుకో లేనప్పుడు రాజేశ్వరిని ఇంట్లోంచి బయటకు పొమ్మని అరుస్తూండడం. "నా ఇంట్లోంచి ఫో ..." అనేమాట అతని నోటి చివరనుండేది.

ఒక్కసారి అని ఊరుకునేవాడు కాదు. రాజేశ్వరి వీధి తలుపు తీసుకుని బయటికెళ్లేదాకా అతను అలా అరుస్తూనే వుండేవాడు. ఆ మాట అనడానికి రమేశానికి పెద్ద కారణం కూడా అక్కరలేదు. అతి చిన్న విషయాన్ని కూడా పెద్దది చేసి విమర్శించడం అతని కలవాటే. అలాగే జరిగింది ఆరోజు కూడా. రమేశానికి కాబేజి కూర కొబ్బరి వేసి చేస్తే ఇష్టం. ఎప్పుడూ రాజేశ్వరి అలాగే చేసేది. కాని ఆ రోజు పెసరపప్పు వేసి చేసింది. ఇంకేముంది. బ్రహ్మాండం బద్దలయింది. రమేశం మొదటగా తన ఇష్టాయిష్టాలు తెలుసుకోనందుకు అరిచాడు. తరువాత బయటికెళ్ళి కొబ్బరికాయ తేనందుకు తిట్టాడు. ఆపైన తను తిండిలేక ఆకలితో మాడిచావడమే రాజేశ్వరి కిష్టమయిన విషయమన్నట్లు తేల్చేసాడు. తన సంగతి పట్టించుకోని మనిషి తన ఇంట్లో వుండడానికి వీల్లేదన్నాడు. తక్షణం ఇంట్లోంచి బయటకు పొమ్మన్నాడు. రాజేశ్వరికి దుఃఖం, ఉక్రోషం కలిసి వస్తున్నాయి. ఇంట్లో ఎదుగుతున్న పిల్లలున్నారు. తండ్రి మీద పిల్లలకి ద్వేషం కలగకూడదని ఎన్ని విధాలుగా సమర్థించుకుంటున్నా ఈ మనిషికి ఇంగితం లేదేమిటా ? అని బాధపడింది. ఇన్ని మాటలు పడుతూ ఇక్కడ వుండక పోతేనేం అనుకుంది. మరుక్షణం పిల్లలు గుర్తొచ్చారు. వాళ్ళు తల్లిలేని వాళ్ళయిపోతారు. రమేశం ఇంకా గట్టిగా అరవడం మొదలుపెట్టాడు. రాత్రి నిశ్శబ్దంగా వున్న సమయంలో ఇరుగు పొరుగు వాళ్ళు ఈ అరుపులు వింటే ఎంత సిగ్గుచేటు ? గబుక్కున వీధి గుమ్మం దాటింది. భళ్ళున తలుపు మూసి గడియ వేశాడు రమేశం. వీధి అరుగు మీద కూర్చుని మోకాళ్ళలో మొహం దాచుకుంది రాజేశ్వరి. ఆమె ఏడవటం లేదు. ఏడుపంటే ఆమె కసహ్యం. ఏమీ చేతకాని వాళ్ళే ఏడుస్తారని ఆమె ఉద్దేశ్యం. రమేశం బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి నిద్రలో పడగానే బిక్క చచ్చిపోయిన పిల్లలిద్దరూ శబ్దం కాకుండా వీధి తలుపు తీసి తల్లి దగ్గర చేరారు.

"అమ్మా, ఇది మనిల్లు కాదా ?" చందూ అడిగాడు.

"కాదు నాన్నా, రమేశం గారిల్లు", కసిగా చెప్పింది రాజేశ్వరి.

"మరి మేము" అర్థం కాక అడిగింది సరోజ.

"రమేశం గారి పిల్లలు ..." పెదవి కొరుక్కొంటూ చెప్పింది.

"మరి నువ్వు ?" ఇద్దరూ అడిగారు.

"రమేశం గారి పెళ్ళాన్ని ..." గట్టిగా పెదవిని నొక్కింది రాజేశ్వరి. పెదవి చిట్లి రక్తం వచ్చింది.

ఆడవారి అస్తిత్వానికి నిలువ నీడ లేకుండా చేసిన ఈ సమాజ ధోరణికి రాజేశ్వరికి కోపం పొంగుకొచ్చింది.

ఇదివరకొకసారి ఇలాగే చాలా ఆవేశపడ్డ సంఘటనలో భర్తతో వాదనకి దిగలేక (దిగడం భార్యగా ధర్మం కాదని తెలిసి) వివరణ నివ్వమని తండ్రిని అడిగింది. రాజేశ్వరి తండ్రి చదువుకున్నవాడు, సంస్కారవంతుడు. ఆయన పెంపకంలో రాజేశ్వరికి సంగీతంలో రుచి, సాహిత్యంలో అభిరుచి పెరిగాయి. కాని రమేశానికి భార్య పుస్తకాలు చదవడం ఇష్టముండదు. ఎందుకూ పనికిరాని అత్తాకోడళ్ళ తగవులూ, మొగుడిని లొంగదీసుకునే చిట్కాలూ మాత్రమే ఆ పుస్తకాల్లో వుంటాయని నిక్కచ్చిగా నమ్మే మనిషి. ఈ విషయాన్నే తండ్రి నడిగింది రాజేశ్వరి.

"నాన్నా, పెళ్ళి చేసుకుని మరొకరి ఇల్లాలయినంత మాత్రాన ఒక స్త్రీలోని ప్రతిభ, పాండిత్యం అణగారిపోవలసిందేనా ? ఆమెకంటూ ఒక అస్తిత్వమంటూ వుండదా ?" అని దానికి ఆయన కేవలం ఒక ఆడపిల్ల తండ్రిలాగే సమాధాన మిచ్చారు.

"అమ్మా, గంగా, గౌతమీ లాంటి పుణ్యనదులున్నాయి. వీటికి ఎంతటి మహాత్మ్యముందంటే, ఎటువంటి పాపాత్ములయినా సరే వాటిలో మునిగితే వారి పాపాలన్నీ ప్రక్షాళనమయిపోతాయి. కాని, ఇవే నదులు ప్రకృతి ధర్మానికి లోబడి సముద్రంలో కలిసాక, ఇంతటి పవిత్రత కోల్పోయి కేవలం ఉప్పు నీరుగానే మిగులుతాయి తప్పితే, వీటిలో ముందున్న పవిత్ర గుణం నిలబడదు. అలాగేనమ్మా స్త్రీకూడా. ప్రకృతి ధర్మం ప్రకారం స్త్రీ పురుషులు కలిసి జీవించాలనుకున్నప్పుడు నీలో మరింక ప్రత్యేకతలంటూ ఏమీ వుండకూడదు. అలా వుండాలని నీవను కోవడం ప్రకృతికి విరుద్ధంగా నడవడమే."

తండ్రి మాట ప్రకారం రాజేశ్వరి తన అస్తిత్వాన్ని మరిచిపోవడానికే ప్రయత్నించింది. కేవలం రమేశం భార్యగా జీవించడానికే నిర్ణయించుకుంది. కాని ఎంత అణచుకుందామన్నా ఆమెలోని వ్యక్తిత్వం మధ్య మధ్యలో నేనున్నానని గుర్తు చేస్తూనే వుంది. మనసుకీ, మనుగడకీ జరిగే పోరాటంలో రాజేశ్వరి నలిగిపోయింది.

సంప్రదాయం నేర్పిన కట్టుబాట్లలో ఇమిడిపోవడానికి ప్రయత్నించిన రాజేశ్వరి ... "భూదేవి లాంటి ఇల్లాలు, ఆ దుర్వాసుడిని ఆ తల్లి కనుక భరిస్తోంది" అనేవాళ్ళ మాటలూ వింది.

"మొగుడికి లోకువయితే మాదాకబళం వాడికీ లోకువే" అని చెప్పినట్లు భర్త తీసిపడేస్తున్న స్థితికి చుట్టుప్రక్కల వాళ్ళు చేతులు కలపడంతో ఆ హింసనూ భరించింది.

కాలం ఎవరికోసమూ ఆగదు. కొడుకు చంద్రానికీ, కూతురు సరోజకి పెళ్ళిళ్ళయి హైదరాబాదులో సెటిలయ్యారు. ఇద్దరికీ బాబు, పాప కలిగారు. వారి కాపురాలు వారు చేసుకుంటున్నారు. రాజేశ్వరికి ఒక్కసారిగా లోకమంతా శూన్యంగా అనిపించ సాగింది. ఇరవైనాలుగ్గంటలూ పిల్లలే లోకంగా గడిపిన ఆమెకు కాలం గడవడం కష్టమయింది. ఎప్పుడో మనసులో దాగిన అపశృతులన్నీ మధ్య మధ్య మళ్ళీ తలెత్త సాగాయి. మాట్లాడడానికి మనిషి లేరు.

కొంతమంది దంపతులలో ఏమవుతూందంటే, పిల్లలు పెద్దవాళ్ళయి వాళ్ళ వాళ్ళ జీవితాల్లో స్థిరపడ్డాక, భార్యాభర్తల మధ్య ఒకరకమయిన స్నేహం ఏర్పడుతుంది. అన్నాళ్ళూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి రిటైరయిన మగవాడూ, పిల్లలకి తన అవసరం తీరిపోవడంతో ఆ ఇల్లాలూ, ఇద్దరూ ఒకరి కొకరు మానసికంగా దగ్గరవుతారు. బాధ్యతలు కూడా చాలావరకు తీరడంతో ఒకరిమీద ఒకరు ఆధారపడడం ఎక్కువవుతుంది. కాని ఇక్కడ రమేశానికీ, రాజేశ్వరికీ మనస్తత్వాల్లో వున్న తేడావల్ల ఇద్దరూ మాట్లాడుకుందుకు కామన్ టాపిక్ దొరకదు.

అక్కడికీ ఒకరోజు సాయంత్రం రమేశానికి కాఫీ ఇచ్చి, ప్రక్కనే మల్లెమాల కడుతూ కూర్చుంది రాజేశ్వరి. చల్లని సాయంకాలం, మనసుని ఆహ్లాదపరిచే మల్లెల పరిమళం. రాజేశ్వరిలోని భావుకత్వం మేలుకొంది.

"మల్లెపూల వాసన చాలా బాగుంటుంది కదూ !" అడిగింది భర్తని. ఈవెనింగ్ ఎడిషన్ సీరియస్‌గా చదువుతున్న రమేశానికి రాజేశ్వరి మాటలు డిస్ట్రబెన్స్‌గా అనిపించాయి. రమేశం మౌనం చూసి మరికొంత చొరవ చూపింది రాజేశ్వరి.

"పువ్వులీ, పసిపాపలీ చూస్తుంటే ఆనందంగా అనిపిస్తుంది కదండీ" అంది, భర్త తన మాట వింటున్నాడనుకున్న సంతోషంతో, రమేశం ఒక్కసారిగా అరిచాడు.

"ఊ, బాగుంటాయ్. ఎందుకు బాగుండవు ? ఈ పూట పుట్టి రేపు వాడిపోయే పువ్వులూ బాగుంటాయి. పందికి పుట్టే పిల్లలూ బాగుంటాయి. ఎందుకు బాగుండవు? అంతే, అంతే మీ బుద్ధి ... ఎంతసేపూ పిల్లలూ, పువ్వులూను. అంతకుమించి ఎదగరు. మాలాగా కాశ్మీర్ సమస్య గురించి ఆలోచించేంత తెలివితేటలు మీ ఆడవాళ్ళకి రమ్మంటే వస్తాయా ? అందుకే మీరు ఆ వంటింట్లో పడి చావడమే మంచిది. పో లోపలికి, వెధవ గొడవా నువ్వూను ..."

రసరమ్యమయిన పూల జగత్తు నుంచి ఒక్కసారిగా పందులు దొర్లే బురదలో పడ్డట్టయింది రాజేశ్వరి మానసిక స్థితి. "చేరి మూర్ఖుని మనసు రంజింపలేము" అన్న పద్యపాదం గుర్తొచ్చి, పెదిమలు జారి బయటకొచ్చిందామాట. అది రమేశం చెవుల పడనే పడింది. అంతే ... ఒక్కసారిగా రెచ్చిపోయాడు. తనను మూర్ఖుడన్నందుకు గింజుకున్నాడు. మూర్ఖురాలు రాజేశ్వరే అని తేల్చేసాడు. ఇంతటి మూర్ఖురాలిని ఇన్నాళ్ళు ఎలా భరించానా అని ఆశ్చర్యపోయాడు. అంతటి మూర్ఖురాలు తనింట్లో ఉండతగ్గది కాదని తేల్చేశాడు. తక్షణం తనింట్లోంచి బయటకు పొమ్మన్నాడు. ఇరుగూ, పొరుగూ వింటున్నారన్న ఇంగితం కూడా లేకుండా ఆ అసురసంధ్యవేళ నిజమయిన మూర్ఖుడిలా అరవసాగాడు రమేశం.

రాజేశ్వరిలో సహనం నశించింది. బానిసత్వం బ్రద్దలయింది. స్వేచ్ఛ కోరుకుంటున్న మనసును మరింక పట్టివుంచడానికి శక్తిలేని రాజేశ్వరి, శక్తినంతా కూడదీసుకుని ఇల్లు దాటి, గేటు దాటి బయటకు నడిచింది.

అలా బయటకొచ్చిన రాజేశ్వరి ప్రక్కవీధిలోని రామనాథం గారింట్లో ముందు గది ఖాళీ చేయించుకుని అద్దెకు దిగింది. దగ్గర్లోని స్కూల్‌కి వెళ్ళి ఉద్యోగం కోసం అప్లయి చేసింది.

ఆరోజు ప్రొద్దున్నే రామనాథం గారింటి ముందు మొక్కల మధ్య కూర్చుంటే రాజేశ్వరికి జరిగిన విషయాలన్నీ కళ్ళ ముందు కనిపించాయి. అప్పుడే రామనాథం గారు చెప్పగా వింది, కొడుకూ, కోడలూ, కూతురు, అల్లుడూ, మనవడూ, మనవరాలూ అందరూ హైదరాబాద్ నుండి వచ్చారని. మరికాసేపట్లో వాళ్ళు ఇక్కడికీ వస్తారు. వాళ్ళకెలా ఎదురుపడాలో రాజేశ్వరికి అయోమయంగా వుంది. ఇన్నేళ్ళొచ్చి పిల్లల ముందు బయటపడిపోయామన్న విషయం ఆమెను చాలా మొహమాట పెట్టేస్తోంది.

గేటు తీసిన చప్పుడికి అటు తిరిగిన రాజేశ్వరికి నలుగురూ నెమ్మదిగా వస్తూ కనిపించారు.

"అమ్మా ... " చందూ ఒక్క పరుగున తల్లి దగ్గరకు చేరి భుజం చుట్టూ చేయి వేశాడు.

"చిన్నా ..." అంటూ పాతికేళ్ళ కొడుకిచ్చిన చేయూతని వణుకుతున్న చేత్తో గట్టిగా పట్టుకుంది రాజేశ్వరి. కన్నుల్లో చిప్పిల్లుతున్న నీటిని కనురెప్పల వెనుక దాయడానికి వృధా ప్రయత్నం చేయబోయింది.

నరాల ఉద్రిక్తతకు వణుకుతున్నట్లున్న అమ్మ చేతులను గట్టిగా ధైర్య మిస్తున్నట్లు పట్టుకుని, నెమ్మదిగా అరుగు మీద కూర్చోబెట్టి పాదాల దగ్గర కూలబడిపోయి ఆవిడ ఒళ్ళో మొహం దాచుకుని భోరుమన్నాడు చంద్రం. అప్పటిదాకా ఒక్కమాట కూడా

మాట్లాడకుండా బిగపట్టుకుని వున్న చందూ ఒక్కసారి బరస్ట్ అవడంతో అక్కడందరూ కదలిపోయారు.

"చిన్నా ..." అంటూ చందూ తల నిమురుతూ కూర్చుంది రాజేశ్వరి. అయిదు నిమిషాల పాటు అక్కడ నిశ్శబ్దం రాజ్యమేలింది. కాసేపటికి కాని ఆ అనుభూతి నుండి ఎవ్వరూ తేరుకోలేకపోయారు.

కూతురు సరోజ, కోడలు జానకి వచ్చి రాజేశ్వరికి చెరొకప్రక్క చేరి ఆవిడ మీద చేయివేసి కూర్చున్నారు, ఏదో పెన్నిధి దొరికినట్లు.

నెమ్మదిగా తలెత్తి అల్లుడి మొహం చూడడానికి మొహమాటపడుతూ "బాగున్నావా బాబూ ..." కుశల ప్రశ్నలు వేసింది రాజేశ్వరి. తల్లీ కొడుకులను కన్నార్పకుండా చూస్తున్న సత్యం నెమ్మదిగా తలూపాడు. జానికికయితే అత్తయ్య గారి చెయ్యి ఊపేస్తూ "కంగ్రాట్యులేషన్స్" చెప్పెయ్యాలని తెగ ముచ్చటగా వుంది. కాని నలుగురినీ చూసి కంట్రోల్ చేసుకుంది.

"ఎప్పుడొచ్చారు ?" నెమ్మదిగా అడిగింది రాజేశ్వరి.

"ఇప్పుడే అరగంటయింది ..."

"పిల్లలేరీ ?"

"రాముా ఆడిస్తున్నాడు"

కుశల ప్రశ్నలయ్యాయి. తరువాత ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో ఎవరికీ తెలియడం లేదు.

సత్యం అత్తగారి ఇబ్బంది అర్థం చేసుకున్నాడు.

"పిల్లలు ఏడుస్తున్నారేమో సరోజా, నేను వెడతాను" అంటూ బయటికి నడిచాడు.

చంద్రం నెమ్మదిగా తలెత్తాడు.

"అమ్మా, హైద్రాబాద్ వెళ్ళిపోదాం, వచ్చెయమ్మా ..." అన్నాడు.

"అలాగే నాన్నా, రాక ఎక్కడికి వెడతాను ? కాని ఇప్పుడు కాదు తర్వాత ..."

"అమ్మా, ఎప్పటిలాగే ఇప్పుడు కూడా నాన్నగారిని క్షమించలేవామ్మా ?" ధైర్యం చేసింది సరోజ.

"క్షమించడాలూ, శపించడాలూ చేసేంత గొప్పదాన్ని కాదమ్మా నేను. ఒక మామూలు మనిషిని. కనీసం ఆ విషయం కూడా మీ నాన్నగారు గ్రహించలేకపోయారు. ఆయనన్న మాటలకి నేనంటే నాకే ఒక విధమయిన విరక్తి ఏర్పడింది. ఏమీ చేతకాని

పనికిరాని దాన్నేమోనన్న ఫీలింగు వచ్చేస్తోంది. ఒక్కొక్కసారి ఆయనంటున్న మాటలు వింటుంటే నేను క్రిమి కీటకాలకన్న హీనమయిన దాన్నేమోననిపిస్తోంది. రోడ్డు మీద బట్టలు కూడా సరిగా కట్టుకోవడం రాని బిచ్చగత్తెను చూస్తుంటాము చూడూ, అలాంటి బిచ్చగత్తెను మీ నాన్నగారు కనుక చేరదీసి ఇంత తిండి పెడుతున్నారన్న భావం నాలో ఏర్పడిపోతోంది. నాలో నాకు నమ్మకం తగ్గిపోతోంది. ఆత్మవిశ్వాసం లేని దాన్నయిపోతున్నాను. నన్ను నేను సమర్థించుకోలేకపోతున్నాను. ఇంక మేమింతే ... మా గురించి మర్చిపోండి ...'' వణుకుతున్న గొంతుతో చెప్పింది రాజేశ్వరి.

వాళ్ళ సంభాషణ వింటూ అత్తగార్ని పరిశీలిస్తోంది జానకి. జానకి దృష్టిలో అత్తగారు దేవత. మామగారు బ్రహ్మరాక్షసుడు. ఈ నాలుగు రోజుల్లోనూ అత్తగారిలో ఎంత మార్పు ? మనిషి బాగా కుంగిపోయినట్లు మొహంలో స్పష్టంగా కనిపిస్తోంది. విపరీతమయిన ఒత్తిడులకు తట్టుకుంటున్నట్లు నరాలు కదులుతున్నాయి. గొంతు బలహీనమయ్యింది. తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం ఆమెలోని సున్నితత్వాన్ని పారద్రోల లేకపోతోంది.

అత్తయ్యగారిలా అయిపోయేరేమిటి ? విశ్రాంతి తీసుకోవలసిన ఈ వయసులో స్కూలు పిల్లలకి అరచి పాఠాలు చెప్పడం ఆవిడ శక్యమా ? ముప్పైయేళ్ళకు పైగా ఆవిడ కుటుంబానికి ధారపోసిన శ్రమంతా వృధాయేనా ? రోజుకి ఎనిమిది గంటలు పనిచేసే చిన్న ఫ్యూన్ ఉద్యోగానికయినా రిటైరయ్యాక వారి శేష జీవితం సాఫీగా సాగడానికి ఏదో డబ్బంటూ ముట్ట చెపుతారే ! పది సంవత్సరాల పాటు ఏ ఇంట్లో వంట చేసినా, పనిమనిషిగా ఏదో ముట్టచెవుతారే ! మరి ఇక్కడ ఈవిడకు దక్కిం దేమిటి ? కనీసం ఒక్కపూట తిండి కోసం ఓపిక తగ్గిపోతున్న ఈ వయసులో వీధిలోకెళ్ళి ఉద్యోగం చేసుకుంటే కాని గడవని స్థితా ?

ఉద్రేకపడుతున్న మనసుతో ఆవిడకి ధైర్యంగా ఏదో చెప్పెయ్యాలని ముందు కొచ్చి ఆవిడ చేయి గట్టిగా పట్టుకున్న జానకి మాటలు దొరకక ఆగిపోయింది. కోడలు భావాన్ని అర్థంచేసుకున్న రాజేశ్వరి జానకిని దగ్గరికి తీసుకుంది.

"మమ్మల్నిప్పుడేం చేయమంటావమ్మా ?'' చంద్రం నిస్సహాయంగా అడిగాడు.

"ఇందులో ఎవరూ చేయడానికి ఏమీ లేదు. మీ ఇళ్ళకు మీరు వెళ్ళండి. నాకు రావాలనిపించినప్పుడు తప్పకుండా వస్తాను.''

ఎవరూ ఏమీ మాట్లాడలేకపోయారు.

"ఇంక వెళ్ళండి. మీ నాన్నగారు మీ కోసం చూస్తుంటారు. ఆయన ఆకలి కాగలేరు.''

రాజేశ్వరి మాటలకి జానకికి ఒళ్ళు మండింది.

'మీ గురించి ఆయనకి అక్ఖర్లేనప్పుడు ఆయన గొడవ మీకెందుకు ?' అనబోయిన మాటని అతి కష్టం మీద ఆపుకుంది. అందరూ కలిసి గేటు దాకా వచ్చాక చంద్రం ఒకడుగు వెనక్కివేసి జేబులో డబ్బంతా తీసి అరుగుమీద పెట్టి, చెమర్చుతున్న కళ్ళు తుడుచుకుంటూ, నిస్సహాయంగా బయటకు నడిచాడు.

సందు తిరిగేసరికి సత్యం పిల్లలిద్దర్నీ తీసుకువస్తూ ఎదురయ్యాడు. చంద్రం, సరోజల ముఖాలు చూసి, వాళ్ళని పలకరించే ధైర్యం చేయలేక వెనకాల నెమ్మదిగా వస్తున్న జానకి నడిగాడు.

"ఏమన్నారు ?"

"రమ్మని పిలవడానికి మామయ్యగారికి అహంకారం అడ్డొస్తే, పిలవకుండా రావడానికి అత్తయ్యగారికి అభిమానం అడ్డొచ్చింది" తనకు అర్థమయినంతవరకు వివరించింది జానకి. అసలు వాళ్ళు నలుగురూ పనిగట్టుకుని హైద్రాబాదు నుండి వచ్చింది రాజేశ్వరి ఇంట్లోంచి వెళ్ళిపోయిందన్న వార్తను జీర్ణించుకోలేక ప్రత్యక్షంగా చూసి, వీలయితే ఇద్దరినీ సామరస్య పరచగలమేమోనన్న ఆశతోనే.

"అంతేకాని ఆయన మీద కోపం లేదటనా ?"

"కోపమా ? అదెక్కడి ఓరిమో ఆవిడకి ? ఇంకా ఈయనగారి ఆరోగ్యం గురించి బాధపడిపోతున్నారు" పొంగుకొస్తున్న ఉక్రోషంతో అంది జానకి.

"ఇక్కడ మామయ్యగారి పరిస్థితీ అలాగే వుంది" నెమ్మదిగా అన్నాడు సత్యం.

"అంటే ?" ఆశ్చర్యంగా అడిగింది జానకి. ఆ మనిషికి బాధ కూడానా అన్నట్లు!

"అదే ... బేంక్‌లో ఏ స్కీముకి ఎంత వడ్డీ వస్తుందో వివరాలన్నీ అడుగుతున్నారు. ఫిక్స్‌డ్‌లో వేసిన డబ్బులు మధ్యలో తీస్తే మంచిదా ? లేక అత్తయ్యగారి పేర ట్రాన్స్‌ఫర్ చేయడానికి వీలవుతుందా ! అని అన్ని వివరాలు అడుగుతున్నారు".

జానకికి ఒళ్ళుమండింది.

"మరే పాపం ... ఈయనగారి డబ్బుల కోసం ఆవిడేమీ కాచుక్కూర్చోలేదు..."

"అంటే డబ్బు లేకుండా ఎలా బ్రతకగలరు ?"

"ఆవిడ అభిమానం వున్న మనిషి. ఈయనిచ్చినా ఆవిడ పుచ్చుకోరు ..."

"అభిమానం అన్నం పెడుతుందా ?" సూటిగా అడిగాడు సత్యం.

ఆశ్చర్యంగా చూసింది జానకి.

"అవును. అభిమానం అన్నం పెట్టదు. కొన్ని సంవత్సరాలపాటు చేసిన ఏ

ఉద్యోగానికయినా ఏవో బెనిఫిట్సంటూ వుంటాయి. అటు వంటిది, ఇన్ని సంవత్సరాలు ఆ ఇంటికి చేసిన దానికి డబ్బు తీసుకునేందుకు ఆవిడకు సర్వహక్కులూ వున్నాయి''.

"ఆవిడింటికి, ఆవిడ పిల్లలకు ఆవిడ చేసారు. పరాయివాళ్ళింట్లో చేస్తే డబ్బు లెక్కలు కాని, ఆవిడింట్లో ఆవిడ చేసిన దానికి లెక్కలు కట్టుకుంటారా ఎవరయినా?''

"ఆవిడ ఇల్లే అని కనుక అనుకుంటే, ఆయన వెళ్ళిపొమ్మన్నంతలో ఎందుకు వెళ్ళిపోవాలి ? ఇది నా ఇల్లు పొమ్మనడానికి మీరెవరు ? అనొచ్చు కదా ! ఇల్లూ తనది కాదనుకుని, డబ్బూ వద్దనుకుని ఆవిడ సాధించదలచుకున్నదేమిటి ?'' సూటిగా అడిగాడు సత్యం.

ఆగిపోయింది జానకి. ఆవిడిల్లనుకునే ఆవిడ చేసారు. అలాంటప్పుడు ఆయన పొమ్మన్నంతలో ఎందుకు వెళ్ళిపోవాలి ? పోనీ రమేశం గారిల్లే అనుకుంటే చేసిన శ్రమకి తగ్గ డబ్బు తీసుకోవాలి. ఆవిడ తీసుకోరు. దీనివల్ల అత్తయ్యగారికి ఒరిగిందేమిటి ? ఆవిడ వ్యక్తిత్వం, ఆవిడ అభిమానం ఆవిడని ఇంట్లోంచి రోడ్డు మీద పడేసాయి తప్పితే ఏ పతకాలు కట్టబెట్టాయి ?

అత్తయ్యగారు ఆవిడిల్లు అని కనుక ఆ ఇంటికోసం ఇన్ని సంవత్సరాలూ సర్వశక్తులూ ధారపోస్తే ... ఆ ఇంట్లో ఆవిడకి సర్వహక్కులూ వున్నాయి. ఆవిడని ఇంట్లో నుండి వెళ్ళమనే అధికారం మామగారికెంత మాత్రం లేదు. ఒకవేళ ఆయన మాట తూలినా ఈవిడ లెక్కపెట్టనక్కరలేదు. పిచ్చివాడి వాగుడి క్రింద తీసి పడేసి హాయిగా మహారాణిలా ఆ ఇంటిని ఏలుకోవచ్చు. జానకి మొహం మందారంలా విచ్చుకుంది. మిగిలిన ముగ్గుర్నీ వెళ్ళమని చెప్పి మళ్ళీ వెనక్కు మళ్ళింది.

జానకి వెళ్ళేసరికి రాజేశ్వరి పుస్తకాలు ముందేసుకుని కూర్చుంది.

చిన్నప్పుడెప్పుడో వదిలేసిన పుస్తకాలు చదువుకుంటుంటే రాజేశ్వరికి బాగానే వుంటోంది కాని, వ్రాయడానికొచ్చేటప్పటికి స్పీడ్‌గా వ్రాయడం కుదరడంలేదు. అలవాటు పోయి అస్తమానం బ్రేక్ పడిపోతోంది. రాజేశ్వరి దాన్ని గురించే ఆలోచిస్తూ వెనక్కి తిరిగేటప్పటికి జానకి కనిపించింది.

"ఏంటి జానకీ, మళ్ళీ వచ్చావేం ?''

"అత్తయ్యా, మీరేమీ అనుకోనంటే నేనొక్కమాటడగనా ?''

"ఏంటమ్మా, ఫరవాలేదు అడుగు ...''

"అత్తయ్యా, మీరిలా వచ్చెయ్యడం వలన మామయ్యగారికి శిక్ష వేయకుండా వదిలేసినట్లవలేదంటారా ?''

"ఆయనకు శిక్షా ?'' ఆశ్చర్యంగా అడిగింది రాజేశ్వరి.

"అవును, మీరు అక్కడుండి ఆయన్ని సాధించాలి తప్పితే, ఇలా వచ్చెయ్యడం వలన ఆయన చెప్పినట్లు మీరు చేసి, మీరే లొంగిపోయినట్లవటం లేదా ?" సూటిగా అడిగింది.

"అందుకని ఆయనేమన్నా అక్కడే పడుండాలంటావా ?" ఆశ్చర్యపోతూ అడిగింది జానకి.

"ఎవరు పడుండమన్నారు ? మీరు ఆయనతో సమానంగా అనండి మాటలు."

"నేనా ?"

"అవును. ఆ ఇల్లు ఒక్క మామయ్యగారిదే కాదు, మీది కూడా. మాటలనే అధికారం ఆయనకే కాదు మీకూ వుంది. మామయ్యగారున్నట్లే మీరు సర్వ స్వతంత్రంగా ఆ ఇంట్లో వుండడానికి సర్వహక్కులు మీకూ వున్నాయి."

"ఆయన పొమ్మన్నా కూడానా ?"

"మీరూ ఆయన్ని పొమ్మనండి."

"ఆయన నన్ను తీసి పడేస్తారు."

"మీరూ ఆయన్ని తీసి పడేయండి."

"నాకు ఇష్టమయిన పనులేమీ చెయ్యద్దంటారు."

"అనడానికి ఆయనెవరు ? ఆయన కిష్టమయినవి ఆయన చేసుకున్నట్లే మీకిష్టమయినవి మీరూ చేసుకోండి ..."

"అసహ్యంగా తిడతారు ..."

"మీరూ తిట్టండి ..."

"నేనలా తిట్టలేను ..."

"అయితే వినిపించుకోకండి. ఆయన్నసలు లెక్కచేయకండి ..."

ఆశ్చర్యంగా చూసింది రాజేశ్వరి జానకిని, ఇది సాధ్యమా అన్నట్లు.

"పదండి వెడదాం ..." రాజేశ్వరి చేయందుకుంది జానకి.

"ఇప్పుడా ?"

"ఇప్పుడే ?"

"మళ్ళీ పొమ్మంటే ?"

"ఎందుకు వెళ్ళాలి ? ఇది నా ఇల్లు అని చెప్పండి."

"అది రమేశం గారిల్లని అంటారు కదా !"

"ఆ రమేశంగారెవరు ? రాజేశ్వరి భర్త కాదా ! మీరు ప్రక్కన లేనిదే ఆయన జీవితానికి నిండుదనముండేదా ? ఈ కుటుంబం, ఈ పిల్లలు, ఈ గౌరవం ఆయనకి మీ వల్ల కాదా వచ్చింది ? ప్రతిక్షణం మీ మీద ఆధారపడి మామయ్యగారు బ్రతుకుతున్నారు కాని ఆయన మీద మీరు ఆధారపడి లేరని ఇలా మీరు బయట కొచ్చెయ్యడంవల్ల ఆయనకి అర్థం కాలేదంటారా ?"

"ఆయన దగ్గరున్న డబ్బు నా దగ్గర లేదుగా !"

"ఆ డబ్బు మీరు కావాలంటే ఇట్టే సంపాదించగలరు. కాని మీ వంటి ఇల్లాలిని ఆయన వేయి జన్మలెత్తినా సంపాదించగలరా ?"

"ఈ నాలుగు రోజులూ ఎక్కడికెళ్ళావంటే ?"

"మీ ఇష్టం. అడగడానికి ఎవరికి అధికారం వుంది ? మీకు బోర్ కొట్టింది. నాలుగు రోజులు బయట తిరిగొచ్చారు. ఎవరికీ సెలవులుండవా ? అలాగే."

"కానీ ..."

"అత్తయ్యగారూ, ఇంక కానీలు మానేసి పదండి ..."

బలవంతంగా రాజేశ్వరి భుజం చుట్టూ చేయివేసి బయటకు నడిపించింది జానకి. దారిలో అంతా జానకి రాజేశ్వరికి ఆవిడ స్థానం ఆవిడ వదలకుండా, ఆవిడ హక్కులు ఎలా కాపాడుకోవాలో బోధపరుస్తూనే వుంది. భర్తలో నచ్చని విషయాలుంటే ప్రక్కనే వుండి సాధించి మార్చుకోవాలి తప్పితే, ఇల్లు వదలడం వల్ల నష్టం ఆడవారికేనని వివరించి చెప్పింది. ఒక్కొక్కసారి మనకి తెలిసిన విషయాలయినా సరే, ఎదుటి మనిషి నోటి వెంట వింటుంటే బాగుంటుంది. తన మనసులోని భావాలనే జానకి బలపరుస్తున్నట్లనిపించింది రాజేశ్వరికి.

ఇల్లు రాగానే గేట్లోంచి ఇంటి వయిపు చూసింది రాజేశ్వరి. వరండాలో రమేశం, చంద్రం, సత్యం, సరోజ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. రమేశం ఇష్టపడని విషయమేమిటా అని రాజేశ్వరి ఒక్కక్షణం ఆలోచించింది. ఆయనకి ఆడవాళ్లు గట్టిగా మాట్లాడితే నచ్చదు. గుండెల్నిండా గాలి పీల్చుకుంది. గట్టిగా అరచినట్లుగా మాట్లాడుతూ ఇంట్లోకి అడుగుపెట్టింది.

"రామూ, మార్కెట్‌కి వెళ్ళి తొందరగా కూరలు తీసుకురా ... పిల్లలు ఆకలి కాగలేరు."

యుద్ధభేరీ మ్రోగించి మహారాణిలా, ఠీవిగా లోపలికొస్తున్న రాజేశ్వరిని వరండాలో

కూర్చున్నవాళ్ళు విభ్రమంగా చూసారు. కొంగు నడుం చుట్టూ బిగించి, అప్పుడే ఏదో పనిమీద గేటు దాకా వెళ్ళిన మనిషిలా, చాలా మామూలుగా రాజేశ్వరి లోపలికెళ్ళి, గబగబా బెడ్‌రూమ్‌లో అలమార్లో వున్న తన బట్టలు తీసుకొని, బాత్రూమ్‌లో దూరి తలుపేసుకుంది. వెనకగా వచ్చిన జానకితో పాటు సత్యం, సరోజ, చంద్రం లోపలికెళ్ళారు.

"అమ్మకేం చెప్పి తీసుకొచ్చావు జానకీ ?" ... జానకి చేతులు పట్టుకుని ఊపేస్తూ చంద్రం సంతోషంగా అడిగాడు.

"నేనెవర్ని తీసుకురావడానికి ? ఆవిడింటికి ఆవిడవచ్చారు" నిర్లక్ష్యంగా సమాధానం చెపుతూ, నవ్వుతూ చూసింది జానకి.

"ఆడదానివి కాదూ ? ఆ అరుపులేమిటి ?" అని అరవబోయిన రమేశం లొంగిపోయి, పోయిన పెన్నిధి దొరికినట్లు ఫీలవుతూ, చేతిలో వున్న పేపరుని మడిచి గుండెలమీద పెట్టుకుంటూ, ఈజీ చెయిర్లో వెనక్కి వాలాడు ❋

**రచన - ఇంటింటి పత్రిక : ఫిబ్రవరి, 2002; కథాపీఠం పురస్కారం**

# చందమామ రావె ...

ఇంకా తెల్లవారలేదు. అలారం శబ్దానికి మెలకువ వచ్చింది కాంతికి. కనులింకా బరువుగా వున్నా, మూసుకోమని మారాం చేస్తున్నా, చేయవలసిన పనులు గుర్తురాగానే టక్కున లేచి కూర్చుంది. అంతే ! ఆ తరువాత, సుమారొక గంటసేపు ఇంట్లో వున్న అన్ని మిషన్లుతోపాటు తనూ ఒక మిషనుగా మారి పనులు చేసుకుంది. కుక్కరూ, టోస్టరూ, గ్రైండరూ, మైక్రోవేవూ అన్నింటి స్విచ్చిలూ ఆపేసి, రెండు కప్పుల కాఫీ, బ్రెడ్ టోస్టూ తీసుకుని ఆఫీసు రూములోకి వచ్చింది. కానీ అక్కడ కాంతికి శరత్ కనిపించలేదు. కంప్యూటర్‌కి ఒక స్లిప్ అంటించి ఉంది.

"హనీ, అర్జంటుగా ఆఫీసు నుంచి కబురొచ్చింది. బహుశా రాత్రి భోజనానికి రావడం కూడా కుదరదేమో ... గుడ్‌డే ... శరత్."

అది చదవగానే ప్రాణం ఉసూరుమనిపించింది కాంతికి. శరత్ ఆఫీసుకి ఫోన్ చేసింది. సీట్లో దొరకలేదు. వెంటనే సిస్టమ్ ముందు కూర్చుని అతనికి ఈ-మెయిల్ ఇచ్చింది.

"శరత్ ! నేను నీహాతో మాట్లాడాను. ఆమె 5000 రూపాయల వరకు డిమాండ్ చేస్తోంది. ఆమె ట్రైనింగ్‌లో మైత్రి కొడుకు ఐ.క్యూ బాగా పెరిగిందట. ఇలైట్ స్కూల్లో సీట్ గ్యారంటీ అని చెపుతోంది. ఒక్కసారి ఆ స్కూల్లో కనుక బున్నీకి సీట్ వస్తే ఇక అక్కడి నుంచి డైరెక్టుగా ప్రొఫెషనల్ కాలేజీకే ... ఏమంటావు ?"

శరత్‌కి ఈ-మెయిల్ పంపించి, హడావిడిగా తయారవుతూ, ఆశా ఇంకా రాలేదేమిటా అనుకుంటూ, ప్రక్కనే వున్న రూమ్‌లోకి తొంగిచూసింది. అది బున్నీ రూము. పెద్ద పెద్ద సైకాలజిస్టుల పుస్తకాలు చదివి కాంతి, శరత్ లిద్దరూ ఆ గదిని తీర్చిదిద్దారు. డక్‌షేప్‌లో వున్న బేబీకాట్ మీద బున్నీ ముడుచుకుని పడుకున్నాడు. బూరె బుగ్గలతో ముద్దొస్తున్న బున్నీని ముద్దు పెట్టుకుందామని ముందు కడుగేయ బోతున్న కాంతి కాలింగ్ బెల్ శబ్దం విని గుమ్మం వయిపు నడిచింది.

బున్నీని చూసుకుందుకు ఆశా ఇంట్లో అడుగు పెట్టడం, కాంతి కైనటిక్ హోండా స్టార్టు చేసి ఆఫీసుకు బయలుదేరడం ఒక్కసారే జరిగాయి.

కాంతి, శరత్ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే. అందివచ్చిన అవకాశాలను

అందుకుని మంచి కెరియర్స్ బిల్డప్ చేసుకున్నారిద్దరూ. ఈలోగా బున్నీ పుట్టాడు. వాడి వలన కాంతి కెరియర్‌లో ఒక అడుగు వెనకబడింది. బున్నీ ఎప్పుడు ఫుల్‌టైమ్ స్కూల్‌కి వెడతాడా, ఎప్పుడు మళ్ళీ కెరియర్‌లో ఎదగడానికి వీలవుతుందా అని కాంతి రోజులు లెక్కపెడుతోంది. అంటే బున్నీని చూడలేక కాదు. వాడిని భవిష్యత్తులో మంచి స్కూల్లో, కాలేజీలో చదివించడానికి బోల్డు డబ్బు కావాలి మరి ! ఇద్దరిలో ఒకరి సంపాదనతో ఇల్లు నడుపుకుంటే, మరొకరి సంపాదన బున్నీ చదువుకు పనికొస్తుందని కాంతి, శరత్‌ల ఉద్దేశ్యం. బున్నీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉండడం కోసం వారిద్దరూ ఎంత కష్టపడడానికయినా సిద్ధంగా వున్నారు.

కావాలంటే కాంతి తల్లిదండ్రులు కాని, శరత్ తల్లిదండ్రులు కాని వచ్చి, బున్నీ ఆలనా పాలనా చూసే వీలుంది. కాని వారలా వుండడంలేదు. "పిల్లలు వాళ్ళ బ్రతుకులు వాళ్ళు బ్రతుకుతున్నారు. వాళ్ళకి కావలసినట్లు వాళ్ళ బాబుని పెంచుకుంటున్నారు. మనం మధ్యలో దూరడం సంస్కారం కాదు ..." అని అభిప్రాయ పడ్డారు. వారిని వచ్చి బున్నీని చూడమనడం కాంతి, శరత్‌లకు కూడా ఇష్టం లేదు. ఇన్ని రోజులకి బాధ్యతలు తీరి రెస్టు తీసుకునేవాళ్ళని ఇబ్బంది పెట్టడం భావ్యం కాదని ఒకవేపూ, అతి గారాబం చేసి మనవడిని డిసిప్లిన్ లేకుండా ఎక్కడ పాడు చేస్తారోనని మరోవైపూ ఆలోచించి, అసలా ప్రసక్తే తీసుకురాలేదు.

అలాగని వాళ్ళిద్దరూ బున్నీ పెంపకంలో ఏవిధమైన లోటూ చేయలేదు. పిల్లల పెంపకంలో ట్రైనింగు అయిన ఆశాకు నెలకు రెండువేలిచ్చి బున్నీ సంరక్షణ కోసం పెట్టుకున్నారు. కాంతి ఆఫీసు నుంచి రావడం మరికొంత లేటయితే ఓవర్‌టైమ్ ఇవ్వక తప్పని పరిస్థితి. ఆశా సాధారణంగా ఓవర్‌టైమ్ తీసుకుంటూనే ఉంటుంది. కాంతి ఉద్యోగం అటువంటిది మరి !

రెండేళ్ళ వయసున్న బున్నీ వయసుకు తగ్గట్టు బూరె బుగ్గలతో, అప్పుడప్పుడే వస్తున్న ముద్దు మాటలతో ముద్దులు మూటకడుతూ వుంటాడు. ప్రొద్దున్న వాడిని నిద్రలేపేదీ ఆశాయే ! మళ్ళీ రాత్రి నిద్రపుచ్చేది ఆశాయే ! ఆశా చాలా కరక్టు మనిషి. ఎట్టి పరిస్థితులలోనూ తన డ్యూటీ మర్చిపోదు. పిల్లలకి ఏ టైముకి ఏం తినిపించాలో, ఏ టైములో ఎటువంటి ఆటలు ఆడించాలో అన్నీ ట్రైనింగులో నేర్చుకుంది. తినడం, మాట్లాడడం, నడవడం, కూర్చోవడం వంటి అన్నిరకాల పద్ధతులూ చక్కగా బోధిస్తుంది. బున్నీకి "అత్త", "అమ్మ" అన్న మాటల కన్నా ముందు "ప్లీజ్", "తాంకూ" అన్న మాటలు వచ్చాయంటే ఆ ఘనతంతా ఆశాదే ! కాంతి, శరత్ లిద్దరూ బున్నీ మేనర్స్‌కి ముగ్ధు లవుతూంటారు. తామిద్దరూ పెద్దవాళ్ళయ్యేక కావాలని నేర్చుకున్న మాటలన్నీ బున్నీ చిలక పలుకుల్లా పలుకుతుంటే వారికెంత గర్వంగా వుంటుందో ! ఆశా ప్రతిరోజూ సాయంత్రం బున్నీ గురించి రిపోర్టిస్తూ ఉంటుంది.

కాంతి ఆఫీసుకు వెళ్ళగానే ఆశా బున్నీ రూమ్‌లోకి వెళ్ళి చూసింది. మంచి నిద్రలో వున్నాడు. టైము చూసింది. ఈ టైము దాటితే ఇంక నిద్రపోకూడదు అనుకుంటూ వాడిని బలవంతంగా నిద్రలేపి, బ్రష్ చేయించి, స్నానం చేయించి, బట్టలు మార్చి, జుట్టు దువ్వి తీసుకొచ్చి డైనింగ్ ఛెయిర్‌లో కూర్చోపెట్టింది. ప్లాంక్ ముందుకు లాగి, బౌల్‌లో కార్న్‌ఫ్లేక్స్ కొలిచి వేసి, కొలత ప్రకారం పాలు పోసి, స్పూన్ వేసి బున్నీ కందేలాగా తోసింది. బున్నీ నిస్సహాయంగా బౌల్ వంకా ఆశా ముఖం వంకా చూశాడు. వాడికి బ్రష్ చేసుకుంటున్నప్పుడు ట్యూబ్‌లో వున్న పేస్టంతా బైటకి నొక్కెయ్యాలనిపించింది. స్నానం చేస్తున్నప్పుడు నీళ్ళని చేతులతో టపటపా కొడుతూ ఆ శబ్దాన్ని మరీ మరీ వినాలనిపించింది. కాని వాడి చేతిలో ఏముంది ? ఆశా చేతిలో ఆటబొమ్మలా నీట్‌గా తయారయి డైనింగు ఛెయిర్‌లో కూర్చోవలసొచ్చింది. బున్నీకి ఏమిటో అంతా విసుగ్గా అనిపిస్తోంది. "కమాన్ ... హేవిట్ ..." ఆశా గొంతు కమాండింగ్‌గా వినిపించింది. స్పూన్ తీసుకుని అయిష్టంగానే తినడం మొదలు పెట్టాడు. సగం నోట్లో కెడితే సగం బట్టల మీద పోసుకుని మొత్తానికి అయిందని పించాడు. బున్నీ తనంత తానే తీసుకుని తినడం నేర్చుకోవాలి. ఇంకొకరు పెట్టకూడదు. వాడిలో ఇండివిడ్యువాలిటీ పెరగదు. అందుకే అలా చేసింది ఆశా. కాని వాడు తినే పద్ధతి ఆమెకేమీ సంతృప్తికరంగా లేదు. అలా ఒళ్ళంతా పోసుకుంటూ తినకూడదు. నీట్‌గా తినాలి. అందుకే, "యు షుడ్ నో హౌటు ఈట్" అని ఓ కామెంట్ పడేసింది. అరటిపండు తీసి బున్నీ కివ్వబోయింది.

"నో ..." తల అడ్డంగా వూపాడు బున్నీ.

"వాట్ డు యు వాంట్ ?" అడిగింది ఆశా.

"ఆపిల్ ..." నోటికొచ్చిన పేరు చెప్పాడు బున్నీ తప్పించుకుందుకు.

ఆశా ఫ్రిజ్ తీసి చూస్తే ఎక్కడా ఆపిల్స్ కనబడలేదు. వెంటనే కాంతి ఆఫీసుకు ఫోన్ చేసి చెప్పింది బున్నీ ఆపిల్ అడుగుతున్నాడని.

బున్నీ ఏది అడిగినా అది వెంటనే తనకు తెలియజేయాలని కాంతి ఆశాకి గట్టిగా చెప్పింది. సైకాలజిస్టుల సలహా ప్రకారం పిల్లలు అడిగినదేదీ కాదనకూడదనీ, వాళ్ళే పని చేస్తున్నా వద్దనకూడదనీ, వాళ్ళు అడిగినవన్నీ ఇవ్వాలనీ ... లేకపోతే, వాళ్లలో ఒక విధమైన అసంతృప్తి కలుగుతుందనీ, పెరిగి పెద్దయిన తర్వాత వాళ్ళ పర్సనాలిటీ మీద దాని ప్రభావం ఉంటుందనీ, కాంతి పూర్తిగా నమ్మింది. అందుకే బున్నీ ఆపిల్ కావాలన్నాడని ఆశా చెప్పగానే ఫ్రూట్‌షాప్‌కి ఫోన్‌చేసి, ఇంటి అడ్రస్ చెప్పి మంచి ఆపిల్స్ పంపమని ఆర్డర్ ఇచ్చేసి మళ్ళీ పనిలో పడిపోయింది.

బ్రేక్‌ఫాస్ట్ అయ్యాక ఆశా బున్నీని వాడి రూములోకి తీసుకెళ్ళి ఆటబొమ్మలన్నీ

తీసి వాడి ముందు పరిచింది. అవన్నీ ఎడ్యుకేషనల్ టాయ్స్ అని పేరు తెచ్చుకున్న బొమ్మలు. పిల్లలు ఆటలాడుకుంటూండగానే వారిలో ఒరిజినాలిటీ, క్రియేటివిటీ, ఐ.క్యూ. ఇవన్నీ పెరగడానికి తయారుచేయబడిన బొమ్మలు. ఆ రోజు బున్నీ వేటితో ఆడతాడో పరిశీలించి, దానిని అనలైజ్ చేసి, నిన్నటికీ ఇవ్వాల్టికీ వాడి ఐ.క్యూ.లో ఇంప్రూవ్‌మెంట్ వుందో లేదో సాయంత్రం కాంతికి రిపోర్టివ్వాలి. కానీ బున్నీ అసలు బొమ్మల వైపే చూడడం లేదు. వాడి దృష్టి కిటికీలోంచి కనపడుతున్న చెట్టు మీద ఉంది. ఆశా కూడా అటు చూసింది. గూటిలోనే వున్న ఇంకా రెక్కలు రాని పక్షులకు తల్లి పక్షి నోటి కాహారం అందిస్తోంది. ఆశా మనసు తేలికపడింది.

"టుడే బున్నీ హేజ్ అబ్జర్వ్‌డ్ ఎ లివింగ్ ఎగ్జాంపుల్" అని సాయంత్రం కాంతికి రిపోర్టు రాయచ్చుననుకుంది.

లంచ్‌టైమ్ అవగానే కాంతి వండి, అల్యూమినియం ఫాయిల్‌లో పేక్ చేసి వుంచిన న్యూట్రిషియన్ లంచ్‌ని మైక్రోవేవ్‌లో మరొకసారి వేడిచేసి బున్నీ ముందుంచింది ఆశా.

"కమాన్ ... హేవిట్" అంది కమాండింగ్‌గా. బున్నీ కసలేమీ తినాలనిపించలేదు. ఏదో ఒకటి తినేస్తే ఆశా నవ్వుతూ 'గుడ్‌బాయ్' అంటుందనుకుంటూ బున్నీ అయిష్టంగానే సగం కింద, సగం బట్టల మీద పోసుకుంటూ తిన్నాడు.

సాయంత్రం బున్నీకి మొహం కడిగి, బట్టలు మారుస్తూంటే వాడికి చిరాకని పించింది. వాడికి చొక్కా వేసుకోకుండా హాయిగా వుండాలనుంది. కాని ఆశా షర్టు తొడిగేస్తోంది. తల అడ్డంగా తిప్పుతూ ... "నో ..." అన్నాడు.

"వాట్ డుయు వాంట్ ?"

"రెడ్ షర్ట్"

నోటికొచ్చిన మాట చెప్పాడు. ఆశా అలమారంతా వెతికింది. ఎర్రరంగు చొక్కా లేదు. వెంటనే కాంతికి ఫోన్ చేసి బున్నీ రెడ్ షర్ట్ కావాలంటున్నాడని చెప్పింది. పాలు కలిపిచ్చింది తాగడానికి ఆశా. "నో ..." అన్నాడు బున్నీ. వాడికి పంతం లాంటిదేదో వస్తోంది. వాడికేం కావాలో వాడికే తెలియటంలేదు.

"వాట్ డు యు వాంట్ ?" అలవాటుగా అడిగింది.

"చాకొలెట్" ... నోటి చివరనున్న మాట చెప్పాడు. వెంటనే ఫ్రిజ్ తీసి, ఫైవ్‌స్టార్ వాడి చేతిలో పెట్టింది. వాడికి నిజంగా ఆకలయి అడగలేదు కదా ! దాన్ని చేతిలో పట్టుకొని ఇల్లంతా తిరుగుతున్నాడు. ఆశా ఏదో మేగజైన్ తీసుకుని అందులో మునిగి పోయింది. పదినిముషాలయ్యాక బున్నీ ఏంచేస్తున్నాడా అని వెతుక్కుంటూ ముందు

గదిలోకెళ్ళింది. అక్కడ వాడు టీ.వి.కి ఎదురుగా కూర్చుని రిమోట్ బటన్లు నొక్కుతున్నాడు.

"అమ్మో ! బున్నీ టీ.వి. చూస్తే ఇంకేమయినా ఉందా ?" పిల్లలు టీ.వి. చూడడం మంచిది కాదని వాడినెత్తుకుని వాడి రూమ్‌లోకి తీసుకెళ్ళబోయింది. బున్నీ ఏడుపు మొదలుపెట్టాడు.

"వాట్ డుయువాంట్ ?" అలవాటుగా అడిగింది.

వాడు టీ.వి. వైపు చూపించాడు. ఆశా అటు చూసేసరికి స్క్రీన్‌మీద చంద్రుడు కనిపిస్తున్నాడు.

"యు వాంట్ మూన్ ?" అడిగింది ఆశ్చర్యంగా.

"యా ..." అన్నాడు వాడు మరింత ధీమాగా. వెంటనే కాంతికి ఫోన్ చేసింది ఆశా.

"మేమ్, బున్నీ వాంట్స్ మూన్ ..." చాలా మామూలుగా చెప్పింది.

"వాట్ ?" ... ఆశ్చర్యపోయింది కాంతి.

"యస్ మేమ్ ... హి వాంట్స్ మూన్" తన డ్యూటీగా చెప్పేసింది ఆశా.

వెంటనే కాంతి శరత్‌కి ఫోన్ చేసింది.

"బున్నీకి మూన్ కావాలిట" విషయం చెప్పింది.

శరత్‌కి కాసేపు ఏమీ అర్థం కాలేదు. నెమ్మదిగా అనలైజ్ చేసుకున్నాడు. కొత్తగా బున్నీకి కొన్న బొమ్మల్లో మూన్ మీద అడుగులేస్తున్న మనిషి బొమ్మ ఒకటి ఉంది. మనిషి చంద్రుడి మీదెలా తేలుతూ నడుస్తాడో చూపిస్తుంది. శరత్‌కి ఆనందం ఆకాశపుటంచులు తాకింది. తన కొడుకు చంద్రుడి మీద నడవాలనుకుంటున్నాడు. పుత్రోత్సాహం పట్టలేకపోయాడు. వెంటనే కాంతితో చెప్పాడు బున్నీ ఆలోచనలు ఎంత ఉన్నతంగా ఉన్నాయో !

శరత్ మాటలు విన్న కాంతికి గాలిలో తేలిపోతున్నట్లనిపించింది. మళ్ళీ తన పిచ్చితనానికి తనకే నవ్వొచ్చింది. శరత్‌తో అదే చెప్పింది "ఇదేమయినా చాక్లెట్టా ? బొమ్మలా ? అడిగిన వెంటనే అందించడానికి ? మూన్ !!!"

కానీ శరత్ బున్నీ కోరికను సమర్థించాడు. వాడికి కావలసింది వాడు అడిగాడనీ, ఇవాళ కాకపోతే రేపయినా వాడు అడిగింది ఇవ్వాలని చెప్పాడు. అదీకాక ఈ మధ్యే చంద్రుడి మీదకి రష్యా వాళ్ళ సాయంతో ఒక అమెరికన్ విజిట్ చేసి వచ్చాడని, మరి కొన్నాళ్ళలో అది టూరిస్ట్ స్పాట్‌గా తప్పకుండా అవుతుందనీ అప్పుడు తప్పకుండా బున్నీ కోరిక తీరగలదని శరత్ ఆకాశానికి నిచ్చెనలు వేయడం మొదలుపెట్టాడు.

కాంతి ఆఫీసు నుంచి ఇంటికి చేరేటప్పటికి ఆశా ఇంటికి బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. కాంతిని చూస్తూనే బున్నీ గురించి రిపోర్టు ఇచ్చింది. ప్రొద్దుట్నించీ బ్రేక్‌ఫాస్ట్, లంచ్ సగం సగమే తిన్నాడనీ, డిన్నర్ అసలు ముట్టుకోలేదనీ, మూన్ కోసం చాలా మారాం చేశాడనీ, ఏడుస్తూనే పడుకున్నాడనీ చెప్పింది.

"అసలు వాడికి మూన్ గురించి ఎలా తెలిసింది ?'' ... కాంతి అడిగింది.

మధ్యాహ్నం తను మేగజైన్ చదువుతున్నప్పుడు బున్నీ టీ.వి. పెట్టాడనీ, వాడు అటూ ఇటూ దాని బటన్లు నొక్కుతుంటే వి.సి.ఆర్. ఆన్ అయి, అందులో వున్న సినిమా రెండు నిముషాలు చూసాడనీ అందులో వాడికి మూన్ కనిపించిందనీ, అప్పట్నుంచి దానికోసం మారాం చేస్తున్నాడని చెప్పింది.

కాంతి ఆశ్చర్యపోయింది. తనకు, శరత్‌కు అసలు టీ.వి. చూడడానికే టైముండదు. మరింక వీడియో కేసెట్ పెట్టుకుని చూసేటైమెక్కడ ? వెంటనే మొన్ననే వచ్చి వెళ్ళిన బంధువులు గుర్తొచ్చారు. వాళ్ళు కాలక్షేపం కోసం సినిమా పెట్టుకుని కేసెట్ అందులో మర్చిపోయి ఉండవచ్చుననుకుంది. ఆశాను పంపించి బున్నీ రూమ్‌లోకి వెళ్ళింది. వాడు నిద్రలోనే ఇంకా వెక్కిళ్ళు పెడుతున్నాడు. కళ్ళ కింద ఆరిపోయిన కన్నీటి చారికలు కూడా కనిపిస్తున్నాయి. కాంతి ఖంగారుపడింది. బున్నీ అడిగింది ఇవ్వకపోతే వాడిలో అసంతృప్తి మొదలయితే అది రేపు వాడి వ్యక్తిత్వం మీద ఎలాంటి ప్రభావం చూపిస్తుందో అని ఆందోళన పడింది. అసలు వాడు చూసిన కేసెట్‌లో ఏముందో అనుకుంటూ ముందు గదిలోకి వెళ్లి టీ.వి., వీడియో ఆన్ చేసి రెండు నిముషాలు రివైండ్ చేసి చూడడం మొదలుపెట్టింది.

అందులో ...

ఒక తల్లి తన ముద్దులు మూటకట్టే బాబును ఎత్తుకుని, "చందమామ రావె'' అని పాట పాడుతూ గోరుముద్దలు తినిపిస్తోంది. చంకలో బాబు నెత్తుకుని ఒక చేతిలో పాలబువ్వతో ఆ తల్లి కళ్ళ నిండా ప్రేమ, ఆప్యాయతలు ఒలికిస్తూ బాబుకి అన్నం తినిపిస్తోంది.

కాంతి స్థాణువయ్యింది.

"చందమామ రావె ... జాబిల్లిరావె ...

కొండెక్కి రావె ... గోగుపూలు తేవే ...''

చందమామ రావె ...

చెవులకి వినిపిస్తున్న పాట, కనులకు కనిపిస్తున్న దృశ్యం కాంతి మనసును కలచివేసాయి. బున్నీకేంకావాలో అర్థమయింది. వాడికి గోతులు, గొప్పులు వున్న

మూన్ కాదు కావలసింది. ఆక్సిజన్ మాస్క్ వేసుకుని తేలుతూ నడవ వలసొచ్చే మూన్ కాదు కావలసింది.

చల్లదనం కురిపించే చందమామ కావాలి. బొంత కుట్టుకుంటున్న ముసలమ్మ కూర్చున్న చందమామ కావాలి. ఉడుత కూర్చుని జాంపండు తింటున్న చందమామ కావాలి. వెండిగిన్నెలో వేడి బువ్వ, పైడిగిన్నెలో పాలబువ్వ చందమామ అందిస్తే, దానిని అందాల బాబుకు అందించే అమ్మ అమృత హస్తం కావాలి.

కాంతికి అర్థమైపోయింది. బున్నీకేం కావాలో ! ... ఆఫ్టాల్ ఆమె కూడా అమ్మేకదా ! ... ❋

**రచన - ఇంటింటి పత్రిక : ఫిబ్రవరి, 2002**

**వాడ్రేవు పతంజలి స్మారక కథల పోటీలో బహుమతి**

కన్నడ భాషలోకి అనువదించబడి అనువాద కథల పోటీలో బహుమతి పొంది కన్నడ పత్రికలో ప్రచురించబడింది

# పాపం మాలతి ...

"వద్దు వద్దు అని మీకిద్దరికీ ఇప్పటికి లక్షసార్లు చెప్పాను. ఆఖరికి మీకు కావాల్సింది చేసుకొచ్చేరన్నమాట'' మాలతి భర్తని, కూతురినీ కూడా గట్టిగా అడిగింది.

కూతురు ఉష ఫ్రెండ్ బర్త్‌డే పార్టీ అయితే శనివారం ప్రొద్దున్న మాలతి ఉషని "చక్కీ చీజ్'' దగ్గర దించి వచ్చింది. పార్టీ అయ్యాక కూతుర్ని పికప్ చేసుకునేందుకు వెళ్ళిన శివరాం వస్తూ వస్తూ ఒక కుక్కపిల్లని కూడా తీసుకొచ్చేడు.

అసలు శివరాం ఒక కుక్కపిల్లని పెంచుకుందామని మాలతిని ఎప్పట్నించో అడుగుతున్నాడు. అమెరికాలో అందర్నీ గమనిస్తున్న ఉష కూడా ఆరేడేళ్ళు దాటినప్పట్నుంచీ ఒక కుక్కనో పిల్లినో పెంచుకుందామని తల్లిని బ్రతిమాలుతోంది. ఉషకి పదేళ్ళు వచ్చినా కూడా ఇంట్లోకి కుక్కని కానీ మరి దేనిని కానీ తేవడానికి మాలతి ససేమిరా ఒప్పుకోలేదు.

శివరాం, మాలతి ఉద్యోగరీత్యా అమెరికా వచ్చి పన్నెండేళ్ళవుతోంది. పాతవి పూర్తిగా వదులుకోకుండా కొత్తవి అన్నీ నేర్చుకోకుండా "అమెరికన్ డాలర్స్ ఇండియన్ లైఫ్'' అన్న మాటకి పూర్తి అర్థాన్నిస్తూ చక్కగా ఒక కూతురికి తల్లిదండ్రులయారు.

మాలతి తెలివైనది, చురుకైనది. ఉష స్కూలు విషయాల దగ్గర్నుంచి ఇంట్లోకి కావల్సిన సరుకులు, ఇంట్లో వారి రొటీన్ హెల్త్ చెకప్పులు, స్నేహితులతో కలివిడిగా వుండడం, నలుగురితో ఇచ్చి పుచ్చుకోవడం లాంటివన్నీ ఆమే చూసుకుంటూ, వీక్‌డేస్‌లో ఉషని స్విమ్మింగ్‌కి, కరాటేకీ తీసికెడుతూ వీకెండ్లో శివరాం రిలాక్సవ డానికి సహాయపడుతుంటుంది.

శివరాంకి కూడా చెడు అలవాట్లేమీలేవు. భార్య, కూతురు, ఇల్లు తప్పితే అతనికి మరో వ్యాపకమేలేదు. కానీ ఒక చిన్న కోరిక మాత్రం ఎప్పట్నించో వుంది, అదే ఒక కుక్కపిల్లని పెంచుకోవాలని. ఉష కూడా కాస్త జ్ఞానం వచ్చిన దగ్గర్నుంచీ చుట్టూ అందర్నీ గమనిస్తుండడం వల్ల స్కూల్లో ప్రతివాళ్ళూ వాళ్ళ పెట్ యానిమల్ గురించి మాట్లాడడం చూసి ఎలాగైనా ఒక పిల్లినికానీ, కుక్కని కానీ పెంచుకుందామని తల్లిని బతిమాలుతోంది.

కానీ మాలతికి చిన్నప్పుడు ఇండియాలో పెరిగినప్పటి వాసనలు ఇంకా పోలేదు. చిన్నప్పుడు ఇంట్లోకి కుక్కవస్తే "ఛీ ... ఛీ ..." అంటూ కర్ర పుచ్చుకుని కొట్టడమే గుర్తొస్తుంది. అందుకే ఇక్కడ అందరూ కుక్కల్నీ, పిల్లుల్నీ స్వంతపిల్లల్నీ ముద్దు చేసినట్టు చేస్తుంటే అసహ్యపడేది. అక్కడికీ శివరాం మాలతికి వివరంగా చెప్పాడు. చిన్నప్పుడు ఆమె చూసినవి వీధిలో తిరిగే కుక్కలనీ, అవి తాకితే ఎక్కడ లేని రోగాలు వస్తాయని మన పెద్దవాళ్ళు తరిమేసేవారనీ, ఇక్కడి పెట్స్ అలాంటివి కాదనీ, వాటి వంశం గురించి తెలుసుకుని కానీ ఎవరూ పెంపకానికి తీసుకోరనీ నచ్చచెప్పాడు. "కుక్కలకీ, పిల్లులకీ వంశమేవిటి నా మొహం ..." అంటూ అతని మాటని తీసి పడేసింది మాలతి.

"అదికాదు హనీ, వాటిని రెగ్యులర్‌గా వెట్ హాస్పిటల్‌కి తీసికెడతారు. వ్యాక్సిన్స్ అవీ ఇప్పిస్తారు. వాటివల్ల మనకే రోగాలూ రావు" అని ఎంత నచ్చచెప్పినా మాలతి ఒప్పుకోలేదు. ఏం చేసినా కుక్క కుక్కేకదా అంటుంది తప్పితే పెంపకానికి మటుకు పడనివ్వలేదు. ఆఖరికి ఇవాళ బర్త్‌డే పార్టీ నుంచి వచ్చిన తండ్రీ, కూతురూ ఒక కుక్కపిల్లని ఎత్తుకుని కనిపించేసరికి మాలతి ఆవేశం ఆపుకోలేకపోయింది.

"వద్దు వద్దు అని మీకిద్దరికీ ఇప్పటికి లక్షసార్లు చెప్పాను. ఆఖరికి మీకు కావాల్సింది చేసుకొచ్చేరన్నమాట."

శివరాం నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు.

"హనీ, అసలు సంగతి తెలిస్తే నువ్వే ఒప్పుకుంటావు. మేం దీన్ని కావాలని తెచ్చామా ? చూడు ఎలా చూస్తోందో ? మేం వస్తుంటే దారిలో కొన్ని కుక్కల్ని పెట్టుకుని కొంతమంది వున్నారు. అవి ఆర్ఫన్సట. ఎవరైనా పెంచుకుంటారేమోనని అక్కడ పెట్టుకుని వున్నారుట. మేం అట్నుంచి వస్తుంటే ఇది పిల్చింది. చూసేసరికి ఎంతో ఆశగా "నన్ను మీతో తీసికెళ్లరూ ... !" అన్నట్టు చూసింది. పాపం అనాథ. కాసిని పాలుపోస్తే ఇంట్లో వుంటుంది. అందుకని ఇంక దాని చూపుని కాదనలేక తీసుకొచ్చాం."

మాలతి విసుక్కుంది. అయిపోయింది. అంతా అయిపోయింది. వీళ్ళకూ్కడా ఈ అమెరికన్ల భాష వచ్చేసింది. కుక్కలు నన్ను తీసికెళ్ళరా అని అడగడమేంటి చోద్యం కాకపోతేనూ ! అదేంటో ... కొంతమందిని చూసింది మాలతి. వాళ్ళు ఎంతో సంభ్రమంతో నోరు ఈ చివర నుంచి ఆ చివరవరకూ సాగదీసుకుంటూ, "యూ నో ... ఐ లవ్ మై ట్రెజ్జ్ మోర్ దాన్ మై సన్ ..." అంటుంటారు. వాళ్ల సంబరం పాడుగానూ

... సొంత పిల్లలకన్న కుక్కలూ, పిల్లులూ ఎక్కువేమిటో ఎంత ఆలోచించినా అర్థంకాదు మాలతికి.

ఉష తల్లిని బ్రతిమాలుకుంది. "ప్లీజ్ ... డోంట్ సే నో మామ్. ప్లీజ్ మామ్ ... అయ్ లైకిట్ మామ్ ..." అంటూ. శివరాం మళ్ళీ అభ్యర్థించాడు. "దీని సంగతి మేమిద్దరం చూసుకుంటాం హనీ ... నీకేం ట్రబులివ్వం. ప్లీజ్ ... నో అనకు."

ఇంక కాదని తను చేసేదేమీలేదని గ్రహించిన మాలతి వాళ్ళ దారికి అడ్డు తొలగింది. మరింక వాళ్ళిద్దరి సంతోషానికి అవధులు లేవు. మాలతి మొఖాన ఓ "థాంక్స్" పారేసి, దాన్ని పుచ్చుకుని ఇద్దరూ ఫ్యామిలీరూమ్‌లో సెటిలయిపోయారు. దాని పేరు గురించి చర్చించి చర్చించి ఆఖరికి "మిని" అని తేల్చారు. దాన్ని ఇంట్లో ఎక్కడ పెట్టాలా అని ఆలోచించి, చివరకి లాండ్రీరూమ్‌గా నిర్ధారించి, మళ్ళీ ఇద్దరూ కలిసి దాన్ని పుచ్చుకుని బైటకిపోయారు. వస్తూ వస్తూ ల్యాండ్రీరూమ్ నుంచి అది బైటకి రాకుండా ఆ గుమ్మం దగ్గరకి ఓ చిన్న చెక్కగేటూ, దానికి కావాల్సిన ఫుడ్, స్వెటర్, కాప్ లాంటివి మొత్తానికి దానికి కావల్సిన సరంజామా చాలానే కొనుక్కొచ్చారు. శివరాం అప్పటికప్పుడు లాండ్రీరూమ్ నుంచి బైటకొచ్చే గుమ్మం దగ్గర ఆ చిన్న గేటు బిగించేసి, మినీని దానిలో పెట్టి, "చూసావా ... నీకు మేం ఏ ఇబ్బందీ లేకుండా చేశాము" అన్నట్టు మాలతివైపు చూశాడు. మాలతి ఆ చూపుల్ని పట్టించుకోనట్టు మొహం పక్కకి తిప్పుకుంది.

ఆ ఆదివారమంతా తండ్రీ కూతుళ్ళిద్దరూ మినీకి ఇచ్చే ఫుడ్ గురించి, దానికి స్నానం చేయించడం గురించి, వెట్ హాస్పిటల్‌కి తీసికెళ్ళి వ్యాక్సిన్స్ ఇప్పించడం గురించి ఇంటర్నెట్‌లోకి వెళ్ళి సమాచారం సేకరించి, వాటి ప్రింటవుట్లు కూడా తీసుకుని లాండ్రీరూమ్‌లో గోడకి అతికించుకున్నారు. వాళ్ళ సంతోషం చూసి మాలతికి ఆశ్చర్యం వేసింది. వాళ్ళు ప్రేమవర్షం కురిపించడానికి ఇంకెవరూ దొరక్క ఈ కుక్కపిల్లని తెచ్చుకున్నారా అనిపించి, ఏదైనా చేసుకోనీ, నాకు సంబంధం లేదుకదా ... వాళ్ళ ఏడుపేదో వాళ్ళు ఏడుస్తారనుకుంటూ మరింక అటువైపు కూడా తొంగి చూడలేదు మాలతి.

కానీ అది కుదిరేపని కాదని మర్నాడు పొద్దున్న వరకూ గుర్తించలేదు మాలతి. సోమవారం పొద్దున్నే శివరాం ఆఫీసుకీ, ఉష స్కూల్‌కీ వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళేదాకా వాళ్ళ వెనకాల తోకాడిస్తూ తిరిగిన మినీ కూడా గరాజ్ డోర్ దాకా వచ్చి వాళ్ళని సాగనంపింది. గరాజ్ డోర్ మూసి ఇంట్లోకి వస్తున్న మాలతికి ఎదురుగా ఈ కుక్కపిల్ల కనిపించింది. చటుక్కున ఆగిపోయింది. అవునుకదా ... ఇదొకటి వుందికదా

అనుకుంటూ దానివైపు చూసింది. అదికూడా మాలతిని అనుమానంగానే చూసింది. నిన్నంతా దానికి శివరాంతోటీ, ఉషతోటీ బాగానే అలవాటయింది. కానీ మాలతి దాని దరిదాపులకి కూడా పోలేదు. అందుకని అది మాలతి వైపు గుర్రుగా చూసింది. కనీసం అది అలా చూసిందని మాలతి అనుకుంది. ఇప్పుడెలా దాన్ని తప్పించుకుని ఇంట్లోకి వెళ్ళడం ... దానికి పాలో, బిస్కట్లో ఏవో పడెయ్యాలికదా అనుకుంటూ, ''చ్యా ... చ్యా ...'' అంది దాన్ని వెనక్కి నడవమన్నట్టు చెయ్యి విదిలిస్తూ. దానికర్థంకాలా. మాలతిని పరీక్షిస్తున్నట్టు ఇంకా అలాగే కూర్చుంది.

"నిన్నే ... ఏంటి నీపేరూ ... ఆ ... మినీ కదా ! మినీ ... చూ చూ రామ్మా ... రా ... నీ రూమ్‌కి రా ... చూ చూ ...'' అంటూ దానికి లాండ్రీరూమ్ వైపు చెయ్యి పెట్టి చూపించింది. అది తల ఒకసారి అటు వైపు తిప్పి చూసి, ఏదీ పట్టనట్టు ఇటు తిరిగి మళ్ళీ మాలతినే చూడసాగింది. మాలతికి ఏం చెయ్యాలో అర్థం కాలేదు.

"అటు నడవమన్నానా ?'' కాస్త గట్టిగా అంది. అది గుర్రుమని శబ్దం చేసింది. మాలతి భయపడింది. నెమ్మదిగా కాళ్ళు జరుపుతూ, ఊపిరి బిగబట్టుకుని దాని పక్కనుంచే ఫ్యామిలీ రూమ్ దాకా వచ్చింది. వెనకాలే తోకాడిస్తూ మినీ కూడా వచ్చింది. "అమ్మయ్యా దారి దొరికింది'' అని సంతోషిస్తూ మాలతి లాండ్రీరూమ్ వైపు నడిచింది. మినీ కూడా వెనకాలే వచ్చింది. ఎంతో తొందరగా ఆ రూమ్ లోకి వెళ్ళింది మాలతి. వెనకాలే గెంతుతూ మినీ కూడా వచ్చింది. దాన్ని లోపలపెట్టి, తను బైటకొచ్చి చిన్నగేటు వేసేద్దామని మాలతి ఆలోచన. అలాగే మాలతి ఒక అడుగు బైటపెట్టిందో లేదో విషయం అర్థమైనట్టు మినీ అంతకంటే ముందే ఒక్క గెంతులో రూమ్ లోంచి బైటకొచ్చి, మాలతివైపు విజయగర్వంతో చూసింది. మాలతికి కాసేపు పోనీ వదిలేద్దామా, ఇంట్లో తిరుగుతుంది అనిపించింది. మళ్ళీ వదిలేస్తే అమ్మబాబోయ్ సోఫాలవీ పాడుచేస్తే అన్న ఆలోచన రాగానే ఎలాగైనా దాన్ని లాండ్రీరూమ్ లోనే సెటిల్ చెయ్యాలనుకుని మాలతి ముందుగా తను ఆ రూమ్ లోకి వెళ్ళింది. మినీ రూమ్ దాకా వచ్చి, గేటు దగ్గరే నిలబడి మాలతిని చూడసాగింది. మాలతి కదలకుండా అలాగే నిలబడింది. మినీ కొంచెం కొంచెంగా రూమ్ లోపలికి వస్తోంది. మాలతి నెమ్మదిగా దానికి తెలీకుండా దానిమీంచి చెయ్యిజాచి చిన్నగేటు మూసేసింది. మినీ మూసేసిన గేటుని చూసి ఇటు తిరిగి మాలతి అక్కడే వుండడం చూసి సమాధాన పడింది. నెమ్మదిగా నడుస్తూ గేటుదాకా వచ్చి చిన్నప్పుడు గోడలు దూకిన సంగతులు గుర్తుచేసుకుంటూ ఆ గేటు దూకినట్టే దాటి అందులోంచి బైటపడింది మాలతి. మినీ ఒక్క గెంతులో వచ్చి మాలతి కాలుని పట్టబోయింది. గబుక్కున కాలు లాక్కుంది మాలతి. చీదరగా మినీని చూస్తూ పరిగెడుతున్నట్టే బాత్రూమ్‌లోకెళ్ళి,

కాళ్ళని సోపుతో ఒకటికి పదిసార్లు కడుక్కుంటేకానీ మాలతికి ఆ చీదర తగ్గలేదు. కిందనుంచి మినీ అరుపులు వినిపిస్తున్నాయి. శివరాం మీద, ఉషమీద పీకల్దాకా కోపం వచ్చిందామెకి. మినీని మేం చూస్తాంకదా అంటారు మాట్లాడితే ... నిజమే కానీ వాళ్ళు ఇంట్లో వుండేదెప్పుడు ? శనాదివారాలే కదా ! మరి మిగిలిన అయిదు రోజులూ పొద్దుట్నించీ సాయంత్రం దాకా తనకీ మినీకి మధ్య ఈ యుద్ధం తప్పదన్న మాట. ఒక్కసారిగా ఎక్కడలేని నీరసం వచ్చేసింది మాలతికి.

ఇంతలో ఫోను. ఎవరా అని చూస్తే శివరాం. ఎప్పుడో అమెరికా వచ్చిన కొత్తల్లో ఆఫీసుకి వెళ్ళిగానే చేరినట్టు ఫోన్ చేసి చెప్పేవాడు శివరాం. తర్వాత ఇద్దరూ ఆ అలవాటుని మర్చిపోయారు. మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత ఇప్పుడీ ఫోన్. "ఏమిటి ? ఏమైంది ?" ఖంగారుపడుతూ అడిగింది మాలతి. "అబ్బే, ఏవీలేదు ...నీతో మాట్లాడా లనిపించిందంతే ..." కాస్త తడబడ్డాడతను. మాలతికి అర్థమైపోయింది. ఇప్పుడీ కుక్కకోసమే నన్నమాట ఫోన్ అనుకుంటూ, "ఊ ... చెప్పు ..." అంది ఏమీ ఎరగనట్టు.

"అదే ... బ్రేక్ ఫాస్ట్ చేశావా ?" "ఇంకా లేదు.." "మరి తినేసెయ్యి. లేటవుతుంది." "అలాగే ..." "అవునూ, మినీ ఏం చేస్తోందీ ?" కాస్త భయపడుతూనే అడిగాడు శివరాం.

"ఏం చేస్తుందీ ! కుక్కలేం చేస్తాయో అదే చేస్తోంది. లేకపోతే డాన్స్ ఏమైనా చేస్తోందనుకున్నారా ?" కోపమంతా వెళ్ళగక్కేసింది.

"అబ్బే ... అదికాదు. పాలేమైనా తాగిందా అని ..." అప్పుడు గుర్తొచ్చింది మాలతికి దానికేమైనా పెట్టాలని.

"అవునూ ... దానికి ఏం పెట్టాలీ ?" అనడిగింది. శివరాం గొంతులో ఉత్సాహం పొంగింది.

"పాలు పట్టాలి. మరో గంటయ్యాక బిస్కట్లు పెట్టాలి. ఏవేవి, ఏ టైమ్‌లో, ఎంతెంత పెట్టాలో అన్నీ ఆ రూమ్‌లో గోడకి ప్రింట్ ఔట్ అతికించి పెట్టాం." అమ్మో మళ్ళీ ఆ రూమ్‌కి వెళ్ళక తప్పదా అనుకుంది.

"మినీకి పాలుపట్టే బౌల్, మెజర్మెంట్ బౌల్ అన్నీ అక్కడే వున్నాయి. ప్లీజ్ హనీ ... నేనొచ్చేదాకానే. తర్వాత నేను చూసుకుంటాగా" శివరాం ఫోన్ పెట్టేశాడు. సాయంత్రం దాకా చూశాక ఇంకేముంటుంది చూసేందుకు ! ఇంక తనకి తప్పదు. తనవల్ల మరో నోరులేని జీవి బాధపడకూడదు అనుకుంటూ ఆ రూమ్‌కి వెళ్ళి, పళ్ళు బిగపట్టుకుని గోడమీదున్నవి చదివి, దానికి కావల్సినవి పెట్టింది మాలతి. మినీ ముందు కాస్త అనుమానంగా చూసి తర్వాత ఆ పాలు తాగింది. అమ్మయ్య

అనుకుంటూ ఒక బ్రెడ్ టోస్ట్ చేసుకుని, జ్యూస్ తీసుకుని ఫ్యామిలీ రూమ్‌లో సెటిలయ్యింది మాలతి.

కొంచెంసేపు అయేసరికి మినీ అరుపు వినిపించింది. ముందు అంతగా పట్టించుకోలేదామె. కానీ అది గాప్ లేకుండా అరుస్తోంది. అరుపు కూడా వేరే విధంగా వుంది. ఏమైందోనని అటువైపు వెళ్ళిచూస్తే ఇంకేముందీ కుక్కకదా ... పాలు తాగేసి దాని రెండోపని కూడా కానిచ్చేసింది. మాలతి ముందు తెల్లబోయింది. తర్వాత అసహ్యమేసింది. ఇప్పుడేం చెయ్యాలి ? అది ఎత్తి ఫ్లష్ చెయ్యాలా ? లేకపోతే సాయంత్రం శివరాం వచ్చేవరకూ వుండాలా ? ఛీ ... ఛీ ... అనుకుంటూ ముక్కుకీ, నోటికీ గుడ్డ కట్టేసుకుని, చేతులకి గ్లవ్స్ తొడుక్కుని, సగం వేళ్ళు మూసుకుని, పళ్ళు బిగపట్టుకుని, అక్కడంతా క్లీన్ చేసి, చేతులు ఒకటికి పదిసార్లు కడుక్కుని, పదికి వందసార్లు శివరాంని తిట్టుకుంది. "ఏం ఖర్మ వచ్చిందిరా భగవంతుడా !" అనుకుంటూ సోఫాలో కూలబడింది. మళ్ళీ ఫోను మోగింది. శివరామే కనక అయితే ఇవాళ అయిపోయాడే అనుకుంటూ ఎవరా అని చూస్తే ప్రమీలగారు.

ప్రమీల గారి ఫోను తప్పక తీసుకుంటుంది మాలతి. ఆవిడ ఆ లొకాలిటీలో వున్న తెలుగు అసోసియేషన్‌కి సెక్రటరీ. ఉగాది, సంక్రాంతి సంబరాల్లో ఉష చేత పాటలు పాడించాలన్నా, డాన్సులు చేయించాలన్నా ఆవిణ్ణి మంచి చేసుకోవడం చాలా అవసరం. ఇన్నేళ్ళనుంచీ మాలతి ఆవిడతో సంబంధ బాంధవ్యాలు బాగానే నడిపిస్తోంది. దగ్గర్లో ఏవీ కార్యక్రమాలు లేవే, ఇప్పుడెందుకు పిలిచిందీ అనుకుంటూ ఫోన్ ఎత్తి, "హాయండీ ... ఎలా వున్నారు ?" అంది. అవతల్నుంచి ప్రమీల గారు కూడా ఎంతో ఆనందంగా "హాయండీ మాలతిగారూ, బానే వున్నాం. మీరెలా వున్నారు ? ఆహ ... ఏం లేదండీ ... మీ దగ్గరనుంచి ఒక చిన్న ఫేవర్ కావాలి. అందుకని చేశాను" అంది.

"అయ్యో ... దాందేముందండీ ! తప్పకుండా. నా చేతనైనంతవరకు తప్పకుండా చేస్తాను."

"అబ్బే ... ఏం లేదండీ. ఇవాళ మా ఫ్యామిలీ అంతా మా అక్కకూతురి బేబీ షవర్ కోసం న్యూజెర్సీ వెడుతున్నాం. ఇండియా నుంచి మా అక్క వచ్చింది. మళ్ళీ రెండ్రోజుల్లో వచ్చేస్తాం. వీకెండ్‌కి ముహూర్తం అస్సలు బాలేదుట. మా అక్కకి చాదస్తం ఎక్కువ. రేపే చేద్దామని కూర్చుంది. పిల్లల్ని తీసికెళ్ళడానికి ఎన్నిరకాల తిప్పలు పడ్డానో మీకేం తెలుసు ..." అంటూ నిట్టూర్చింది అవతల్నుంచి ప్రమీలగారు.

"పోనీలెండి. మొత్తానికి వెడుతున్నారు. హావ్ ఎ నైస్ ట్రిప్ ..."

"అవుననుకోండీ ... కానీ చిన్న ఇబ్బంది వచ్చింది మాలతిగారూ. ఈ మధ్య

మా పిల్లలిద్దరూ హేమ్‌స్టర్స్‌ని పెట్ చేస్తున్నారండీ. ఈ రెండ్రోజులూ మీరు వాటిని కాస్త చూస్తారేమోనని ...'' ఎంతో మర్యాదగా మాట్లాడుతూ విషయం చెప్పారు ప్రమీల గారు. గుండెల్లో రాయి పడింది మాలతికి. హేమ్‌స్టర్స్ అంటే ఎలక పిల్లల్లా వుంటాయీ అవేనా అనుకుంది. కాసేపు నోటమ్మట మాట రాలేదు. గబుక్కున సరస్వతి గారు గుర్తొచ్చారు. వాళ్ళ పిల్లలు కూడా వాళ్ళింట్లో గినియాపిగ్సో, దిబ్బో, దిరిగుండవో ఏదో పెంచుకుంటున్నారు. అందుకని గబుక్కున "సరస్వతి గారి కయితే వాటి గురించి ఏమైనా తెలిసుండొచ్చేమోనండీ ...'' అంది ఆకుకి అందకుండా పోకకి పొందకుండా.

"సారీ మాలతిగారూ. సరస్వతి గారితో వుయ్ హేడ్ ఎ బిట్టర్ ఎక్స్‌పీరియన్స్. అయ్ డోంట్ వాంట్ టు ఆస్క్ హర్. మీమీద వున్న నమ్మకంతో మిమ్మల్ని అడుగుతున్నాను.''

నో అనడానికింకేముంది ? ఆవిడ మాటే ఒక ఆర్డరులాంటిది. రేప్పొద్దున్న ఉష కోసం ఏమైనా అడగాలంటే ఇప్పుడిది ఒప్పుకోక తప్పదనుకుంటూ, "కాని నాకు వాటి గురించి ఏమీ తెలీదండీ ...'' అంది నీరసంగా.

"నో ప్రాబ్లమండీ. వాటి కేజ్‌లో అవుంటాయి. టైముకి వాటికి కాస్త ఫుడ్ పెట్టడమే. అన్ని డీటైల్స్ యిస్తాంలెండి. థాంక్సండీ. మరో హాఫెనవర్లో మీ ఇంటికొస్తాం'' అంటూ ప్రమీల గారు ఫోన్ పెట్టేశారు.

అన్నట్టుగానే మరో అరగంటలో వచ్చి హామ్‌స్టర్స్ వున్న పంజరం లాంటి దాన్ని మాలతి కప్పగించి వెళ్ళారు.

మొహమాటానికిపోతే మొహమ్మాద తన్నినట్టనిపించింది మాలతికి. ఏం చేస్తుంది ? రోట్లో తలపెట్టి రోకటిపోటుకి భయపడితే ఎలా అనుకుంది. టైము చూసింది. మధ్యాహ్నం రెండయింది. మరో గంటలో కూతురూ, ఇంకో గంటకి శివరాం వస్తారు. అప్పుడు ఈ బోనుని ఎక్కడ పెట్టాలో ఆలోచించొచ్చు అనుకుంటూ వాటి కిచకిచలనీ, మినీ అరుపులనీ భరిస్తూ సోఫాలో కూలబడింది.

ఉష రాగానే హామ్‌స్టర్స్‌ని చూసి సంబరపడిపోయింది. మినీని పలకరించి వచ్చి ఆ బోను దగ్గరే కూర్చుంది. అందులో వున్న చక్రం లాంటి దానిమీద హామ్‌స్టర్స్ ఎక్కి దిగుతుంటే సంతోషంతో చప్పట్లు కొట్టింది. వాటి కిచకిచలకి, మినీ అరుపులకి శివరాం వచ్చే సమయానికి మాలతికి తలనెప్పి వచ్చేసింది. తనకి పూర్తిగా ఇష్టం లేని పనులు తనే తప్పనిసరిగా చేయాల్సిన పరిస్థితి రావడంతో వచ్చిన అలసట మీద వచ్చిన కోపాన్నంతా శివరాం మీద, ఉష మీద చూపించేసింది.

ఆ రాత్రి ఇంట్లో ముగ్గురూ కూడా సరిగా పడుకోలేకపోయారు. రాత్రిళ్ళు ఆ హామ్‌స్టర్స్ ఆ వీల్ మీద ఎక్కువగా తిరగడం వల్లో, లేకపోతే అంతా నిశ్శబ్దంగా వుండడం వల్లో తెలీదు కానీ ఆ వీల్ శబ్దం వాళ్ళ చెవిలో జోరీగ దూరినట్టే అయింది. వాటి కిచకిచలకి మినీ అరుపులు మరీ ఎక్కువయ్యాయి. ఇంక లాభం లేదనుకుని శివరాం ఆ బోను పట్టుకెళ్ళి బేస్‌మెంట్లో పెట్టి వచ్చాడు. ఈ రెండురోజులూ దానిని అక్కడే వుంచాలని అందరూ కలిసి నిశ్చయించుకున్నారు.

ఆ రెండ్రోజులూ పగలంతా మాలతికి కాస్త కష్టమే అయింది. ఇటు మినీ సంగతి చూడడం, మళ్ళీ కింద బేస్‌మెంటు కెళ్ళి హామ్‌స్టర్స్‌కి ఫుడ్ పెట్టడం, వాటికేం కావాలో చూసుకోవడం, కింద వాటి కిచకిచలు, పైన మినీ అరుపులతో మాలతికి తలంతా దిమ్ముగా అయిపోయింది.

మూడోరోజు లేస్తూనే అమ్మయ్య అనుకుంది. ఈరోజు మధ్యాహ్నానికి ప్రమీల గారు వచ్చేస్తారు. నిన్న ఫోనులో చెప్పిందాన్ని బట్టి మధ్యాహ్నం ఒంటిగంటకల్లా వచ్చేస్తారు. ఈ ఒక్కపూట గడిపేసి వాళ్ళు రాగానే వాళ్ళ బోను వాళ్ళ కప్పగించేస్తే తనకీ మాట దక్కుతుంది.

శివరాం, ఉష వెళ్ళాక, మినీ పని చూసేక హామ్‌స్టర్స్‌కి కావలసిన ఫుడ్ తీసుకుని బేస్మెంట్‌లోకెళ్ళింది మాలతి. బోనులోకి చూసి తెల్లబోయింది. గిరగిరా తిరిగే వీల్ స్థిరంగా కదలకుండా వుంది. రెండు హామ్‌స్టర్స్ బోనులో చెరో మూల పడుకున్నట్టు న్నాయి. మూడోది నెమ్మదిగా అటూ ఇటూ తిరుగుతోంది. ఖంగారుగా బోనుని కాస్త అటూ యిటూ కదిపింది మాలతి. ఆ రెండూ అయితే కదలలేదు. మూడోది అయితే నడిచేది కూడా ఆగిపోయి కూలబడిపోయింది. ఒకవేళ చనిపోయాయా ? గుండె ఝల్లుమందామెకి. ఎలా తెలుస్తుంది ? ఏం చెయ్యడం ? స్తబ్దుగా అయిపోయిన మనసుని స్వాధీనం లోకి తెచ్చుకుంది. వీటి గురించి ఎలా తెలుస్తుంది ? ఎవరి నడగాలి ? సరస్వతి గారు ... ఆ ... అవును సరస్వతి గారి పిల్లలు ఇలాంటి ఎలక పిల్లల్లాంటి వేవో పెంచుతున్నారని ఆవిడ ఒకసారి చెప్పినట్టు గుర్తు. గబగబా పైకొచ్చి ఫోనులో సరస్వతి గారి నంబరు కలిపింది.

"హాయండీ మాలతిగారూ ... చాలా రోజులైంది మీతో మాట్లాడి ... ఎలా ఉన్నారు ?" సరస్వతిగారు పలకరించారు.

"హాయండీ. బానే వున్నాము" మర్యాద గొంతులోకి తెచ్చుకుంది. "అదే చాలా రోజులైంది. మీతో ఓసారి మాట్లాడదామని చేసానండీ. పిల్లలూ, రవీంద్రగారూ బాగున్నారా ?"

"అంతా ఓకేనండీ.  మాలతిగారూ, ఈసారి ఉగాదికి మనం పిల్లలచేత డిఫరెంట్‌గా ఏదైనా చేయిద్దామండీ, సేమ్ ఓల్డ్ మూవీ సాంగ్స్ కాకుండా." సరస్వతి గారు ఉత్సాహంగా చెపుతుంటే తనని తను తిట్టుకుంటూ, అంతా ఓపిగ్గా విని, "ఔనండీ. మీ పిల్లలు గినియా పిగ్స్ పెట్ చేస్తున్నారనుకుంటాను ..." అని సగంలో వదిలేసింది.

పిల్లల పెట్స్ విషయం వచ్చేసరికి మరీ విజృంభించేసింది సరస్వతిగారు.

"గినియా పిగ్స్ కాదండీ ... హామ్‌స్టర్స్.  దె ఆర్ సో క్యూట్ ..." ఎలకపిల్లలు క్యూట్ ఏంటీ పిచ్చి కాకపోతే అని మనసులో తిట్టుకుంది మాలతి.  "అంటే వాటిని చాలా జంటిల్‌గా హేండిల్ చేయాలి.  వాతావరణంలో కాస్త తేడా వచ్చినా అవి తట్టుకోలేవు.  వాటిని బాగా పేంపర్ చెయ్యాలండీ."  ఒకటడిగితే పది చెప్పే సరస్వతి గారి మాటలకి అడ్డు రాకుండా వింటూ తనకు కావల్సిన సమాచారం ఎప్పుడు చెప్తుందా అని ఎదురుచూస్తోంది మాలతి.  ఆవిడ ఆ హామ్‌స్టర్స్ చరిత్ర గురించి చర్చించి, వాటి అలవాట్లని అభివర్ణించి, వాటిని ఎలా పేంపర్ చెయ్యాలో చూపుతూ మధ్యలో సడన్‌గా "మాలతిగారూ, యూ నో సంథింగ్ ? లాస్టియర్ ప్రమీల గారు టూడేస్‌కి బైటకి వెడుతూ వాళ్ళ హామ్‌స్టర్స్‌ని మా ఇంట్లో పెట్టి వెళ్ళారు.  ఆ కేజ్‌ని మేం బేస్‌మెంటులో పెట్టాం.  లాస్టియర్ కింకా మా బేస్‌మెంటుని ఫినిష్ చెయ్యలేదుకదండీ. అందుకని ఆ వాతావరణానికి తట్టుకోలేక అవి చచ్చిపోయాయి.  ప్రమీల గారికయితే ఎంత కోపం వచ్చిందనుకున్నారూ ! నాకు చాలా భయమేసింది.  ఆఖరికి ఇండియా నుంచి వస్తూ మా తమ్ముడు నాకోసం తెచ్చిన పచ్చుళ్ళని ఆవిడ కిచ్చి ప్రసన్నం చేసుకో వల్సొచ్చింది.  "గుండె జారిపోయింది మాలతికి.  సరస్వతి గారు చెప్తూనే పోతున్నారు. "యూ నో సంథింగ్ ? శ్యామల గారి క్కూడా ఇలాంటి ఇబ్బందే వస్తే ఆవిడ కొత్తవి కొనిచ్చి ప్రమీలగార్ని ప్రసన్నురాలిని చేసుకున్నార్ట" ఆ మాట ఠక్కున పట్టుకుంది మాలతి.  అమ్మయ్య ... ఏదో దారి కనిపించింది అనుకుంటూ "అంటే అవి పెట్ స్టోర్‌లో దొరుకుతాయన్నమాట" అంది అంటీ ముట్టనట్టుగా.

"ఎందుకు దొరకవండీ ? పెట్ స్మార్ట్‌లో అన్నీ దొరుకుతాయి.  అయినా శ్యామల గారు పైకి చెప్పింది కానీ నాకే కనక ఈ విషయం ముందే తెలిసుంటే ప్రమీల గారికి తెలీకుండా కొత్తవి కొనేసి ఆ బోనులో పెట్టేదాన్ని" అన్న ఆవిడ మాటలు విని, ఆహా ఎంత చక్కటి మార్గం చెప్పిందీ అనుకుంటూ "మరి వాళ్ళు పేంపర్ చేసినవి వేరని గుర్తు పడతారేమో ?" అంది అనుమానంగా.

"నామొహం ... అన్నీ ఒకలాగే వుంటాయి.  ఎవరూ దేన్నీ గుర్తు పట్టలేరు" ధీమాగా చెప్పారు సరస్వతిగారు.

"మా అమ్మే ... మా తల్లే" అనుకుంటూ, "మరి వుంటానండీ. మొబైల్‌లో ఎవరో కాల్ చేస్తున్నట్టున్నారు. మళ్ళీ మాట్లాడదాం" అంటూ ఫోన్ పెట్టేసి టైమ్ చూసుకుంది. పదకొండు దాటింది. ప్రమీలగారూ వాళ్ళూ మరో రెండు గంటల్లో వచ్చేస్తారు. పెట్ స్మార్ట్ ఎక్కడుందీ ? ఫోన్ తీసి పెట్ స్మార్ట్ నంబర్ చూసి డయల్ చేసి తనకి కావల్సిన వివరాలన్నీ కనుక్కుంది. అక్కడికి వెళ్ళడానికి ట్రాఫిక్ ఎక్కువగా లేకపోతే గంట పడుతుంది. గబగబా ఓవర్ కోటు తగిలించుకుని, షూ వేసుకుని, పర్సు తీసుకుని బయల్దేరింది.

మాలతి అదృష్టం బాగుండి ఆ స్టోర్లో కావల్సినవి దొరికాయి. అవి తీసుకుని వెనక్కి వస్తుంటే ట్రాఫిక్ జామ్. ఈ నంబరు స్ట్రీటు ఎప్పుడూ యింతే అనుకుంటూ టైము చూసుకుంది. ఒంటిగంటకి మరో అయిదు నిమిషాలు మాత్రమే వుంది. లెక్కలు వేసుకుంది. ప్రమీల గారి టైము ప్రకారం ఒంటిగంటకి సబర్బ్ చేరితే తమ ఇంటికి వచ్చేటప్పటికి మరో అరగంట పడుతుంది. వాళ్ళొచ్చే లోపల తను ఇంటికి చేరుకోగలదా ? ఇంకా గంట డ్రైవ్ వుంది. ఆలోచిస్తుంటేనే మాలతికి టెన్షన్ పెరిగిపోతోంది. ప్రొద్దుట్నుంచీ ఏమీ తినలేదేమో కడుపులో ఆకలో గాభరాయో తెలీదు కానీ మొత్తానికి ఏదో గడబిడగా అవుతోంది. ట్రాఫిక్ క్లియరయి మాలతి ఇంటికి చేరేటప్పటికి సరిగ్గా మధ్యాహ్నం రెండయింది.

ఆ ఎలకపిల్లల్లాంటి వున్న హోల్డర్‌ని ఎత్తిపట్టుకుని, గరాజ్ డోర్ తీసి ఇంట్లోకి అడుగుపెట్టిందో లేదో, ఎలా దాటిందో మినీ ఆ చిన్నగేటు దాటి లాండ్రీ రూమ్‌లోంచి బయటకొచ్చి మాలతి చేతిలో వున్న వాటి కోసం ఎగరడం మొదలుపెట్టింది.

"ఛీ ఛీ పో ... నీ రూమ్‌కి పో ..." అని అరుస్తూనే మాలతి దాన్ని తప్పించుకుంటూ లాండ్రీరూమ్ వైపు వెళ్లింది. మినీ కూడా వెనకే వచ్చింది. "హమ్మయ్య" అనుకుంటూ చిన్నగేటు వెయ్యబోతుంటే ఆ గేటుకున్న స్క్రూ లూజయి, గేటు ఓ పక్కకి వాలి కనిపించింది. మాలతి ప్రాణం ఉసూరుమంది.

ఇప్పుడు మినీని తీసుకుని బేస్‌మెంటులోకెడితే ఇంకేమయినా వుందా ? ఆ బేస్మెంటంతా తన చేత పరుగులు పెట్టిస్తుంది. మరింక కిందెక్కడా దాన్ని పెట్టి తలుపులు మూయడానికి లేదు. ఇంకేం చెయ్యలేక తన చేతిలో వున్న హామ్‌స్టర్స్ హోల్డర్ని మినీకి అందకుండ పైకి పట్టుకుంటూ, మినీని రారమ్మని పిలుస్తూ, పైన బెడ్ రూమ్‌లోకి తీసికెళ్ళి, దానిని రూమ్ మధ్య దాక రానిచ్చి, ఒక్క లాంగ్ జంప్‌తో బైటకొచ్చి బెడ్‌రూమ్ తలుపు లేసేసింది మాలతి. ఆ వయసులో మాలతి చేసిన సర్కస్ ఫీట్‌కి నడుం దగ్గర ఎక్కడో కలుక్కుమన్న ఫీలింగ్. లోపల్నించి తలుపు

గీరుతూ మినీ అరుస్తున్న అరుపులు మొదలయ్యాయి. ఎప్పుడూ లేనిది మాలతి ఒళ్ళంతా చెమటలు. ఒక్క ఉదుటున కిందికి దూకినట్టే దిగి బేస్‌మెంట్‌లోకి పరిగెత్తింది. బోనులోకి చూసేటప్పటికి మూడూ కూడా కింద పడిపోయి వున్నాయి. ఆ బోనుని పైకి తెచ్చి, బాక్‌యార్డ్‌లోకి తీసుకుపోయి, వాటిని గ్రౌండ్స్‌లో కనపడకుండా ఓ మూలకి పారేసేసి, లోపలికొచ్చి, దానిలోకి తను తెచ్చిన మూడు హామ్‌స్టర్స్‌ని పంపించి, దానిని ఫ్యామిలీరూమ్‌లో ఎదురుగా పెట్టిందో లేదో డోర్ బెల్ మోగింది. చూస్తే ప్రమీలగారూ, పిల్లలూను. పిల్లలు పరిగెత్తినట్టే లోపలికొచ్చి హామ్‌స్టర్స్ వున్న కేజ్ దగ్గరికి పరిగెట్టి వాటితో కబుర్లు మొదలుపెట్టేశారు. చిన్నపిల్లలయితే సంతోషం పట్టలేక తల్లి దగ్గరకొచ్చి, "మామ్, గ్రేసీ డిడింట్ ఫర్గెట్ మీ" అని ఇంత మొహం చేసుకుని చెప్పింది. ప్రమీలగారయితే "సో నైస్ ఆఫ్ యూ మాలతిగారూ. వియ్ గేవ్ యు సోమచ్ ట్రబుల్. ఎనీవే థాంక్స్ ఫర్ ది హెల్ప్" అంది.

"ఫరవాలేదండీ. మనలో మనకి థాంక్స్ ఎందుకు ?" అని పైకి అంటూ, ఇంక మీరు వెడితే నాకు కాస్త గుండెదడ తగ్గుతుంది అనుకుంది. వాళ్ళు ఆ బోను తీసుకుని కాలు బైట పెట్టగానే, దఢాలున డోరు మూసి ప్రొద్దుట్నించీ పడ్డ టెన్షన్ ఒక్కసారి తీరిపోవడంతో నిస్సత్తువతో డోర్‌కి ఆనుకుని నిలబడిపోయిందామె.

ఈలోగా ఎక్కణ్ణించో ఏదో కుక్క అరుపు లీలగా మాలతి చెవులని తాకింది. గబుక్కున కళ్ళు తెరిచింది. ఏదో కుక్కేంటీ ... అది మినీయే. ఆ అరుపు కూడా వేరేలా వుంది. ఖంగారుపడింది. ఇది బెడ్‌రూమ్ కానీ పాడుచెయ్యలేదుకదా ! గుండె జారిపోయింది. కార్పెట్ పాడయితే ... అసలే అది కాస్ట్లీ కార్పెట్ ...

"అమ్మో ... ఒసే ... ఆగవే ... కానిచ్చెయ్యకే ... వచ్చేస్తున్నాను ..." అంటూ మెట్ల వైపు పరిగెత్తింది పాపం మాలతి ❊

**అమెరికాలో మాట : ఆటా 2008 మహాసభల ప్రత్యేక సంచిక**

2008లో అమెరికన్ తెలుగు అసోసియేషన్ నిర్వహించిన కథల పోటీలో
అయిదు ప్రథమ బహుమతులలో ఒకటిగా ఎంపికయిన కథ

# ఇది ఇలా సాగవలసిందేనా ?

అది ఒక మహా నగరమూ కాదు, అలాగని కుగ్రామమూ కాదు. ఒక చిన్న సైజు పట్టణం ... పెద్దసైజు పల్లెటూరూ అనుకోవచ్చు నిరభ్యంతరంగా. ఎందుకంటే ఆ ఊళ్ళో ఒక జూనియర్ కాలేజీ, ఒక కోర్టూ, నాలుగు సినిమా థియేటర్లూ, ఒక బాలికల హైస్కూలూ, చిన్నా, పెద్దా కలిపి ఎనిమిది హోటళ్ళూ, ఒక క్లబ్బూ, ఒక మహిళా మండలి వగైరా వగైరాలున్నాయి.

అన్నింటికన్న ముఖ్య విషయం ఏమిటంటే మిగిలిన సంస్థల మాటెలా ఉన్నా ఆ ఊళ్ళో క్లబ్బూ, మహిళా మండలీ మటుకు తమ తమ విధులను సక్రమంగా నిర్వహిస్తాయి. ప్రస్తుతం ఆ విధి నిర్వహణ కోసమే తలలు బద్దలు కొట్టుకుంటున్నారు మహిళా మండలి ప్రెసిడెంటు శ్రీమతి బుచ్చివరదాయినీ రంగమూర్తి, వైస్ ప్రెసిడెంట్ మిసెస్ నిరంజనీ కృష్ణమూర్తీను. నిజంగానే వాళ్ళు అంత బుర్రలు బద్దలు కొట్టుకుని ఆలోచిస్తున్న సమస్య చాలా పెద్దదే మరి ... అదేమంటే ... ఆంధ్ర దేశానికి రెండు మూడేళ్ళ కొకసారి ఆనవాయితీగా వస్తున్న ఉప్పెన ఈ సంవత్సరం మరింత తీవ్రంగా వచ్చింది. ఇళ్ళే కాదు, ఊళ్ళకి ఊళ్ళే నామరూపాలు లేకుండా కొట్టుకుపోయాయి. పోయిన వాళ్ళు పోగా ఉన్న వాళ్ళ కోసం ప్రభుత్వం వెంటనే సహాయ సహకారా లందించింది. ప్రభుత్వమే కాకుండా కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా తమ తమ పూర్తి సహకారాన్నందించాయి. ఆఖరికి ప్రజలు కూడా ఆ పరిస్థితి విని ఉద్వేగులై ఎవరికి తోచిన సహాయం వాళ్ళు చేశారు.

కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, ఆఫీసుల్లో ఉద్యోగులు, క్లబ్బులో పెద్దమనుషులు ఎవరికి తోచిన విధంగా వారు ఆ ఉప్పెన బాధితులకు సాయపడటానికి ముందుకు వచ్చారు. భోజన పదార్థాలే కాదు, బట్టలు, చిన్న చిన్న వస్తువులు, డబ్బు ఎవరికి తోచింది వారు ఇచ్చారు. అదుగో, అందులో ఏ రకంగా తమ సహాయ సహకారా లందించాలనేదే ఆ మహిళా మండలి పెద్ద తలలిద్దరి ఆలోచనానూ !

అప్పటికే ఆ ఉప్పెన ప్రాంతానికి ఆహార సరఫరా జరిగింది. బట్టల పంపిణీ జరిగింది. తదితర వస్తు సామగ్రి, ఆఖరికి డబ్బు పంపిణీ కూడా అయింది. కొన్ని

స్వచ్ఛంద సేవా సంస్థలయితే ఆ ఉప్పెనలో ఇండ్లు కోల్పోయిన వారికి ఇండ్ల నిర్మాణం కూడా తలపెట్టాయి.

ఆ మాట కొస్తే మహిళా మండలి తరపున కూడా కొంత డబ్బూ, కొన్ని బట్టలూ చేరాయక్కడకు. కాని అంతకన్నా మరేదైనా చేసి ఇంకా గొప్ప గుర్తింపు పొందాలని ఆ మహిళామణుల కోరిక.

ప్రెసిడెంటు బుర్ర చురుకైనదే కాని, వైస్ ప్రెసిడెంటు బుర్ర మరీ పాదరసం. ప్రెసిడెంటు స్వలాభం గురించి ఆలోచిస్తే, వైస్ ప్రెసిడెంటు దానితో పాటు ఇతరుల నష్టం గురించి కూడా ఆలోచిస్తుంది.

"... పోనీ ఒక పనిచేస్తే వరదాయినిగారూ" దాదాపు గంటసేపు తర్జన భర్జనల తరువాత మిసెస్ నిరంజనీ కృష్ణమూర్తి సంతోషంతో వెలిగిపోతున్న మొహంతో అరిచింది.

"ఏమిటి" ఉత్కంఠగా చూసింది వరదాయిని.

మిసెస్ నిరంజనీ కృష్ణమూర్తి గొంతు సవరించుకుంది. తను చెప్పాలనుకున్నది స్థిమితంగా, ఎదుటి మనిషికి అర్థమయ్యేటట్టుగా చెప్పడం ప్రారంభించింది.

"ఈ ఉప్పెన ఉపద్రవంలో చాలామంది నిరాశ్రయులైనారు గదా !"

"కాని వారందరికీ పునరావాస సౌకర్యం కల్పిస్తున్నారు కదా !"

మధ్యలోనే అందుకున్న వరదాయిని చిరునవ్వుతో చూస్తూ ... "అవును, ఎవరికి కల్పిస్తున్నారు ? ఒక ఇంటి పెద్దకి ... అంటే ఆ ఇంట్లో చిన్న పిల్లలు పోయినా, ఒక యజమాని అంటూ ఉన్నవారికి కల్పిస్తున్నారు. అదే యజమాని పోయి పిల్లలు మిగిలిపోతే ..."

"పోతే ..." సరిగా అర్థంకాక అడిగింది వరదాయిని.

"ఆ పిల్లల్ని మనం దత్తత చేసుకుంటాం ..." చాలా గర్వంగా, హుందాగా చెప్పింది మిసెస్ నిరంజనీ కృష్ణమూర్తి.

"అంటే ? మహిళా మండలిని అనాథ శరణాలయం చెయ్యాలంటావు !" మొహం చిట్లించింది ఆ మండలి ప్రెసిడెంటు.

"మహిళామండలెందుకు మధ్యలో ? మనం పర్సనల్‌గా, ఇండిపెండెంటుగా, మన ఇళ్ళల్లో, మన పిల్లల్తో సరిగ్గా పెంచుకుందుకు కలక్టరు గారి పర్మిషను తీసుకుని వాళ్ళని దత్తర తీసుకుంటాం ..." అర్థం చేసుకోమన్నట్లు చూసింది వైస్ ప్రెసిడెంటు.

కళ్ళు తిరిగి మూర్ఛ వచ్చినంత పనయింది వరదాయినికి. నిరంజనీ కృష్ణమూర్తి

పిసినిగొట్టుతనానికి జిల్లా స్థాయిలో ప్రసిద్ధి పొందింది. అలాంటిది ... ఇంట్లో అనాథలను పెట్టుకుని పోషించడమా ? ... ఆశ్చర్యంగా చూస్తున్న వరదాయినిని మిసెస్ నిరంజనీ కృష్ణమూర్తి నవ్వుతూ చూసింది.

"... ఈ ఉప్పెనలో చాలామంది పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయారు. వీళ్ళని కొన్నాళ్ళ పాటు ప్రభుత్వం అక్కడే ఉంచి భోజన సదుపాయాలందజేస్తుంది. తర్వాత వాళ్ళ వాళ్ళ వయస్సులను బట్టి అనాథ శరణాలయానికో, మరో సేవా సదనానికో జేరుస్తుంది. అందులో మీరొకరిని, నే నొకరిని ప్రభుత్వ అనుమతితో దత్తత చేసుకుని ఇంట్లో పెట్టుకుంటే ... ఒక అనాథని ఇంట్లో పెట్టుకుని పోషిస్తున్న ఘనత అంత తక్కువ దేమి కాదనుకుంటాను ..." మిసెస్ నిరంజనీ కృష్ణమూర్తిని మధ్యలోనే ఆపుతూ...

"కాని దాని వలన మనకేం ఒరుగుతుంది ? మినిస్టరుతో కలసి ఫోటో తీయించుకోలేము గదా ..." ప్రెసిడెంటు పదవి కేవలం ఫోటో తీయించుకుందుకే ఉద్దేశింపబడిందన్న ఉద్దేశం పూర్తిగా కల వరదాయినీదేవి అడిగింది.

కురుక్షేత్రంలో అమాయకుడైన అర్జునుని చూసి శ్రీకృష్ణుడు క్షమించి నవ్వినట్టు నవ్వింది మిసెస్ నిరంజనీ కృష్ణమూర్తి.

"ఇందులో మినిస్టరుతో కలసి ఫోటో తీయించుకోవడం అనవసరం. ఇక మన పేరా ? పేపర్లలో ఎలాగూ పడుతుంది ... ఎందుకంటే ఒక అనాథను తెచ్చి పెంచుకోవడమంటే అది చిన్న పని కాదు. ఆ పిల్ల బాగోగులన్నీ ఇక మనవే కదా ..." అంది !

"కాని ఎందుకు చెప్పు ఈ లేనిపోని తద్దినాన్ని తలకెత్తుకోవడం. ఉన్న కర్మకి తోడు ఉపాకర్మ కూడానా అన్నట్లు ఇంట్లో ఉన్న వాళ్ళకే చాకిరీ చెయ్యలేక ఛస్తుంటే ... అందులో మా రెండోదాని సంగతి తెలుసు కదా, మంచం మీంచి లేవలేని దానికి అన్నీ మంచం మీదే జరగాలి. అదేం ఖర్మో ... మా ఆయన ఇదివరకు ఒకసారి కాకపోతే ఒకసారైనా దాని గురించి ఇంట్లో ఉండేవారు. ఈ మధ్య అసలు బొత్తిగా ఇంటివైపు చూడటమే మానేశారు. అన్నింటికీ ఒక్కదాన్ని ఛస్తున్నాననుకో. ఈ పనివాళ్ళా ఇవాళుంటారు రేపుండరు. ఇంకా ఇంకో పిల్లని కూడా ఎక్కడ నెత్తిమీ దెట్టుకోను ?" అని విసుక్కుంది వరదాయినీదేవి.

ఆవిడ చెపుతున్నదంతా ఓపిగ్గా వింటున్న మిసెస్ నిరంజనీ కృష్ణమూర్తి ...

"అందుకే ఈ అనాథను నువ్వు తీసుకోవాలి. ఆ పిల్ల అనాథ. గుప్పెడు మెతుకులు పడేస్తే ఇల్లు కనిపెట్టుకు నుంటుంది. ఇంక నువ్వెటు తిరిగినా నీ కూతురి

గురించి బెంగుండదు. అటు అనాథను చేరదీసామన్నట్లు పేరుకు పేరూ వస్తుంది ... ఇటు మన పనీ అవుతుంది'' అంటున్న నిరంజనీ కృష్ణమూర్తిని నిర్ఘాంతపోయి చూస్తున్న వరదాయినీదేవి ఒక్క క్షణంలో తేరుకుంది. మరుక్షణం ఆమె ముఖం ట్యూబ్‌లైట్‌లా వెలిగింది. ఒక్క ఉదుటున లేచి నిరంజనిని కౌగలించేసుకుంది. పాదరసంలా పనిచేసిన ఆమె తెలివికి జోహారు లర్పించింది. ఆ సాయంత్రమే వారిద్దరూ కార్లో బయలుదేరారు వారి ఆశయం నెరవేర్చుకుందుకు.

❋❋❋

మర్నాటి తిరుగు ప్రయాణంలో ఫ్రంట్ సీట్లో వారిద్దరితో బాటు వెనక సీట్లో మరి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అప్పటికప్పుడే ఈ తిరుగు ప్రయాణం మొదలైన దగ్గర్నుంచీ, అంటే ఇంచుమించు గంట సేపట్నుంచీ మళ్ళీ ఆ పెద్ద బుర్ర లిద్దరి మధ్యా గొడవ పెరుగుతోంది. కారణం కూడా పోట్లాడ తగ్గదే మరి. అదేమిటంటే, వెనక కూర్చున్న ఇద్దరు అమ్మాయిలలోనూ ఒకరు చంద్రి, మరొకరు కమల. ఇద్దరిలోనూ చంద్రి చురుకుగా, తెలివిగా కనిపిస్తోంది. కాని కమల ఆ ఉప్పెనలో సర్వం కోల్పోయిన దానిలా (నిజంగా కోల్పోయిందిగా మరి) జెడ్డి మొహంతో వానపాములా కనిపిస్తోంది. ప్రస్తుతం ఆ మహిళామణుల తగవేమంటే ... చంద్రి కోసం. ఆమె నాకు కావాలంటే, నాకు కావాలని పోట్లాట.

“చూడు మిసెస్ కృష్ణమూర్తీ ! ఇరవై నాలుగ్గంటలూ ఇండిపెండెంటుగా ఒక మనిషిని కనిపెట్టుకు నుండాలంటే కాస్త చురుకైన పిల్ల కావాలి కదా ! నీకు అంత పనేమి ఉంటుంది చెప్పు ? నీ కూతురా ... పెళ్ళయి బొంబాయిలో కాపరం చేసుకుంటోంది. కొడుకా ... అమెరికాలో సెటిలయ్యాడు. లింగూ లిటుకూ మంటూ నువ్వూ, మీ ఆయనాను. మీ ఆయనేమో నెలకి ఇరవై రోజులు టూర్ల మీదే ఉంటాడాయె. అందుకని నువ్వు కమలని తీసుకెళ్ళు. నేను చంద్రిని తీసుకెడతాను'' స్పష్టం చేసింది వరదాయినీదేవి.

“నువ్వన్నది నిజమే. నిజంగా ఆలోచిస్తే నాకు కమల చాలు. కాని నేను మరో విషయం ఆలోచిస్తున్నాను. ఇప్పుడు మనిద్దరం వీళ్ళిద్దరినీ మహిళా మండలి తరపున ఉద్ధరిద్దామని తీసుకొచ్చాం. కొన్నాళ్ళు పోయాకనైనా మనమేం చేశామని ఆరా రావచ్చు. అందుకని చంద్రిని గనుక నేను తీసుకుంటే, ఇంట్లో ఎలాగూ ఎక్కువ పనుండదు కనుక, ఆ పిల్ల చురుకైనది కనుక మెట్రిక్‌కి కట్టించి, ఏదైనా వృత్తి విద్యలో ప్రవేశ పెట్టడానికి వీలవుతుంది. అప్పుడు మన మహిళామండలికి మన తరపు నుంచి మంచి పేరే వస్తుంది, అనాథల నుద్ధరించామని. అలాంటప్పుడు మరి కమల మీ

ఇంట్లో ఉంటే మరే చదువులకి వెళ్ళకపోయినా ఫరవాలేదు. రేపెవరైనా వచ్చి అడిగినా మన మాట నిలబెట్టుకున్నట్లు కాస్తైనా కనిపించాలి కదా, అందుకని మరి నువ్వింక మాట్లాడకు. ఆ కమల ఎలాగూ ఇరవై నాలుగ్గంటలూ మీ ఇంట్లోనే ఉంటుంది కనుక ఒక పని నెమ్మదిగా నయినా నీకు ఫరవాలేదు.''

అంటూ మిసెస్ నిరంజనీ కృష్ణమూర్తి చంద్రిని నిజంగా ఉద్ధరించడానికి దీక్షా కంకణురాలై, వరదాయినిని ఒప్పించి, చంద్రినే తన ఇంటికి తీసుకువెళ్ళింది విజయ గర్వంతో.

❋❋❋

మరో పదిరోజులు పోయాక, మిసెస్ నిరంజనీ కృష్ణమూర్తి ఈజీఛైర్‌లో పడుకుని తాపీగా బొంబాయి నుండి కూతురు రాసిన లెటర్ మరోసారి చదువుకుంటోంది.

“హాయ్ మమ్మీ. థాంక్స్ ఎలాట్. నాకు తెలుసు. నువ్వు నాకోసం ఎవరినైనా పంపుతావని. చంద్రి నిజంగా బలే ఏక్టివనుకో. ఇదివరకైతే ఈ డాలీతో బలే విసుగొచ్చేసేది. ఎక్కడికైనా హబ్బీతో కలసి ప్రోగ్రామ్ పెట్టుకుంటే, ఈ డాలి నెక్కడ ఉంచడమా అనేది పెద్ద సమస్యైపోయేదీ, బొత్తిగా ఏడాది పిల్లకదా ! చంద్రి డాలీని ఎంత తొందరగా అలవాటు చేసుకుందనుకున్నావు ? ఇంట్లో పనులు కూడా చాలా మటుకు అదే చూస్తోంది. నేను పైపైన సూపర్‌విజనే. నిజంగా నాకిపుడు చాలా హాయిగా ఉందనుకో. ఏ క్లబ్బులో జేరడానికైనా ఇంకిప్పుడు మరే అడ్డూ లేదు. చాలా థాంక్స్ ... చంద్రిని పంపినందుకు. మీ అల్లుడుగారు కూడా చాలా సంతోషించారు. ముద్దులతో ...

మీ ముద్దుల కూతురు
స్వీటీ

ఉత్తరం చదవడం పూర్తి చేసిన మిసెస్ నిరంజనీ కృష్ణమూర్తి రిలాక్స్‌డ్‌గా ఈజీఛైర్‌లో వెనక్కి వాలింది. పెదవుల మీద విజయ గర్వంతో కూడిన చిరునవ్వుతో❋

**ఆంధ్రప్రభ వారపత్రిక : 25-9-1991**

# అతను ... ఆమె ... కాలం

**స**మయం ... రాత్రి పదిగంటలు.

స్థలం ... ఒక ప్రైవేటు ఆస్పత్రిలోని స్పెషల్ రూమ్.

**అతను ...**

మందు ఇచ్చిన మత్తులో నిద్రపోతున్న ఆమెను చూస్తుంటే అతని మనసు ఎక్కడికో వెళ్ళిపోయింది. ఏవేవో జ్ఞాపకాలు, అనుభవాలు. పెళ్ళయిన ముప్పైయేళ్ళ జీవితం అతని ముందు నిలిచింది.

ముప్పైయేళ్ళక్రితం జీవితమంతా తనను భద్రంగా చూసుకుంటానన్న నమ్మకంతో ఆమె తన చిటికెనవేలు పట్టుకుని తనవెంట వచ్చింది. మరి తను ...? చూసుకున్నాడా అంటే చూసుకున్నాడనే చెప్పాలి.

కుటుంబం, సాంప్రదాయం చూసి తన తండ్రి పెళ్ళి కుదిర్చాడు. అందరూ పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారుకదా అలాగే తనూ చేసుకున్నాడు. చిన్నప్పట్నుంచీ తను చూసిన ఆడవాళ్ళు తల్లీ, అక్కలూ. ఇంట్లో ఏ విషయమైనా నాన్న నిర్ణయించడం, మిగిలినవారు దానిని ఆచరించడం జరిగేది. తల్లికికానీ, అక్కలకికానీ ఇంట్లో ఆడవారు చేసుకునే పనులు చేసుకోడం తప్పితే ఇంకేమీ తెలియవు. ఆఖరికి వంటలూ, పూజలూ, నోములూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ అన్నీ కూడా నాన్న చెప్పినట్లు చెయ్యడం తప్పితే మరింక వాళ్ళకి స్వంత అభిప్రాయాలంటూ వుండేవికావు.

అక్కలు పెళ్ళిళ్ళయ్యాకకూడా బావలు పంపినప్పుడే పుట్టింటికి రావడం, వాళ్ళకి అడుగడుగునా భయపడుతుండడం చూసి అందరు ఆడాళ్ళూ అలాగే వుంటారను కునేవాడు. ముప్పైఏళ్ళ క్రితం అత్తగారి మనస్తత్వం తన తల్లిది. కోడలు వచ్చేక కొడుకు తనకెక్కడ దూరమవుతాడోనన్న భయంతో కోడలి మీద నేరాలు చెప్పడానికి సిద్ధంగా వుండేది. కోడలు చేసే ప్రతిపనిలోనూ తప్పు పట్టేది. ప్రతిమాటకీ విపరీతార్థాలు తీసేది. ఆమెకి సాయం తన అక్కలిద్దరూను. చిన్నవాడు తమ్ముడు మరదలు చేతిలోకి వెళ్ళిపోతే తమకి పుట్టింటి సంబంధం ఎక్కడ తెగిపోతుందోనని అన్నింటికీ తల్లికి వత్తాసుగా వుండేవారు.

అసలు పెళ్ళికిముందే వాళ్ళందరూ కలిసి తన మనసులో ఒక ముద్రే వేసేరు. భార్య పరాయింటినుంచి వచ్చిందనీ, కనిపించిన తల్లినీ, తోడబుట్టినవాళ్ళనీ కాదని వేరు కాపరం పెట్టమంటుందనీ, అలా వేరు కాపరం పెట్టించి తన సంపాదనంతా పుట్టింటికి దోచి పెట్టేస్తుందనీ, అందుకని మొట్టమొదట్నించీకూడా భార్యని తన చెప్పు చేతల్లో పెట్టుకోవాలనీ, ఇలాంటివన్నీ మొక్క నాటేముందు ఎరువు వేసినట్టు పెళ్ళికి ముందే తన బుర్రలో పెట్టేసేరు.

చుట్టపక్కాల్లో అలా పెళ్ళాం కొంగు పట్టుకుని వేరే కాపరం పెట్టినవారి చరిత్రలు ఒకటికి పదిసార్లు వినిపించేరు. దాంతో పెళ్ళాం తను చెప్పినమాట వింటూ, తను వండమన్నవి వండి, తను తెచ్చినవి కట్టుకుని, తను ఎక్కడికి తీసికెడితే అక్కడికి వచ్చి, తను వద్దన్నచోటికి మానేసి, తనవాళ్లందరినీ గౌరవించాలనే స్థిరమైన అభిప్రాయంతో పెళ్ళి చేసుకున్నాడు.

కాని జరిగిందేమిటి ?

పెళ్ళి సమయానికి కాస్తో కూస్తో చదువుకున్న ఆవిడకి అప్పటికే స్వంత అభిప్రాయాలూ, ఆశలూ, సరదాలూ ఏర్పడ్డాయి. పెళ్ళాం స్వతంత్రించి ఇది నాకు కావాలని అడగడం ఎంత అపరాధం ? ఒక్కసారి అతనికి ఒక సంఘటన గుర్తు వచ్చింది.

ఆరోజు కూతురు మంగ బారసాల రోజు. తమింట్లో ఆనవాయితీగా వస్తున్నట్టు తను తల్లి పేరు పెట్టడానికి సిద్ధపడితే ఎంత గొడవ చేసింది ? పుస్తకాల్లో వున్న పిచ్చి పేర్లు నచ్చాయి కానీ తన తల్లి పేరు మటుకు నచ్చలేదు. ఏం ... అదేవన్నా చిన్నపేరా ... ఏవన్నానా ... అలవేలుమంగ ఎంత గొప్ప దేవత ?

ఒంటరిగా అడిగినప్పుడు ఒప్పుకోలేదని చుట్టాలందరిముందూ నానా రభసా చేసింది. వాళ్ళూ అంతే ... ఆవిడగారి మాటకి తందాన తానా అంటూ తాళం వెయ్యడం మొదలెట్టేరు. "ఈరోజుల్లో ఆ పేరేవిటీ ? రేప్పొద్దున్న మీ అమ్మాయే మిమ్మల్ని నిలదీస్తుంది" అంటూ ...

తనకి మరీ చిర్రెత్తుకొచ్చింది. చుట్టాలందరిముందూ ఆవిడన్నది వొప్పుకుంటే ఇంక మొగుడనే విలువేం వుంటుందీ ? పెళ్ళాం చేతిలో కీలుబొమ్మనయ్యానని తనని తనవాళ్ళందరూ వెక్కిరించరూ ? అంతే ... ఒక్కమాటలో తన నిర్ణయం చెప్పేసాడు తను ఆరోజు.

"నువ్వు మా అమ్మ పేరు పెట్టడానికి వొప్పుకుంటేనే బారసాల పీటల మీద కూర్చుంటాను. లేదూ ... నా కూతుర్ని తీసుకు వెళ్ళిపోతాను" అంటూ. అంతే ...

పిల్లనిచ్చిన మామగారు కాళ్ళబేరాని కొచ్చేరు. అలాగ ఆరోజు తను అందరిలోను మగాడనిపించుకున్నందుకు గర్వపడ్డాడు. కాని దానివల్ల భార్య మనసులో తన స్థానం ఎంత దిగజారిపోయిందో తెలుసుకోలేకపోయేడు.

ఇలా ఒకటా ... రెండా ... ఎన్నో ... వాదించింది, ఏడిచింది, పోట్లాడింది, ఇంట్లోంచి వెళ్ళిపోతానని బెదిరించింది. తను కనక రాయిలా తట్టుకుని నిలబడ్డాడు తప్పితే మరోడైతే ... ఒక్కసారి తల విదిలించేడతను.

అత్తవారింట్లో కర్కోటకుడైన అల్లుడుగా పేరు తెచ్చుకున్నాడు. చుట్టపక్కాల్లో కోపిష్టివాడని బిరుదొచ్చింది. తనవాళ్లలో మగాడనిపించుకున్నాడు. కానీ తన భార్య దృష్టిలో ...

ఒక్కసారి తలతిప్పి మంచంమీద మత్తుమందులో నిద్రపోతున్న ఆమెను చూసేడు. ఆమె మనసులో ఏమేమి భావాలు సుళ్ళు తిరుగుతున్నాయో మరి భృకుటి ముడిపడి విడిపోతోంది.

తామిద్దరు ఇలాంటి ప్రతికూల భావనలతో వుండగానే పెళ్ళయిన పదిహేనేళ్లకి తల్లి పోయింది. వెనకే తండ్రి. అక్కలు వాళ్ళ కుటుంబాల్లో బాధ్యతలు మీదపడి రావడం తగ్గించేసేరు.

ఆసరికి తమ పిల్లలిద్దరూ పెద్ద చదువుల కొచ్చేరు. ఇంక తమిద్దరికీ పిల్లల పోటీ చదువులూ, పెళ్ళిళ్ళూ, ఉద్యోగాల్లో చేరడాలూ ... వీటితోనే మరో పదిహేనేళ్ళు గిర్రున తిరిగిపోయేయి. తమ తమ ఇష్టాలన్నీ అడుగున పడిపోయేయి.

ఈ గడిచిన జీవితంలో పిల్లల దృష్టిలో కూడా తను దుర్మార్గుడిగానే కనిపిస్తున్నాడు. వాళ్ళు ఎదుగుతున్నప్పుడు తను వాళ్ళ అమ్మని తిడుతుండడం, వంటింట్లో ఆవిడ ఎవరూ చూడకుండా కొంగుతో కళ్ళొత్తుకోవడం వాళ్ళ కళ్ళపడేవి. తను వాళ్ళ అమ్మని నోరెత్తనివ్వకుండా ఒక బానిసలా చూసానన్న అభిప్రాయం ఇద్దరిలోనూ బలపడిపోయింది. కూతురు మంగ సానుభూతి వచనాలు తప్పితే ఏమీ చెయ్యలేకపోయినా కొడుకు గోపాలం పెద్ద ఉద్యోగంలో చేరి వాళ్ళ అమ్మకి కల్పతరు వయ్యేడు.

ఇప్పుడు ఆవిడకి ప్రయోజకుడైన కొడుకే సర్వస్వం. ఏం కావాలన్నా కొడుకుని అడుగుతుంది. మరుక్షణం ఆ కొడుకు దానిని తీరుస్తాడు. "నా కొడుకు కొన్నా" డని అందరితో చాటింపు వేసుకుంటుంది. అలా చెప్పేటప్పుడు తనవైపు చూసే చూపు తనని అథఃపాతాళానికి తొక్కేసేది. నీతో నాకింక పనేంటి అన్నట్టు నిర్లక్ష్యంగా ప్రవర్తించేది.

భార్య మనసులో చోటు చేసుకోలేని తన అసమర్థతకి ఇప్పుడు బాధపడి ఏం లాభం ? అయినా ప్రయత్నించేడు. అప్పటి పరిస్థితులు విడమరిచి చెప్పేడు. ఇప్పుడు అటువంటి ఒత్తిళ్ళు ఏమీలేవనీ, తన భార్యకన్నా తనకి ఇంకెవరూ ఎక్కువకాదనీ, ఏ చిన్న విషయమైనా పట్టించుకుంటాననీ వివరించేడు. కానీ అప్పటికే ఆమెకి తనపట్ల ఒకరకమైన ఉదాసీనవైఖరి వచ్చేసింది. అంత విడమరిచి చెప్పినా కొడుకుని ఎక్కువ చేసుకుని తనని తీసిపడేసే స్థితికి ఆమె వచ్చిందంటే ఇంక ఆ బ్రహ్మదేవుడు కూడా ఆమెని మార్చలేడని అభిప్రాయానికి వచ్చేడతను.

ఇప్పుడు పెళ్ళయిన ముప్ఫైయేళ్ళకి ఇంట్లో తామిద్దరే. కానీ ఇద్దరి మధ్యా యోజనాల దూరముందనిపిస్తుంటుంది. కాలచక్రం ఒక్కసారి వెనక్కి తిరిగితే ఎంత బాగుండును ? అలాగే జరిగితే ఇలాంటి పొరపాటు మరెప్పుడూ చెయ్యడు తను. భార్య మానసికంగా దగ్గరవడం మగవాడికి ఎంత ముఖ్యమో తెలిసేసరికి ఆలస్యమై పోయింది.

కనీసం ఇలాగైనా జరగకుండ పదిరోజులక్రితం ఆమెకి హఠాత్తుగా స్ట్రోక్ వచ్చింది నిమిషాల మీద వైద్యం అందడంతో తనకి కనీసం ఈ మాత్రం తోడునైనా భగవంతుడు అనుగ్రహించేడు. దానికోసం ఎంతమంది దేవుళ్ళకి మొక్కేడో. ఇదిగో ... ఇవాల్టికి పూర్తిగా తగ్గింది. రేపు ఇంటికి వెళ్ళొచ్చన్నారు డాక్టర్లు.

అరెరె ... ఈ ఆలోచనల్లో పడి మర్చేపోయేడు ... వెంటనే టైమ్ చూసుకున్నా డతను. పన్నెండవుతోంది. ఆమెకి ఇంజక్షన్ ఇవ్వాలి. నర్సుని పిలవడానికి లేచి కారిడార్ వైపు నడిచాడు.

నర్సు వచ్చి నిద్రలో వున్న ఆమెకి ఇంజక్షన్ ఇచ్చింది. ఎంత జాగ్రత్తగా ఇచ్చినా మెలకువ వచ్చేసిందామెకు. నొచ్చుకుంటూ సారీ చెప్పి, గుడ్‌నైట్ చెప్పి వెళ్ళిపోయింది నర్స్.

ఆమె అతనివైపు చూసింది. నెమ్మదిగా వచ్చి జాగ్రత్తగా ఆమెకి దుప్పటి కప్పి పక్కనున్న బెడ్ మీద కెళ్ళి పడుకున్నాడతను. అప్పటిదాకా బలవంతంగా ఆపుకున్న నిద్రాదేవి అతణ్ణి అనుగ్రహించింది.

**ఆమె ...**

నిద్ర మధ్యలో మెలకువ వచ్చిన ఆమెకి ఎంత ప్రయత్నించినా మళ్ళీ కన్నుమూత పడలేదు. నిద్రపోతున్న అతనివైపు చూసిందామె. ఏవిధమైన ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా వుందా మొహం. ఇప్పుడిలా వున్నాడు కానీ ముప్ఫైఏళ్ళ క్రితం, పెళ్ళయిన

కొత్తలో ఎలా వుండేవాడు ? అసలు పెళ్ళాన్ని తనొక్కదాన్ని వున్నానన్న స్పృహంటూ వుండేదా ? ఏదైనా చెప్పబోతే పోట్లగిత్తలా రంకెలేసేవాడు.

పెళ్ళయిన కొత్తల్లోనే అతను అసలు స్పందన అనేదే లేకుండా "అందరూ చేసుకుంటున్నారు పెళ్ళి ... నేనూ చేసుకున్నాను ..." అనడం విని ఇతనికి ప్రత్యేకత లంటూ ఏవీలేవా అనుకుని విస్తుపోయింది.

అటూ ఇటూ మెసులుతూ పక్కనున్న అతన్ని చూస్తుంటే ముప్పైయేళ్ళపాటు అతనితో గడిపిన సహజీవనం ఒక్కసారి కళ్ళముందు కొచ్చింది. ముప్పైయేళ్ళ క్రితం జీవితమంతా తనకి తోడుగా వుంటానన్న అతని మాటలు పూర్తిగా నమ్మి, అతని చిటికెనవేలు పట్టుకుని అతని వెనకే నడిచి వచ్చింది.

తండ్రి కులం, గోత్రం, చదువు, సంప్రదాయం అన్నీ చూసి తనని అతని చేతిలో పెట్టేడు. అందరు అమ్మాయిల్లాగే తనుకూడా తన భర్త తనని అపురూపంగా చూసుకుంటాడని కలలు కంది. ఎంతవరకూ చూసుకున్నాడూ అంటే అతని మాట విన్నంతవరకూ బాగానే చూసుకున్నాడు.

అది వద్దు, ఇది కావాలి అనడం ఆ ఇంట్లో మహాపరాధం. మొగుడు పెట్టింది తినాలి, తెచ్చింది కట్టుకోవాలి ... అంతే. అసలు మొగుడన్నవాడు పెళ్ళానికి ఏమైనా తేవడమే గొప్ప విషయం. మరింక ఆడవాళ్ళకి ఇంకేమీ అక్ఖర్లేదని ఆ ఇంట్లో వాళ్ళందరి అభిప్రాయమూను. అసలు అత్తారింటికంటూ వచ్చేక తనకసలు ఇష్టాలనేవి వుంటాయనే మాటే మర్చిపోయింది. ఎదురుగా ఎంతమందున్నా సరే నోటికొచ్చినట్టు తిట్టేసేవాడు. ఒక్కొక్కసారి తన తోటివాళ్ళు భర్త దగ్గర తన పరిస్థితి చూసి నవ్వుకుంటుంటే చచ్చిపోవాలనిపించేది.

అలాంటప్పుడే తను తల్లి కాబోతున్నట్టు తెలిసింది. పొత్తిళ్ళలో నవమాసాలూ మోసి కన్న తన చంటిపాపను చూడగానే ఆ కలలపంటకు తనకెంతో ఇష్టమైన జ్యోతిర్మయి అన్నపేరు పెట్టుకోవాలని ఆశపడింది. అంతే ... అదేదో మహాప రాధమైనట్టు, అత్తగారిని తనేదో ఘోరంగా అవమానించేసినట్టూ అత్తా, మామా, ఆడపడుచులూ అందరూ నానామాటలూ అన్నారు. పోనీ కనీసం భర్తైనా తనని అర్థం చేసుకుంటాడనుకుని అన్నదమ్ములముందు అతనితో తన కోరిక చెప్పింది. అంతే ... అగ్గిమీద గుగ్గిలమైపోయాడీ మనిషి. తల్లికన్నా తన కెవరూ ఎక్కువ కాదనీ, ఆ తల్లితోపాటు అప్పటికప్పుడు రోజుల పిల్లని కూడా తీసుకుని ప్రయాణమైపోయాడు.

తన తండ్రి హడలిపోయేడు. అల్లుణ్ణి బ్రతిమాలుకుని, కూతురైన తనకి

ఎన్నో నీతులు చెప్పి పంపించేడు. అంతే ... అప్పట్నుంచి తన మనసు అసలు స్పందన అనేదే లేని రాతి మనసు అయిపోయింది.

కాలమాగుతుందా ? ఏళ్ళు గడిచిపోయేయి. అత్తమామలు గతించేరు. ఆడపడుచుల రాకపోకలు తగ్గేయి. ఇంతలో పిల్లలిద్దరూ పెద్ద చదువుల కొచ్చేరు. కూతురి పెళ్ళి, కొడుకు చదువూ, ఉద్యోగం లాంటి బాధ్యతల మధ్య తనసలు తన గురించే మర్చిపోయింది. కానీ పిల్లలు మర్చిపోలేదు. తండ్రి నోటి దురుసుతనంతో తను పడ్డ బాధ ప్రత్యక్షంగా చూసిన వాళ్ళిద్దరూ మళ్ళీ తనలోని ఆశలని, కోరికలని నిద్రలేపేరు. తను కావాలనుకున్నవన్నీ క్షణాల మీద తెచ్చి తన కళ్ళముందుంచేరు.

తండ్రి చేయని పని తాము చేసి తల్లిని సుఖపెడుతున్నందుకు ఇద్దరూ పరవశించి పోయేరు. ఇంతకన్న తనకి ఏం కావాలీ ? ఈ మొగుడి దగ్గర తీరని తన కోరికలు పిల్లల దగ్గర తీరుతున్నాయి. మనసు గర్వంతో నిండిపోతుంటే ఒక్కసారి నిద్రపోతున్న అతనివైపు చూసింది.

అంతే ... ఒక్కసారి ఆమె వాస్తవంలోకి వచ్చింది. ఈ పదిరోజులూ అతను పడ్డ మానసిక వ్యథ ఆ మొహంలో కొట్టొచ్చినట్టు కనపడుతోంది. స్ట్రోక్ వచ్చిన తనని ఆఘమేఘాల మీద ఆస్పత్రికి తీసుకురావడం గుర్తొచ్చిందామెకి. ఆ సమయంలో అతని మొహంలో కనపడ్డ గాభరా కళ్ళముందు కదిలింది. డాక్టర్ల కోసం హడావిడి పడడం, వాళ్ళు చెప్పిన ఇంజక్షన్ల కోసం ఆ వయసులో అతను పరుగులు పెట్టడం అన్నీ తలపులోకొచ్చేయి.

నిజంగా ఇదంతా తనమీద ఆపేక్షేనా అనుకుంటే తన మనసు తననే ఛెళ్ళున కొట్టినట్టు అనిపించింది. అమ్మా, అక్కల మాట విని తనని బాధపెట్టేడని అతని మీద నెపం వేస్తోందే ... మరి తను చేసిందేమిటి ? మనస్సు ఒక్కసారి తను చేసిన తప్పుని ఎత్తిచూపించింది.

ఒక్కసారి నెల్లాళ్ళ క్రితం జరిగిన సంఘటన గుర్తొచ్చిందామెకి.

ప్రయోజకుడైన కొడుక్కి మంచి మంచి సంబంధాలే వస్తున్నాయి. ఆరోజు పెళ్ళి సంబంధం విషయంలో నలుగురు పెద్ద మనుషులు ఇంటికి వచ్చేరు. అతను వారితో మర్యాదగా మాట్లాడుతుంటే తనేమంది ?

"మీరూరుకోండి ... నేను చెప్తానుగా ... మీ సంబంధం మావాడు ఒప్పుకోడండీ ... ఇంకా మాట్లేమిటి ? వెళ్ళిరండి" అని వారిని పంపేసింది.

ఆ క్షణంలో అతని కళ్ళల్లో కనపడ్డ బాధ ఇప్పుడు తనని బాధపెడుతోంది.

నిజమే ... పెద్దమనుషుల ముందు అతని పెద్దరికాన్ని గౌరవించాల్సిన తను ఆ పెద్దరికాన్ని హేళన చేసింది. ఎంత తప్పు పని చేసింది. నలుగురి మాటలూ పట్టుకుని తనని తీసిపడేసేడని అతనిని అన్నిసార్లు తిట్టుకుందే ... మరి తను చేసిన పనేమిటి ? అదేగా ...

పెళ్ళయిన పదిహేను సంవత్సరాలూ అమ్మా, అక్కల మాటలు నమ్మి అతను తనను బాధపెడితే, ఆ తర్వాత పదిహేను సంవత్సరాలూ పిల్లల ఆసరా చూసుకుని తను అతన్ని బాధపెట్టింది. తనని అతను అర్థంచేసుకోలేదని అనుకుంటోందే మరి తను అతన్ని అర్థం చేసుకుందా ? ఒక్కసారి కళ్ళు మూసుకుంది. పెళ్ళి సమయంలో అమ్మమ్మ చెప్పిన మాట గుర్తొచ్చింది.

పెళ్ళయి అత్తవారింటికి బయల్దేరుతున్నప్పుడు అమ్మమ్మ చెప్పింది.

"పిల్లా ... చూడు ... ఇప్పుడు మీరిద్దరూ అంటుకట్టిన మొక్కల్లా ఒక్కటయ్యేరు. రేప్పొద్దున్న తల్లి చెట్టు నుంచి ఈ అంటుని వేరుచేసి పెద్దవాళ్ళు వెళ్ళిపోతారు. మీ చెట్టు మూడు పువ్వులూ, ఆరు కాయలుగా అవుతుంది. వాళ్ళ వేళ్ళు కత్తిరించుకుని వాళ్ళూ విడిగా పెరుగుతారు.

పై తరం వెళ్ళిపోయినా, తర్వాతి తరం విడిపోయినా మీ బంధం మాత్రం మీ జీవితకాలం వుంటుంది. మీరిద్దరూ ఒకరి కొకరు. అంతే. మంచైనా, చెడ్డైనా, కష్టమైనా, సుఖమైనా మీరిద్దరూ కలిసి అనుభవించాలి. అదే కాపురమంటే ..."

నిజమే ... ఈ విషయం ఇన్నాళ్ళూ ఎందుకు మర్చిపోయింది ? పెళ్ళి సమయానికి అతనికి వున్న బలహీనతలతో సహా అతనిని పూర్తిగా ఎందుకు అంగీకరించలేకపోయింది ? అదంతా వదిలేస్తే గడచిన పదిహేను సంవత్సరాలనుంచీ తను ఏదంటే అది చేస్తున్నాడే ... ఆ విషయం ఎందుకు గుర్తించలేకపోయింది ? అన్నిటికన్నా ఇప్పుడు ... ఈ పది రోజుల్నించీ అతనే కదా తనని కంటిపాపలా చూసుకుంటున్నాడు. కూతురికి అత్తగారింటి బాధ్యతలు. కొడుకుకి ఉద్యోగ బాధ్యతలు. ఎవరి పనులు వారివే. కాని తామిద్దరే ఒకరి కొకరు. అంతే ... ఒక్కసారి ఆమెకి అతను సర్వస్వంలా కనిపించేడు.

అమ్మమ్మ చెప్పింది అక్షరసత్యం. పిల్లలకి ఎవరి కుటుంబాలు వాళ్ళ కొస్తాయి. కాని తామిద్దరూ మటుకు చివరిదాకా ఒకరి కొకరు. మళ్ళీ ఒక్కసారి ఈ జీవితం వెనక్కి వెడితే ఎంత బాగుండును ? అలా జరిగితే ఇలాంటి పొరపాటు పని చేసుండే దాన్ని కాదు. ఆమె రక్తంలో ఆవేశం వేడి తగ్గి ఆలోచించే నెమ్మదితనం వచ్చింది.

సమయం ... మర్నాడు ఉదయం పదిగంటలు.

స్థలం .. అదే స్పెషల్ రూమ్.

ఆస్పత్రిలో బిల్లు కట్టేసి వచ్చి అతను స్టూల్ మీదున్న మందులు బేగ్‌లో పెట్టి, ఆమెకి దగ్గరగా వచ్చి చెయ్యందించేడు. అతను చీమలా పోగేసుకున్న డబ్బంతా కట్టేసి వచ్చినా ఆ మొహంలో ఏ మాత్రం ప్రశాంతత తగ్గలేదు.

"ఎంతయిందండీ బిల్లు ?" అడిగిందామె. నవ్వేడతను.

"నువ్వు మళ్ళీ నాతో వస్తున్నావు. అందుకు ఎంతిచ్చినా తక్కువే" అన్నాడు.

ఆ మాటలు విన్న ఆమె ఈసారి అతని చిటికెనవేలు అందుకోకుండా నెమ్మదిగా లేచి అతని పక్కన నిలబడింది. అది చూసి అతను ఆప్యాయంగా ఆమె భుజం చుట్టూ చేతులు వేసి నడిపించుకుంటూ తీసికెళ్ళేడు. భద్రంగా వున్న ఆ చేతులలో యిమిడిపోతూ నిశ్చింతగా అతనితో నడిచిందామె ❋

**నవ్య వీక్లీ : 4-4-2012**
**ఉగాది కథల పోటీలో విశేష బహుమతి**

తమిళంలోకి అనువదించబడి తిన్నయ్.కామ్ అనే అంతర్జాల పత్రిక
జులై 2012లో ప్రచురించబడింది.

# నాణానికి మరోవైపు ...

"అటువైపు ఇంకా యెండ తగ్గలేదు ... ఇక్కడ కూర్చోండి ..." నెమ్మదిగా తన వెనకనుంచి వినిపించిన మాటలకి పార్కులో వాకింగ్ చేస్తున్న సునంద అసంకల్పితంగా వెనక్కి తిరిగి చూసింది. సావిత్రమ్మ గారు భర్త చేతిని పట్టుకుని నెమ్మదిగా నడిపిస్తూ ఇవతలి బెంచీవైపు తీసుకొచ్చింది. ఆయన చేతికర్రని బెంచీకి ఆనిస్తూ నెమ్మదిగా "రామా కృష్ణా ..." అనుకుంటూ కూర్చున్నాడు. ఆవిడ పార్కు చుట్టూ నడవడానికి వేసిన రాళ్ల మీద నెమ్మదిగా అడుగులు వెయ్యడం మొదలు పెట్టింది.

"ఎక్కువసేపు నడవకు. మళ్ళీ రాత్రి కాళ్ళు నొప్పులంటావ్ ..." ఆ పెద్దాయన మాటలు వద్దనుకున్నా సునంద చెవులకి సోకాయి. సునంద రోజూ సాయంత్రం ఆ కాలనీలో పార్కుకి వాకింగ్‌కి వస్తుంది. మంచి ఉద్యోగంలో వుంది. భర్తకి ఎక్కువగా టూర్లు తిరిగే ఉద్యోగం అవడంతో ఇంటి బాధ్యత, కొడుకు చదువు బాధ్యత సునందే చూసుకుంటుంది. అంతేకాకుండా ఆమెది మెత్తని మనసు కూడా అవడంతో కాస్త సంఘసేవ కూడా చేస్తుంటుంది. అంటే ... వరదలు గట్రా వచ్చినప్పుడు డబ్బులు, వస్తువులు పోగుచేసి బాధితులకు సహాయం అందించడం, తాగుబోతు భర్తలు, శాడిస్టు భర్తలు భార్యలను బాధపెడుతుంటే ఆ భార్యాభర్తలకు కౌన్సిలింగ్ చెయ్యడం, వృద్ధులైన తల్లిదండ్రులని చూడని పిల్లలుంటే వారికి తెలియచెప్పడం, అసలు ఎటువంటి ఆశ్రయమూ లేనివారిని వృద్ధాశ్రమాల్లో చేర్పించడం లాంటివన్నీ మనస్ఫూర్తిగా చేస్తుంది. అందుకే రోజూ నడవలేక నడవలేక పార్కుకు వచ్చే ఈ వృద్ధ దంపతులు సునంద దృష్టిని ఆకర్షించారు. అడుగు తీసి అడుగు వెయ్యడానికి అంత అవస్థపడుతున్న వారు అసలెందుకు వాకింగ్‌కి రావడం ... వాళ్ళింట్లో పరిస్థితి ఏమిటో ... కొడుకూ కోడళ్ళ తిట్లూ, దెప్పుళ్ళూ కాసేపైనా తప్పించుకుందుకు ఇంత కష్టపడి వస్తున్నారేమో ... ఇదేదో తెలుసుకోవాల్సిందే ... తెలుసుకుని వారికి తన చేతనైన సాయం అందించాల్సిందే అనుకున్న సునంద వారం క్రితమే వాళ్ళ పేర్లూ, వాళ్ళెక్కడుంటారో అన్నీ కనుక్కుంది.

సన్నటి జరీబార్డరున్న నేతచీర, నుదుట గుండ్రని కుంకుమబొట్టు, మెడలో

మంగళసూత్రాలూ, నల్లపూసలూ, రెండు చేతులకీ రెండేసి జతల గాజులూ, ఆత్మ విశ్వాసంతో కూడిన చూపులూ వున్న ఆవిడని చూస్తుంటే జరుగుబాటుకు లోటులేని కుటుంబమే అనిపించింది సునందకి. మరి ఇలా రోజూ కాళ్ళీడ్చుకుంటూ యిక్కడికి రావడం యెందుకు ? కోడలి నోటిదురుసు భరించలేకనే అనే నిశ్చయానికి వచ్చేసింది సునంద. మొదటిసారే పర్సనల్ విషయాలు అడిగితే బాగుండదని అప్పుడు అంతవరకే అడిగింది. ఇవాళ మరి కాస్త ముందుకెళ్ళి ఆ పెద్దావిడని మరిన్ని విషయాలు అడగ డానికి నిశ్చయించేసుకుంది.

పార్కులో సునంద మూడు రౌండ్లు నడిచొచ్చే లోపల ఆ పెద్దావిడ ఎంతో కష్టంతో ఒక్క రౌండ్ మాత్రం తిరగగలిగి, భర్త పక్కన కూలబడింది. ఆయన పార్కులో ఓ పక్కగా కూర్చుని రాజకీయాలు మాట్లాడుకుంటున్న వారి మాటలు శ్రద్ధగా వింటున్నారు. నెమ్మదిగా ఆవిడ పక్కన కూర్చుంది సునంద. ఓ చేత్తో కాళ్ళు రాసుకుంటూ పలకరింపుగా చిరునవ్వు నవ్విందావిడ. తీరుగా వున్న ఆవిడ ముఖానికి ఆ చిరునవ్వు మరింత అందం తెచ్చింది.

"మీ ఇల్లు ఎక్కడాంటీ ... ?" అనడిగింది.

"పక్కవీధిలో ఆర్.కె. అపార్ట్‌మెంట్స్‌లో వుంటాం. నువ్వెక్కడుంటావమ్మా?" సునంద అడిగింది కదాని ఆవిడ కూడా మర్యాదకి అడిగింది.

"ఇటువైపు ఆంటీ. సాయిసుధా అపార్ట్‌మెంట్స్‌లో వుంటున్నాం."

"మీరు రోజు వస్తారా ఆంటీ పార్కుకి ..." అంటూ నవ్వుతూ సంభాషణని పొడిగించింది సునంద.

"ఆ ... సాధారణంగా వస్తూనే వుంటావమ్మా ... ఏవిటో ఒక్కడుగు వెయ్యాలంటే ఎక్కడలేని ఓపికా కూడదీసుకోవాల్సొస్తోంది. ఆయనైతే ఇంటి దగ్గర్నుంచి ఇక్కడి దాకా వేసే నాలుగడుగులకే కూలబడిపోతారాయె. ఈ రోడ్లు కూడా చూడు ఎలా వున్నాయో ... మనం ఎంత జాగ్రత్తగా నడుస్తున్నా ఎవరు మనమీద ఏ బండి పెట్టేస్తారో అన్నట్టుంటుంది" అందావిడ ఆయాసపడుతూ.

"మీరూ, అంకులూ అంత కష్టపడి రాకపోతే ఇంటి దగ్గరే కూర్చుని ఏ భక్తి టీవియో చూసుకోవచ్చు కదాంటీ ..." అంది సానుభూతి కనబరుస్తూ. ఆ సానుభూతి నచ్చలేదేమో సావిత్రమ్మకి ఏమీ మాట్లాడలేదు. సునంద మరికాస్త చొరవ తీసుకుంది.

"మీరిద్దరే వుంటారు కదా ఆంటీ ... సాయంత్రం అయ్యేసరికి తోచదు. కాస్త ఇలా అయినా బయటపడితే నలుగురు మనుషులూ కనిపిస్తారు కదా ..." వాళ్ళిద్దరూ

వుంటున్నారో, పిల్లలతో కలిసి వుంటున్నారో తెలుసుకుందుకు అలా తెలివిగా ప్రశ్నని తిప్పి అడిగింది.

"లేదమ్మా. మేమూ, మా అబ్బాయీ అందరం కలిసే వుంటున్నాం" జవాబు చెప్పక తప్పలేదు ఆవిడకి.

అయితే తన ఊహ కరక్టే. వీళ్ళు ఆ కొడుకూ కోడళ్ళ సాధింపులు తప్పించుకుందుకే ఇంత కష్టపడి పార్కు కొస్తున్నారు అనుకుంది సునంద.

"అంకుల్ ఈ వూళ్ళోనే పనిచేసారా ఆంటీ ..." నెమ్మదిగా మాటలలోకి దింపింది.

ఆవిడ కాస్త చురుగ్గా చూసింది సునంద వైపు.

ఆవిడ గురించి తనకేమైనా తెలియాలంటే ముందు ఆవిడకి తన గురించీ, తను చేసే సంఘసేవ గురించీ పూర్తిగా పరిచయం చేసుకోవాలనిపించింది సునందకి. అందుకే తను ఎక్కడెక్కడ ఎవరెవరికి సహాయం చేసిందో, ఎంతమంది పిల్లల్ని బాల కార్మికులు కాకుండా కాపాడిందో, ఎంతమంది ఆశ్రయం లేని వృద్ధుల్ని వృద్ధాశ్రమాల్లో చేర్పించిందో అన్నీ కాస్త గొప్పగానే చెప్పింది. మన గురించి మనం చెప్పుకుంటున్నప్పుడు కాస్త అతిశయోక్తి జోడించకపోతే ఎదుటివారికి బాగా అర్థం కాదని బాగా తెలిసిన సునంద తను చేసిన గోరంత సంఘసేవనీ కొండంతగా చూపించింది.

అన్నీ ఓపిగ్గా విందావిడ. అది చూసిన సునంద ఇంకాస్త ఉత్సాహపడుతూ ... "మీకేదైనా సహాయం కావాలంటే చెప్పండి ఆంటీ ..." అంది.

సావిత్రమ్మ ఏమీ అర్థం కానట్టు చూసింది సునందని. ఆవిడకి అర్థం అయ్యేలా మళ్ళీ చెప్పింది సునంద. "అటుపక్క నాలుగో ఇంట్లో పార్వతీశంగారని వుండేవారు కదాంటీ ... ఆయన కొడుకు ఇలాగే ఆయన కొచ్చే పెన్షన్ మొత్తం తీసేసుకునేవాడు. తిండి కూడా సరిగ్గా పెట్టేవాడు కాదు. నేనే కలగజేసుకుని, మీడియాకీ వార్త అందించి, ఈ వార్త అన్ని చానల్స్‌లోనూ వచ్చేలా చేసి, ఆ కొడుక్కి అందరిచేతా నాలుగు చివాట్లు పెట్టించి, ఆ పెద్దాయన్ని మంచి వృద్ధాశ్రమంలో చేర్పించాను. ఇప్పుడాయన అక్కడ సంతోషంగా వున్నారు. అప్పుడప్పుడు ఫోన్ చేసి నన్ను పలకరిస్తుంటారు కూడాను ..." కంఠంలో ఒకింత గర్వం తొంగి చూస్తుండగా చెప్పింది సునంద.

"ఇది నీ వుద్యోగవామ్మా ... ?" నెమ్మదిగా అడిగింది సావిత్రమ్మ.

"అబ్బే ... కాదాంటీ ... నేను ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాను. నాకు ఒక

కొడుకు. నైన్త్ క్లాసు చదువుతున్నాడు. కానీ నా ఎదురుకుండా ఎవరైనా పిల్లలు కానీ, వృద్ధులు కానీ బాధపడుతుంటే నేను చూళ్ళేనాంటీ ... అందుకే మీ ఇద్దరి బాధా చూడలేక అడుగుతున్నాను. ఇంకా ఇంత యెండ వుండగానే నాలుగ్గంటలకల్లా ఠంచనుగా ఎవరో తరిమినట్లు పార్క్కి వచ్చేస్తారు. సరిగ్గా ఆరుగంటలు అవగానే వెడతారు. ఈ సిమెంటు బెంచీల మీద అంతసేపు కూర్చోలేక ఓసారి కాళ్ళు మడుచుకునీ, పైకి పెట్టుకునీ అవస్థ పడుతుంటారు. హాయిగా ఇంట్లో కూర్చుని ఏ భక్తి టీ.వి.యో చూసుకునే అవకాశం మీకు లేకనే కదా మీరిలా ఇంత బాధపడుతూ నడవలేక నడవలేక వచ్చేదీ ... కాసేపైనా మీ కొడుకూ కోడళ్ల సూటీ పోటీ మాటలు తప్పించుకుందుకే కదా మీరింత కష్టపడేదీ ... ?''

తెల్లబోయింది సావిత్రమ్మ. "నేనలా చెప్పానామ్మా నీకు ?'' అనడిగింది నెమ్మదిగా.

"చెప్పక్కర్లేదాంటీ ... ఇప్పుడు జరుగుతున్న కథే ఇది. ఇలా తల్లిదండ్రుల్ని ఉసురు పెడుతున్న ఆ పిల్లలకి తెలీదా ... ఎప్పటికో అప్పటికి వాళ్ళు కూడా పెద్ద వాళ్లవుతారనీ ...'' అలవాటైన మాటలనే మరింత గట్టిగా అంది సునంద. "చెప్పండాంటీ ... నేను ఒక్కసారి మీడియాని పిలిచానంటే మీవాళ్ళు బెంబేలెత్తిపోయి, మీ అడుగులకు మడుగులొత్తుతారు ... మీ విషయం చెప్పండాంటీ ...'' అంది.

"మా పిల్లలు మమ్మల్ని బాగానే చూసుకుంటారమ్మా ... అలాంటి దేమీ లేదు ...'' అంది నెమ్మదిగా సావిత్రమ్మ.

"ఎందుకాంటీ దాస్తారూ ... మీకు నేనున్నాను కదా చెప్పండి ...'' పిల్లలను బైట పెట్టడం తల్లిదండ్రులకి ఇష్టముండదని తెలిసిన సునంద రెట్టించింది.

"లేదమ్మా ... నిజంగానే ... మా కొడుకూ, కోడలూ మమ్మల్ని బాగానే చూసుకుంటారు. మాకేమీ ఇబ్బంది లేదు. నువ్వు మీడియా వాళ్ళని పిలిచినా మేము చెప్పేదదే. అయినా మీడియాలో కూడా ఎప్పుడూ పెద్దవాళ్లని చూడని పిల్లల గురించే చెపుతారు తప్పితే తల్లిదండ్రులని నెత్తిమీద పెట్టుకు చూసే పిల్లల గురించి కూడా చెపితే బాగుంటుంది కదమ్మా'' తనకు తోచిన సలహా ఇచ్చింది సావిత్రమ్మ.

"అది కూడా చూపించాలాండీ ... ?''

"చూపించాలమ్మా ... ఒక పూజ చెయ్యమని చెప్పడానికి అది చెయ్యకపోతే నువ్వు నరకానికి పోతావు ... అని భయపెట్టేకన్నా, ఆ పూజ చేస్తే నీకు మంచిది అని చెపితే భక్తితో ఆ పూజ చేస్తారు. ఏ పూజ అయినా భయపెట్టి చేయించేకన్నా భక్తితో

చేస్తేనే మంచిది కదా. అలాగే మీడియా కూడా పెద్దవాళ్లని చూడకపోతే మీమీద నేరం మోపుతాం అని చెప్పే బదులు, అందరూ కలిసున్నప్పుడు అందే సంతోషం చూపిస్తే, అందులో వున్న ఆనందం గ్రహించి కలిసుంటారు కదా. ఎంతసేపూ ఈ మీడియా చెడే చూపిస్తుందెందుకు ? నిజం చెప్పాల్సొస్తే యిప్పటికి కూడా ఎంతోమంది పిల్లలు వాళ్ళ పెద్దవాళ్లని బాగానే చూసుకుంటున్నారు. ఎక్కడో కొంతమంది చూడకపోతే వాళ్ళనే ఒకటికి పదిసార్లు చూపించి పిల్లలందరూ ఇలాంటివాళ్ళే నన్న అభిప్రాయాన్ని జనాల్లోకి ఎక్కించేస్తున్నారు మీరు.''

సావిత్రమ్మ మాటలకి సునంద ఊరుకోలేకపోయింది.

"బాగా చూసుకుంటే హాయిగా ఇంట్లోనే ఉండొచ్చుకదా ... ఇలాగ కాళ్ళు పీక్కుపోతుంటే, ఈ ఎండలో పార్కుకి రావడమెందుకు ?''

అప్పటిదాకా తననెవరూ ఇలా నిలదీయక పోవడంతో సావిత్రమ్మనే నిలదీసింది సునంద. హాయిగా నవ్వేసింది సావిత్రమ్మ.

"అదా నీ ఉద్దేశ్యం ? మా ఇంట్లో వాళ్ల సూటీ పోటీ మాటలు పడలేక ఈ కాస్సేపైనా పార్కులో కూర్చుందామని వచ్చామనుకుంటున్నావా నువ్వు ?'' అనడిగింది.

''మరీ ?'' ఇంకా యెండ కూడా తగ్గకుండా ఉస్సురనుకుంటూ ఆ పెద్దవాళ్ళిద్దరూ అందుకుకాక మరెందుకు వస్తారన్న ధీమాతో అడిగింది సునంద.

"నువ్వు స్థిమితంగా వింటానంటే చెపుతాను.''

"చెప్పండాంటీ ...'' ఆవిడ సమస్య ఎలాంటిదైనా సరే తీర్చెయ్యాలనే కృత నిశ్చయంతో అదేదో వినడానికి మరికాస్త ముందుకు వంగింది.

"మా అబ్బాయి గవర్నమెంటు ఆఫీసరు. మా కోడలు ఇంట్లోనే వుంటుంది. మాకు నైన్త్ క్లాసు చదువుకునే మనవడూ, సెవెన్త్ క్లాస్ చదువుకునే మనవరాలూ వున్నారు. మా వారికి నెలకింతని పెన్షన్ కూడా వస్తుంది. అదెప్పుడూ నా కొడుకు అడగలేదు సరికదా ... మా మందులు కూడా మమ్మల్ని కొనుక్కోనివ్వకుండా వాడే కొంటాడు. ఆ డబ్బు అప్పుడప్పుడు పిల్లలు పుట్టినరోజులనీ, పెళ్ళి రోజులనీ మా ఆశీర్వాదాలు తీసుకుందుకొచ్చినప్పుడు మాకు తోచినంత వాళ్ళ చేతిలో పెడుతుంటాము. మా కొడుకూ, కోడలూ మమ్మల్ని ప్రేమగానే చూసుకుంటారు.''

"మరి అంతా బాగుంటే యింత యెండలో కూడా ఉస్సురుస్సురనుకుంటూ, ఇంత కష్టపడి ఇంట్లోంచి బైటపడితే చాలన్నట్టు ఇక్కడికి ఎందుకొస్తున్నారాంటీ ?'' ఆతృతని ఆపుకోలేకపోయింది సునంద.

ఆవిడ చిన్నగా నవ్వి చెప్పడం మొదలుపెట్టింది.

"చూడమ్మా, స్కూల్ నుంచి మూడుగంటలకి ఇంటికొచ్చిన పిల్లలిద్దరూ మనవడు ట్యూషన్‌కీ, మనవరాలు సంగీతానికీ నాలుగవగానే వెళ్ళిపోతారు. మావాడు నాలుగు దాటిన పావుగంట లోపల ఇంటికొచ్చేస్తాడు. పొద్దుననగా ఆదరా బాదరా ఆఫీసుకి వెళ్ళినవాడు అలిసిపోయి వచ్చి కాస్త టిఫిన్ తిని టీ తాగుతాడు. ఆ కాసేపే మొగుడూ పెళ్ళాలిద్దరూ కాస్త మాటా మంతీ చెప్పుకునేది. పిల్లల భవిష్యత్తు గురించైనా, చుట్టుపక్కలవారి మంచి చెడుల గురించైనా ఒకరితో ఒకరు ఇంకోళ్ళు వింటున్నారనే భయం లేకుండా మాట్లాడుకునేది రోజులో ఆ కాసేపే. మళ్ళీ ఆరవగానే పిల్లలు వచ్చేస్తే వాళ్ల చదువులూ, తిండీతిప్పలూ, రాత్రిపనులూ వుండనే వుంటాయి. ఆ కాస్త సమయం కూడా వాళ్ళిద్దరూ మనసు విప్పి మాట్లాడుకోకపోతే వారిలో ఒకరి కొకరన్న భావం ఎలా నిలబడుతుందీ.

అసలే అది రెండు బెడ్‌రూముల ఫ్లాటాయె. మావాడొచ్చే టైమ్‌కి మేమిద్దరం ఆ హాల్లోనే కూర్చుని టీ.వి. చూస్తున్నామనుకో ... పాపం ఆ మొగుడూ పెళ్ళాలిద్దరికీ వాళ్లకంటూ ప్రత్యేకంగా మాట్లాడుకుందుకు చోటేదీ. పెద్దవాళ్లం మేముండగా ఇద్దరూ రూమ్‌లోకి వెళ్ళి కూర్చోలేరు. రాత్రి అందరూ పడుకున్నాక మాట్లాడుకుందామంటే ఎదుగుతున్న పిల్లలాయె ... వాళ్ల చదువులూ అవీ చూసుకోవాలాయె. ఆ విషయాలన్నీ ఆలోచించుకోవాలన్నా ... అసలవన్నీ వదిలెయ్యి. భార్యాభర్తలిద్దరూ పిల్లల భవిష్యత్తు గురించి మాట్లాడుకోవాలన్నా, పాపం వాళ్లకి సమయమూ, చోటూ కూడా దొరకదాయె. మొగుడూ పెళ్ళాలన్నాక కష్టం, సుఖం ఒకరికొకరు చెప్పుకోవాలి కదా మరి. రోజు మొత్తం మీద దానికి వాళ్ళకి టైమేదీ ... ఏదో సాయంత్రం పిల్లల ట్యూషన్ల కెళ్ళేక మాట్లాడుకుందామంటే ఉత్సవ విగ్రహాల్లాగ మేమెదురుగా వుంటే ఇంకేం మాట్లాడుకుంటారూ ... అందుకే ... వాళ్లకిద్దరికీ మాత్రమే రోజులో ఆ కాస్త సమయం ఇవ్వడానికి మేమిద్దరం ఇలా వస్తున్నాం. ఇలా వస్తున్నందుకు మాకు కాస్త కష్టమనిపించినా మా పిల్లలకి సంతోషం కలిగిస్తున్నామన్న తృప్తి మాకిద్దరికీ వుంది. ఆ తృప్తి ముందు ఈ కష్టం ఎంతటిదమ్మా ..."

సావిత్రమ్మ చెపుతున్న దానిని విస్ఫారిత నేత్రాలతో వింటున్న సునందకి నోట మాట రాలేదు. ఈవిధంగా తన ఆలోచన ఎందుకు సాగలేదు అనుకుంటుంటే ఆవిడే మళ్ళీ అంది. "చూడమ్మా ... ఎవరికైనా సాయం చెయ్యాలన్న తపన నీలో వుంది. కష్టంలో వున్న వాళ్లకి చెయ్యి అందిస్తున్నావు ... అదీ బాగానే వుంది. కానీ అందరూ కష్టాలే పడుతున్నారనుకోకమ్మా. సుఖంగా వుండడం ఎలాగో తెలీనివాళ్లకి

ఆ ఉపాయం కూడా చెపుతూండు. కష్టాలన్నీ సగానికి పైగా మనం ఊహించుకునేవే. కాస్త స్థిమితంగా ఆలోచిస్తే మనలో చాలామంది ఆ భావన నుంచి బైట పడగలరు. నీకు చేతనైతే ఇలాంటి ఉపాయాలు చూపించి, అందర్నీ హాయిగా వున్నారని చూపించు మీడియాలో. అది మరో పదిమందికి మార్గదర్శకమవుతుంది."

సావిత్రమ్మ చెప్పింది వింటున్న సునంద ఏమీ మాట్లాడలేకపోయింది. ఇంతలో ఆ పెద్దాయన కర్ర పుచ్చుకుని లేస్తూ, "వెడదామా ..." అన్నారావిడతో. సావిత్రమ్మ కూడా నెమ్మదిగా లేచి, సెలవు తీసుకుంటున్నట్టు ఆప్యాయంగా సునంద చేతి మీద చెయ్యి వేసి నిమిరి, ఆ పెద్దాయన చెయ్యి పట్టుకుని నడిచి వెడుతుంటే, వెనక నుంచి సునంద అప్రయత్నంగా రెండు చేతులూ జోడించకుండా వుండలేక పోయింది ❊

**జాగృతి వారపత్రిక - దీపావళి సంచిక : 9-11-2015**

**వాకాటి పాండురంగారావు స్మారక కథల పోటీలో ప్రథమ బహుమతి రూ : 15,000/- గెలుచు కున్నది**

# పెన్నిధి దొరికింది

**ము**ఖానికి దగ్గరగా ఏదో వచ్చినట్లుండడంతో గాఢనిద్రలోంచి ఒక్కసారిగా కళ్ళు విప్పింది పార్వతమ్మ. తన ముఖం దగ్గరగా ముఖంపెట్టి కళ్ళలోకి సూటిగా చూస్తున్న రెండు గుండ్రటి మెరుస్తున్న కళ్ళు చూసి ఒక్కసారి ఉలిక్కిపడింది. "డాడ్ ... మామ్మా వోక్ అప్" అని అరుస్తూ కిందికి పరిగెడుతున్న మనవడి మాటలకి పూర్తిగా మెలకువొచ్చి చుట్టూ పరికించింది. ఇండియా నుంచి నిన్నరాత్రి కొడుకింటికి అమెరికా వచ్చింది. రాగానే కాసేపు ఇండియా కబుర్లు చెప్పి భోంచేసి పడుకుంది. మళ్ళీ ఉదయం పదింటికి లేచింది. నిద్రా మెలకువా కాని స్థితిలో ఇవాళ మధ్యాహ్నం భోజనమయ్యాక పడుకున్న ఆమెకి సాయంకాలం అయిదయి మనవడు వచ్చి మొహంలో మొహం పెట్టి పరీక్షించేదాకా మెలకువ రాలేదు.

కొడుకు రవి కాఫీ కప్పు తీసుకుని తల్లి గదిలోకి వచ్చాడు. "అయ్యో ! ఎందుకురా ? నేను కిందికి వొద్దును కదా" అంది నొచ్చుకుంటూ.

"ఫరవాలేదమ్మా ... కాఫీతాగు" అంటూ కాఫీకప్పు తల్లి చేతికిచ్చి అక్కడే కూర్చుని కబుర్లు చెప్పడం మొదలుపెట్టాడు. తండ్రి వెనకే వచ్చి కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళని ఇంతింత కళ్ళేసుకుని చూస్తున్న మనవడిని దగ్గరికి రమ్మని చేతులు చాపింది. వాడు తండ్రివైపు చూశాడు. తండ్రి వెళ్ళమనగానే నెమ్మదిగా పార్వతమ్మ దగ్గరికి వచ్చాడు. ఒక్కసారిగా ఒళ్ళోకి లాక్కుని ముద్దులు పెట్టేసుకుంది పార్వతమ్మ.

ఆవిడకి రవి ఒక్కడే కొడుకు. ఉన్న ఒక్క కొడుకునీ అపురూపంగా పెంచుకుని, చక్కగా చదివించుకుంది. ఆ చదువుకే విదేశాల్లో అవకాశాలు బాగున్నాయంటూ అమెరికా వచ్చి స్థిరపడిపోయాడు. పెళ్ళి కోసమనీ, తర్వాత పుట్టిన మనవడిని చూపించడానికనీ తప్పితే మళ్ళీ పార్వతమ్మకి కొడుకు దర్శనం కాలేదు.

క్రితంసారి చంటిపిల్లాణ్ణి చూపించడానికి ఇండియా వచ్చినప్పుడు కూడా వాడికి మూడేళ్ళే. అసలు తాత, మామ్మ వాడికి గుర్తేలేరు. మనవడి ముద్దుముచ్చట్లు చూసుకోవడానికి ఆవిడ తపించిపోతోంది.

సరిగ్గా అప్పుడే ఆరేళ్ళ మనవడికి స్కూల్‌కి సెలవులిచ్చారనీ, తామిద్దరూ

ఉద్యోగాలకు వెళ్ళాలి కనుక అమ్మా, నాన్న వచ్చి కొన్ని నెలలు వాడి దగ్గరుంటే బాగుంటుందనీ కొడుకు అడిగాడు. ఎంత బతిమాలినా భర్త రాజారావు రానన్నాడు. అన్ని నెలలు వ్యాపారం వదిలి రాలేనని ఖచ్చితంగా చెప్పేసాడు.

పార్వతమ్మ పక్కింట్లో వుంటున్న రుక్మిణి కూడా తన అనుభవాలు చెప్పింది. అక్కడికి వెళ్లాక మాట్లాడ్డానికి మనిషి కనపడక ఎంతగా ఒంటరితనం అనుభవించిందో చెప్పింది.

భార్యాభర్తలిద్దరూ వాళ్ల అవసరానికి తమని రమ్మంటారు. తప్పితే పెద్దవాళ్ళంటే అభిమానంతో కాదని స్పష్టం చేసింది. దానిని కూడా ఆవిడ లెక్కపెట్టలేదు.

"అందులో తప్పేముంది ? పిల్లల అవసరాలకి మనం కాకపోతే ఎవరాదుకుంటారు ?" అంటూ ఆవిడ మాటని తీసిపడేసింది పార్వతమ్మ.

అంతేకాకుండా తన వాదన బలపర్చుకుంది. "వాళ్ళూ రాక మనమూ వెళ్ళకపోతే ఇంక పిల్లలకి మామ్మ, తాత అనే వాళ్ళెలా వుంటారో ఎలా తెలుస్తుంది ?" అంటూ ఎదురు ప్రశ్న వేసింది.

బంధువులూ, స్నేహితులూ కూడా అమెరికా వెడితే అస్సలు తోచదనీ, పగలంతా ఆ అద్దాల కిటికీలు పట్టుకుని వేళ్ళాడాలనీ, రోడ్లమీద మనుషులే కనిపించరనీ పార్వతమ్మకి చెప్పారు. వారమంతా ఇంట్లో కట్టిపడేసినట్టుండాలని, శని, ఆది వారాలు వాళ్ళు తీసికెడితేనే బయట ప్రపంచం కనిపిస్తుందనీ, అదే ఇండియాలో అయితే ఎక్కడికిపడితే అక్కడికి ఎప్పుడుపడితే అప్పుడు వెళ్ళే స్వేచ్ఛ మనకుంటుందనీ ఆవిడని నిరుత్సాహపరిచారు.

అయినాసరే. "నా మనవడే నా ప్రపంచం. ఇంక బయటి ప్రపంచంతో నాకేంటి పని ?" అని వాళ్ళకి సమాధానం చెప్పిందావిడ.

మనవడి ముద్దుముచ్చట్లు కళ్ళారా చూసుకోవాలనే ఆవిడ కోరికముందు అందరి వాదనలూ వీగిపోయాయి.

ప్రయాణం ఖరారైనప్పట్నించీ ఇంక పార్వతమ్మ హడావుడికి అంతులేదు.

ఇదివరకు వచ్చినప్పుడే మనవడికి బంగారం గొలుసు చేయించింది. ఇప్పుడు కొత్తగా చేతికి బ్రేస్‌లెట్ చేయించింది. రెండోచేతికి చిన్నపిల్లలు పెట్టుకునే ముద్దొచ్చే వాచీ కొంది. మార్కెట్లో మగపిల్లలు వేసుకునే కొత్తగా వచ్చిన షేర్వానీలు, రెడీమేడ్ పంచెలు లాంటివి ఇండియన్ డ్రెస్సులు కొంది.

కొడుక్కి ఇష్టమని అడ్డూలు చేసింది. కోడలు తింటుందని కారప్పూస చేసింది.

మనవడి కోసమని మురుకులు వండింది. ఇంక ఊరగాయలు, వడియాలు లాంటివి సరేసరి. అన్ని పేకెట్లో సీల్ చేయించేసింది.

మనవడి ముద్దుముచ్చట్లు చూడాలనీ, వాడికి, తనకి తెలిసిన పాటలూ, పద్యాలూ నేర్పాలనీ, వాడితో కలిసి దాగుడు మూతలు ఆడుకోవాలని పెళ్ళైన ముప్పైయేళ్ళలో ఎప్పుడూ వంటరిగా వదలని భర్తని ఇండియాలో వదిలి, మనవడితో ఆడుకుందామన్న ముచ్చటతో ఒంటరిగా ఎగిరి అమెరికా వచ్చేసింది.

మర్నాడు సోమవారం తెల్లవారగానే పనులకి పరిగెట్టాలి. అందుకే ఆ రోజు రాత్రి భోజనం చేస్తున్నప్పుడు కొడుకు రవి, కోడలు సరళ పార్వతమ్మకి ఆవిడ ఇంట్లో వున్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ చెప్పారు. ఇద్దరి ఫోన్‌నెంబర్లూ ఒక కాగితం మీద రాసి ఎదురుగా కనిపించేలా పెట్టారు.

సరళ అత్తగారికి ఏయే వస్తువులు ఎక్కడున్నాయో, ఎలా వండుకోవాలో చూపించింది. ఇండియాలో పార్వతమ్మ చేతి వంటంటే అమృతహస్తమన్న పేరున్న ఆవిడ ఆ వంటింట్లో స్విచ్చిలు, మిషన్లు జాగ్రత్తగా ఆకళింపు చేసుకుంది.

పొద్దున్నే వంట చేసి పెడతాననీ, కాఫీకి కూడా డికాషన్ వేసే పెడతాననీ, పార్వతమ్మ లేచాక, కాస్త పాలు కలిపి వేడి చేసుకుంటే చాలనీ, నానీకి బ్రేక్‌ఫాస్ట్, లంచ్ విడివిడిగా టేబిల్ మీద పెట్టి వాడికి చెప్పి వెడతాననీ, కాస్త తిన్నాడో లేదో చూస్తే చాలనీ, ఎవరొచ్చినా తలుపు తీయొద్దని, బోల్డు విషయాలు చెప్పింది సరళ.

రవి తల్లికి టీ.వి. రిమోట్ ఇచ్చి అది ఎలా పెట్టుకోవాలో చూపించాడు.

అమ్మ, నాన్న, మామ్మకి ఇంట్లో మామూలు విషయాలన్నీ అంత ప్రత్యేకంగా చెప్పడం విచిత్రంగా అనిపించింది నానీకి. కాఫీ పెట్టుకోవడం, టీ.వి. పెట్టుకోవడం కూడా చెప్పడం చూస్తుంటే ఈ మామ్మకన్నా తనకే చాలా విషయాలు తెలుసనే నిర్ణయానికొచ్చేశాడు వాడు.

దానికి తోడు నానీ, అత్తగారిని ఏమైనా ఇబ్బంది పెడతాడేమోనని ఆలోచించి సరళ తెలివిగా దొంగాడి నెత్తిన బాధ్యత పెట్టినట్టు వాడికి ముందే "మామ్మకి ఇక్కడేమీ తెలీదు. నువ్వే మామ్మని చూసుకోవాలి" అంటూ వాడిని పొగిడి, వాడి చేతిలో మామ్మను పెట్టింది. దాంతో వాడు చాలా బాధ్యత తన మీదున్నట్టు ఫీలయిపోయాడు.

మనవడి కళ్ళల్లో తనపట్ల కనపడుతున్న ఆసక్తి చూసి సంతోషించబోయిన పార్వతమ్మకి అంతలోనే ఆ కళ్ళలో ఒకవిధమైన "ఈవిడకి ఏమీ తెలీద"న్న వెక్కిరింత లాంటిది కనిపించింది. కానీ పట్టించుకోలేదు.

సహజంగా పార్వతమ్మ చురుకైనదే. కోడలు చెప్పినవన్నీ ఇట్టే గ్రహించేసింది. అన్నింటికన్నా ఆవిడకి పగలంతా హాయిగా మనవడితో కాలక్షేపం చేయొచ్చని మహా ఉత్సాహంగా వుంది. ఒకరిమాట ఒకరికి అర్థం అయితేనేం కాకపోతేనేం ... ఆటకి, పాటకి భావం ముఖ్యం కాని భాష కాదుకదా, అయినా ఎన్నాళ్ళు ? నాలుగు రోజులు మన తెలుగులో మాట్లాడితే అంత తియ్యని భాషనీ ఇట్టే పట్టెయ్యడూ. ఎంచక్కా ఇద్దరూ కలిసి బోలెడు పద్యాలూ, పాటలూ పాడుకుంటారు. బోల్డు కథలు చెప్పుకుంటారు. మనవడి దగ్గర తను ఇంగ్లీషు కూడా నేర్చుకోవచ్చు. మహా ఉత్సాహపడి పోయిందావిడ.

మర్నాడు ఉదయాన్నే ఇంకా కొడుకూ, కోడలూ ఆఫీసులకి వెళ్ళకుండానే మెలకువ వచ్చేసింది పార్వతమ్మకి. కిందకి దిగి, కోడలు చెప్పినట్టు కాఫీ కలుపుకుని, ఆ కాఫీ మగ్గుతో ఫ్యామిలీ రూమ్‌లోకి వస్తున్న ఆవిడకి అద్దాల తలుపుల్లోంచి బయట గులాబీ గుత్తులు కనువిందు చేశాయి. నిన్న సాయంత్రం కొడుకు వంటింటి వెనకాల చెక్కలతో కట్టిన అరుగుని చూపించాడు. దానిని డెక్ అంటారని చెప్పి, కూచోడానికి దానిమీద నాలుగు కుర్చీలు కూడా వేసుంచాడు. అందుకని ఆ గులాబీ గుత్తులను చూడగానే హాయిగా బైట కూర్చుని కాఫీ తాగుదామని అనుకుంటూ పెరటి తలుపు హేండిల్ మీద చెయ్యి వేసింది. అంతే “బయ్ ... బయ్” మంటూ గట్టిగా అలారం మోగడం మొదలైంది. ఆ సౌండ్‌కి హడలిపోయింది. అది అలా మోగుతూనే వుంది. ఏం చెయ్యాల్లో తెలీని పార్వతమ్మ నిశ్చేష్టురాలై నిలబడుంటే రెండో నిమిషంలో టవల్ చుట్టబెట్టుకుంటూ కొడుకు హడావిడిగా మెట్లు దిగి వచ్చి డోర్ పక్కనున్న మీటల్ని నొక్కాడు. అంతే, అలారం ఆగిపోయింది. హమ్మయ్య అనుకుంటూ ఆవిడ “ఏవిట్రా ఇదీ ?” అనడిగింది.

“అదా, అది సెక్యూరిటీ కోసమమ్మా. రాత్రి పెడతాం, పొద్దున్నే వెళ్ళేటప్పుడు ఆపేస్తాం. ఈ లోపున ఎవరైనా డోర్ తియ్యడానికి చూస్తే అది మోగుతుంది” అని వివరిస్తుంటే కొడుకూ, కోడలి ఫోన్లకి పోలీసుల నుంచి కాల్స్ రావడమూ, వీళ్ళు అంతా బాగా వుందని చెప్పడమూ అన్నీ జరిగిపోయాయి.

అలారం మోతకి అమ్మా నాన్నలతో పాటు కిందకి దిగిన నానీ కళ్ళల్లో మళ్ళీ నిన్నటి హేళన లాంటిదే కనిపించింది పార్వతమ్మకి. బొడ్డూడని వెధవ తనని చూసి వెక్కిరిస్తాడా. కాస్త మనస్సు చివుక్కుమనిపించిదావిడకి. కానీ ముద్దులు మూటకట్టే ఆ చిన్నమొహం, గుండ్రంగా మెరుస్తున్న పెద్దకళ్ళూ ఆవిడని వివశురాలిని చేసాయి. అందుకే ఆ భావాన్ని పక్కకి తోసేసింది.

కొడుకూ, కోడలూ ఆఫీసులకి వెళ్ళిపోయారు. పొద్దున్న మోగిన అలారానికి కంగారుపడిన పార్వతమ్మ తనను తాను సమాధానపర్చుకుని, స్నానం చేసి దేవుడి స్తోత్రాలు చదువుకుంటూ కిందకి దిగింది. కింద ఫ్యామిలీ రూమ్‌లో నానీ కూర్చుని వాడి లాప్‌టాప్‌లో ఏదో చేసేసుకుంటున్నాడు. పాపం అనిపించింది పార్వతమ్మకి. వెర్రిపిల్లాడు, అమ్మా నాన్నా ఆఫీసులకంటూ వెళ్ళిపోతే ఆడుకుందుకు ఎవరూ లేక పిచ్చివెధవ ఆ పెట్టె పట్టుకు వేళ్ళాడుతున్నాడు అనుకుంటూ వాడి దగ్గరికి వెళ్ళి "నానీ, టిఫిన్ తిన్నావా ?" అనడిగింది బాధ్యతగా. వాడికర్థం కాలేదు. "వ్వాట్ ?" అన్నాడు. మళ్ళీ అడిగింది. తెలీలేదు వాడికి. ఇంకిలా లాభం లేదని డైనింగ్ టేబిల్ మీద వాళ్ళమ్మ పెట్టిన బాక్స్ చూసింది. ఖాళీగా అనిపించింది. మామ్మనే గమనిస్తున్న నానీకి అప్పుడు అర్థమైంది.

"ఓ బ్రేక్‌ఫాస్ట్ ! ఐయాన్ డన్" అన్నాడు. అమ్మయ్య అనుకుని వాడి పక్కన కూర్చుని "మనం కథ చెప్పుకుందామా ?" అంది.

వాడికి రామాయణం, భారతం, పంచతంత్రం అన్నీ చెప్పెయ్యాలని ఆవిడ ఎప్పుడో నిర్ణయించేసుకుంది. కానీ మొదలుపెట్టడం మటుకు వాడికి కాస్త ఇంటరెస్టింగ్‌గా వుంటుందని 'బుడుగు'తో మొదలుపెట్టింది.

"నీలాంటివాడే బుడుగు అని ఓ అబ్బాయున్నాడూ ..." అంది.

"వ్వాట్ ... ?" అన్నాడు నానీ. నీరసపడిపోయిందావిడ. ఏదో కాస్త ఇంగ్లీష్ అర్థం అవుతుంది కానీ వాడికర్థమయ్యేటట్టుగా వాడు పలికినట్టు చెప్పడం రాలేదావిడకి.

కానీ తన ప్రయత్నాన్ని వదిలిపెట్టదల్చుకోలేదావిడ. ఉత్సాహం తెచ్చుకుంది. "పోనీ పద్యం చెప్పనా ? పోయమ్ ?" అంది. నానీకి "పోయమ్" అన్నమాట అర్థమయి మామ్మ ఫీల్ అవుతుందేమోనని ...

"కె ..." అన్నాడు.

ఓహో ... 'కె' అంటే 'ఓకె' అని అర్థం చేసుకుని సంతోషపడిపోయి, తేలిగ్గా వున్నది మొదట చెపుదామనుకుంటూ, కృష్ణశతకంలోని "నీవే తల్లివి తండ్రివి" అన్న పద్యం చెప్పడం మొదలుపెట్టింది.

అందులో రెండు, మూడుసార్లు "నీవే ..." అంటూ వచ్చేసరికి వాడికి విసుగని పించింది. "ఇట్స్ బోరింగ్" అంటూ వెళ్ళిపోయాడు వాడు.

పార్వతమ్మ వాడిని వదలదల్చుకోలేదు. కొత్తకదా ఇంకాస్తసేపు మాట్లాడిస్తే సరి అనుకుంటూ ...

"ఇదేంటి ?" అనడిగింది వాడి చేతిలో పెట్టినిచూపించి.

"ఇట్స్ మై లాప్‌టాప్" అన్నాడు వాడు మెరుస్తున్న కళ్ళతో, చూపించమందావిడ.

అంతే ! వాడు విజృంభించేసాడు. అందులో ఏమేమి పదాలు నేర్చుకోవచ్చో, ఎలాంటి లెక్కలు చెయ్యొచ్చో, ఎన్నిరకాల ఆటలు ఆడుకోవచ్చో, పాటలు ఎలా వినవచ్చో అన్నీ టకటకా వాడి భాషలో చెప్పేశాడు. పార్వతమ్మకి సగం మాటలు అర్థమే కాలేదు. అయినాసరే అన్నీ తెలిసిపోయినట్టు ఎంతో సంతోషంగా మొహం పెట్టేసింది. ఏమీ తెలీని మామ్మకి తనేకదా అన్నీ చెప్పేసాననే గర్వంతో, నానీ మళ్ళీ వాడి ఆటల్లో పడిపోయాడు.

ఇంక వాడితో మాట్లాడే ఓపిక లేక పార్వతమ్మ టీ.వి. ఆన్ చేసింది. ఒక్క ప్రోగ్రామ్ నచ్చలేదు ఆవిడకి. అన్నీ పిచ్చి చానళ్ళలా అనిపించాయి. అలా అర్థం అవని అవన్నీ చూస్తూ కూర్చుంటే పార్వతమ్మ దృష్టి భర్త మీదకి పోయింది. ఇప్పుడు అక్కడ అర్థరాత్రవుతుందేమో ! వచ్చేటప్పుడు భాగ్యాన్ని వంటకి పెట్టే వచ్చింది. ఏం తింటున్నారో ... ఏమో ! ఆ భాగ్యమేమో, రొట్టెలు సాయంకాలమే చేసేసి టేబిల్ మీద పెట్టేసిపోతుంది. ఈయన భోజనానికొచ్చేసరికి చల్లగా, గట్టిగా అయిపోతాయి. తినగలరో, లేదో ! అసలే ఆయనకి ఇలా పెనం మీంచి అలా కంచంలో పడాలి. ఏం తింటున్నారో ఏంటో అనుకుంటూ ఇంటివైపు, భర్తవైపు దృష్టిపోయిన ఆవిడ చేతిలోని రిమోట్‌మీద ఏ బటన్ నొక్కిందో ఏంటో, ఒక్కసారిగా టీ.వి. స్క్రీన్ అంతా తెల్లగా అయిపోయింది.

కంగారుపడిపోయి ఇదెక్కడి గొడవరాబాబూ అనుకుంటూ గబ గబా మళ్ళీ ఆమీటా ఈమీటా నొక్కినా అది కదలదే ! ఏం చెయ్యాలో తోచక "నానీ" అంటూ పిలిచిందావిడ. అక్కడే ఆడుకుంటూ ఆవిడపడుతున్న బాధ చూస్తున్న ఆ పిల్లాడు వెంటనే వచ్చి ఇంకేదో మూలపడున్న ఇంకో రిమోట్ తెచ్చి, రెండు రిమోట్‌ల మీద చక చకా ఏవో బటన్లు నొక్కేసి, మళ్ళీ స్క్రీన్ మీదకి బొమ్మని తెచ్చి, విజయగర్వంతో మామ్మని చూశాడు. 'అమ్మయ్య' అనుకుంటూ ఇటుతిరిగిన పార్వతమ్మకి మళ్ళీ నానీ చూపుల్లో అదే వెక్కిరింత కనబడింది. భూమికి జానెడు లేడు, తనను చూసి నవ్వుతాడా ! మనసు చివుక్కుమన్నట్టనిపించింది. కానీ మళ్ళీ తన కొడుకు చిన్ననాటి రూపం నానీలో కనబడుతుంటే మరింక ఏవిధమైన వ్యతిరేకతా వాడిపట్ల కలగలేదు సరికదా, ఆ చూపులు కూడా సర్వజ్ఞుడైన తనని తెలుసుకోలేకపోయిన యశోద అజ్ఞానాన్ని చూసి చిన్నికృష్ణుడు నవ్విన కొంటె నవ్వులాగే అనిపించిందావిడకి.

ఏదో భోజనం అయిందనిపించింది కానీ పార్వతమ్మకి ఏంటో తృప్తిగా లేదు. తను అనుకున్నట్టు మనవడితో కబుర్లు చెప్పలేకపోతోంది. ఒకరిమాట ఒకరికి అర్థమే

కావడం లేదు. ఎంతసేపూ ఆ పిచ్చి పెట్టి, ఆ కార్లూ, బ్లాక్సూ పెట్టుకు కూచుంటాడు తప్పితే, అసలు తన దగ్గరికే రావటం లేదు. ఒక్కరోజుకే అలావుంటే మరింక ఇన్ని నెలలూ ఎలా గడుస్తాయో అని అనుకుంటుంటే చుట్టాలూ, స్నేహితులూ చెప్పినవన్నీ ఆమెకి గుర్తొచ్చాయి. వాళ్ళెంత చెపుతున్నా వినిపించుకోకుండా ఇక్కడికి వచ్చి పొరపాటు చేశానా అనుకుంది.

నానీ బ్లాక్స్ పెట్టుకుని ఆడుకుంటుంటే పైన తన గదిలోకి వెళ్ళి పడుకుంది. మళ్ళీ లేచేసరికి కొడుకూ, కోడలూ వచ్చేశారు. కోడలు వంట కూడా అయిపోయింది. అందరూ కలిసి పగలు జరిగిందంతా చెప్పుకుని నవ్వుకుంటూ భోజనాలు ముగించి పడుకుందుకు సిద్ధమయ్యారు.

పడుకుందుకు తన గదిలోకి వెడుతున్న పార్వతమ్మ నానీ గదిలోకి తొంగి చూసింది. రవి నానీని పడుకోబెట్టుకుని కథలు చెపుతున్నాడు. లోపలికి వెళ్ళింది. చాలా శ్రద్ధగా ఊపిరి బిగబట్టి వింటున్నాడు వాడు.

"వీడు ఈ గదిలో పడుకుంటాడా ?" అడిగింది పార్వతమ్మ. అవునన్నాడు రవి.

"చంటి పిల్లాడు ఒక్కడికీ భయం వెయ్యదూ ? మీ గదిలో పడుకోబెట్టుకోండి" అంది.

రవి నవ్వాడు. "ఇక్కడ అలా వుండదమ్మా. పిల్లలు చిన్నప్పట్నుంచీ స్వతంత్రంగా పెరుగుతారు. పుడుతూనే వాళ్ళపేరుతో పిలిపించుకుంటారు."

ఏవిటో పార్వతమ్మకి అదంత రుచించలేదు. చంటివెధవ, రాత్రి భయపడితే? అదే అడిగంది.

"ఏం భయపడడు. ఎప్పట్నించో వాడు ఒక్కడే పడుకుంటున్నాడు. ఇవాళ కొత్తకాదు" అన్నాడు రవి. "ఏవిటో ... ఇక్కడ వీళ్ళ పద్ధతులూ అవీ తనకి నచ్చలేదు. కానీ తను వద్దని చెపితే మాత్రం వాళ్ళు వింటారా" అనుకుంటూ తన గదిలోకి వచ్చేసింది. ఆ చలికి తట్టుకోలేక కంఫర్టర్‌లో దూరిపోయిందావిడ. నిద్రపట్టక, 'భర్తని ఒక్కణ్ణీ వదిలి ఇంతదూరం రావడంలో పొరపాటు చేసానా' అనుకుంది.

అర్థరాత్రి దాటిపోయింది. నిద్రపట్టని పార్వతమ్మ అటూ ఇటూ మెసలుతోంది. సగందాకా వేసివున్న తలుపు నెమ్మదిగా తెరుచుకుంది. తలుపు చాటు చేసుకుని, ఒక అడుగు గది లోపలికి వేసి, మెరుస్తున్న రెండు గుండ్రటి కళ్ళతో పార్వతమ్మ వైపు చూసాడు నానీ. వాడి కళ్ళలో ఒకలాంటి భయం. తెల్లబోయి వాడిని చూడగానే నిద్ర మధ్యలో లేచాడా వీడు అనుకుంటూ చేతులు చాపిందావిడ. ఒక్క ఉదుటున

ఆవిడ చేతుల్లో కొచ్చేసి "అయామ్ స్కేర్డ్" అన్నాడు వాడు. ఆ మాట వింటున్నప్పుడు వాడి కళ్ళల్లో భయం ప్రస్ఫుటంగా కనబడిందావిడకి. ఒక్కసారిగా రెండు చేతులూ వాడిపై వేసి, వాడిని మంచం మీదకి లాక్కుంది. వాడు మళ్ళీ "అయామ్ స్కేర్డ్... కెన్ అయ్ స్లీప్ హియర్ ?" అన్నాడు.

ఏం కథలు విన్నాడోయేమో మాట కూడా వణుకుతూ వస్తోంది. కొడుకు మీద పీకల్దాకా కోపం వచ్చిందావిడకి. పిచ్చి కథలన్నీ చెప్పి చంటిపిల్లాణ్ణి ఒక్కణ్ణీ వదిలేసారనుకుంటూ, వాడ్ని పక్కన పడుకోబెట్టుకుని, దగ్గరగా లాక్కుని, ఇద్దరికీ కలిపి పూర్తిగా కంఫర్టర్ కప్పిందావిడ.

ఆవిడ పొట్టలోకి మరింతగా దూరిపోతూ పార్వతమ్మను చూసి నవ్వాడు నానీ. మెరుస్తున్న ఆ కళ్ళల్లో భయం పుంజాలు తెంచుకుని పారిపోయినట్టుంది. ఆ చూపుల్లో ఎంత నిశ్చింత, ఎంత భద్రత, ఎంత ప్రేమ ? పార్వతమ్మ ఆ చూపులకి పొంగి పోయింది. ధైర్యం చేసి సముద్రాలు దాటి వచ్చినందుకు కావలసిన పెన్నిధి చేతి కందినంత ఆనందపడిపోయింది. "ఎన్ని తపస్సులు చేస్తే ఈ పెన్నిధి లభిస్తుంది. ఎంత పుణ్యం చేసుకోకపోతే ఇంతటి పెన్నిధి తనదవుతుంది" అనుకుంటూ నానీని మరింత దగ్గరికి పొదువుకుంటూ నిశ్చింతగా నిద్రపోయిందావిడ ❊

**ఆంధ్రభూమి వార పత్రిక : 18-7-2013; ప్రత్యేక బహుమతి**

# కాస్త ఆలోచిస్తే ...

**ప**దహారేళ్ళ చందూకి ఉక్రోషంతో ముక్కుపుటాలు అదురుతున్నాయి. తట్టుకోలేని కోపం వల్ల మొహం జేవురించింది. చెంపల మీద పడిన తండ్రి చేతివేళ్ళ దెబ్బలు ఛెళ్ళుమని కొరడాతో కొట్టినట్లు మండుతున్నాయి. ఉబికి రాబోతున్న ఏడుపుని అభిమానం తలెత్తగా ఆపుకుని నిర్లక్ష్యంగా చూసేడు తండ్రివైపు. ఆ చూపు చూసిన సూర్యానికి కొడుకు మీద తగ్గబోతున్న కోపం మళ్ళీ తారస్థాయినంటింది. మళ్ళీ చెయ్యెత్తబోయేడు చందూ మీద. పది నిమిషాల నుంచి తండ్రి కొడుకుల మధ్య జరుగుతున్న వ్యవహారం చూస్తున్న సుమతి గబుక్కున సూర్యం చెయ్యి పట్టుకుంది. విసురుగా తోసేయబోయేడు సూర్యం. బలమంతా ఉపయోగించి ఆపుతూ, కొడుకుని కొట్టవద్దని అర్థిస్తున్నట్లు కళ్ళతో చెబుతూ, తల అడ్డంగా ఊపింది సుమతి. బలవంతంగా చెయ్యిదించేడతను. కానీ తన కోపాన్ని మటుకు నిగ్రహించుకో లేకపోయేడు.

"నువ్వు చదువుతున్న ఇంతోటి ఇంటర్ చదువుకి ఇలా అర్ధరాత్రి దాకా ఫ్రెండ్స్‌తో పార్టీలూ, తిరుగుళ్ళూ వొద్దంటే మానవా ... ?"

"అందరూ వెడుతూంటే నేనొక్కణ్ణీ ఎలా మాననూ ?" చెప్పిన సమాధానమే మళ్ళీ చెప్పేడు చందూ.

"మా నాన్న వద్దన్నాడని చెప్పడమే ..." అధికారికంగా అన్నాడు సూర్యం.

"అలా చెబితే అందరూ నవ్వుతారు. నోట్లో వేలెట్టుకుని మీ అమ్మ ఒళ్ళో బజ్జో అంటారు. అయినా నాకిన్నేళ్ళొచ్చేయి. నా సంగతి నాకు తెలీదా ... ?"

"ఏం తెలుసు నీకు ? చదువూ సంధ్యా లేని వాళ్ళతో ఫ్రెండ్స్ అంటూ తిరిగి అడ్డమైన స్నేహాలు చేస్తున్నావ్. అసలు వాళ్ళ అమ్మా నాన్నలు ఎలా ఊరు కుంటున్నారు?"

"వాళ్ళేం మీలాంటి సంస్కారం లేని వాళ్ళుకాదు" రోషంగా అన్నాడు చందూ.

"అంటే మేవేనా సంస్కారం లేని వాళ్ళం."

"అవును. మా ఫ్రెండ్సింట్లో వాళ్ళేం చెప్పినా, చేసినా ఎవరూ వొద్దనరు. కాదనరు."

"బయట ఎన్నైనా చెప్పొచ్చు. ఇంట్లో కెడితే కానీ అసలు సంగతి తెలీదు. ఎవడైనా నీకు వరసగా రెండ్రోజులు టీ ఇస్తాడేమో చూపించు ..."

"నన్నేమైనా అను. నా ఫ్రెండ్స్‌ని మటుకు ఏవైనా అన్నావో ..." ఆవేశ పడిపోయేడు చందూ.

"అయితే పో ... ఆ ఫ్రెండ్స్ దగ్గరికే ఫో. నా ఇంట్లోకి రాకు ..." గట్టిగా అరిచేడు సూర్యం.

"ఏవండీ ..." సుమతి అడ్డుకోబోయింది.

"నువ్వు మాట్లాడకు. ఇలాంటి పొగరుబోతును నా ఇంట్లో వుంచుకోలేను. ఫో బైటికి ..." చెయ్యి వీధివైపు చూపించేడు సూర్యం.

పొంగుకొస్తున్న ఆవేశంతో "అలాగే పోతాను. ఇంతోటి ఇంట్లోకి మీరు రానివ్వకపోతే నాకేం నష్టం లేదు. మా ఫ్రెండ్స్ నన్ను నెత్తి మీద పెట్టుకుంటారు. మీరు వచ్చి నా కాళ్ళట్టుకున్నా మళ్ళీ ఈ ఇంట్లో అడుగుపెట్టను" తలెగరేస్తూ అన్నాడు చందూ.

"మరింకేం. ఇంకా నిల్చున్నావేం ... ఫో వెంటనే ..."

సుమతి వారిస్తున్నా వినకుండా చందూని బైటికి తోసేసి వీధి తలుపు వేసేసేడు సూర్యం.

రాత్రి ఒంటి గంటవుతోంది. వీధి నిర్మానుష్యంగా వుంది. సందు మొగన పడుకున్న ఓ కుక్క తలెత్తి ఓసారి మొరిగి మళ్ళీ ఒరిగింది.

విసురుగా నాలుగడుగులు వేసి ఒకసారి వెనక్కి తిరిగి ఇంటి వైపు చూసేడు చందూ. మూసివేసిన తలుపుల వెనకున్న రెండు బండరాతి గుండెలను తల్చుకుని, వారి కడుపున పుట్టినందుకు తన దురదృష్టాన్ని నిందించుకుంటూ ఫ్రెండ్ రాజారాం ఇంటి దారి పట్టాడు చందు. సందు చివరికి రాగానే మొగన ఆగిన కారుని గుర్తుపట్టేసేడు. అది వాసు కారు. అంటే వీళ్ళింకా ఇళ్ళకి వెళ్ళలేదన్నమాట. తనని సందు మొగన వదిలి మళ్ళీ ఇక్కడ బైఠాయించేరన్నమాట. దుఃఖమంతా ఎక్కడికి పోయిందో ఒక్క అంగలో వాళ్ళని చేరుకున్నాడు చందూ. రాజారాం, చందూ, బంటీ, వాసూ. వీళ్ళ నలుగురూ మంచి స్నేహితులు. అలాంటి స్థితిలో చందూని చూడగానే పాపం స్నేహితులు ముగ్గురూ తల్లడిల్లిపోయేరు. కారణం తెలుసుకుని చందూ తండ్రిని

తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేరు. వాళ్ళ మాటలు వింటూంటే తండ్రి కొట్టిన దెబ్బల మీద స్నేహితులు చల్లని చందనం రాస్తున్నట్లు అనిపించసాగింది. అందుకే మరింత తాత్సారం చెయ్యకుండా చెప్పేసేడు. "నేనింక ఆ ఇంటికి వెళ్ళనురా. అంతకన్నా చావడం మేలు."

ఒక్కసారి ఉలిక్కిపడ్డారు స్నేహితులు ముగ్గురూ. "అదేంటిరా అలా అంటావ్. మరింకెక్కడుంటావ్ ... ?" బంటీ వెంటనే అడిగేడు.

"మీ అంత మంచి ఫ్రెండ్స్ వుండగా నాకేం లోటురా. ఆ మాత్రం మీ ఇళ్ళల్లో ఎక్కడో చోట వుంటాలేరా ..." చాలా భరోసాగా అన్నాడు చందూ. వాళ్ళకి కాసేపు ఏం మాట్లాడాలో తోచలేదు.

రాజారాం ముందుగా తేరుకున్నాడు.

"సరే చందూ ... మా ఇంటికి వెడదాం ..." అంటూ చందూ భుజం చుట్టూ చెయ్యి వేసి కారు వైపు నడిచాడు రాజారాం. ఇంటి దగ్గర చందూనీ, రాజారాంనీ దింపేసి వాసూ, చంటి వెళ్ళిపోయేరు. అర్థరాత్రి కొడుకుతో పాటు ఇంట్లోకి వస్తున్న చందూని చూసి రాజారాం అమ్మా, నాన్నలు ఆశ్చర్యపోయేరు. చందూని తన గదిలోకి తీసుకెళ్ళి బాత్‌రూం చూపించి చల్లటి నీళ్ళతో మొహం కడుక్కుని బట్టలు మార్చుకోమని తన నైట్ డ్రస్ ఒకటి తీసిచ్చి, మంచినీళ్ళ కోసం వంటింట్లోకి వెళ్ళాడు రాజారాం.

మంచినీళ్ళు తీసుకొని వెనక్కి తిరిగిన రాజారాంకి వెనకాల అతని తల్లీ, తండ్రి కనిపించారు.

"ఏమైందిరా అతనికి ?" ఆత్రుతగా అడిగింది తల్లి దమయంతి.

"ఏం కాలేదమ్మా ! లేట్ అయిపోయింది కదా ... ఇవాల్టికి ఇక్కడ పడుకుంటానని వచ్చేడంతే ..." రాజారాం మాట దాటేస్తూ ముందుకి అడుగేసాడు.

"ఏం కాకపోవడమేంటి ? మొహమంతా అలా ఎర్రగా అయిపోతే ..." తండ్రి శేఖరం రాజారాంని నిలదీశాడు.

"అదా ... అబ్బే రోడ్డు మీద పడిపోయేడు డాడీ ... అప్పుడక్కడ రోడ్డు వేస్తున్నట్టున్నారు. ఆ కంకర గుచ్చుకున్నట్లుంది అంతే ..." అంటూ వాళ్ళని దాటుకుని రూములోకి వచ్చి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

చల్లటి నీళ్ళతో మొహం కడుక్కున్న చందూకి కాస్త మనసు కూడా చల్లబడి నట్టనిపించింది. రాజారాంని చూడగానే "చాలా థాంక్స్‌రా ..." అన్నాడు.

"ఫ్రెండ్స్ మధ్య థాంక్స్ లేంట్రా ... ఇక పడుకో ..." అంటూ కప్పుకుందుకు దుప్పటి ఇచ్చి తను కూడా పక్కనే పడుకున్నాడు. అలసిపోయిన ఇద్దరూ ఇట్టే నిద్రలోకి జారుకున్నారు.

మర్నాడు రాజారాంతో పాటు చందూకి కూడా ఆప్యాయంగా బ్రేక్‌ఫాస్ట్ పెట్టింది దమయంతి. రోజంతా రాజారాం ఇంట్లోనే పాటలు వింటూ, వీడియో గేమ్‌లు ఆడుకుంటూ గడిపేసారిద్దరూ. సాయంత్రం అయ్యేసరికి చంటీ, వాసు కూడా వచ్చేరు. నలుగురూ బైటికి పోయి ఛాట్ గట్రా తినేసి వచ్చి, రాత్రి చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాక వాసూ, చంటీ వాళ్ళ ఇళ్ళకి వెళ్ళిపోయేరు. చందూ రాజారాం ఇంట్లోనే పడుకున్నాడు. రెండు రోజులు గడిచేయి. మూడోరోజు ఇంక ఆగలేక దమయంతి రాజారాంని అడిగింది. "ఒరే రాజా, చందూ వాళ్ళ పేరెంట్స్ ఊళ్ళో లేరా ?" అంటూ గతుక్కుమన్నాడు రాజారాం.

"అమ్మా ... అసలేమయ్యిందంటే ..." అంటూ రాజారాం తల్లికి మెల్లిగా చందూ ఇంట్లోంచి వచ్చేసిన విషయం అంతా చెప్పేసేడు. తెల్లబోయింది దమయంతి.

"నీకు మతుందా పోయిందా ? అమ్మా నాన్న ఏదో అన్నారని ఇలా ఇంట్లోంచి వచ్చేస్తారా ?" గట్టిగా అడిగింది.

"ఏదో అనలేదమ్మా ... ఇంట్లోంచి పొమ్మన్నారు" వివరంగా చెప్పేడు రాజారాం. "ఛీ, నోర్ముయ్యి ..." అంటూ ఏదో అనబోతున్న తల్లిని కోపంగా చూస్తూ

"ఏంటమ్మా ... అంత గతి లేకుండా వున్నాడనుకున్నావా వాడు ? మేమంతా లేమా ?" అంటున్న కొడుకుని చూసి నోట్లోంచి రాబోతున్న తీవ్రమైన పదజాలాన్ని బలవంతాన ఆపుకుంది. కొడుకులో అంతటి ఆవేశాన్ని చూసిన దమయంతికి కొడుకు కూడా ఇలాగే ఇంట్లోంచి వెళ్ళిపోతాడేమో అన్న భయం వెన్ను జలదరించేలా చేసింది. భర్త వచ్చేదాకా బిగపట్టుకుని వున్న దమయంతి శేఖరాన్ని చూడగానే విషయమంతా వివరించింది.

విన్న శేఖరానికి మతిపోయింది. ఏం పిల్లలు వీళ్ళు. ఈ ఆవేశాలు ఎక్కడికి దారితీస్తాయి. తొందర పడకుండా బాగా ఆలోచించుకుని కొడుకుని బైటికి తీసికెళ్ళేడు.

"చూడు రాజా ... చందూ ఇక్కడుంటే మాకేం అభ్యంతరం లేదు ..." అంటూ మొదలుపెట్టేడు రాజారాం మొహం ఆనందంతో విచ్చుకుంది.

"మనం ఇప్పుడు ప్రాక్టికల్ విషయాలు మాట్లాడుకుందాం" అన్నాడు శేఖరం.

ఏమిటన్నట్టు చూసాడు రాజారాం. "ఒకవేళ చందూ అమ్మా నాన్న వచ్చి

అతన్ని వాళ్ళింటికి రమ్మాన్నారనుకో ...'' శేఖరం మాటల్ని మధ్యలోనే అడ్డుకున్నాడు రాజారాం. "రమ్మంటే వెళ్ళిపోతారా ఎవరైనా ... ఇంట్లోంచి పొమ్మన్న వాళ్ళింటికి వెళ్ళడానికి వాడేమీ పౌరుషం లేనివాడు కాదు ...''

శేఖరం సర్దుకున్నాడు. "సరే వెళ్ళడు ... సరే ... మరి ఇప్పుడు ఇంటర్‌లో వున్నాడు కదా ... చదువెలా చదువుతాడు ?''

"ఎలాగంటే ... నాలాగే'' అనబోయి ఆగిపోయేడు రాజారాం. అతనికి వెంటనే గుర్తొచ్చింది. తన తండ్రి తన కాలేజీ ఫీజు కట్టడం కోసం బ్యాంక్ నుంచి లోన్ తీసుకున్నాడు. ఆ విషయం రాజారాంకి అర్థమవ్వాలని శేఖరం, దమయంతి రాజారాం ఎదురుగానే నెలకి ఎంత వాయిదాలు కట్టాలో, అందుకోసం వాళ్ళు చిన్న చిన్న సరదాలను ఎలా మర్చిపోవాలో మాట్లాడుకున్నారు. అలా మాట్లాడుకుంటే కొడుక్కి కూడా బాధ్యత తెలుస్తుందని వాళ్ళనుకున్నారు. అది గుర్తొచ్చింది రాజారాంకి.

వెంటనే మిగిలిన ఇద్దరు ఫ్రెండ్స్ గుర్తొచ్చేరు. "నేను బంటీని, వాసుని కూడా అడుగుతాను'' అన్నాడు తండ్రితో.

శేఖరం తలూపేడు. "సరే అడుగు. మరి చందూ పేరెంట్స్‌కి అతనిక్కడున్నట్టు చెప్పేరా ? వాళ్ళు కంగారుపడుతుంటారు కదా ... ?'' అనడిగేడు.

రాజారాం మొహం ఆ మాట వినగానే ఎరుపెక్కింది. "ఖంగారు పడేవాళ్ళైతే ఇంట్లోంచి పొమ్మనరుగా ?'' అన్నాడు వెటకారంగా.

శేఖరం మనసు చందూ తల్లిదండ్రులను తల్చుకుని బాధపడింది. వాళ్ళ ఫోన్ నెంబర్ తెలిస్తే ఎంత బాగుండునూ అనుకున్నాడు మనసులో.

నిజమే ... పాపం శేఖరం అనుకున్నట్లు వాళ్ళ ఫోన్ నెంబరు తెలిస్తే బాగుండును. ఎందుకంటే చందూ తల్లిదండ్రుల పరిస్థితీ అల్లాగే వుంది మరి. ఏదో పిల్లవాణ్ని క్రమశిక్షణలో పెట్టడానికి వాడి స్వేచ్ఛని ప్రశ్నించడం, చిన్నవాడు అలాంటి ఎదురు సమాధానం చెప్పగానే పెద్దరికానికి భంగం వాటిల్లినట్లు గొంతు పెంచడం, దానికి ఆ పిల్లవాడు భయపడకపోతే అధికారికంగా ఇంట్లోంచి పొమ్మనడం ... వాళ్ళిద్దరికీ తల్చుకున్న కొద్దీ దుఃఖం ఉబికుబికి వస్తోంది. చందూ ఎక్కడికెళ్ళాడో తెలీదు. కాలేజీకి సెలవులు కనుక అది మూసేసి ఉంది. ఫ్రెండ్స్ అంటూ తిరగడమే కానీ వాళ్ళ పేర్లు కానీ, ఎక్కడుంటారో గానీ తెలీదు. సుమతి ఆ వూళ్ళోనే ఉద్యోగం చేసుకుంటున్న తమ్ముడు చలపతిని పిలిచి విషయం చెప్పి భోరుమంది.

"మీ బావ ఆవేశాన్ని ఆపుకోలేకపోయేరనాలో, వాడు పౌరుషాన్ని చంపుకోలేకపోయేడనాలో నాకు తెలీటం లేదురా'' అంటూ ఎవరినీ తప్పు పట్టలేని పరిస్థితిని

వివరించింది. భార్య ముందు దోషిలా సంజాయిషీ ఇచ్చుకోవలసిన పరిస్థితికి దిగజారినందుకు సిగ్గుపడ్డాడు సూర్యం. నిజవే ... తను ఆవేశపడకుండా వుండాల్సింది కానీ ఆ ఆవేశం ఎందుకొచ్చింది ? రేప్పొద్దున్న వీడిల్లా రోడ్లు పట్టుకు తిరక్కూడదనే కదా ...

తమకా వ్యవసాయాలు చేసుకుందుకు పొలాల్లేవు. వ్యాపారాలు చేద్దామంటే డబ్బుల్లేవు. రేప్పొద్దున్న వాడు బతకడానికి వాడికొచ్చే ఉద్యోగమొక్కటే ఆధారం. ఆ ఉద్యోగానికి కూడా ఎంతెంత పోటీయో ... చదవాల్సిన వయసులో చదువుకోకుండా పార్టీలంటూ డబ్బున్న వాళ్ళతో తిరిగితే రేప్పొద్దున్న బాధపడేది వాడేననే కదా తన బాధ ... ఎంతసేపూ తిట్టానంటారే కానీ ఆ తిట్టడం వెనుక ఉన్న బాధ ఎవరూ అర్థం చేసుకోరేం. తను చేసింది తప్పో ... ఒప్పో తేల్చుకోలేని స్థితిలో పడిపోయేడు సూర్యం.

చలపతికి ఏం చెప్పాలో తోచలేదు. జరిగిన దానిలో తప్పొప్పులెవరివో ఆలోచిస్తూ కూర్చోకుండా చందూని వెదికే పనిలో పడ్డాడు.

రాజారాం తండ్రికి చెప్పిన మాట మర్చిపోలేదు. తమకన్నా బంటీ, వాసూలు బాగా డబ్బున్నవాళ్ళు. అందుకే ఆ సాయంత్రం చందూతో కలిసి బంటీని, వాసూనీ హోటల్‌లో కలిసినప్పుడు ఆ విషయం గురించి అడిగాడు.

"మా ఇంట్లో ఎక్కువ రోజులు కుదరదేమోరా. ఫీజు కట్టడం కూడా కష్టమే. మీరిద్దరూ ఏదో ఆలోచిస్తే కానీ పాపం చందూ చదువు ముందుకు సాగడం కష్టం."

బంటీ, వాసూ ముఖముఖాలు చూసుకున్నారు. ముందుగా వాసూయే అన్నాడు. "మా డాడీ చాలా స్ట్రిక్టురా. ఏదో మా మామ్‌ని బెదిరించి డబ్బులు తెస్తున్నా కానీ ఇలాంటి ఫీజులూ అవీ అంటే పైసా విదల్చరు. ఇంకా ఇంట్లో ఇంకొకళ్ళని తెస్తానంటే నన్ను కూడా బైటికి తోలేస్తారు."

బంటీ చెప్పింది అంతకు రెండింతలు ఎక్కువగా వుంది. "అసలు మా ఇంట్లో మా డాడీ మాట అసలు చెల్లదు తెల్సా ... ఇప్పటికీ మా తాత మాటే శాసనం. మాఇంట్లో, మాకీ డబ్బంతా సంపాదించింది మా తాతేట. అందుకని చందూ విషయంలో నేనేం చెయ్యలేన్రా."

రాజారాం వాళ్ళ మాటలకు తెల్లబోయాడు. చందూ అయితే అక్కడికక్కడే నీరుగారి పోయాడు. అసలు నిజం చెప్పాల్సి వస్తే చందూ బోల్డు డబ్బుందని వాసూ, బంటీల మీదే ఎక్కువ ఆశలు పెట్టుకున్నాడు. రాజారాం తండ్రి మామూలు ఉద్యోగి. ఇప్పటికీ రాజారాం ఇంట్లో తన గురించి జరుగుతున్న వాదోపవాదాల్ని చూచాయగా వింటూనే ఉన్నాడు. వాసూ, బంటీలిద్దరూ కూడా ఎప్పుడూ ఎంతో గొప్పగా వాళ్ళ

ఏది అడిగితే అది వాళ్ళ పేరెంట్స్ ఇట్టే ఇచ్చేస్తారని చెప్పడం విని ఒకటి రెండు రోజుల్లో వాసు విల్లాకో, బంటీ భవంతికో వెళ్ళిపోతాననే కొండంత ఆశతో వున్నాడు. అందుకే ఇప్పుడు వాళ్ళిద్దరి మాటలూ విని నీరుకారిపోయేడు. మరిప్పుడు తనేం చెయ్యాలి ... ఎక్కడికెళ్ళాలి ... ఆలోచిస్తూ పడుకున్న చందూకి సరిగ్గా నిద్రపట్టలేదు. అర్ధరాత్రి వేళ ఏవో మాటలు వినిపిస్తే పూర్తిగా మెలకువ వచ్చేసింది.

"ఎలా కుదురుతుందిరా రాజా. అతనింకా మైనరు. అతనిక్కడున్నట్టు వాళ్ళ పేరెంట్స్‌కి తెలిసి ఏ పోలీసు కంప్లైంటో ఇస్తే కిడ్నాప్ నేరం కింద వాళ్ళు మనల్ని అరెస్ట్ చేస్తారు కాస్త అర్థం చేసుకో ..."

రాజారాం తండ్రి శేఖరం మాట కాస్త గట్టిగానే వినిపిస్తోంది. ఒక్కసారిగా మంచం మీద లేచి కూర్చున్నాడు చందూ.

"మనం కూడా పొమ్మంటే వాడెక్కడికెడతాడు డాడీ ... ?"

"అది కాదు వాళ్ళిల్లెక్కడో చెప్పు. నేనూ, మామ్ వెళ్ళి అసలు సంగతేవిటో కనుక్కొస్తాం."

"వాళ్ళు వీణ్ణి ఇంట్లోంచి గెంటేసేరు డాడీ ..." రాజారాంని మధ్యలో అడ్డుకున్నాడు శేఖరం.

"చూడు రాజా. ఆవేశంలో వున్నప్పుడు మనం మనని కంట్రోల్ చేసుకోలేం. మనకి తెలీకుండానే అనకూడని మాటలు కొన్ని మన నోటివెంట వచ్చేస్తాయి. ఏ సందర్భంలో అలా అన్నారో ఆ సందర్భాన్ని మట్టి ఆ మాటని అర్థం చేసుకోవాలి. కానీ కేవలం ఆ మాటలొక్కటే తీసుకొని ఇలాంటి నిర్ణయాలకు రాకూడదు. నాకు తెలిసినంత వరకూ ఏ పేరెంట్సూ పిల్లల్ని ఇలా వొదులుకోరు. ఏదో ఆవేశంతో అన్న మాటలకి పాపం వాళ్ళిప్పుడు ఎంత బాధపడుతుంటారో ... నాకు వాళ్ళ అడ్రస్సు ఇయ్యి. వెళ్ళి మాట్లాడితే కానీ అసలు సంగతి తెలీదు కదా ... ?"

రాజారాంకి తండ్రి మాట కూడా నిజమేననిపించింది. ప్రస్తుతం అంతకన్నా వేరే మార్గం కూడా అతనికి కనిపించడం లేదు. బంటీ, వాసూ ఎప్పుడైతే చందూని వాళ్ళిళ్ళకి తీసుకెళ్ళడం కుదరదన్నారో అప్పుడే రాజారాం మనసులోనూ ఒక భావన మెదిలింది. అందరి పేరంట్సూ అంత ఖచ్చితంగా, క్రమశిక్షణంటూ పిల్లల్ని భయంతో పెంచుతుంటే తన పేరెంట్స్ ఎంత మంచివాళ్ళు. కాకపోతే తనని సరిసమానంగా కూర్చోబెట్టి అన్ని విషయాలూ ఒక స్నేహితుడికి చెప్పినట్లు చెబుతారు ... అనుకుంటూ, "మేం వాణ్ణి జంక్షనులో వదిలేసి వస్తుంటాం డాడీ ... ఆ లేన్‌లో ఏ ఇల్లో తెలీదు ..." అన్నాడు.

"పోనీ ... ఫోన్ నెంబర్ ?" ఆత్రుతగా అడిగాడు శేఖరం.

"ల్యాండ్ లైన్ నెంబర్ తెలీదు. మొబైల్ అయితే వాడి దగ్గరే వుంటుంది కదా మరీ ..." కాస్త నిరాశపడ్డాడు శేఖరం.

"సరే ... ఆ జంక్షనేదో చెప్పు. రేపెళ్ళి ప్రయత్నిస్తాం ..." అన్నాడు చివరికి.

నిద్ర మధ్యలో లేచిన చందూకి ఈ మాటలు వినపడ్డాయి. రేపో ఎల్లుండో ఎలాగోలాగ అంకుల్ తన పేరెంట్స్‌ని కలుస్తారు. వాళ్ళు ఇక్కడికి వస్తారు. ఇంటికి రమ్మంటారు. తను మళ్ళీ ఆ ఇంటికి వెళ్ళగలడా ? చందూ మనసులో ఎక్కడో దాక్కున్న ఉడుకుమోత్తనం మళ్ళీ ఒక్కసారి పైకి లేచింది. ఇంట్లోంచి పొమ్మంటున్న తండ్రి ముఖం కళ్ళముందు కనపడింది. ఆయనకి అంత కోపమెందుకో ...

తనేమైనా మహాపరాధం చేసాడా ? ఏదో ఫ్రెండ్స్‌తో కాస్త రాత్రి దాకా తిరిగితే అదేదో మహా నేరమన్నట్లు ఇంట్లోంచి పొమ్మంటారా ... ? ఏం ... సరదాలు ఈ వయస్సులో కాకపోతే ఎప్పుడుంటాయ్ ? చిన్నప్పుడు ఆయన తిరగలేదా ? తనకేం అభిమానం పౌరుషం లేవా ? వాళ్ళింట్లోంచి పొమ్మన్నంత మాత్రాన ఇంత ముద్ద పడెయ్యన ంత మాత్రాన తను బతకలేడా ? ఎక్కడికో వెళ్ళిపోయిన చందూ ఆలోచనలు అక్కడే ఆగిపోయేయి. అవును ... ఎలా బతకడం ? ఇంకా ఇక్కడే వుండి లాభం లేదు.

రాజారాం వాళ్ళకు ఇబ్బంది మాట అటుంచితే అమ్మా నాన్నా తన కోసం ఇక్కడికి వచ్చే ఛాన్సుంది. ముందిక్కడ్నుంచి వెళ్ళిపోవాలి. తర్వాత మాట తర్వాత అనుకుంటూ ఎక్కడికి వెళ్ళాలో ఆలోచించుకోకుండా ఆ తెల్లవారుఝామున ఒక్కడే నెమ్మదిగా ఆ ఇంట్లోంచి బైటపడ్డాడు.

బైట ఇంకా చల్లగా వుంది. స్వేచ్ఛగా ఎగిరిపోయే పక్షి ముందుగా తన రెక్కలు టపటపలాడించినట్లు రోడ్డు మధ్యలో నిలబడి రెండు చేతులూ చాపి పైకి కిందికీ ఆడిస్తూ గుండ్రంగా తిరిగేడు చందూ. ఎంత హాయిగా వుంది ... ఎక్కడికి వెడుతున్నావని కానీ, ఎందుకెడుతున్నావని కానీ ఇప్పుడు వెళ్ళకపోతే ఏమని కానీ, ఎప్పుడొస్తావని కానీ అడిగేవాళ్ళు లేరు. హాయిగా చేతులూపుకుంటూ, సన్నగా ఈల వేసుకుంటూ మధ్య మధ్యలో రోడ్డు మీదున్న చిన్న చిన్న రాళ్ళని తన్నుతూ అలా తోచిన వైపు నడుస్తున్నాడు చందూ.

తెల్లారేక కానీ రాజారాం వాళ్ళకి చందూ ఇంట్లోంచి వెళ్ళిపోయిన సంగతి తెలియలేదు. వెంటనే శేఖరం, దమయంతి, రాజారాం చందూ ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళేరు. చందూ ఎప్పుడూ తిరిగే సందులోకి తిరిగి అటూ ఇటూ చూసుకుంటూ

నడుస్తున్న వాళ్ళకి స్కూటర్ మీద వెడుతున్న చందూ మామయ్య చలపతి కనిపించేడు. వీళ్ళు కాలేజీలో చేరిన కొత్తలో చలపతి చందూ పుట్టిన్రోజునాడు ఓసారి చందూ స్నేహితులకి హోటల్‌లో ట్రీట్ ఇప్పించాడు. అతన్ని చూడగానే ఆత్రంగా చెయ్యూపేడు రాజారాం. చలపతి రాజారాంని గుర్తుపట్టి, విషయం విని వాళ్ళ ముగ్గుర్నీ చందూ ఇంటికి తీసికెళ్ళాడు.

శోక సముద్రంలో మునిగిపోయిన సూర్యం, సుమతి ఇన్నాళ్ళూ చందూ రాజారాం ఇంట్లో వున్నాడని తెలుసుకుని పరిపరివిధాల వాళ్ళకి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. అక్కణ్ణించి కూడా ఉదయమే వెళ్ళి పోయేడనీ తెలిసి హతాశులయ్యేరు. చలపతి ధైర్యం చెప్పేడు. "అక్కా, ఈ వూళ్ళోనే వున్నాడు కదా. అక్కడికదే సంతోషం. నేను వెతుక్కొస్తానుగా ..." అంటూ ధైర్యం చెప్పేడు. కానీ ఎక్కడని వెతుకుతాడు ? ఏమని వెతుకుతాడు.

చందూ మాత్రం చేతిలో కానీ లేకుండా ఎక్కడకని వెళ్ళగలడు ? కాళ్ళు నొప్పెట్టేదాకా రాగం తీస్తూ నడిచిన అతను కాళ్ళు కాస్త లాగుతుండేసరికి వేగం తగ్గించేడు. గెంతులు ఆగిపోయేయి. కడుపులో ఆకలి నిద్రలేచింది. జేబులో పైసా లేదు. ఎదురుగా పార్కు కనిపించింది. కొంతమంది పార్కులో పొద్దున్నే వాకింగ్ చేస్తున్నారు. అక్కడే వున్న కుళాయిలో నీళ్ళు తాగి, కడుపు చల్లబడిందనిపించాక అక్కడే వున్న బెంచీ మీద నడుం వాల్చాడు. కన్ను మూతపడింది. మళ్ళీ మెలకువ వచ్చేసరికి సాయంత్రం అవుతోంది. కడుపులో ఆకలితో పాటు చుట్టూ అలుము కుంటున్న చీకటి చూస్తూంటే చందూ మనసులోకి భయం కూడా వచ్చి చేరింది. ఇప్పుడెలాగా ? ఎక్కడికెళ్ళాలి ? ఏం తినాలి ? ఎలా తినాలి ? ఎక్కడ పడుకోవాలి? అన్నీ ప్రశ్నలే. పార్కులోంచి బైటకొచ్చి కనపడిన రోడ్డు పట్టాడతను. అది తిన్నగా మెయిన్‌రోడ్డు వైపు తీసికెళ్ళింది. ముందున్నవి పండుగ రోజులవడం వల్ల దుకాణాల నిండా జనాలు కిటకిటలాడుతున్నారు. ఆ రోడ్డు మీద వరుసగా నగల దుకాణాలు లోపలున్న నగలతో పోటీగా బైట అలంకరించిన దీపాల తోరణాలతో మిలమిలా మెరిసిపోతున్నాయి. చందూకి వెంటనే గుర్తొచ్చింది. ఈ దీపావళికి తండ్రి తనకి థౌజెండ్‌వాలా క్రేకర్స్ కొంటానన్నాడు. తల్లి తనకి ఎంతో ఇష్టమైన రసగుల్లాలు చేస్తానంది. నాలుగు రోజుల కిందటే తనని తీసికెళ్ళి మంచి జీన్స్, టీషర్టు కొన్నారు. అంత ప్రేమున్న వాళ్ళు ఇలా ఇంట్లోంచి పొమ్మనడవేమిటో ... ఛీ ... ఈ పెద్దవాళ్ళకి ఎప్పుడేం చెయ్యాలో తెలీదు. చిరాకనిపించింది చందూకి.

ఏదో ఆలోచిస్తూ నడుస్తున్న అతను వెనక నుంచి ఎవరో పరిగెత్తుకుంటూ

వచ్చి అతని చేతిలో బలవంతాన ఏదో కుక్కేసి పక్క సందులోకి పారిపోతే తెల్లబోయి చూస్తూ నిలబడిపోయేడు. వెనకాల ఇద్దరు మనుషులు పరిగెత్తుకొచ్చి చందూ చేతిలోది లాక్కుని, అతన్ని ఎడా పెడా కొట్టడం మొదలుపెట్టారు. చూస్తుండగా చుట్టూ జనాలు మూగిపోయేరు. అసలేం జరుగుతుందో అర్థం అయ్యేలోపే చందూ వంటిమీద బలంగా దెబ్బలు పడడం మొదలయ్యేయి.

పండక్కి బట్టలు కొనడం కోసం మార్కెట్‌కొచ్చిన చందూ మామయ్య చలపతి ఆ మనుషుల గుంపు చూసి సంగతేమిటా అని వెళ్ళి చూస్తే అక్కడ అందరి మధ్యలో బాగా దెబ్బలు తింటున్న చందూ కనిపించేడు. కొందర్ని బతిమాలుకొని, కొందర్ని తప్పించుకునీ, మరికొందరు కొడుతున్న దెబ్బలకు అడ్డం వెళ్ళి వాటిని తనను కూడా భరించి మొత్తానికి చందూని పావురాయి పిల్లని పొదువుకున్నట్లు తన గుండెలకు దగ్గరగా పొదువుకొని బైటకి తీసుకొచ్చేడు. మామయ్యని చూడగానే చందూకి మళ్ళీ పౌరుషం పొడుచుకొచ్చింది. విడిపించుకుందుకు గింజుకోవడం మొదలుపెట్టేడు.

చలపతి సావధానంగా చెప్పేడు. "నువ్వు నాతో రానక్కర్లేదు. నీక్కావలసిన చోటుకి వెళ్ళు. నా బండి వుంది కదా. దాని మీద దింపుతాను పద" అన్నాడు ఏమీ తెలీనివాడిలా.

చందూ తెల్లబోయేడు. అందరూ తననిలా కొడుతుంటే చూసేడే ... ఆ సంగతి ఏమిటని అడగడేం ?

చందూ చెయ్యి పట్టుకుని బండి వైపు నడిపిస్తూ "ఎటు వెళ్ళాలి ?" అన్నాడు చలపతి.

"మావయ్యా ... అసలేం జరిగిందంటే ..." అప్పటిదాకా ఉగ్గపట్టుకున్న చందూ చలపతి ఉదాసీనత చూసి ఆపుకోలేక చెప్పబోయేడు.

"ఏమైతే నాకెందుకు ? నువ్వు స్వతంత్రంగా వుండాలనుకున్నావు. ఎవరు కాదంటారు చెప్పు. అలాగే ... ఎక్కడ దింపాలో చెప్పు దించుతాను."

ఎక్కడికని చెబుతాడు చందూ. అలా నిలబడిపోయేడు. బొమ్మలా నిలబడ్డ మేనల్లుడిని చూసిన చలపతికి ఇదే తగిన సమయం అనిపించింది.

"పోనీ కాసేపు ఆ పక్కన కూర్చుందామా. తర్వాత దింపేస్తాలే నిన్ను అంటూ చందూని పక్కనే వున్న ఐస్‌క్రీమ్ షాపు వైపు నడిపించేడు.

కాసేపట్లో కళ్ళు తిరిగేలా వున్న చందూ, "మావయ్యా ... టిఫినేమైనా ..." అన్నాడు నెమ్మదిగా.

చందూ పరిస్థితి చలపతికి అర్థమైపోయింది. వీధి చివర వున్న రెస్టారెంట్‌కి తీసికెళ్ళి "కాస్త మొహం కడుక్కుని రా. చల్లగా వుంటుంది" అని చెప్పి, చందూ వాష్‌బేసిన్ వైపు వెళ్ళినప్పుడు తన మొబైల్ నుంచి ఫలానా హోటల్‌కి అక్కని తీసుకు రమ్మని సూర్యానికి మెసేజ్ పంపించి, చందూ వచ్చేటప్పటికి మామూలుగా కూర్చున్నాడు.

ఆత్రంగా రెండు ప్లేట్ల టిఫిన్ తిన్నాక కానీ చందూ తేరుకోలేకపోయాడు.

"ఇంకా ఏం తెప్పించమంటావ్ ?" అనడిగేడు చలపతి.

బాగా ఖాళీగా వున్న కడుపులో ఒక్కసారిగా అంత ఆహారం పడడంతో పొట్ట బరువుగా అనిపించింది చందూకి. వేడి వేడిగా కాఫీ పడితే కాస్త ఆ బరువు తగ్గుతుందనే ఉద్దేశ్యంతో "ఇంక కాఫీ చాలు" అన్నాడు.

ఇద్దరికీ కాఫీ చెప్పి, "ఊ ... ఇప్పుడు చెప్పు. అసలేం జరిగిందో ..." అన్నాడు చలపతి. ఎక్కడికో పారిపోయిన ఉక్రోషం మళ్ళీ పరుగెట్టుకొచ్చింది చందూ మాటల్లోకి.

"అదికాదు మావయ్యా. అలాగ నన్నింట్లోంచి పొమ్మంటే మనిషన్న వాడెవరైనా ఇంకా ఆ ఇంట్లో ఉండగలడా ?"

"నువ్వు మనిషివని ఎవరన్నారు ?" తాపీగా అడిగేడు చలపతి.

స్థాణువయ్యాడు చందూ.

"అవును. నిన్ను మనిషని ఎవడంటారు ? స్నేహితులని నమ్ముకుని ఇల్లు వదిలినవాడిని ఏమంటారో నాకైతే తెలీదు ..."

"మావయ్యా ..." ఆవేశపడబోయాడు చందూ.

"నువ్వలా ఆవేశపడకు. నిజం తెలుసుకో. ఏదో నలుగురిలో బడాయి చూపించుకుందుకు గొప్పలు చెప్పుకునే ఫ్రెండ్స్‌ని నమ్మి బైటికి పోయేవ్. ఇప్పుడేమైంది?" సూటిగా అడిగేడు.

"ఇన్నాళ్ళూ నేనున్నది ఓ ఫ్రెండింట్లోనే ..." అదే స్థాయిలో సమాధానం చెప్పేడు చందూ.

హేళనగా నవ్వేడు చలపతి. "వాళ్ళు మటుకు ఎన్నాళ్ళు పెట్టుకుంటారు ? ఒకటి రెండు రోజులంతే ... మహా అయితే ఇంకోరోజు వుంచుకునేవారేమో ... ఇప్పుడు నడి రోడ్డు మీద జరిగింది అప్పుడే మర్చిపోయేవా ... అనుకోకుండా అక్కడ నేనున్నాను కనుక సరిపోయింది. లేకపోతే ఈపాటికి నువ్వు పోలీస్ స్టేషన్‌లో వుండేవాడివి."

చలపతి మాటలకి సమాధానం దొరకలేదు చందూకి. మౌనంగా వున్న చందూని

చూసి నెమ్మదిగా అన్నాడు చలపతి. "చూడు చందూ ప్రస్తుతం మెరిసేదంతా బంగారం అనుకునే వయసు నీది. ఫ్రెండ్స్ మాటలే నిజమనుకోవడం, నీ మేలుకోరి మంచి చెప్పే వారిని శత్రువులనుకోవడం ఈ వయసులో జరిగేదే. ఆ వయస్సుని గుర్తించ కుండా మీ నాన్న నిన్ను కోప్పడ్డం పొరపాటే."

చలపతి తండ్రిని తప్పుపట్టడం, తనని సమర్థించడంగా అనుకుని చందూ మొహం కాస్త విచ్చుకుంది.

"అదుగో చూసావుగా ఆ నగలు ? ఎలా మిలమిలా మెరిసిపోతున్నాయో ... వాటికంత మెరుపు ఎలా వచ్చిందంటావ్ ?" ఎదురుగా వున్న నగల షాపులు చూపిస్తూ అడిగేడు చలపతి.

మావయ్య హఠాత్తుగా నగల మాట ఎందుకెత్తాడో అర్థంకాక, "బాగా పాలిష్ పెట్టుంటారు" అన్నాడు మామూలుగా.

"కదా ... నీ విషయంలోనూ అంతే. ప్రస్తుతం నువ్వు ముడి బంగారానివి. నిన్ను కొలిమిలో కాల్చి, మలినాలు తీసేసి, సాగదీసి, వంచి, ఆభరణం చేసి, దానిని బాగా పాలిష్ చేస్తేనే కానీ అలా షోకేస్‌లో పెట్టడానికి పనికిరావు. కంసాలి ఇవన్నీ చెయ్యలేదనుకో. నువ్వు అలా నల్లగానే ఎవరి గుర్తింపూ లేకుండా లోపలెక్కడో పడుంటావు. ప్రస్తుతం అలాగ సానబట్టవలసిన వయసు నీది. ఇప్పుడు మీ నాన్న నిన్ను గారంచేసి అలాగ సాన పెట్టలేదనుకో భవిష్యత్తులో నువ్వెందుకూ పనికి రాకుండా పోతావ్. అది మీ నాన్న బాధ ..."

ఏదో మబ్బు విడితున్నట్లనిపించింది చందూకి. "నువ్వు అన్నీ చూస్తున్నావు. ఈ నాలుగు రోజుల్లో అన్ని రకాలుగానూ అనుభవం కూడా బాగానే అయ్యుంటుంది" సూటిగా చూసేడు చందూని. మావయ్య కళ్ళల్లోకి సూటిగా కళ్ళలోకి చూడలేక కళ్ళు దించుకున్నాడు చందూ. ఇంక అంతకన్నా ఎక్కువ చెప్పకూడదనుకున్న చలపతి, "సరే ... మరిప్పుడేం చేస్తావ్ ?" అనడిగేడు. ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేక వెర్రిమొహం వేసాడు చందూ. "ఏ హోటల్‌లోనైనా సర్వర్‌గా చేరతావా ... లేకపోతే చిన్నపిల్లలకి ట్యూషన్లు చెప్తావా ..." అంటూ ఆలోచించినట్లు నటించి ... "అయినా ఇప్పటికిప్పుడు నీకు ట్యూషన్‌కి పిల్లలెక్కడ దొరుకుతారు గానీ వెంటనే దొరికేది సర్వరు ఉద్యోగమే ... నీక్కావాలంటే నాకు తెలిసిన వాళ్ళ హోటల్ వొకటుంది. చెప్పమంటే చెబుతాను ..." చలపతి మాటలు వింటున్న చందూకి ఒక్కసారిగా కళ్ళముందు చీకట్లు కమ్మినట్లయింది. అమ్మ గుర్తొచ్చింది. ఇప్పటికీ ఆకలి లేదంటున్నా సరే ముద్దలు కలిపి నోటికందించే అమ్మ కళ్ళ ముందు మెదిలింది. అలాగే అమ్మ చేతి ముద్దలు

తినే తను ఇంకొకరికి సర్వ్ చేయ్యడమా ? కడుపులోంచి దుఃఖం ఉబికుబికి రాబోయింది. ఇంతలో మెసేజ్ చూసుకున్న సూర్యం సుమతిని తీసుకుని అక్కడికి వచ్చేడు. అంతే ... అమ్మని చూడగానే అంత పౌరుషం ఎక్కడికి పోయిందో ... ''అమ్మా ...'' అంటూ సుమతి చేతుల్లోకి వెళ్ళిపోయేడు చందూ. పోయిన పెన్నిధి దొరికినట్లు ఆత్రంగా చందూని పొదువుకుంది సుమతి.

వాళ్ళిద్దరిని అలాగే చూస్తున్న సూర్యం మొహం తేటపడింది. చలపతి చెయ్యి పట్టుకుని సంతోషంతో వూపేసాడు. ఆ చెయ్యిని అలాగే పట్టుకుని కాస్త ఇవతలగా తీసుకొచ్చేడు సూర్యాన్ని చలపతి. "బావా నీకు చెప్పగలిగేవాణ్ణి కాదు. కానీ ... ఎక్కడో చదివేను. ఒక విషయం నీతో పంచుకుందామనీ ...'' అన్నాడు.

ఏమిటన్నట్లు చూసేడు సూర్యం.

"ప్రపంచ ప్రఖ్యాతి చెందిన చరిత్రకారులు అర్నాల్డ్ టాయన్ బీ రీసెర్చ్ చేసి చెప్పినమాట ఇది. మెచ్యూరిటీ అంటే పరిణతి అనేది అందరు పిల్లలకి ఒకే వయసులో రాదట. కొంతమందికి పదహారేళ్ళకే వస్తే ఇంకొంత మందికి ఇరవై ఏళ్ళకి కాని రాదుట. కాని పదహారేళ్ళకొచ్చిన పరిణతి కన్నా ఇరవై ఏళ్ళకి పరిణతి వొచ్చే వాళ్ళు జీవితంలో అనుకున్నది సాధిస్తారట. మన చందూకి మెచ్యూరిటీ రావడం కొంచెం లేటైనా భవిష్యత్తులో బాగా పైకొస్తాడు బావా. నువ్వు కాస్త ఓర్పుగా వున్నావనుకో ...'' అక్కడితో చెప్పడం ఆపేసిన చలపతి విజ్ఞతని మెచ్చుకోకుండా వుండలేకపోయాడు సూర్యం. తనకేమీ సలహాలు ఇవ్వకుండా చందూని ఆవేశంతో ఏమీ అనొద్దని చెప్పకనే చెబుతున్న చలపతి మాటలకి స్పందిస్తూ చలపతి చేతులని మృదువుగా నొక్కి వదిలేస్తూ, రాజ్యాలు గెలిచినంత ఠీవితో కొడుకు భుజం చుట్టూ చేతులేసి నడిపించు కొస్తున్న సుమతిని చూపించేడు సూర్యం ❊

**నవ్య వీక్లీ : 12-2-2014**

**నవ్యవీక్లీ - నాటా సంయుక్త నిర్వహణలో రూ. 5000/- బహుమతి పొందిన కథ**

# ఇప్పుడైనా చెప్పనీయమ్మా ...

"ఈ రోజు ఇంతటి గురుతరమైన బాధ్యత, ఇంతటి గౌరవించదగిన ఉద్యోగం నాకు లభించిందంటే దానికి ముఖ్య కారణం మా అమ్మగారు. ఆవిడ కడుపున పుట్టడం నా అదృష్టమయితే, ఆవిడ ప్రవర్తన నాకు స్ఫూర్తి అయింది. "టీ.వి. ముందు కూర్చుని, కొడుకు ఇస్తున్న ఇంటర్వ్యూ చూస్తున్న శంకర్రావు, పార్వతి ముందుకు వంగి ఇంకాస్త శ్రద్ధగా వినసాగారు.

అమెరికాలో ఒక పెద్ద సాఫ్ట్‌వేర్ సంస్థకి సి.ఈ.వో.గా ఎంపికయిన విజయ్ హుందాగా కూర్చుని యాంకర్ అడుగుతున్న ప్రశ్నలకి సమాధానాలిస్తున్నాడు. నలభై అయిదేళ్ళ విజయ్ పరిపూర్ణ వ్యక్తిత్వంతో ఆ ఫ్లడ్ లైట్ల ముందు వెలిగిపోతున్నాడు. అమెరికాలో ప్రముఖ సంస్థల జాబితాలో మొదటి నాలుగు స్థానాల్లో నిలబడే ఆ సంస్థకి సి.ఈ.ఓ.గా ఎంపిక కావడమంటే సామాన్యమైన విషయం కాదు. విజయ్ ఆ బాధ్యతాయుతమైన ఉద్యోగంలో జేరేముందు తల్లిదండ్రుల్ని కలవడానికి ఇండియా వచ్చాడు. ఒక భారతీయునికి దక్కిన గౌరవం అందరికీ చూపించాలనే ఉద్దేశ్యంతో లోకల్ ఛానల్ వాళ్ళు అతనిని ఇంటర్వ్యూ చేశారు.

అమెరికాలో దిగ్గజాల్లాంటి పోటీదారులతో పోటీపడి విజయ్ ఆ స్థానాన్ని దక్కించుకున్నాడు. మిగిలినవాళ్ళు కూడా తక్కువవాళ్ళేమీ కాదు. వారు చదివిన యూనివర్సిటీలు, తెచ్చుకున్న మార్కులు ఇతని కన్నా ఎక్కువే. కాని ఆ స్థానానికి విజయ్ ఎంపికయ్యాడు. దానికి ముఖ్య కారణం తన తల్లి అని చెపుతున్నాడు.

"ఎవరైనా విజయం సాధించినప్పుడు ఈ మాటే చెపుతుంటారు. మీరు దీనిని ఇంకాస్త వివరించగలరా ? అంటే మీ అమ్మగారు ఎంతవరకు చదువుకున్నారు, ఏమి ఉద్యోగం చేసేవారూ, మిమ్మల్ని చదివించడంలో ఆవిడ చూపించిన ప్రత్యేకమైన పద్ధతులు ఏమిటి ... ఇలాంటివన్నీ మీ ద్వారా వింటే కొంతమందైనా ఆ స్ఫూర్తి పొందుతారుకదా ..."

విజయ్ మనోహరంగా నవ్వాడు. "మా అమ్మగారి చదువు హైస్కూల్‌తోనే ఆగిపోయింది. కాలేజీలో అడుగు పెట్టకుండానే పెళ్ళైపోయింది. అమ్మగా నన్ను ఆవిడ పెంచిన తీరే నాకు స్ఫూర్తి."

చాలా శ్రద్ధగా వింటున్న శంకర్రావు మొహంలో భావాలు మారిపోయాయి. తనకన్న, తన భార్య కొడుకు అభివృద్ధికి సాయపడిందని అతను చెప్పడం ఆయనని చిన్నబుచ్చింది. పార్వతి వంక చూశాడు. ఆవిడ ఇంకా ఆ ఆనందం నుంచి తేరుకోలేదు. కాని భర్త తనని చూడగానే ముఖమ్మీద కనపడే భావం మార్చేసుకుని, మొహం ఉదాసీనంగా పెట్టేసింది.

"చూసేవా ... చూసేవా నీ కొడుకూ ... ఏవిటో ... మాట్లాడితే ఈ కొడుకు లందరూ అమ్మ అమ్మ అంటూ అమ్మ భజన మొదలెడతారు. తొమ్మిది నెలలు మోసి, కని పెంచి పెద్దచేసింది అంటూ దండకాలు చదూతారు. కడుపుతో వున్నాక కనక మానారా. పిల్లలంటూ పుట్టేక ఆ మాత్రం ఇంత అన్నం వండి వడ్డించడంకూడా ఘనకార్యమేనా ? ఏం ... వాడికి తండ్రిగా నేనేమీ చెయ్యలేదా ... పుడుతూనే ఇన్ని డిగ్రీలు తెచ్చేసుకున్నాడా ... వాడిని మంచి స్కూల్లో చేర్పించడం దగ్గర్నుంచి అప్పు చేసి అమెరికా పంపేవరకూ ఎంత తాపత్రయపడ్డానో వాడికి తెలీదా ? ఇంట్లో కూర్చుని అన్నం వండిపెట్టిన అమ్మని అంత అందలం ఎక్కిస్తున్నప్పుడు పక్కన నాపేరు కూడా కలిపి అమ్మా, నాన్నా అనొచ్చు కదా ..." లోపలినుంచి ఉబికివస్తున్న ఉడుకుమోత్తనం ఆపుకోలేకపోయాడు శంకర్రావు.

"ఏదో అందర్లాగే వాడూ చెప్పేడేమోనండి. ఇప్పటికి కూడా వాడు మీ ఎదుట ఎప్పుడైనా తలెత్తి మాట్లాడేడా ..." సమాధానపరచబోయింది పార్వతి.

సరిగ్గా అదే మాట అంది విజయ్ భార్య నీలిమ కూడా అమెరికాలో విజయ్‌తో కలిసి ఫ్యామిలీ రూమ్‌లో కూర్చుని ఈ ఇంటర్వ్యూ చూస్తూ.

"పోనీ పెద్దాయన. ఆయన్ని చిన్నబుచ్చకుండా అమ్మా నాన్న లిద్దరి పేర్లూ చెప్పొచ్చు కదండీ."

నీలిమ అడిగినదానికి తన లోపల ఎప్పట్నించో వున్న భావాలని ఆమె ముందు వెళ్ళగక్కేసాడు విజయ్. "నీలూ, నాతోపాటు మరో ఇద్దరు ఇదే పొజిషన్‌కి పోటీ పడ్డారు. గుర్తుందా ... ?"

"లేకేం ... వాళ్ళు చదివిన స్కూల్స్, తెచ్చుకున్న గ్రేడ్స్ కూడా మీకన్నా ఎక్కువే అని మీరే అన్నారుగా. మరి వాళ్లని కాదని మిమ్మల్ని ఎన్నుకున్నారంటే ఆ కంపెనీవాళ్ళు మీలో ఏదో ప్రత్యేకతని చూసేవుంటారు. బహుశా మీ నాన్నగారి నుంచి మీకు ఆ జీన్స్ వచ్చాయేమో ..." అంది.

"కాదనలేను. వంశంలో వున్న ప్రత్యేకతలు ఏడుతరాలదాకా వస్తాయంటారు. కానీ విత్తనం ఒక్కటీ సరిపోదు నీలూ ... విత్తనం ఎంత ముఖ్యమో క్షేత్రం కూడా

అంతే ముఖ్యం ... ఎంత గొప్ప విత్తనమైనా దానికి అనుకూలమైన వాతావరణం లేకపోతే మొలకెత్తదూ, ఫలించదూ కూడా. కాశ్మీర్‌లో పండే ఆపిల్స్‌ని నువ్వు హైద్రాబాదులో పండించగలవా ... ఎడారిలో పండే ఖర్జూరాలని కోనసీమలో పండించ గలవా ... అందుకే కేవలం విత్తనాన్ని బట్టే దేని అభివృద్ధీ వుండదు ...''

ఏదో కొత్త విషయాన్ని వింటున్నట్టు ఆసక్తిగా చూసింది నీలిమ. ఏదో గుర్తు చేసుకుంటూ అన్నాడు విజయ్, "నేను ఎప్పుడో ఎక్కడో చదివాను నీలూ ... జీవుడు జన్మించడానికి ముందు తనకి ఏ క్షేత్రం కావాలో చూసుకుంటాడుట. ముందు జన్మలో కలిగిన సంస్కారాలని బట్టి క్షేత్రాన్ని ఎన్నుకుంటాడుట. అలా ఎన్నుకుని ఆ గర్భాన పుట్టడం వల్ల ముందరి జన్మ సంస్కారాలన్నీ ఆ తల్లి పెంపకంలో వృద్ధి పొందుతాయట. అలాగ మా అమ్మ కడుపున పుట్టడం నేను ఒకరకంగా అదృష్టంగా భావిస్తే, ఆ తల్లి పెంపకంలో నేను పొందిన స్ఫూర్తి ఇంకోరకంగా నాకు కలిసొచ్చింది.''

"నాకేమీ అర్థం కావటం లేదు ...'' అంది నీలిమ. నవ్వాడు విజయ్. నీలిమ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ,

"అందరమ్మల్లాగా మా అమ్మ కని పెంచడమొక్కటే చెయ్యలేదు. నేను ఈ పొజిషన్‌లో నిలబడడానికి కారణం మా అమ్మ మా ఇంటిని నడిపిన తీరు. అది గుర్తించగలగడం నా అదృష్టం. పిల్లలు తండ్రి దగ్గర్నుంచి చాలా నేర్చుకుంటారు. నిజమే. కానీ అవి వాళ్ళు నేర్చుకునేవి కాస్త వయసు వచ్చాక. కానీ పుట్టినప్పటినుంచీ విషయాలు నేర్చుకునేది తల్లి పొత్తిళ్ళనుంచే. తనకి తెలీకుండానే బిడ్డ తల్లిని గమనిస్తాడు, అనుకరిస్తాడు.''

"అత్తయ్యగారు చేసిన అంత గొప్ప పనేవిటో నాకు తెలీలేదు'' అంది నీలిమ.

"చెప్తాను. సరిగ్గా విను. నువ్వు కూడా కొడుకును కన్న తల్లివే. పిల్లలను పెంచేటప్పుడు తల్లులు ఎంత అప్రమత్తతతో వుండాలో నీకే తెలుస్తుంది'' అంటూ కార్పెట్ మీద కాళ్ళు జాపుకుని కూర్చుంటూ మొదలెట్టాడు విజయ్.

"నీలూ, ఒక సంస్థకి సి.ఈ.ఓ. అంటే ఆ సంస్థని అభివృద్ధి వైపు నడిపించ గలగాలి. అందుకోసం ఎంతోమందితో, ఎన్నో రకాల పరిస్థితులలో పనిచేయించ గలగాలి. దానికి సబ్జెక్ట్ ఒక్కటే వస్తే సరిపోదు. రకరకాల వ్యక్తులలో వున్న ప్రతిభని గుర్తించి, ప్రోత్సహించి, సముదాయించి, సమాధానపరచి అలా ఎన్నో రకాలుగా ఆ ప్రతిభని వారి నుండి రాబట్టి సంస్థను పెద్దది చెయ్యాలి. ఇలా ఎలా చెయ్యాలన్నది నేను కేవలం మా అమ్మ దగ్గరే నేర్చుకున్నాను.''

తెల్లబోయింది నీలిమ. "కానీ అత్తయ్యగారు ఏమీ చదువుకోలేదు కదండీ...!''

“నిజవే. అమ్మ కాలేజీ చదువులు చదవలేదు. హైస్కూల్ చదువు పూర్తవకుండానే ఒక ఉమ్మడి కుటుంబంలోకి పెద్దకోడలిగా వెళ్ళింది” విజయ్ చిన్నప్పటి జ్ఞాపకాలన్నీ ఒకటొకటిగా నీలిమకి చెప్పసాగాడు.

“నీలూ, మా అమ్మ ఆమె పదహారేళ్ళకే అత్తగారు, మామగారు, అత్తగారి అత్తగారు, ఇంట్లోనే వుండే ఒక విధవాడపడుచూ, పెళ్ళి కాని మరో ఇద్దరు ఆడపడుచులూ, ముగ్గురు మరుదులూ వున్న ఉమ్మడి కుటుంబంలోకి కాపురానికొచ్చిందిట. మా ఆఖరి మేనత్త పెళ్ళి టైమ్‌కి నాకు పదేళ్ళు. అప్పుడే నేను మా అమ్మలోని మరో మనిషిని చూసాను. అప్పటికింకా మేం మా చదువుకోసం హైద్రాబాదు రాలేదు. మా ఊళ్ళోనే ఉండేవాళ్లం.

ఆ రోజుల్లో మా అత్తకి చూసిన సంబంధం చాలా పెద్దింటి సంబంధం. ఆ సంబంధమే చెయ్యాలని మా మామ్మ పట్టు పట్టి కూర్చుంది. అంత తూగలేనని మా తాతగారు ససేమిరా అన్నారు. నీకు తెలుసుకదా. మా నాన్నకి మేం నలుగురు పిల్లలం. అప్పటికి మా పెద్దబాబయ్య ఒక్కడే ఎక్కడో గుజరాత్‌లో ఏదో బట్టల మిల్లులో అక్కౌంటెంట్‌గా చేసేవాడు. మిగిలిన బాబయ్యలిద్దరూ ఇంకా చదువు కుంటున్నారు. మా మండువాలో ఇంట్లో వాళ్ళ మధ్య అంత పెద్ద మాటల యుద్ధం జరగడాన్ని చూడడం నేనదే మొదటిసారి. అంతా గట్టిగా ఎవరికి తోచినట్టు వాళ్ళు అరిచేసి వెళ్ళిపోయారు.

ఒక్క మా అమ్మ మాత్రం నోరిప్పి ఒక్క మాటనలేదు. అలా అందర్నీ చూస్తూ కూర్చుంది. ఆఖర్న అందరూ మా అమ్మ దగ్గరకొచ్చి ... మా తాతగారేమో “ఇదిగో కోడలుపిల్లా చెప్పు మీ అత్తగారికి. ఈ పెళ్ళి చెయ్యడంతో అవదు. తర్వాత పురుళ్ళకీ పుణ్యాలకీ యింతకింత అవుతుంది. నావల్ల కాదని ఖచ్చితంగా చెప్పెయ్యి” అంటే ... మా మామ్మేమో “ఒసేవ్, పిల్లని కలిగినింట్లో పడెయ్యాలని మీ మావగారితో చెప్పు. ఇప్పుడు గంతకు తగ్గ బొంతని ఏదో ముడెట్టేస్తే రేప్పొద్దున్న దాని పిల్లలకి పాల డబ్బాల్దగ్గర్నుంచీ మనవే కొనాలని చెప్పు” అంటే, ఇంక మా నాన్నేమో “ఏదో ... కొంతవరకు సాయం చెయ్యగలను కానీ నా స్తోమతుకి మించి నేనేమీ ఇవ్వలేను. నాకూ నలుగురూ పిల్లలున్నారు కదా ...” అన్నారు. మా బాబాయిలిద్దరూ ఏం మాట్లాడకుండా జరుగుతున్నది చూస్తూ కూర్చున్నారు.

నాకు బాగా గుర్తు. ఆరోజు సాయంత్రం పొలం నుంచి వచ్చి, కాఫీ తాగి, వీధరుగు మీద విశ్రాంతిగా కూర్చున్న మా తాతగారితో సింహద్వారం లోపలగా నిల్చుని మా అమ్మ ఏదో మాట్లాడింది. ఆ తర్వాత దేవుడి దగ్గర సంధ్యదీపం వెలిగిస్తున్న

మా మామ్మతో మాట్లాడింది. రాత్రి భోజనం వడ్డిస్తూ మా నాన్నగారితో మాట్లాడింది. మరి ఏం మాట్లాడిందో ఏమో ఆ వయసులో నాకర్థం కాలేదు కానీ మర్నాడు పొద్దున్నే ముహూర్తం బాగుందంటూ మా తాతగారు మా నాన్నగారిని వెంట పెట్టుకుని వెళ్ళి అదే సంబంధాన్ని ఖాయం చేసుకొచ్చారు. వాళ్లందరికి అమ్మేదో చెప్పిందని తప్పితే ఏం చెప్పి అందర్నీ ఒప్పించిందో ఆ వయసులో తెలీలేదు.

కాని ఒకటి మాత్రం బాగా అర్థమయ్యింది. వాళ్లంతా ఆవేశంగా వున్నప్పుడు ఎదురు చెప్పకుండా సొంతంగా వాళ్ల మాటలన్నీ మా అమ్మ వింది. తర్వాత వాళ్ల వాళ్ల ఆవేశాలు తగ్గాక ఒకరిమాట ఇంకొకరికి అర్థం అయ్యే వాళ్ల వాళ్ల భాషలో చెప్పింది. అందరు కోరుకునేది మా అత్త సుఖమేకదా ... ఆ లక్ష్యం దృష్టిలో పెట్టుకుని ఎవరు ఎలా చెపితే ఒప్పుకుంటారో అలా వాళ్ల దగ్గర మాట్లాడి ఆ పెళ్ళి స్థిరపడేలా చేసింది మా అమ్మ. అంతేకాదు ... ఆ పెళ్ళిలో కూడా ఎటువైపునుంచీ మాట రాకుండా అందర్నీ ఎంతో సమర్థవంతంగా ఒకే లక్ష్యం వైపు నడిపించింది. ఆ వయసులో అమ్మ ఎలా చేసిందో నాకు తెలీలేదు కాని ఏదో గొప్ప పని చేసిందని మటుకు అర్థమైంది. ఆ తర్వాత నుంచి అమ్మని నిశితంగా పరిశీలించడం అలవాటు చేసుకున్నాను. "విజయ్ చెపుతున్నది శ్రద్ధగా వింటున్న నీలిమ గబుక్కున లేచి, "ఉండండి. చింటూ స్కూల్ బస్ వచ్చే టైమైంది. వాణ్ణి తీసుకొచ్చేక స్థిమితంగా చెప్దురుగాని'' అంటూ డ్రైవ్ వే వైపు పరిగెట్టింది. చింటూ లోపలికి రాగానే తండ్రిని ఫ్యామిలీ రూమ్‌లో చూసి సంతోషంతో విజయ్ ఒడిలో చేరిపోయేడు. చింటూకి స్నాక్ తీసుకొచ్చి పక్కనే కూర్చుని "ఊ ఇంక చెప్పండి'' అంది నీలిమ.

"నీలూ, నీకు తెలీనిదేవుంది ... మూడు తరాల మనుషులు ఒక ఇంట్లో వుంటున్నప్పుడు తరాల మధ్య సంఘర్షణ తప్పదు. అందులోనూ వయసు పెరిగేకొద్దీ చాదస్తాలు కూడా ఎక్కువవుతాయంటారు. అలాగే మా తాతగారూ, నాన్నమ్మా వాళ్ల పట్టుదలలు అస్సలు వదిలేవారు కాదు. ఎదుగుతున్న ఆడపిల్లల్ని మా అమ్మ సరిగ్గా పెంచటం లేదని అస్తమానం మా అమ్మని, చెల్లెళ్ళని ఏదో ఒకటంటూ సాధించేవారు. వాళ్ళలా అంటుంటే మా చెల్లెళ్ళు విసుక్కునేవాళ్ళు. కాని మా అమ్మ మటుకు ఎప్పుడూ కూడా ఒకరి దగ్గర మరొకర్ని కించపరచలేదు. మా చెల్లెళ్ళ దగ్గర పెద్దవాళ్ళ మాటలని ఎలా గౌరవించాలో చెప్పేది. మా తాతగారు, నాన్నమ్మల దగ్గర మారుతున్న కాలంలో చదువుకుంటున్న పిల్లల మనస్తత్వం ఎలా వుంటుందో వివరించేది. మరి ఆ మధ్యవర్తిత్వం ఎలా నెరిపేదో కానీ ఒకరంటే ఒకరికి ప్రేమాభిమానాలు రెండింత లయ్యేలా చూసింది. అందరికన్నా ఎక్కువ సాధించేది ఇంట్లోనే వుండే మా పెద్ద

మేనత్త. ఆవిడ జీవితంలో ఏమీ అనుభవించలేకపోయింది. ఆ బాధ మరొకరి మీద ద్వేషంగా మారకుండా మా అమ్మ ఆవిడనెప్పుడూ ఏదో ఒక ఆధ్యాత్మిక చింతనలో వుంచేది. అలా వుంచడానికి మా అమ్మ ఎన్ని రకాలుగా సమర్థించుకోవాల్సి వచ్చేదో నేను గమనిస్తుండేవాణ్ణి. నీలూ, నీకో విషయం తెలుసా ?'' అడిగాడు విజయ్. ఏమిటన్నట్టు ఆసక్తిగా ముందుకు వంగింది నీలిమ.

"రక్తసంబంధీకులయితే ఎప్పుడైనా ఒక మాటనుకున్నా అదేమీ మనసులో పెట్టుకోకుండా కలిసిపోతారు. కాని బైట నుంచి వచ్చినవాళ్ళు ? అంటే మా పిన్నిలు ముగ్గురూ కూడా వేరే వేరే ఇళ్ళ నుంచి వచ్చినవారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క పద్ధతి. పెద్ద బాబయ్య దూరంగా గుజరాత్‌లో వుంటున్నా ప్రతియేడూ వచ్చి ఫలసాయంలో తన వాటా పట్టుకెళ్ళేవాడు. మిగిలినవాళ్ళు ఇద్దరూ దగ్గర ఊళ్ళలోనే పనిచేస్తుండడం వల్ల ప్రతి పండక్కీ పబ్బానికీ ఇంటికొచ్చేవారు. మా పిన్ని లిద్దరికీ ఒకరంటే ఒకరికి పడేది కాదు. మాటలు బాణాల్లా విసురుకునేవారు. ఆ మాటల్లో మా తాతగారు, నాన్నమ్మల్ని కూడా దులిపేసేవారు. మా నాన్నమ్మ అయితే ఆ మాటలు వినలేక తలపట్టుకు కూర్చునేది. ఒక్కొక్కసారి మా తాతగారైతే ఇంక ఇంట్లో అడుగు పెట్టొద్దని కూడా వాళ్లమీద అరిచేసేవారు. అలాంటి ఉత్తర దక్షిణ ధృవాలని మా అమ్మ ఏం మంత్రం వేసేదో కానీ ఏకతాటికి తెచ్చేది. నేను కాస్త పెద్దవాణ్ణయేక వాళ్ళని ఎలా కలిపేవమ్మా అనడిగితే అమ్మ నవ్వేసి ఇలా అంది.

"నాన్నా, దేనికైనా ఒక లక్ష్యమంటూ వుంటుంది. ఇక్కడ మన లక్ష్యం మనిల్లు అభివృద్ధి లోకి రావడం. అదెలా వస్తుందీ ... పిల్లలు మీరందరూ జీవితాల్లో బాగా స్థిరపడినప్పుడు వస్తుంది. మీరు ఎలా స్థిరపడతారూ. మీరైనా బాబయ్యల పిల్లలైనా నలుగురిలో మన కుటుంబం గురించి గౌరవ మర్యాదలుంటే మీకు అలాంటి ఇళ్లనుంచి సంబంధాలొచ్చి చక్కగా స్థిరపడతారు. ఒక కుటుంబ గౌరవం నిలబడాలన్నా, కూలి పోవాలన్నా కారణం ఆ ఇంటి ఇల్లాలే. ఆ ఇల్లాలి లక్ష్యం పిల్లల అభివృద్ధి అయినప్పుడు మిగిలిన విషయాలన్నీ చాలా చిన్నవైపోతాయి. పిన్నిలిద్దరికీ వాళ్ల కర్థమయ్యేటట్టు దీన్ని చెప్పడమే నేను చేసింది.

నీకింకో విషయం చెప్పనా నాన్నా ... మనుషులు సాధారణంగా దుర్మార్గులు కారు. ఒక్కొక్కసారి పరిస్థితులు వారినలా స్వార్థపరులుగా, దుర్మార్గులుగా మారుస్తాయి. మనం ఆ పరిస్థితిని సరిదిద్దాలి తప్పితే మనుషులని తప్పు పట్టకూడదు. ఇక్కడ కూడా అంతే ... పిన్నిలిద్దరూ మంచివాళ్ళే. ఎటొచ్చీ పెద్దవారైన తాతగారు తీసకునే నిర్ణయాలవల్ల వాళ్ళ పిల్లలకి ఎక్కడ అన్యాయం జరుగుతుందోనన్న భయం వాళ్లనలా మాట్లాడిస్తోంది. వారిలో ఆ భయం పోగొడితే ఎంతో కలివిడిగా వుంటారు.''

అమ్మ అన్న మాటలకి నాకు కోపం వచ్చింది. "అందుకోసం నువ్వు వాళ్ళ నంత బతిమాలాలా ? నీలాగే వాళ్ళు కూడా కోడళ్ళేకదా ... నీలాగే వాళ్ళకి కూడా బాధ్యతలు లేవా ? నువ్వెందుకు అందరిచేతా మాటలనిపించుకోవాలీ ... ?" అన్నాను. అమ్మ నవ్వింది.

"నేను ఈ ఇంటికి పెద్ద కోడలిని. అందర్నీ ఒకే తాటి మీద నడిపించడం నా బాధ్యత. ఎవరి దగ్గర ఏ సమర్థత వుందో తెలుసుకుని, సామరస్యంగా దానిని బైటికి తీసి ఇంటి అభివృద్ధికి వాడుకోవడంలోనే నా సమర్థత వుంటుంది. నువ్వేచూడు. బైట అందరితోనూ మర్యాదగా మాట్లాడి కార్యాన్ని సాధించుకొచ్చే లౌక్యం చిన్న పిన్ని దగ్గర వుంది. అందుకని ఆవిడని కథలూ కార్యాలూ అయినప్పుడు మధ్యవర్తిగా కనక వుంచితే మనం కావాలనుకున్నవి సాధించుకొస్తుంది. అదే బుల్లిపిన్నిని చూడు. మార్కెట్‌లో సరుకులుకానీ, బట్టలూ, బంగారం కానీ ఏవి ఎక్కడ నాణ్యంగా, సరసంగా వుంటాయో బాగా తెలుసు. అటువంటి పనులు ఆవిడకి అప్పగించితే మనకి నిశ్చింత. ఇంక మీ అత్త అంటావా ... ఏఏ పూజలూ, వ్రతాలూ ఎలా, ఎప్పుడు, ఎక్కడ చెయ్యాలో ... అన్నీ తెలిసిన శాస్త్రవేత్త. ఆ పెత్తనం ఆవిడకి అప్పగించామనుకో ... ఇంక ఊరూ వాడా పదినాళ్ళు చెప్పుకునేలా బ్రహ్మాండంగా చేయించేస్తుంది."

ఆసక్తిగా వింటున్న నీలిమ "ఎంత బాగా చెప్పారండీ అత్తయ్యగారు ... !" అంది. "నీలూ, నీకు ఆ మాటలు బాగున్నాయేమో కానీ అప్పుడు నాకు నచ్చలా ... అందుకే అమ్మని అడిగేసాను." "ఏమని ... ?" ఆతృతగా అడిగింది నీలిమ.

"ఏవనంటే ... మగవాళ్ల ప్రమేయమే లేకుండా ఆడవాళ్ళు ఇల్లు నడిపించెయ్య గలరంటావ్ ..." అన్నాను. "అప్పుడత్తయ్యగారే వన్నారు ?"

నీలిమ నెత్తిమీద చిన్నగా మొదుతూ, "అయ్యో పిచ్చి నాగన్నా ... అంది." కిసుక్కున నవ్వింది నీలిమ విజయ్ అన్న తీరుకి.

"ఇంకా ఏవందంటే ... ఇలా ఆడవాళ్ళూ, మగవాళ్ళూ అంటూ ఈ రోజుల్లో తేడాలు చేస్తున్నారు కానీ ... నిజంగా ఆలోచిస్తే ఇంట్లో ఆడవారి సలహా తీసుకోనిదే ఏ మగవాడూ నిర్ణయం తీసుకోడు. అలాగే ఇంట్లో నిర్ణయం తీసుకునేది ఆడవారైనా బయటికి దానిని ప్రకటించేది మటుకు మగవాడే ... అది మన సంప్రదాయం" అంది అమ్మ.

ఇదంతా ఏదో గందరగోళంగా అనిపించి నేను పెట్టిన తెల్లమొహం చూసి అమ్మ అక్కడే వున్న ఒక పౌడరు డబ్బా చేతిలోకి తీసుకుని చెప్పింది. "నీకు అర్థమయ్యేలా చెప్పాలంటే ... ఇప్పుడు మనం పౌడరు కొనుక్కోవాలనుకో ... బజారుకెళ్ళి

మంచి పౌడరు డబ్బా కోసం మనం ఎప్పుడూ వాడే మంచి కంపెనీ పేరు చెప్పి అదే డబ్బా ఇమ్మని అడుగుతాం. ఆ కొట్టువాడు అంతకన్న తక్కువ ధరలోవి వున్నాయని చూపించినా సరే మనం మంచిదనుకున్నదే అడుగుతాం. ఎందుకూ ... దానికున్న పేరుని బట్టీ. అదిగో అలాంటి పేరే సంఘంలో మంచి కుటుంబానిక్కూడా వుంటుంది. ఆ పేరే ... బైట అందరూ చెప్పుకునే ఫలానావాళ్ల కుటుంబం. అలాగే ఇంట్లో ఆడవారి సామర్థ్యాన్ని మగవాడు గౌరవిస్తే ఆ ఇంటిపేరు గొప్పగా వినిపిస్తుంది. ఆడవారు మగవాళ్ళని కాదని వాళ్ళే బైటకొచ్చి స్వతంత్రం ప్రకటిస్తే అది అంత గొప్పగా అనిపించదు. ఎందుకంటే కుటుంబమంటే ఇంట్లో వారందరూ పొరపొచ్చాలు లేకుండా కలిసి మెలిసి వుండడం. అలా వున్నప్పుడే సంఘంలో ఆ కుటుంబ గౌరవం పెరుగుతుంది. దానిని ఆడా, మగా ఇద్దరూ తెలుసుకోవాలి అన్న అమ్మ మాటలవల్లే నేను ఇక్కడ టీమ్ లీడర్‌గా రకరకాలైన వ్యక్తులను ఒకే తాటికి తేగలుగుతున్నాను.''

శ్రద్ధగా వింటున్న నీలిమ "ఎంత బాగా చెప్పారో అత్తయ్యగారు ... ఇంకా ఏమన్నారండీ ... '' అంది చింటూకి వాడు ఆడుకునే లాప్‌టాప్ ఇచ్చి. విజయ్‌కి ఇంకా చెప్పాలనే ఉత్సాహం ఇనుమడించింది.

"నీలూ, అమ్మ చేసిన పనుల్లో అన్నింటికన్న నాకు బాగా నచ్చింది ఒకటి చెప్పనా ?'' నీలూ ఆసక్తిగా చూసింది.

"మా పెద్ద చెల్లెలు లక్ష్మి తెల్సుకదా ... చాలా తెలివైంది. అన్నింట్లోనూ ఫస్ట్ మార్కులే దానికి. బాగా చదువుకుని, ఉద్యోగం చేస్తూ, దాని కాళ్లమీద అది నిలబడాలని లక్ష్మి ఆశయం. కానీ డిగ్రీ పరీక్షలవగానే ఒక మంచి సంబంధం చూసి పెళ్ళి నిశ్చయించేరు మా నాన్నగారు. ఇంక చూస్కో దాని బాధ ... నాన్నగారి ఎదురుగా నిలుచుని మాట్లాడలేదు ... భయం. అమ్మని పట్టుకుని సతాయించేసింది. ఆఖరికి ఆ వయసులో వుండే ఆవేశంతో పెళ్ళి చేస్తే చచ్చిపోతానని కూడా బెదిరించింది. దాని మాటలన్నీ ఓపిగ్గా వింది అమ్మ. లక్ష్మిని నెమ్మదిగా మాటల్లో పెట్టింది. పెళ్ళనేది ఏ వయసులో చేసుకుంటే బాగుంటుందో చెప్పింది. ఇదివరకటి రోజులు కావనీ, పెళ్ళయ్యాక కూడా చదువుకుని, ఉద్యోగం చేసుకోవచ్చనీ, అందుకోసం తను అన్ని విధాలా లక్ష్మికి సహాయంగా వుంటానని మాటిచ్చి, పెళ్ళికొప్పించింది.''

విజయ్ చెప్పింది ఆసక్తిగా వింటున్న నీలిమ "లక్ష్మి చదువుకి అత్తయ్యగారెలా సాయం చేసేరు ?'' కుతూహలంగా అడిగింది.

"చాలా చేసింది. పెళ్ళైన రెండేళ్ళూ లక్ష్మికి అత్తవారింటి పరిస్థితులకి అలవాటు పడడానికి సరిపోయింది. తర్వాత రవిగాడు పుట్టాడు. వాడు పుట్టాక ఎమ్.ఏ.

పరీక్షలు రాసింది లక్ష్మి. సత్య పుట్టాక బి.ఇడి., ఎమ్.ఇ.డి. కూడా చేసింది. అన్నింట్లోనూ మంచి మార్కులు తెచ్చుకుంది. అన్ని పరీక్షలప్పుడు కూడా అమ్మ లక్ష్మి పక్కనే వుండి, పిల్లల్ని తను చూసుకుని, చాలా రకాలుగా సాయం చేసి తన మాట నిలబెట్టుకుంది. లక్ష్మి పిల్లలు స్కూలుకి వెళ్లడం మొదలెట్టాక అది ఓ కాలేజీలో లెక్చరర్‌గా చేరింది. రెండేళ్ళు అక్కడ చేసేక అమ్మే సలహా ఇచ్చి లక్ష్మి చేత ఒక స్కూల్ పెట్టించింది. అలా మొదలుపెట్టిన ఆ స్కూలే ఇప్పుడు శారదా విద్యాలయం. కె.జి. టు పి.జి. అనే పెద్ద విద్యాసంస్థ అయింది. వీటన్నింటి వెనకా లక్ష్మి వెన్నంటే అమ్మ కూడా వుంది. అలాగ ఇంట్లో గొడవలేమీ జరగకుండా సరైన సమయంలో లక్ష్మికి పెళ్ళిచెయ్యడం, లక్ష్మి కోరిక తీరడానికి తను వెన్నంటే వుండడం ఇవన్నీ అమ్మ చేసినవే నీలిమా. అదే స్ఫూర్తి నాక్కూడా. మన ముందున్న అవకాశాన్ని మనకి అనుకూలంగా మార్చుకోవడమన్నది నేను అమ్మ దగ్గర నేర్చుకున్నదే ..." భావోద్వేగంతో అన్నాడు విజయ్.

ఒక అద్భుతాన్ని వింటున్నట్టు వింది నీలిమ. "అత్తయ్య గారి గురించి మీరీ విషయాలేవీ ఇన్నాళ్ళూ చెప్పలేదేవండీ ... ?" అంది.

తేలిగ్గా ఊపిరి విడుస్తూ, "మగవాణ్ణి కదా నీలూ ..." అన్నాడు. అర్థం కానట్టు చూసింది. "ఎంత కాదన్నా మగవాడికి ఆ ఈగో వుంటుందనుకుంటాను. అందుకే అమ్మ గురించి ఎవరు చెప్పినా నవమాసాలు మోసి కంది ... అని చెపుతారు తప్పితే వారి వ్యక్తిత్వం తల్లి వల్ల రూపు దిద్దుకుందని చెప్పలేరు. ఎందుకంటే అలా చెపితే తండ్రి ఏమైనా ఫీలవుతాడేమోననుకుంటారు. అలా తండ్రిని చిన్నబుచ్చడం తల్లికి కూడా ఇష్టముండదు కనక ఆ గొప్పదనాన్నంతా తండ్రికే ఆపాదిస్తారు. నవమాసాలు మోసి కనడం గొప్ప విషయమే కానీ దానితోపాటు ఆ తల్లి నేర్పిన పాఠాలు కూడా వ్యక్తి జీవితాన్ని నిర్దేశిస్తాయి."

"కాని ఈ విషయాలు నాకిన్నాళ్ళూ తెలీవండీ." అంది నీలిమ.

"నీలాగే చాలామంది దీన్ని గురించి ఆలోచించరు. అందుకనే నీలూ చెప్తున్నాను. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక కుటుంబమనే బండి సజావుగా సాగి ప్రయాణం సాఫీగా సాగాలంటే కుటుంబం అందరూ కూర్చునే బండి తొట్టె అనుకో, ఇంటి యజమాని చక్రం అనుకో ... ఆ చక్రాన్నీ, బండినీ సరిగ్గా సమన్వయపరచే ఇరుసే ఆ ఇంటి ఇల్లాలు. బండికి చక్రం మరీ బిగుసుకుపోయినా బండి నడవదు. వదులైపోయినా రెండింటి బేలన్స్ కుదరదు. అలా కాకుండా బండినీ, చక్రాన్నీ బాలన్స్ చేసి నడిపేది అమ్మ. అలాగే ఏ కంపెనీ అయినా కూడా. కంపెనీ బండి అయితే,

అందులో ఉద్యోగులు చక్రం అయితే రెండింటినీ సమన్వయపరచి నడిపించేవాడే సీ.యీ.వో. ఇలా అమ్మ దగ్గర నేర్చుకున్న పాఠాలు ఏ బిజినెస్ స్కూల్‌లోనూ చెప్పరు. ఇప్పుడిప్పుడే కంపెనీల పేర్లతో పాటు ఆ కంపెనీల సి.ఈ.వో.ల పేర్లు కూడా చెప్పుకుంటున్నట్టే తండ్రి పేరుతో పాటు తల్లిపేరు కూడా గుర్తించే రోజులొచ్చాయి. దానికి ఎవరో ఒకరు నాంది పలకాలి కనక నేను మొదలెట్టాను అంతే ..."

నీలిమ ఆలోచించింది. "మరి మీ నాన్నగారు చిన్నబుచ్చుకోరూ ..."

విజయ్ ఆలోచించి నెమ్మదిగా అన్నాడు. "ఊహు ... చిన్నబుచ్చుకోరు. ఆయనకీ ఈ విషయం తెలుసు. కాని తనంతట తను బైట పెట్టలేరు. నేను పెట్టాను కదా. సంతోషిస్తారు తప్పితే ఏమీ అనుకోరు. ఒకవేళ వెంటనే కాస్త చిన్న బుచ్చుకున్నా అర్థం చేసుకుంటారు" అన్నాడు.

ఇంతలో ఫోన్ మోగింది. ఆ రింగ్ ఇండియానుంచే. విజయ్ వెంటనే తీసి "అమ్మా ..." అన్నాడు. అటునుంచి పార్వతమ్మ నిశ్శబ్దంగా వుండిపోయింది. అర్థమై పోయింది విజయ్‌కి. "ఇంటర్వ్యూ చూసేరామ్మా ... ?" అనడిగాడు. సమాధానం చిన్నగా వినిపించింది. "చూశాం నాన్నా ... కానీ ... నువ్వలా చెప్పకుండా వుండాల్సింది."

గదిలోంచి మాట్లాడుతున్న పార్వతమ్మకి హాల్లో ఎక్స్‌టెన్షన్ ఫోన్లో వింటున్న శంకర్రావు కనిపిస్తున్నాడు.

"ఫరవాలేదమ్మా ... నాన్నగారి గురించైతే నీకేమీ బెంగక్కర్లేదు. ఆయనకన్నీ తెలుసు. అర్థం చేసుకుంటారమ్మా ..." అన్నాడు విజయ్. "కానీ..." అంది పార్వతమ్మ.

"అమ్మా, అమ్మ గురించి కనీసం నన్ను ఇప్పుడైనా చెప్పనీయమ్మా ... !" అన్నాడు విజయ్ ప్రాధేయపూర్వకంగా.

కొడుకు మాటలకి హాల్లోంచి వింటున్న శంకర్రావు మొహంలో చిన్న నవ్వు తొంగిచూసింది.

ఆ చిరునవ్వు చూసిన పార్వతమ్మ మొహం మందారంలా విచ్చుకుంది ❊

**అక్షర - 13వ ఆటా మహాసభల జ్ఞాపక సంచిక; జులై 2014**

**వాకిలి : అంతర్జాల పత్రిక, ఆగస్ట్ 2014**

ఆటా (అమెరికన్ తెలుగు అసోసియేషన్) 13వ కన్వెన్షన్ సందర్భంగా
నిర్వహించిన కథల పోటీలో ప్రత్యేక బహుమతి

# మరోకోణం ...

అది నగరంలా రూపు దిద్దుకుంటున్న పట్టణం. ఆ పట్టణంలో ఆ పెద్దమేడ ప్రభుత్వంలో మంచి అధికార పదవి నిర్వహించి రిటైరయిన దక్షిణామూర్తిది. సమయం సాయంత్రం నాలుగు గంటలైంది.

దక్షిణామూర్తి తను అప్పటిదాకా రాసుకున్న కాగితాన్ని మరోసారి చూసుకుని సంతృప్తిపడి ఈజీచెయిర్‌లో నెమ్మదిగా వెనక్కి వాలాడు. ఈరోజు కోసం ఎంత శ్రమించాడూ ... ఎంతమందిని పైరవీ చేయించాడూ ... ఎంతమంది సవాళ్ల నెదుర్కొన్నాడూ ... మొత్తానికి అనుకున్నది సాధించాడు. అందరూ పూజించే దేవతలనే మరో కోణంలో చూపించాడు.

ఇది ప్రజాస్వామ్యం కనుకా ... ఇక్కడ ప్రతి వ్యక్తికీ భావప్రకటనా స్వాతంత్ర్యం వుంది కనుకా ఇప్పటికైనా తన ప్రయత్నం ఫలించింది. ఈరోజు టౌన్ హాల్లో కేంద్రమంత్రి ఢిల్లీ నుంచి స్వయంగా వచ్చి తనకి సాహిత్యంలో ఎంతో గొప్పదైన ఈ సాహితీ పురస్కారాన్నందజేస్తున్నారు. దక్షిణామూర్తి తనకీ పురస్కారాన్నందజేసిన వాళ్లందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటూ రాసుకున్న కాగితాన్ని మరోసారి సంతృప్తిగా చూసుకుని టైమ్ చూసుకున్నాడు. అప్పుడే నాలుగు దాటిపోయింది ... ఇదేవిటి ... సావిత్రి ఇంకా ఇవాళ కాఫీయే తేలేదు అనుకుని, "సావిత్రీ ... కాఫీ ..." అంటూ గుమ్మం వైపు వెళ్ళాడు. తలుపులు వేసి కనిపించాయి. ఇదేవిటి ... పట్టపగలు రూమ్ తలుపులు వేసున్నాయీ అనుకుని, బహుశా బైట చప్పుళ్లతో తను డిస్టర్బ్ కాకుండా ఉండడానికి సావిత్రే వేసుంటుంది అనుకుంటూ మళ్ళీ "సావిత్రీ ... కాఫీ ..." అంటూ గట్టిగా పిలిచాడు.

ఎక్కడా బదులు లేదు. తలుపులు తీసుకుని హాల్లోకి వెళ్ళబోయాడు. రాలేదు. అవి బైట నుంచి గడియ పెట్టి ఉన్నాయి. అంటే తను లోపలున్నాడని తెలిసి బైట గడి వేసిందా సావిత్రి ... లేక ... మరింక ఆలోచించకుండా "సావిత్రీ ... సావిత్రీ ..." అని గట్టిగా పిలిచాడు. బైట కిటికీ దగ్గర తల్లి శాంతమ్మ కనిపించింది. "అమ్మా, సావిత్రి నేను లేననుకుని బైట గడియ పెట్టేసింది. కాస్త తియ్యి ..." అన్నాడు.

"సావిత్రి పెట్టలేదురా గడియ. నేనే పెట్టాను" శాంతంగా చెప్పింది శాంతమ్మ. ఆశ్చర్యపోయాడు.

"నువ్వా ? సరే పోన్లే ... నన్ను చూసుండవు. తొందరగా తలుపు తియ్యి. సన్మానసభకి టైమ్ అవుతోంది. అదెక్కడుందో కాస్త వేడిగా కాఫీ ఇవ్వమను."

శాంతమ్మ గడియ తియ్యలేదు సరికదా దక్షిణామూర్తి అన్న మాటకి జవాబు కూడా చెప్పకుండా వెళ్ళిపోయింది. తెల్లబోయాడతను.

"సావిత్రీ ... సావిత్రీ ..." గట్టిగా పిలిచాడు. ఈసారి అతని భార్య సావిత్రి కిటికీ దగ్గరకొచ్చింది.

"సావిత్రీ ... ఏంటిది. తలుపుతియ్యి. అవతల టైమ్ అవుతోంది ..." సావిత్రి నెమ్మదిగా స్థిరంగా చెప్పింది. "నేను తియ్యను. నేనే కాదు. అత్తయ్యగారు కూడా తియ్యరు. మీరు ఈ సభకి వెళ్ళటం లేదు అంతే ..." గంగవెర్రులెత్తాయి అతనికి.

"మీకేమైనా పిచ్చెక్కిందా ? అవతల ఢిల్లీ నుంచి మంత్రులొస్తున్నారు. ఇంత పెద్ద పురస్కారం నా ఊళ్ళో నాకిస్తున్నారు. పిచ్చి వేషాలు మాని తలుపుతియ్యి ..."

"వాళ్ళు తలుపు తియ్యరు బావా. అంతేకాదు ... ఆ సభ కూడా జరగటం లేదు ... కాదు కాదు జరగనివ్వటం లేదు ..." అప్పుడే అక్కడికొచ్చిన దక్షిణామూర్తి బావమరిది లక్ష్మీపతి చెప్పాడు. మతిపోయింది దక్షిణామూర్తికి. "ఏమిటీ ... ?"

"అవును ... ఏం పుస్తకం రాసేవు బావా నవ్వు ? రోజూ నువ్వు పూజించే దేవతల గురించి అలాంటి విపరీతార్థాలు తియ్యడం నిన్ను నువ్వు మోసం చేసుకుంటున్నట్టు కాదూ ... ?

"ఇందులో మోసం యేముంది ? ఆ రోజుల్లో ఇంగ్లీషు చదువు చదువుకుని దొరల దగ్గర వుద్యోగం చేసేవారు యింట్లో వారు చేసుకునే నిత్యకర్మలు మానుకున్నారా? లేదుకదా. యిది అలాంటిదే."

"అది వుద్యోగం బావా. జీతం తెచ్చుకుని కుటుంబాన్ని పోషించాలి. ఇది అలా కాదే. నువ్వు రాసినట్లు కనక మనుషులు ఆలోచించడం మొదలుపెడితే అసలు మన సంస్కృతే దెబ్బ తింటుంది. వేల సంవత్సరాల నుంచి కాపాడుకుంటూ వస్తున్న మన సంస్కృతిని, ముఖ్యంగా వేరే యే మతంలోనూ లేని గొప్ప సంస్కృతిని ... మట్టిలో కలిపేసినట్టే కదా బావా ?" మరి కాస్త ధైర్యం చేశాడు లక్ష్మీపతి.

"ఇప్పుడీ సంస్కృతి వుండి యెవరి నుద్ధరించిందట ? వేదం చదువుకుని బాగుపడ్డవాడినొక్కడిని చూపించు."

"అదే బావా మన సంస్కృతిలో గొప్పదనం. ఏదైనా జ్ఞానం సంపాదించుకుని తన కుటుంబాన్ని పోషించుకుని, తాను గొప్పవాడైపోవాలని మన పెద్దలు ఎప్పుడూ చెప్పలేదు. మనవాళ్ళు ఏం చెప్పినా సమాజం బాగు కోసమే చెప్పారు. ఏమనంటే

"నువ్వు సంపాదించిన విద్యాజ్ఞానం వలన నువ్వు గొప్పవాడి వవాలని అనుకోకు. అది తరతరాలకీ పంచు. ధనం ముఖ్యం కాదు. జ్ఞానం ముఖ్యం" అని. అందుకే ఎన్ని దండయాత్రలలో నలిగిపోయినా సనాతన ధర్మం యింకా యిలా నిలబడి వుందీ అంటే ఆ జ్ఞాననిధులు తరతరాలుగా నిస్వార్థంగా దానిని కాపాడుకుంటూ వస్తున్నందు వలనే. ఈ రోజుల్లో అసలే మన సంస్కృతి గొప్పదనం చాలామందికి తెలీదు. కాస్తో కూస్తో తెలిసినవాళ్ళు కూడా నీలాంటి వాళ్ళు రాసే విపరీతార్థాల వలన ఏదో మూల వున్న కాస్త విలువా పడిపోయే స్థితికొచ్చింది."

"ఛావమను ఛాందసులను. అసలు మన హిందూ మతమంతా ఛాందస వాదమే..."

"బావా, అన్నీ చదువుకున్నవాడివి. నువ్విలా అనడం బాగులేదు. హిందూ మతమంటూ లేనిదాన్ని చెప్పకు. మనకి వేదాల్లో, శాస్త్రాల్లో చెప్పిందంతా హిందూ జీవన విధానం మాత్రమే. అంతటి ఛాందసులే కనక మన హిందువులయితే షిరిడీ సాయిబాబాని దేవుడిగా కొలుస్తారా ? ఒక మంచి ప్రవర్తన కలిగిన మనిషి ఏ మతం వాడయినా పూజింపదగ్గవాడే అని మన హిందూ ధర్మం చెప్తుంటే వాళ్ళని ఛాందసు లంటావేంటి ? గుడ్డిగా ఏవో నాలుగు మాటలు చెప్పి అవే పాటించి తీరాలనే వాళ్ళ లాంటి వాళ్ళం కాదు మనం."

"చూడూ ... నలుగురిలో పేరు రావాలంటే కొత్త విషయం ఏదయినా చెప్పాలి. మనం ఇప్పుడు కొత్త విషయం ఎక్కడ ఆలోచించగలం ? అందుకే పాత విషయాన్నే కొత్త కోణంలో చెప్పాలి. ఆ విషయం కూడా అందరికీ బాగా తెలిసినదై వుండాలి. అందుకనే మనం రోజూ పూజించే పురాణాల్లోని దేవతలను మరో కోణంలో చూపించాను. చూడు, రెస్పాన్స్ ఎంత బాగుందో."

"కాని ఇది చదివినవాళ్ళు ఊరుకుంటారంటావా ?"

"ఊరుకోకపోతే ఉరేసుకోమను ..."

"వాళ్ళు ఉరేసుకోరు. నీ ఇంటిమీద కొస్తారు, కాసుకో ..."

"యేడిసేరు. మనవాళ్ళలో అంత ఐకమత్యం యెక్కడేడిసిందీ ... ?" హేళనగా నవ్వాడు దక్షిణామూర్తి.

"బావా, పొరపాటు పడుతున్నావ్, ఇలాంటి పనులవల్ల అందరూ లోపల్లోపల ఉడికిపోతున్నారు. ఎప్పుడో ఉప్పెనలాగ మీద పడతారు. అయినా ఊరివాళ్ళదాకా ఎందుకూ ... నిన్నిప్పుడీ గదిలోపెట్టి బంధించింది నీ తల్లీ, నీ భార్యే ... ముందు వాళ్ళకి సమాధానం చెప్పుకో ..." నిలదీసాడు లక్ష్మీపతి.

తల్లి వైపు చూసేడతను. దుర్గామాతలా కనిపించింది అతని కళ్ళకామె.

"నువ్వు సంస్కృతాంధ్రాల్లో అంత పండితుడివే. మనం రోజూ పూజించే దేవతలపై ఇలాంటి విపరీతార్థాలు ఎలా తీసేవురా ... ?"

"అమ్మా, నిన్నా పుస్తకాలు ఎవడు చదవమన్నాడు ? మనం ఇంట్లో చేసుకునేవన్నీ మన నమ్మకాల బట్టి వుంటాయి. బైట ప్రపంచం చూడు ఎంత మారిపోతోందో. దానికి తగ్గట్టు మనం బైట వేషం వెయ్యకపోతే ఈ అవార్డులూ గట్రా ఏముండవు. బైటవాళ్ళకి చెప్పేవి వేరే వుంటాయి ... మన నమ్మకాలు వేరే వుంటాయి. దేనికదే..."

"పండితులైనవారు సమాజానికి హితమైన రచనలు చెయ్యాలంటారే ... మరి మీరు అందరూ అసహ్యించుకునే రచన ఎందుకు చేసేరు ?" సూటిగా ప్రశ్నించింది భార్య సావిత్రి.

'మీ అర్థంలేని ప్రశ్నలకి నేనేం జవాబివ్వక్ఖర్లేదు కానీ ... ముందు తలుపు తియ్యండి. అవతల పెద్ద మనుషులు వచ్చేసుంటారు" గింజుకున్నాడు దక్షిణామూర్తి.

నవ్వాడు లక్ష్మీపతి. "బావా ... అక్కడ ఏ పెద్దమనుషులూ లేరు. జనాలు ఎవ్వర్నీ ఊళ్ళోకి అడుగు పెట్టనివ్వలేదు. పెట్టిన వాళ్లని కూడా గెస్ట్‌హౌస్‌లోంచి బైటకి రాకుండా హౌస్ అరెస్ట్ చేసేశారు. టౌన్ హాల్లో కుర్చీలు విరగ్గొట్టారు. తెరలు చించేసారు. అంతా అల్లకల్లోలం చేసేసారు. అంతేకాదు. ఊళ్ళో సభకొచ్చే పెద్ద మనుషుల్ని కూడా రాకుండా చేసేరు."

"ఏడిసేరు. నాకు చేసే సన్మానం చూడలేకపోతే రావడం మానెయ్యి. అంతేకాని వెధవ కబుర్లు చెప్పకు."

"కావాలంటే నువ్వే ఫోన్ చేసి చూసుకో ..." సవాల్ చేశాడు లక్ష్మీపతి.

ఫోన్ ఎత్తి చైన్లు ఇంటికి ఫోన్ చేసేడు. ఎవరూ ఎత్తలేదు. సభకి అధ్యక్షత వహించే ఆ ఊరి పెద్దమనుషుల్లో ఒకరైన రామలింగేశ్వర్రావు గారికి ఫోన్ చేశాడు. వాళ్లబ్బాయి ఎత్తేడు ఫోన్. "మీ నాన్నగారు సభకి బయల్దేరేరా ... ?" అడిగాడు.

"మా నాన్నగారు ఊళ్ళో లేరండీ" ఆశ్చర్యపోయేడు. "అదేవిటీ, ఇవాళ సన్మాన సభ ఉంది కదా, మీ నాన్నగారే కదా ఆ సభకి అధ్యక్షులు !"

"ఏమోనండీ ... నాకేవీ తెలీదు. అరగంట క్రితమే అర్జంటు పనుందని పక్కూళ్ళో ఉన్న మా బాబయ్యగారింటికి వెళ్ళేరు."

అవతల ఫోన్ పెట్టేసిన శబ్దం వినిపించింది. వెంటనే ఆ సభలో మాట్లాడే ఇంకో పెద్దమనిషికి ఫోన్ కలపబోయేడు దక్షిణామూర్తి. లక్ష్మీపతి ఆతన్ని ఆపి "ఇంకెవరికి చేసినా ఎవరూ ఫోన్ తియ్యరు బావా. వీళ్ళైతే ఊర్లోంచే పారిపోయేరు. ఇంకొంతమంది ఇంట్లో ఉండి కూడా లేరని చెప్పిస్తారు ..." అన్నాడు.

"అదే ఎందుకని ?" గట్టిగా అరిచాడు దక్షిణామూర్తి. "ఎందుకంటే నువ్వు రాసిన పుస్తకం ప్రభావం మరి ..." వెక్కిరింతగా అన్నాడు లక్ష్మీపతి.

ఉరిమి చూశాడు దక్షిణామూర్తి. "ఎవరు ... ఎవరిదంతా చేస్తున్నది ?" కోపంగా అడిగాడు దక్షిణామూర్తి. ఆవేశంతో ఊగిపోయాడు లక్ష్మీపతి.

"నువ్వు ఎందుకూ పనికిరారంటున్న వాళ్ళే. ఐకమత్యం లేదని నువ్వు ఎద్దేవా చేసినవాళ్ళే. మన సంస్కృతిని పూర్తిగా నమ్మినవాళ్ళు. ఆ సంస్కృతిని తూచా తప్పకుండా ఆచరిస్తున్నవాళ్ళు. అలా ఆచరిస్తున్న వారిని ఆరాధిస్తున్నవాళ్ళు. ఇంట్లో చేసేదే బైట చెప్పేవాళ్ళు. వీళ్లందరూ ఈరోజు ఒక్కటయ్యారు. ఏళ్ళతరబడి రాజుకుంటున్న నిప్పు ఇవాళ భగ్గుమంది. ఎంతకాలం ఊరుకుంటారు ? ప్రతివాడికీ వాడి టైమ్ ఎప్పుడో ఒకప్పుడు వస్తుంది. ఇప్పుడు వీళ్ళ టైమ్ వచ్చింది. ఈ ఊరివాళ్ళే కాదు ... ఈ జిల్లా మొత్తం నుంచి మనుషులొచ్చారు. బావా, ఇప్పుడో ఇంకాసేపట్లోనో నీ ఇంటి మీదకీ వస్తారు. వాళ్ళకి క్షమాపణ చెప్పి, ఇంక ఇలాంటి పుస్తకాలు రాయనని ప్రమాణం చెయ్యి బ్రతికిపోతావ్ ..."

"నేనా ... ?"

"అవున్రా అబ్బాయ్. మామాట విను. లక్ష్మీపతి చెప్పినట్టు చెయ్యి. ఆ రాముడు నిన్ను కాచుకుంటాడురా ..."

"నేనిప్పుడే పోలీసులకి ఫోన్ చేస్తాను" ఆవేశంగా ఫోన్ వైపు నడుస్తున్న దక్షిణామూర్తి బైట నుంచి గట్టిగా కేకలు వినిపిస్తే కిటికీ లోంచి చూశాడు.

బైట మహాసముద్రం ఉరికి వస్తోందా అన్నట్లుగా కనిపించింది ఆ జనసముద్రం దక్షిణామూర్తి కళ్ళకి. ఆమడ దూరంలో ఉన్న నాలుగు వీధుల కూడలిలో గుమిగూడుతున్న ఆ జనం ఎప్పుడైనా కట్లు తెంచుకువచ్చి మీదపడేంత పోటు మీద ఉన్నట్టున్నారు. ఇంకా ఇంకా అటూ ఇటూ జనాలు వచ్చి ఆ సంద్రానికి చేరుతూనే ఉన్నారు. చేత్తో పట్టుకున్న కర్రలని పైకెగరేసి పట్టుకుంటూ, "జై శ్రీరామ్ ..." అని కేకలు పెడుతూ ముందు కురుకుతున్న వాళ్ళను చూస్తుంటే నోట మాట రాలేదు దక్షిణామూర్తికి. తల్లినీ, భార్యనీ చూస్తూ గట్టిగా అరిచాడతను. "తలుపు తియ్యండర్రా ..." అంటూ.

"వాళ్ళు తియ్యరు బావా. ఇది వారిలోని మరోకోణం ..." లక్ష్మీపతి నవ్వాడు.

మరింక దిక్కుతోచక పూజగది వైపు తిరిగి ఆ శ్రీరామచంద్రుని శరణు కోరదామనుకునేంతలోనే గేట్లు తోసుకుని ఇంట్లో ప్రవేశించిందా జనసముద్రం ❋

**ఆంధ్రభూమి, ఆదివారం : 11-1-2015; కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి**

# ప్రత్యక్షసాక్షి

నేను కాలాన్ని చూపించే యంత్రాన్ని. ఈ ఇంటితో నాకు గల సంబంధం యిప్పటిది కాదు. అబ్బో ... ఎప్పుడో ... ఈ దేశానికింకా స్వతంత్రం రాని రోజుల్లో ఈ ఇంటికొచ్చాను నేను. చెన్నపట్నం నుంచి స్వయంగా కొనుక్కొచ్చారు ఇప్పటి ఇంటి పెద్దైన రంగారావు గారి తండ్రిగారు రామయ్యగారు. ఈ ఇంట్లో పెద్ద సింహ ద్వారానికి ఎదురుగా వున్న గుమ్మానికి పైన జాగ్రత్తగా పెట్టించారు. రోజూ నన్ను శుభ్రంగా తుడిచి, కీ ఇవ్వడానికి ఒక మనిషి ఉండేవాడు. అప్పట్నించీ ఇప్పటివరకూ ఈ హాల్లో జరిగే సంభాషణలన్నింటికీ ప్రత్యక్షసాక్షి నేనే. చూడ్డం, వినడం మటుకే నా వంతు. జరుగుతున్న కార్యాలకి స్పందించడం, నా వాదన వినిపించడం నాకు తెలీని విద్యకదా ...

అబ్బో ... ఆ రోజుల్లో ఏ పెద్దపని తలపెట్టాలన్నా ఆ కార్యక్రమానికి కావలసిన చర్చలన్నీ ఇక్కడే జరిగేవి. ఊరి విషయాలే కాదు ఇంట్లో జరగాల్సిన కార్యాలూ, కథలకీ కూడా చర్చలు ఇక్కడే జరిగేవి.

ఇప్పటి కుటుంబ పెద్ద రంగారావు గారి పెళ్ళి దశరథరామయ్య గారమ్మాయితో స్థిరపరిచినప్పుడు ఇక్కడే నిశ్చయ తాంబూలాలు పుచ్చుకున్నారు. రంగారావు గారు చెయ్యెత్తు మనిషి. గంభీరమైన కంఠస్వరం. ఇప్పటికి కూడా ఆయనలో ఆ హుందాతనం కాస్త కూడా తగ్గలేదు. పొద్దున్నే యోగాభ్యాసం చేస్తారు. స్నానం, పూజా అయ్యాక ఈ హాల్లోనే కూర్చుని వూరి విషయాల్లో వూర్లోని పెద్దలకి సలహా లిస్తారు.

ఆయన భార్య అన్నపూర్ణమ్మ. మహా దొడ్డ ఇల్లాలు. సార్ధక నామధేయురాలు. ఇంటికి ఎవరొచ్చినా వట్టిచేతులతో పంపే మనిషి కాదావిడ. భర్తకు తగిన భార్య. తనకున్న విద్యాజ్ఞానంతో ఒక్కగానొక్క కొడుకునీ చక్కటి విలువలతో పెంచిందావిడ. మన ప్రవర్తన ఎదుటి మనిషిని బాధపెట్టకూడదని ఆవిడ పదే పదే నూరిపోసేది. పరువే ప్రాణంగా, నలుగురికి లేదనకుండా ఇవ్వడమే ధర్మంగా జీవన ధర్మాన్ని సాగిస్తున్నారా దంపతులు.

ముఖ్యంగా రంగారావు గారికి చదువంటే ప్రాణం. ఊళ్లో తండ్రి పేరు మీద

స్కూలు కట్టి నడుపుతుండడమే కాకుండా, పై వూళ్ళకి చదువులకోసం వెళ్ళే వాళ్ళకి సిఫారసు ఉత్తరాలు, ఫీజులకి డబ్బూ కూడా ఇచ్చేవారు. "విద్య యొసగును వినయంబు ..." అన్న మాటని పూర్తిగా విశ్వసిస్తారాయన. సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు భాషల్లోని ప్రముఖ పుస్తకాలన్నీ ఆయన చదివారు. ఏ పుస్తకం చదివినా అందులో ఎక్కడ మంచి వుందో గ్రహించి ఆచరించే మనిషాయన.

వాళ్ళ ఒక్కగానొక్క కొడుకు రాఘవరావు. తండ్రి మంచిగుణాలన్నీ పుణికి పుచ్చుకున్నాడు. తల్లిలోని ఆదరించే గుణాన్ని అలవరుచుకున్నాడు. అతని పెళ్లి ముచ్చట్లు కూడా ఈ హాల్లోనే జరిగాయి. తనతో కలిసి రీసెర్చ్ చేసే అమ్మాయిని ప్రేమించి, ఇరువైపులా పెద్దల అనుమతితో పెళ్ళి చేసుకున్నాడు. కోడలి చదువునీ, సంస్కారాన్నీ చూసిన అతని తల్లిదండ్రులకి ఈ పెళ్ళి వద్దనడానికి కారణం కనిపించ లేదు. కొడుకూ కోడళ్ళిద్దరూ హైద్రాబాదులో పేరుపొందిన లాబరేటరీల్లో పెద్ద సైంటిస్టులుగా పనిచేస్తున్నారు. వాళ్ళు ఇవాళ పొద్దున్నే వాళ్ళ కొడుకూ, కూతురితో సహా వచ్చారు. కూతురు ప్రసన్న పసిడి మొలక. నవరత్నాల మూట. మొన్ననే పద్దెనిమిది వచ్చాయి. చూడడానికి ఎంత చక్కగా వుంటుందో తెలివితేటల్లో అంతకు మించింది. ఏ పరీక్ష రాసినా ఫస్టుమార్కు తప్పితే మరోటి రావడం ఆ అమ్మాయికి అలవాటు లేదు. పెద్దలని గౌరవించడం, విద్యని ఒక తపస్సుగా అభ్యసించడం ఆమెకి ఆ ఇంట్లో ఆనవాయితీగా వచ్చాయి.

మరింక కొడుకు కింకా పదిహేనేళ్ళు దాటలేదు. వచ్చీ రాని మీసంతో, చిన్నవాళ్లతో వుండాలో పెద్దవాళ్ళ జట్టులో చేరిపోవచ్చో తేల్చుకోలేకుండా వున్నాడని పించింది.

ప్రయాణ బడలిక తీరగానే అందరూ హాల్లో సమావేశమయ్యారు. ఏదో పెద్ద చర్చలాగే వుంది. జాగ్రత్తగా వినాలనుకుంటుంటే ... అదిగో రాఘవ మొదలు పెట్టనే పెట్టాడు.

"ఈ సంవత్సరం ప్రసన్నకి పెళ్ళి ప్రయత్నాలు చేద్దామనుకుంటున్నాం నాన్నా. ఆ విషయం మీతో చెప్పాలనే ఇలా పనికట్టుకొచ్చాం ..."

వింటున్న పెద్ద వాళ్ళిద్దరూ తెల్లబోయారు. ఇంకా పద్దెనిమిదేళ్ళూ కూడా నిండలేదు. చక్కగా చదువుకుంటోంది. బుద్ధిమంతురాలు. తల్లిదండ్రులిద్దరూ బాగా చదువుకున్నవాళ్ళు. చదువు విలువేంటో తెలిసున్నవాళ్ళు. కూతురి చదువు గురించి ఎన్నెన్నో గొప్ప ఊహలు వాళ్ళకుండేవి. అటువంటివాళ్ళు ఇంత అకస్మాత్తుగా ఈ నిర్ణయానికి ఎందుకొచ్చేరో అర్థం కాలేదు.

"అసలేం జరిగిందిరా ? ఏమైనా ..." నానుస్తూ అంది కాస్త తేరుకున్న అన్నపూర్ణ.

"ఛ ... ఛ ... అలాంటిదేమీ లేదమ్మా. దాని నేమైనా అనుకుంటే మనకే మహాపాతకాలూ చుట్టుకుంటాయి." కూతురి మీద తండ్రికున్న నమ్మకం ఎంత గొప్పదో అనిపించింది. "మరి ..."

తల్లిదండ్రుల ప్రశ్నను అర్థం చేసుకున్నాడు రాఘవ. "ఈమధ్య ఎవరో అబ్బాయి ప్రసన్న వెంటపడి గొడవ చేస్తున్నాడుట నాన్నా ..."

"అయితే ..." అన్నట్టు చూసిన తండ్రివైపు సూటిగా చూడలేక నేలచూపులు చూస్తూ అన్నాడతను.

"నేను ముందు ఏదో చిన్నతనం కదా ... అతనే కొన్నాళ్ళు పోతే వూరుకుంటాడు అనుకుని ప్రసన్నని కూడా ఏమీ రియాక్ట్ అవొద్దని చెప్పాను. కానీ రోజులు గడుస్తున్న కొద్దీ అతని వేధింపులు ఎక్కువవడంతో ఏం చెయ్యాలో తెలీక నన్ను సలహా అడిగింది. ప్రసన్న బాధ అర్థం చేసుకుని నేను స్వయంగా అతన్ని పిలిచి మాట్లాడాను. చదువుకునే వయసులో ఈ ప్రేమలూ అవీ మంచివికావు. ముందు జీవితంలో స్థిరపడ్డాక అప్పుడు చూసుకుందాం అన్నాను. కానీ ఆ కుర్రాడు నా దగ్గర ఏమీ మాట్లాడకుండా ప్రసన్నని రోజూ అక్కడికీ యిక్కడికీ వెడదాం రమ్మని వేధించడం మొదలు పెట్టాడట. రానంటే బెదిరించడం, రోడ్డుమీద నలుగురిలో మీద మీదకి రావడం, అనూహ్యంగా ప్రవర్తించడం చేసేవాడుట. ఈ గొడవ ప్రసన్న మళ్ళీ నాతో చెప్పగానే నేను వెళ్ళి ఆ కుర్రాడి తండ్రిని కలిసాను. అతను అధికారం చేతిలో వున్నవాడు. నలుగురి ఎదుటా ఏమీ మాట్లాడలేక నేను చెప్పింది విని పంపించేసాడు. కానీ ప్రసన్నకి ఆ కుర్రాడి బాధ మటుకు తప్పలేదు. కాలేజీ ప్రిన్సిపల్‌కి చెప్పాను. లేడీస్ కాలేజీ కదా. బైట జరిగే గొడవలకి వాళ్లకి బాధ్యత లేదని స్పష్టం చేసింది. ప్రసన్న రోజూ కాలేజీకి వెళ్ళి రావడానికి చాలా భయపడేది. రోజూ నేనుకానీ, రమకానీ దింపి వెడుతుండేవాళ్లం" శ్రోతలు రాఘవ చెప్పింది శ్రద్ధగా వింటున్నారు.

"క్రితం నెల తనని ప్రేమించకపోతే కత్తితో పొడుచుకు చచ్చిపోతానని ప్రసన్న ఎదురుగుండా చేతిమీద కత్తితో గాటు పెట్టుకున్నాడుట. పాపం ... భయపడిపోయి వారంరోజులు కాలేజీ మానేసింది. నేనూ, రమా నెమ్మదిగా ధైర్యం చెప్పి దింపి వస్తున్నాం. క్రితం వారం కాలేజీ గేటు దాటి బైటకి రాగానే యాసిడ్ బాటిల్ చూపించాడుట. నయం ... రమ ఆ టైమ్‌కి వెళ్ళింది కనక సరిపోయింది కానీ లేకపోతే ఎంత అఘాయిత్యం జరిగిపోయుండేదో ..."

రాఘవ మాటలు వింటున్న పెద్దవాళ్ళు తెల్లబోయారు.

"వాళ్ళింట్లో పెద్దవాళ్ళు ఏం చెప్పలేదా అతనికి ?" అన్నపూర్ణమ్మ అడిగారు.

"వాళ్ళ ఇంటి విషయాలు మనకేం తెలుస్తాయీ ? నాకు తెలిసినంతమటుకు ఇదివరకు ఇలాగే ఆ కుర్రాడి మీద ఎవరో కంప్లైంట్ యిస్తే పోలీస్ స్టేషన్ నుంచి కొడుకుని విడిపించుకొచ్చిన మనిషని విన్నాను."

"ఇంత అరాచకమా ... ?" రంగారావు గారు తెల్లబోయారు.

"ఇంతకన్న ఘోరాలు జరిగిపోతున్నాయి. మీ పూజలూ, పుస్తకాలే మీకు తప్పితే మరొకటిలేదు కనక బయట ఏం జరుగుతోందో మీకు తెలీటంలేదు."

"అదికాదురా ... ఆ కుర్రాడు కూడా చదువుకుందుకే కదా కాలేజీకి వెళ్ళేది ..." అడిగారాయన.

"లేదు నాన్నా. కొంతమంది కుర్రాళ్ళు ఎలా వున్నారంటే వాళ్ళు చెప్పిందే ఎదుటివాళ్ళు వినితీరాలన్నట్టుంటున్నారు. ఎంత రౌడీయిజం చేస్తే ఫ్రెండ్స్ ముందు అంత గొప్ప. వాళ్ళని అనుకుని ఏం లాభం, కొంతమంది తండ్రులు ఎలా వున్నారంటే పధ్నాలుగేళ్ళకే కొడుక్కి మోటార్ సైకిలిచ్చేసి ఘనకార్యం చేసినట్టు ఫీలయిపోతున్నారు. అది నడిపేవాడి కెంత ప్రమాదమో రోడ్డు మీద నడిచేవాళ్ళకి కూడా అంతే ప్రమాదమని.

వాళ్లకి తెలీటం లేదు. రోజూ ఎన్ని యాక్సిడెంట్లు అవుతున్నాయో తెలుసా ..."

అన్నపూర్ణమ్మగారు అడిగింది.

"అదికాదురా రాఘవా, మీరిద్దరూ చదువుకున్నవాళ్ళు. చదువు విలువ మీకు తెలుసు. నీ కూతురా ... సాక్షాత్ సరస్వతీ అవతారమే. ఎంతో బాగా చదువు కుంటోంది. మొన్నటిదాకా నా కూతుర్ని ఫారిన్ పంపించి డాక్టరేట్ చేయిస్తానన్న వాడిని, ఇలా అర్థాంతరంగా చదువు మానిపించి పెళ్ళి చేసేస్తానంటే దానిలో వున్న ప్రతిభంతా ఏమైపోవాలిరా ?"

"అమ్మా, ఇప్పుడు రోజులు మారిపోయేయమ్మా. మా రోజుల్లో ఇలా వుండేది కాదు. మేం చదువుకునే రోజుల్లో క్లాసులో తొంభై మందికి చదువు మీద ఆసక్తి, గురువంటే గౌరవభావం వుండేవి. కేవలం పదిమందికి మాత్రమే అల్లరి చిల్లరిగా తిరిగేవాళ్ళుండేవారు. కానీ, ఇప్పుడిలా కాదు. కేవలం పదిమంది మాత్రమే చదువుని తపస్సుగా భావించి కాలేజీలకొస్తున్నారు. మిగిలిన తొంభై మంది ఫీజులు కట్టేస్తే చాలు. అదే చదువనే ధోరణిలో వున్నారు. వాళ్లకి చదువు విలువ తెలీదు. చిన్నచూపు. ఇంట్లో చిన్నప్పట్నించీ వాళ్ళేదడిగినా తప్పూ, ఒప్పూ చెప్పకుండా తెచ్చి చేతిలో పెట్టే తల్లితండ్రులున్నారు. తప్పు చేస్తే డబ్బు వెదజల్లి కప్పుకునేవాళ్ళున్నారు. ఎంతసేపూ

నేను కోరుకున్నది కావాలి అన్న ధోరణి తప్పితే వాళ్ళు ఎదుటి మనిషిని సాటిమనిషిగా కూడా చూడరు.''

ఆశ్చర్యంగా వింటున్న తల్లిదండ్రులని చూసి రాఘవ ఇంకా యిలా చెప్పాడు. "అలా పిల్లలడిగినవన్నీ కావల్సినవీ, అక్ఖర్లేనివీ కూడా కొనిస్తుంటే ఇలా కాక ఇంకెలా జరుగుతుందీ ? పిల్లల దృష్టిలో తల్లీ తండ్రీ వాళ్ళడిగినవన్నీ ఇచ్చే యంత్రాలు. గురువులు కామిక్ కారెక్టర్లు. ఇప్పుడొస్తున్న ఏ సినిమా చూడు ... గురువుని ఎన్ని రకాలుగా హేళనచేస్తూ, హింసిస్తూ వుంటారో స్టూడెంట్స్. ఈ పిల్లలందరికీ అవే కాలక్షేపాలు. అమ్మనీ నాన్ననీ వెక్కిరించడం, ఆడపిల్లల్ని అల్లరి పెట్టడం ... టీ.వి.ల్లో, సినిమాల్లో ఎక్కడ చూసినా ఇలాగే వుంది. మనింట్లో పిల్లలకి ఇవేవీ తెలీవు. ఇప్పటికీ మనం అమ్మా నాన్నని గౌరవించు, టీచర్ చెప్పినమాట విను అని చెప్తాం. కానీ ప్రస్తుతం ఈ విలువలకి విలువలేదు నాన్నా. ఇలాంటి విలువలున్నవాళ్ళు చేతకానివాళ్ళు, బతకడం తెలీనివాళ్ళు, పాతకాలం వాళ్ళు. బతుకంటే తమకి కావల్సినది తెచ్చుకోవడమే అనుకున్న వాళ్ళ మాటే ఇప్పుడు చెల్లుతోంది. ఇలాంటప్పుడు పిల్లల్ని స్కూళ్ళకి, కాలేజీలకి పంపించి చదివించడమంటే ఎంత భయంగా వుంటోందో తెలుసా అమ్మా ...''

"స్కూలు కేమైందిరా ... ?''

"స్కూలు కేమైందా ? నీ మనవడు సారథి నైన్త్ క్లాస్‌లో వున్నాడా ? వాడి గురించి రమ ఉద్యోగం రిజైన్ చేసేసింది.''

"ఏవిటీ ? రమ ఉద్యోగం రిజైన్ చేసిందా ?'' ఆశ్చర్యంగా రమ వైపు చూసారు. రమ తలవంచుకుంది. రమ తెలివైనది, చురుకైనది. కెమిస్ట్రీలో డాక్టరేట్ తీసుకుంది. లాబ్‌లో సైంటిస్ట్‌గా చేరాక చాలామందిలా చేస్తున్న ఉద్యోగంతో తృప్తి పడకుండా ఇంకా ఏమైనా చెయ్యాలనే తృష్ణతో కొత్త కొత్త విషయాలు చదువుతూ, రాస్తూ వుంటుంది. విజ్ఞానమన్నది కేవలం డబ్బు సంపాదించడానికి మాత్రమే కాదనీ, కొత్త విషయాలు తెలుసుకుని ఆ విజ్ఞానానికి తనవంతు చేయగలిగింది చేయాలనీ అనుకుంటూ వుంటుంది. అలా అనుకునే మనిషి ఉద్యోగానికి రిజైన్ చెయ్యడమా? నమ్మలేకపోయారు. అత్తమామలకి నెమ్మదిగా వివరించింది రమ.

"క్రితం నెల సారథి కోసం వాడి స్కూల్‌కి వెళ్ళానండీ. అంతకు నెల ముందరే రెండుసార్లు రెండు అయిదువందలు దేనికో కావాలని కట్టించుకున్నారు స్కూలువాళ్ళు. ఆనెల మళ్ళీ అయిదొందలు అడిగితే అసలు సంగతేమిటో కనుక్కుందామని స్కూల్‌కి వెళ్ళాను. వాళ్ళ క్లాస్ టీచర్‌ని కలిసి అడిగితే అసలు వాళ్ళు ఏ డబ్బూ తెమ్మని

చెప్పనేలేదుట. నాకు అర్థం కాలేదు. సారథి అబద్దం చెప్పడని నా విశ్వాసం. అందుకే ఆ టీచర్‌ని రెట్టించాను. నా ఆదుర్దాని టీచర్ అర్థం చేసుకుంది. సారథిని పిలిచి అడిగింది. అప్పుడు వాడు కథంతా చెప్పుకొచ్చాడు.

సారథి ఫ్రెండ్ కంప్యూటర్ మీద ఆడుకుందుకు సారథి ఒక గేమ్ సిడి అతనికి ఇచ్చాడుట. మర్నాడు ఆ ఫ్రెండ్ సారథిని నిలదీసి, నువ్విచ్చిన సీడి పెట్టేసరికి మా కంప్యూటర్ అంతా వైరస్ వచ్చేసింది. మా డాడీ పెట్టుకున్న డేటా అంతా పోయింది. దాన్ని బాగుచెయ్యడానికి డబ్బులు కావాలి. నీ సీడీ వల్లే ఇలా అయింది కనక ఆ డబ్బులు నువ్వే ఇవ్వాలని దబాయించాడుట. పాపం వీడు బెదిరిపోయి అప్పటికి నాలుగు నెలల్నించి ఇంట్లో ఆమూలా ఈమూలా పెట్టిన డబ్బులు ఎవరూ చూడకుండా తీసికెళ్ళి ఆ ఫ్రెండ్ కిచ్చేవాడుట. కొన్నాళ్ళకి అవికూడా సరిపోక ఆ ఫ్రెండు గొడవ పడితే అసలు సంగతి చెప్పకుండా టీచర్ తెమ్మందని నా దగ్గర తీసికెళ్ళడం మొదలు పెట్టాడు. రెండుసార్లు ఇచ్చి మూడోసారి టీచర్‌ని కలుద్దాం అని వెళ్ళినప్పుడు ఆ టీచర్ నా అనుమానం చూసి క్లాసులో పిల్లలందరితో మాట్లాడితే ఈ విషయం బైట పడింది. సారథి దారి తప్పుతున్నాడని నాకు చాలా బాధగా అనిపించింది. ఏదో వాడికి మార్కులెలా వస్తున్నాయో తెలుసుకుంటున్నాను తప్పితే వాడు ఎవరితో ఫ్రెండ్‌షిప్ చేస్తున్నాడో తెలుసుకోకపోవడం వల్ల కదా ఇదంతా జరిగిందీ అనిపించింది. వాడు దొంగతనం చేస్తున్నా, అబద్ధాలాడుతున్నా తెలుసుకోకపోవడం తల్లిగా నా బాధ్యతని పక్కన పెట్టడం వల్లే కదా అనిపించింది. ఇటువంటి సమయంలోనే సారథితో వెంట వుండి మంచీ చెడూ చూసుకోకపోతే రేప్పొద్దున్న వాడి ఫ్రెండ్స్ వాడిని ఇంకెలా తయారుచేస్తారో. వీడి ప్రవర్తన మాతో పాటు మేం ప్రసన్నతో బాధపడుతున్నట్టు మరో తల్లిదండ్రుల్ని కూడా బాధపెట్టే హక్కు మాకెక్కడుంది ? వెంటనే ఉద్యోగం మానేసి వాడిని కనిపెట్టుకుని వుంటున్నాను. ఈ రెండేళ్ళూ కాస్త జాగ్రత్తగా చూసుకుంటే దారిలో పడతాడని అలా చేశాను."

విషయం వింటున్న రంగారావుగారికీ, అన్నపూర్ణమ్మ గారికీ నోట మాట రాలేదు. రాఘవ అందుకున్నాడు. "చూసావా అమ్మా ... ఇలా వున్నారు స్కూల్లో చదువుకునే పిల్లలు. కంప్యూటర్ నాలెడ్జ్ వుంది తప్పితే దానిని సక్రమంగా ఉపయోగించు కోవాలన్న ఇంగితం లేదు. తప్పు వాళ్లది కాదు. ఈ వ్యవస్థ అలా వుంది. పొద్దున్న రెండు గంటలు స్కూల్‌కి వెళ్ళేముందు, రాత్రి మూడు గంటలు నిద్రపోయేముందు తప్ప పిల్లలు పగలంతా బైట ఫ్రెండ్స్ తోనే గడుపుతారు. ఆ వయసులో వాళ్ళకి మంచీ చెడ్డా తెలీదు. తెలియచెప్పే సావకాశమూ లేదు. అసలు ఈరోజుల్లో మంచీ చెడూ అన్న మాటలకి అర్థాలే మారిపోయాయి తెల్సా ! తనకి నచ్చిందే మంచి, నచ్చనిది చెడు అనే ఇప్పుడందరూ అనుకుంటున్నారు. ఎవరికి నచ్చినట్టు వాళ్ళు ప్రవర్తిస్తున్నారు.

దేనికీ ఒక రూలంటూ లేదు. ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎవరైనా పొరపాటున రూలు వుందీ అని చెప్తే దానిని అతిక్రమించినవాడే గొప్పవాడవుతున్నాడు. వాడికే అందరూ జేజేలు కొడుతున్నారు. బైట పరిస్థితులు ఇలా వున్నప్పుడు మన పిల్లల్ని మనం దగ్గరుండి ప్రతివిషయం చూసుకోవాలి కదమ్మా ..." రాఘవ ప్రశ్నకి బదులు చెప్పలేక పోయారు ఆ దంపతులు. ఉండబట్టలేక ప్రసన్నని అడిగారు, "ఏం తల్లీ, నువ్వే మనుకుంటున్నావమ్మా ... ?" అంటూ.

ప్రసన్న నెమ్మదిగా నోరు విప్పింది. "నాకు చదువంటే చాలా ఇష్టం నాన్నమ్మా. కానీ ఆ అబ్బాయి చేసే గొడవ చూస్తుంటే భయంగా వుంది. మనకి నచ్చకపోయినా వాళ్ళకి నచ్చినందుకు మనం వాళ్ళు చెప్పినట్టు వినాలా నాన్నమ్మా ? అయినా డాడీ నాకు ఏది బాగుంటుందో అదే చేస్తారుకదా ... అందుకని డాడీ ఏం చెపితే అదే చేస్తాను."

చెప్పలేక చెప్పలేక చెప్పారు అన్నపూర్ణమ్మగారు. "ఏమిటోరా ... ఒకప్పుడు ఆడపిల్లలు చదువుకుందుకు పరిస్థితులు అనుకూలించక మానుకునేవారు. సంఘ సంస్కర్తల పుణ్యామా అని ఆ అవరోధాన్ని అధిగమించారు. రాజ్యాంగం వల్ల రిజర్వేషన్ల సౌకర్యం వచ్చింది. తల్లిదండ్రులు మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలకి కూడా బోలెడు డబ్బు ఖర్చు పెట్టి చదివిస్తున్నారు. ఇలాంటి సమయంలో ఇలా అర్థాంతరంగా సాంఘిక భద్రత కోసమంటూ ఆడపిల్ల చదువు మధ్యలో ఆపేస్తున్నారంటే బాధగా వుంది. రేప్పొద్దున్న చదువుకోలేదని అది బాధపడుతుందేమోరా ..."

రాఘవ కూడా బాధపడుతూనే అన్నాడు. "చదువంటూ కాలేజీకి పంపిస్తే నా కూతురు నాకు దక్కదేమోనన్న భయం వేస్తోందమ్మా. చదువు లేకపోయినాసరే నా కూతురు ప్రాణాలతో వుంటేచాలు. ప్రాణమే పోయే పరిస్థితి వచ్చినప్పుడు చదువుకన్నా నేను నా కూతురు ప్రాణానికే ప్రాధాన్యమిస్తానమ్మా ..."

ఒక్కసారి హాలంతా నిశ్శబ్దం ఆవరించుకుంది. అందరి గుండెలూ చెప్పరాని దిగులుతో నిండిపోయినట్టు వాతావరణం బరువుగా కనపడింది.

నేను కాలాన్ని. నాకు అసలు స్పందన అనేదే వుండదు. కానీ, నాలుగు తరాల చదువు, పెళ్ళిళ్ళ చర్చలు ఇలా హాల్లో నా కళ్ళముందే జరుగుతుంటే ఈ సమాజం పురోగమిస్తోందో, తిరోగమిస్తోందో అర్థంకాని పరిస్థితిలో వాళ్ళ చర్చలకు నిశ్శబ్ద సాక్షిగా నిలబడిపోయాను ❊

**జాగృతి : 26-10-2009**

**వాకాటి పాండురంగారావు స్మారక కథల పోటీలో ప్రత్యేక బహుమతి**

# మునిమనవడి సంబరం

**“నా**కు తెలీకడుగుతానూ ... కోడలు కడుపుతో వుంది కదా ... ఓ వేడీ వెచ్చనా, ఓ మందూ మాకూ, ఓ పద్ధతీ పాడూ చెప్పడానికి ఓ సారి రండి అత్తయ్యగారూ ... అని మాటవరసకైనా అందా మీ కోడలూ ... ?”

భర్త విస్తట్లో మరికాస్త వంకాయ బండపచ్చడి వేస్తూ అంది మహాలక్ష్మమ్మ. ఆవిడ ధోరణి అలవాటైన సీతారావయ్య సమాధానం చెప్పకుండా కమ్మటి వంకాయ పచ్చడి రుచిని చక్కగా ఆస్వాదిస్తున్నాడు.

“అలా బెల్లం కొట్టిన రాయిలా వుండకపోతే నేనన్న మాటకి సమాధానం చెప్పొచ్చుగా ...” మనసులో చుట్టుకుపోతున్న బాధని కాస్త గట్టిగా వెళ్ళగక్కిందావిడ. చిన్నగా నవ్వాడాయన.

“ఎంతైనా నీకు నీ కోడలంటే మహా మురిపమోయ్ ...”

చిర్రెత్తుకొచ్చింది మహాలక్ష్మికి. “ఒకవైపు నేను దాన్ని తిడుతుంటే అదంటే నాకిష్టమంటారా ... ?”

“మరి కాపోతే ... ఎంత ప్రేమ లేకపోతే ఇరవైనాలుగ్గంటలూ ఆ ప్రభనే తల్చు కుంటావ్ ?”

“నేనేం తల్చుకోవట్లేదు. తిట్టుకుంటున్నాను.”

“ఏదైతేనేం ... ఎంతసేపూ నీకు కోడలి ధ్యాసే కదా. అవునోయ్ ... కాస్త ఆ ధ్యాస భగవంతుడి వైపు తిప్పితే పుణ్యమూ, పురుషార్థమూ వస్తాయి కదా ...”

మహాలక్ష్మి అడిగిన దానికి ఆయనెప్పుడూ సూటిగా సమాధానం చెప్పరు. ఆవిడని వేళాకోళంగా ఏదో మాట అని, దానికి ఆవిడ ఉడుక్కుంటే ఆయనకి బాగుంటుంది. అందులోనూ ఆ పల్లెటూళ్ళో, ఆ మండువా ఇంట్లో పనిచేసిపోయే పాలేళ్ళు తప్పితే వీళ్ళిద్దరే ఒకళ్ళకొకళ్ళు కాలక్షేపం. పెద్దకొడుకు పతంజలి హైదరాబాదులో బాంక్ ఆఫీసరు. వాళ్లకి ఒక్కడే కొడుకు పవన్. అక్కడే సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నాడు. కొడుకూ, కోడలూ, మనవడూ, అతని భార్య హారిక అందరూ కలిసే ఉంటున్నారు. ఇప్పుడు ఆ మనవడి భార్య కడుపుతో ఉంది. అదే ఆత్రం

మహాలక్ష్మి కిప్పుడు. పెద్దదాన్ని ఉన్నాను కదా ... కాస్త కోడలు తనని పిలిచి సలహా తీసుకోవచ్చు కదా అని ఆవిడ బాధ.

ఎప్పుడో ఉమ్మడి కుటుంబంలో తను తన అత్తగారి దగ్గర అగ్గగ్గలాడిపోతూ కాపరం చేసినట్టు తన కోడలు ప్రభావతి కూడా ఉండాలని ఆవిడ కోరిక. కాని మహాలక్ష్మమ్మ కొడుకు బాంక్‌లో ఉద్యోగంలో చేరినప్పట్నుంచీ ప్రభావతి మొగుడై పోయేడు. అత్తగారింటికొచ్చి ఉమ్మడి కాపురంలో ఉండే అవసరం లేదు కనుక ప్రభావతి మొగుడితో ఉద్యోగం ఊళ్ళో కాపరం పెట్టి తన స్వతంత్రం ప్రకటించుకుంది. అలాగని ఆవిడ పెద్దరికాన్ని ఎప్పుడూ అగౌరవపర్చలేదు. ప్రతి చిన్న విషయానికీ అత్తగారిని సంప్రదించకుండా ఉండదు. సలహా అయితే అడుగుతుంది తప్పితే తనకి తోచిందే చేస్తుంది.

మహాలక్ష్మమ్మ గారి రెండో కొడుకు గురుమూర్తి ఇరవై ఏళ్ళ క్రితమే పై చదువుల కంటూ అమెరికా వెళ్ళి అక్కడే స్థిరపడిపోయేడు. రెండో కోడలు కూడా ఉద్యోగస్తురాలే. సెలవులు దొరకడమే అపురూపం. ఆ దొరికిన పదిరోజుల్లో పుట్టింట్లో నాల్రోజులూ, అత్తింట్లో నాల్రోజులూ ప్రయాణం నాల్రోజులుగా రెండు మూడేళ్ళకోసారి నడుపుకుంటూ వస్తోంది. వాళ్ళకిద్దరు అమ్మాయిలు. ఇండియా వచ్చినప్పుడు "గ్రానీ" అంటూ చుట్టూ తిరుగుతారు. వెళ్ళేక మరి మాటామంతీ ఉండదు. అసలైన అమెరికన్ జాతీయు లయిపోయేరు.

మహాలక్ష్మమ్మగారి పెద్దకూతురు అన్నపూర్ణకి అప్పటి రోజుల్ని బట్టి హైస్కూల్ చదువవగానే పెళ్ళి చేసేసేరు. సరిగ్గా తల్లి లాగే ఉమ్మడి కుటుంబంలో పెద్దకోడలు. ఆనందంగా బాధ్యతలు తలకెత్తుకున్న ఆమెకి పుట్టింటి కన్న అత్తింటితోనే అనుబంధం ఎక్కువైపోయింది. ఏ పురిటికో, పండక్కో పుట్టింటికి వచ్చినా పబ్బం గడుపుకుని వెళ్ళిపోతుంది. ఎంతసేపూ అత్తింటి ఆరాటమే.

ఇంక రెండో కూతురు శారద. బియ్యే అవగానే పెళ్ళిచేసేరు. అల్లుడికి భిలాయ్ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం. వాళ్లకిద్దరు ఆడపిల్లలు. ఏ ఏడాదికోసారో ఆంధ్రా వైపు వస్తారు. అందుకే మహాలక్ష్మమ్మకి పెద్దకొడుకూ, కోడలూ, మనవడితోనే రాకపోకలు ఎక్కువ.

ఎప్పుడైనా ఓమాట అనుకున్నా కూడా ప్రభావతి తన కొడుకుకి వేడీ వెచ్చనా బాగా చూస్తుందనీ, మనవడిని బాగా పెంచుతుందనీ మహాలక్ష్మమ్మకి బాగా తెలుసు. ఏదైనా ఒకమాట అంటే ఆవిడే అనాలి తప్పితే ప్రభావతిని ఇంకెవరైనా ఏదైనా అంటే ఆవిడ ఆడపులిలా వాళ్ళమీద పడిపోతుంది. ప్రభావతీ అంతే. అత్తగారి చాదస్తానికి

విసుక్కుంటుంది తప్పితే తమ కుటుంబమంటే అత్తగారి కెంత ప్రేమో ప్రభావతికి తెలుసు. అందుకే వాళ్ళిద్దరూ ఎప్పుడైనా మాటా మాటా గట్టిగా అనుకున్నా కూడా తండ్రీ కొడుకూ కల్పించుకోరు. ఇప్పుడు మునిమనవడి రాకకోసం ఎదురుచూస్తోంది మహాలక్ష్మమ్మ.

మహాలక్ష్మమ్మ పొద్దున్నే పనంతా పక్కన పెట్టేసి పంచాంగం ముందెట్టుకుని శ్రద్ధగా చూస్తోంది. అంతకుముందే ప్రభావతి ఫోన్ చేసింది. కోడలు కులాసాగానే తిరుగుతోందనీ, వాళ్ల పుట్టింట్లోనే ఉందనీ, డాక్టర్లు నెలలు నిండాయి కనక మరోవారం చూద్దామన్నారనీ చెప్పింది.

"ఆ డాక్టర్లు అలాగే చెప్తారు. చివరి నిమిషంలో ఆపరేషనంటారు. ఆఖరికది ఏ అమావాస్యో అవుతుంది. నువ్వు వాళ్ళతో మాట్లాడు. ఆపరేషను తప్పదంటే మంచిరోజు, మంచి నక్షత్రం చూసి చెయ్యమనండి" అంది మహాలక్ష్మమ్మ.

"మరే పాపం. ఎమర్జన్సీలు అమావాస్యలూ, గ్రహాలు చూసుకుని వస్తాయేంటండీ ... మీరు మరీనూ ..." విసుక్కుంది ప్రభావతి.

"అలాగంటే ఎలాగే. మామూలుగా పురుడొస్తే వేరు. ఆపరేషనంటే ముందు మనం మంచిరోజు చూసుకుని చెప్పొచ్చుట. మొన్న అవధాని గారి కోడలికి అలాగే మంచిరోజు చూసుకుని చేయించేర్ట."

"అవన్నీ నాకు తెలీవండీ. డాక్టర్లు ఎప్పుడేం చేస్తానంటే దానికి సరేననడమే మాకు తెలుసు" టక్కున ఫోన్ పెట్టేసింది ప్రభావతి. పెట్టింది ఊరుకోకుండా మొగుణ్ణి సతాయించడం మొదలెట్టింది.

"మీ అమ్మగారు ఉట్టినే ఉండరుగా. ఏదో వంక పెడతారు మన ప్రాణానికి. ఓసారి ఫోన్ చేసి ఆ మంచిరోజెప్పుడో కనుక్కోండి."

"అదేదో నువ్వే అడగొచ్చుగా ..." అనబోయి మళ్ళీ కస్సుమంటుందని తల్లికి ఫోన్ చేసి, "అమ్మా, వచ్చే వారంరోజుల్లో నాన్నగార్ని కాస్త మంచిరోజు చూసి చెప్పమను" అనడిగాడు.

అందుకే తెల్లారకుండా పంచాంగం పట్టుక్కూర్చుందావిడ. పొలాన్నుంచి వస్తున్న సీతారావయ్య ఇంకా ఇంట్లో అడుగు పెడుతుండగానే "అయ్యాయా ఊరి రాజకీయాలూ ... అయ్యో ... ఇంట్లో మనవడి పెళ్ళాం పురిటికుందే ... కనబోతోందే ... కాస్త మంచీ చెడూ చెప్దాం అని పట్టించుకునేదేవైనా వుందా ... ?"

"ఇది మరీ బాగుంది. ఉరుమురిమి మంగలం మీద పడిందట. అలాగుంది ... ఇంతకీ అబ్బాయేమైనా ఫోన్ చేసేడా ?"

"ఆ ... చేసేడు. హారికకి ఆపరేషన్ చెయ్యాలేమో అంటున్నార్ట. మంచిరోజు చూసి చెప్పమన్నాడు పెద్దాడు."

పంచాంగం సీతారావయ్య చేతిలో పెట్టి పక్కనే కూర్చుంది. తిథి వార నక్షత్రాలు చూసి ఆయన ఓ రోజు చెప్పడం, దాని కావిడ ఆ వారం బాగాలేదనడం, వారం బాగుంటే నక్షత్రం మంచిది కాదనడం ఇలాగ అన్నీ తెలిసినాయన చూసి చెపుతుంటే వినికిడి జ్ఞానంతో ఆవిడ ఆయన్ని ముప్పు తిప్పలు పెట్టి మొత్తానికి మరో మూడు రోజుల్లో ఒక శుభముహూర్తం నిర్ణయించి ఆ మాటే చెప్పింది కొడుకుతో.

డాక్టర్లు కూడా వీళ్ల కోరికని కాదనకుండా వాళ్ళన్న సమయానికి సిజేరియన్ ఆపరేషన్ చేసి పండంటి అబ్బాయిని వీళ్ళ చేతిలో పెట్టేరు. ఇంక మహాలక్ష్మమ్మ ఆనందానికి అవధులు లేవు. ఇరుగిల్లూ, పొరుగిల్లూ, ఇంట్లో పనివాళ్ళే కాదు ఊరు ఊరందరికీ శుభవార్త చాటింపు వేసినట్లు చెప్పేసింది.

అవధానిగారయితే ... "ఇంకనేవమ్మా ... మునిమనవడు పుట్టాడంటే ఇంక మీకూ ఆయనకీ స్వర్గంలో సీట్లు రిజర్వ్ అయిపోయినట్టే ..." అనగానే నిజంగా స్వర్గద్వారం ముందు నిల్చున్నంత ఆనందపడిపోయింది.

మరో మూడు నెలలకి సీతారావయ్య, మహాలక్ష్మిల మునిమనవడి బారసాల వైభవంగా జరపడానికి హైద్రాబాదులో పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరిగేయి. వారం రోజులు ముందుగానే ఇద్దరూ పెద్దకొడుకు పతంజలి ఇంటికొచ్చేరు. అంతకి రెండు రోజులకి ముందే హారిక కొడుకునెత్తుకుని అత్తారింటికి వచ్చింది. ఇల్లంతా పండగ సందడి అలుముకుంది. మునిమనవణ్ణి చూసి మురిసిపోయింది మహాలక్ష్మమ్మ. మామిడి పిందెల మొలతాడు చేయించుకుని తీసుకొచ్చిందావిడ.

"మీ చాదస్తం కాపోతే డైపర్లు కట్టే ఈ రోజుల్లో మొలతాడు ఎవరు కడుతున్నారూ ... ?" సాగదీసింది ప్రభావతి అత్తగార్ని.

"మొలతాడు లేకుండా మొగపిల్లాడుండకూడదే. నీకేం తెల్సూ ... ఆ వెధవ డైపర్లు కడితే ఒళ్లంతా దురదలూ, దద్దుర్లూ వస్తున్నాయిట. మా ఊళ్ళో అవధాని గారు చెప్పేరు. ఇదిగో ... హారికా ... వాడు బట్టలు పాడు చేస్తే చేసేడు కానీ ఆ వెధవ డైపర్లు మటుకు కట్టకమ్మా ... ఎంచక్కా మామిడిపిందెల మొలతాడు కట్టుకుని చిన్ని కృష్ణుళ్ళా ఉంటాడు పిల్లాడు ..."

"వాళ్ళేవో చవకబారువి వాడుంటారు. అందుకే అలా అయుంటుంది. అయినా మీరు బైటవాళ్ళ మాటలు తప్పితే ఇంట్లో వాళ్ళ మాట ఎప్పుడు చెవిని పెట్టేరు కనక ..." విసుక్కుంది ప్రభావతి.

ఈ అత్తాకోడళ్లని చూస్తుంటే హారికకి ఎప్పుడూ అదేదో అద్భుతాన్ని చూస్తున్నట్టు ఉంటుంది. ఒకరిమాట ఒకరు వింటున్నట్టో, కాదంటున్నట్టో అర్థం కాదు పాపం ఆ అమ్మాయికి.

ఈ వారం రోజుల్నుంచీ అత్తా కోడళ్ళ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం అయిపోతోంది. మునిమనవడికి చక్కగా ఒళ్లంతా నూనె రాసి, పసుపురాసి, నలుగుపెట్టి వేడి వేడి నీళ్ళు పోస్తానంటుంది మహాలక్ష్మమ్మ.

"పసిపిల్లలకి నీళ్ళూ, పాలే బలం. కడుపునిండా పాలిచ్చి, వేడి వేడి నీళ్ళు పోస్తే హాయిగా నిద్రపోతారు పిల్లలు. అప్పుడే ఎంచక్కా ఒళ్ళు చేస్తారు."

"వాడు ఆపరేషన్ చేసి తీసిన పిల్లాడు. అలా ఒళ్లంతా మర్దనాలు చేస్తే అలిసి పోతాడు. ఈ మోటు పనికి తట్టుకోలేడు. చక్కగా బేబీసోప్‌తో బాత్‌టబ్‌లో నీళ్ళు పోస్తే వాడికి హాయిగా ఉంటుంది" ప్రభావతి తేల్చేసింది.

ఈసారి వీళ్ల యుద్ధంలో హారిక కూడా కలిసింది.

"వాడికి ఏ సబ్బులూ పడటంలేదు. ఏం పెట్టినా అలర్జీ వచ్చేస్తోంది. నేను శుభ్రంగా స్పాంజ్ బాత్ చేస్తాను. మీరు వాళ్ళిద్దరికీ చెప్పండి. "హారిక మొగుడి చెవి కొరికేస్తోంది. మహాలక్ష్మమ్మ మనవడూ, ప్రభావతి కొడుకూ, హారిక మొగుడూ అయిన శ్రీధరం ఎవరికీ ఏమీ చెప్పలేక ముందరి గదిలోకి వెళ్ళి తండ్రీ, తాతల పక్కన సెటిలయిపోయేడు.

మొత్తానికి వాళ్లలో వాళ్ళే ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క దానికి సర్దుకుని, ఆ పసివాడికి బేబీసోప్‌తో మాత్రమే తలంటేసి, ఇంక సాంబ్రాణి పొగలూ అవీ వెయ్యకుండా, గబ గబా తుడిచేసి, గొల్లుమని ఏడిచేస్తున్న ఆ పిల్లాణ్ణి "బాలానాం రోదనం బలం ..." అంటూ మహాలక్ష్మమ్మ ముద్దులు పెట్టేసుకుంటుంటే, "పిల్లల్ని అలా ముద్దులు పెట్టుకోకూడదు మామ్మగారూ ..." అన్న హారిక మాటలకి "ఇదెక్కడి విడ్డూరమే" అని విడ్డూరాలు పోతూ మొత్తానికి వాడికి అభ్యంగన స్నానం చేయించేరు అందరూ కలిసి.

బారసాల పెళ్ళికొడుకు ముద్దొచ్చే చిన్న రెడీమేడ్ పంచె, చక్కగా ఎంబ్రాయిడరీ చేసిన లాల్చీతో తయారయ్యాడు. మహాలక్ష్మమ్మగారూ, సీతారావయ్యగారూ తెచ్చిన మామిడిపిందెల మొలతాడు పెట్టుకుని, పితామహులు చేయించిన బంగారు గొలుసు వేసుకుని, మాతామహులిచ్చిన బంగారు మురుగులు తొడుక్కుని చిన్ని కృష్ణునిలా మెరిసిపోతున్నాడు.

బారసాల మహోత్సవానికి ఎక్కడెక్కడి బంధువులనో పిలిచేరు. ఎక్కడెక్కడి చుట్టాలూ వచ్చేరు. వారిలో సీతారావయ్య తమ్ముడి పిల్లలూ, మనవలూ కూడా వున్నారు. ఆ మనవళ్ళలో ఒకడు తేజా. రెండు వారాల విజిట్ కోసం అమెరికా నుంచొచ్చేడు. అక్కడే కొత్తగా పెళ్ళి చేసుకున్న అతను, భార్యకి తన చుట్టాలందర్నీ చూపించడానికి ప్రత్యేకంగా ఈ వేడుకకై తీసుకొచ్చేడు. సింహద్వారం పక్కనే ఓ కుర్చీలో కూర్చోబెట్టి, ఆ హాండిల్ మీదే కూర్చుని సిరికి వచ్చేవాళ్ళందరి గురించి చెపుతున్నాడు తేజా. అతని భార్య సిరి అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఎప్పుడో చిన్నప్పుడు తల్లిదండ్రులతో ఆంధ్రదేశం వచ్చిన జ్ఞాపకాలు తప్పితే ఈ మధ్య ఈ దేశం రాకపోవడం వల్ల ఇక్కడి పద్ధతులన్నీ కొత్తగా చూస్తోంది. ముందుగా సిరికి సీతారావయ్య తమ్ముడూ, తన తాతా అయిన రాఘవరావుని చూపించేడు తేజా.

రాఘవరావు రైల్వేస్‌లో పనిచేసి రిటైరయ్యారు. ట్రాన్స్‌ఫర్ల మీద అన్ని వూళ్ళూ తిరుగుతుండడంతో వైద్యం కోసం అన్ని చోట్లా పనికొస్తుందని పోస్టల్ కోచింగ్‌లో హోమియోపతీ వైద్యం నేర్చుకున్నారు. ఆ హోమియో పెట్టె ఒకటి పట్టుకుని అన్ని ఊళ్ళూ తిరుగుతుండేవారు. రిటైరయ్యాక ఆ హోమియోపతీ వైద్యాన్నే వృత్తిగా చేసేసుకున్నారు. వాళ్ళింటికి ఎవరు వెళ్ళినా ఆయన మాత్రలు నోట్లో పడక తప్పవు. ముందు వెళ్ళగానే ... "అదేంటోయ్ అలా నీరసంగా కన్పిస్తున్నావ్ ?" అంటారు.

మొహమాటంగా, "అబ్బే ... ఏం లేదండీ ... ఏదో ఈ మధ్య కాస్త జ్వరం వచ్చి నీరసం అంతే ..." అన్నారనుకోండి ... "అరే ... జ్వరవా ... ? ఇదిగో ... ఇది నోట్లో వేసేసుకో ... మళ్ళీ యేడాద్దాకా జ్వరం నీ జోలికొస్తే నన్నడుగు ..." అంటూ ఎడంచేత్తో ఎదుటివాడి గడ్డం పైకెత్తేసి, కుడిచేత్తో హోమియోమందు సీసా పట్టుకుని, "టపుకూ ... టపుకూ ..." మంటూ రెండు మూడు మాత్తర్లు నోట్లో వేసేస్తారు. సిరికి ఆయన్ని చూపించి అంత పరిచయమూ చేసేడు తేజా.

ఆయన ఎక్కడికెళ్ళినా ఆ హోమియో మందుల పెట్టి ఆయన వెంట వుండ వలసిందే. అలాగే బారసాలకి కూడా దానిని చంకన పెట్టుకునే వచ్చేరు. ఎవరైనా కాస్త తుమ్మినా, దగ్గినా అక్కడ ప్రత్యక్షమైపోయి, "టపుకూ ... టపుకూ ..." మంటూ వాళ్ల నోట్లో మాత్ర వేసెయ్యడం. వాళ్ళకెవరైనా టిఫిన్ కానీ, కాఫీ కానీ యిస్తుంటే ..." ఇప్పుడే పెట్టకండి, ముందు పన్చెయ్యదు ... కనీసం అరగంటైనా ఆగాలి ..." అంటూ వాళ్ల చేతుల్లో టిఫిన్ ప్లేట్లు తీసి పక్కన పెట్టెయ్యడం.

ఇదంతా చూస్తున్న సిరి కిసుక్కున నవ్వబోయి ఆపుకుంది. అది చూసిన

తేజా ... "ఇక్కడి కొచ్చిన మా చుట్టాల్లో నీకు జంధ్యాల సినిమాల్లో కన్న ఎక్కువ కేరక్టర్‌లు కనపడతాయి. జంధ్యాలగారే బతికుంటే వీళ్లలో ఇంకా ఎంతమందిని చూపించేవారో ..." అన్నాడు.

సరిగ్గా అప్పుడే ప్రభావతి చిన్నాన్న కొడుకు రంగనాథం వచ్చేడు. ఆయన ఈ మధ్యనే అమెరికాలో వున్న కొడుకు దగ్గర నాల్నెల్లుండి వచ్చేడు. వచ్చిందగ్గర్నుండీ అమెరికాని పొగడడం, ఇండియాని తిట్టడం తప్ప మరో మాట మాట్లాడ్డంలేదు. వస్తూ వస్తూ అక్కడ్నించి కొడుకిచ్చిన ఐపాడ్ ఒకటి తెచ్చుకున్నాడు. ఇంక ప్రతివాళ్లకి అందులో వున్న ఫీచర్స్ ఒకటికి పదిసార్లు చూపించేస్తున్నాడు.

తేజా నెమ్మదిగా సిరితో చెప్పేడు ... "ఈయన ఈమధ్య అమెరికాలో లాగా ఇక్కడకూడా అడ్రస్ కనుక్కుందుకు జి.పి.ఎస్. ఫాలో అయిపోయి దాని ప్రకారం వెళితే, అది తిన్నగా తీసికెళ్ళి ఓ పూరిగుడిసె ముందు నిలబెట్టిందట ..." "అదెలా ... ?" అంది సిరి ఆశ్చర్యంగా ...

"ఏవుందీ ... ఆయన లొకాలిటీ కొట్టి సాయీభవన్ అని కొట్టేరుట. ఇక్కడ గుడిసెకీ సాయి భవన్ పేరే ... ఫైవ్ స్టార్ హోటల్‌కీ సాయీభవన్ పేరే వుంటుంది కదా ... అదన్నమాట సంగతి ..." వివరించేడు తేజా.

ఫక్కున రాబోయిన నవ్వుని బలవంతంగా ఆపుకుంది సిరి.

ఆ పక్కనే ఇంకో పెద్దమనిషిని ఇందాకట్నించి గమనిస్తోంది సిరి. ఆయన కిచ్చిన టిఫిన్ తినేసేరు. తినేసేరు కదాని ఆ ప్లేటు తీసి పక్కన పెట్టడం లేదూ ... ఎవరైనా వచ్చి మేం బైట పెట్టేస్తామంటే దానిని ఆయన ఇవ్వటమూ లేదు. పోనీ ఇంకాస్త టిఫిన్ కావాలేమో నని మళ్ళీ వచ్చి మారు అడిగితే కూడా వద్దన్నారు. ఆయన అలాగ ఒలింపిక్ గేమ్స్‌లో జ్యోతిలాగ ఆ ప్లేటుని తన బట్టలకి కాస్త దూరంగానూ, వచ్చిపోయేవాళ్లకి తగలకుండాను జాగ్రత్తగా ఎత్తి పట్టుకున్నారు. సిరికి ఏమీ అర్థంకాక ఆయన్ని చూపించి ఎవరని అడిగింది.

"ఓహో ... ఆయనా ... ఆయన్ని అందరూ ఎస్వీ గారంటారు ..." ఉత్సాహంగా చెప్పేడు తేజా. అంటే అన్నట్టు చూసింది. ఆయన మా పెద్దనాన్న గారి అత్తారి తరపు చుట్టం. ఆయన అసలు పేరు నాకు తెలీదు కాని అందరు ఎస్వీ అంటారు. అంటే సతీవ్రతుడు అన్నమాట. ఆయన ఏ పని చెయ్యాలన్నా ఆవిడ చెపితే తప్ప చెయ్యడు. ఇప్పుడు చూడు. టిఫిన్ తినేసినా సరే ఆవిడొచ్చి ప్లేటు బయట పెట్టమనే దాకా పెట్టడు."

తేజా ఇంకా చెపుతుండగానే అతని భార్య అటు వచ్చింది. మొగుడు చేతిలో

ఖాళీ అయిన ప్లేటుని ఒలింపిక్ జ్యోతిలాగ పట్టుకునుండడం చూసి, "మీ చాదస్తం మండిపోనూ. దానిని బైట పడెయ్యొచ్చు కదండీ ..." అంది. అది విన్నాకే ఆ ఎస్వీగారు లేచి ఆ ప్లేటుని బయట డస్ట్‌బిన్‌లో పడేసొచ్చారు. సిరి ఇంక నవ్వలేక కడుపు పట్టుకుంది.

ఇలాగ ఒక్కొక్కరినీ చూపించి ఒక్కొక్క కథా చెపుతుంటే బారసాల సుముహూర్తం దగ్గరపడింది.

ఈమధ్యలో మహాలక్ష్మమ్మ రెండు మూడుసార్లు హారిక మనవడికి పాలిచ్చిందో లేదో చూడమని చెపుదామని ప్రభావతి కోసం చూసింది. పాపం ప్రభావతి ఇంటి నిండా వున్న అతిథులకి మర్యాదలు చెయ్యడంలో తల మునకలుగా వుండడం చూసి ఆమెని ఇంకా ఇబ్బంది పెట్టడం ఎందుకని మహాలక్ష్మమ్మే రెండు మూడుసార్లు హారికకి గుర్తుచేసింది. "పిల్లా ... చాలా టైమైంది. పిల్లాడికి ఆకలేస్తూంటుంది. పాలియ్యి ..." అంటూ. ఆవిడ చెప్పగానే హారిక గదిలోకెళ్ళి చూడడం, పిల్లాడు మంచి నిద్దట్లో వుండడం చూసి వెనక్కి వచ్చెయ్యడం అయ్యాయి. మహాలక్ష్మమ్మ హారిక గదిలోకెళ్ళింది కదా పాలిచ్చి వుంటుందనుకుంది. తీరా ముహూర్తం దగ్గర పడింది, పిల్లాణ్ణి తీసుకురండి అనేటప్పటికి పిల్లాణ్ణి చేతిలోకి తీసుకున్న హారికకి గాభరా పుట్టేలా వాడు తల వేళ్ళాడేసేడు. హడిలిపోయి గట్టిగా కేకపెట్టింది. విషయమేవిటో నని పెద్దవాళ్లందరూ గబగబా వచ్చి చూస్తే పిల్లాడు శోషొచ్చినట్టయిపోయి తల వేళ్ళాడే స్తున్నాడు. కదిపినా కళ్ళు తెరవడు. కుదిపినా కళ్ళు తెరవడు. ప్రభావతి "డాక్టర్ని పిలవండి తొందరగా ..." అని ఖంగారు పెట్టేస్తోంది.

అందర్నీ తోసుకుంటూ మహాలక్ష్మమ్మ ముందుకు వచ్చి ముని మనవణ్ణి చేతిలోకి తీసుకుంది. తోటకూర కాడలా వేళ్ళాడిపోతున్న వాణ్ణి ఒళ్ళో పడుకోబెట్టుకుని తన చిటికెన వేలు నోట్లో పెట్టబోతే వాడు చప్పరించడం మాట దేవుడెరుగు అసలు నోరే తెరవలేదు. గాభరా పడుతున్న హారికని నెమ్మదిగా పక్కన కూర్చోబెట్టుకుని, పిల్లాణ్ణి తల్లి ఒడిలో పడుకోబెట్టి పాలివ్వడానికి ఆమెని సమాయత్తం చేసి, నెమ్మదిగా చంటిపిల్లాడి చెవి వెనకవైపున రాయసాగింది. ఊహూ ... వాడు కదలలేదు. మరి కాస్త గట్టిగా రాస్తూ, ఈసారి నెమ్మదిగా గిల్లింది. కాస్త కదిలేడు వాడు. మహాలక్ష్మమ్మకి ధైర్యం వచ్చింది. ఈసారి ఇంకాస్త గట్టిగా గిల్లింది. "కుయ్" మన్నాడు వాడు. వెంటనే వాడినోటికి తల్లి పాలను అందించింది. చప్పరించడం మొదలెట్టాడు.

హమ్మయ్య అనుకుంటూ అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అత్తగారి సమయస్ఫూర్తికి ప్రభావతికి కృతజ్ఞతతో కళ్ళమ్మట నీళ్ళు వచ్చేసేయి.

హారికని ప్రశాంతంగా పాలివ్వమని అందరూ ఆ గదిలోంచి బైటకి వచ్చేసారు. బైటకి వస్తూనే ప్రభావతిని చూసి, "మామ్మ నయిపోయేనన్న సంబరం కాదు ... కాస్త చంటి పిల్లాణ్ణి కనిపెట్టుకుండాలని ఆ మాత్రం తెలీపోతే ఎలా ... ?" అంది మహాలక్ష్మమ్మ.

"అయ్యో ... ఆ మాత్రం మాకు తెలీక కాదు. మీకు స్వర్గద్వారాలు తెరిచిన మునిమనవడు కదా ... మీరే చూసుకుంటారనీ ..." అంటూ దీర్ఘం తీసింది అత్తగారి మీద ప్రభావతి.

అక్కడ చేరిన వాళ్లందరూ అలవాటైన ఆ అత్తాకోడళ్ల మాటలకి నవ్వుకుంటూ బారసాల మహోత్సవానికి సిద్ధమయ్యారు ❊

**రచన - ఇంటింటి పత్రిక : సెప్టెంబర్, 2014**

**శ్రీ గాడేపల్లి వెంకటశాస్త్రి స్మారక కథల పోటీలో బహుమతి**

# ఒఖ్ఖ రెండు రూపాయలు

"నేనేం వందలడిగానా ? వేలడిగానా ? ఒఖ్ఖ రెండు రూపాయలేగా ! దానికే అంత దండకం చదవాలా ?"

గట్టిగా వినిపిస్తున్న తల్లి గొంతు చెవిన పడుతూనే మెలకువ వచ్చింది నూకరాజుకి. గబుక్కున లేచి కూర్చున్నాడు.

"ఆ ! ... ఒఖ్ఖ రెండు రూపాయలేగా అని ఎంత తీసి పడేస్తున్నావు ? పిల్లల ఖర్చుల కడిగేదీ అదే. పుస్తకాల కడిగేదీ అదే. రెండూ రెండూ అంటూ నాలుగుసార్లు కలిపితే ఎనిమిదవదా ? పదీ పదీ కలుపుకుంటూ పోతే వందవదా ? ఇలాగే లెక్కలు పెడతాడు నీ కొడుకు. రోజురోజుకీ పెరిగి పోతున్న ధరలతో, నీ కొడుకిచ్చే డబ్బులకి లెక్కలు చెప్పలేక నా తలప్రాణం తోకకొస్తోంది. అయినా ముసల్దానివయిపోయావు. ఇంట్లోంచి బైటకి కదలవు. భోజనం, కాఫీ, టిఫినూ అన్నీ చెల్లిస్తూనే వున్నావాయె ఇంకా నీకు ఆ ఒఖ్ఖ రెండు రూపాయలు మటుకు ఎందుకటా ? ఏం చేసు కుందామనీ?"

సాగదీస్తూ అడుగుతున్న భార్య పంకజం నోటి దురుసుకి చెవులు మూసుకుంటూ మంచం దిగాడు నూకరాజు. కాఫీ ఇస్తున్న భార్య నడిగాడు సంగ తేమిటని ? వెంటనే ఆమె స్వరం సౌమ్యంగా మారిపోయింది.

"ఆ ? ఏముందీ ? మీ అమ్మగారికి రెండు రూపాయలు కావాలిట. మీరిచ్చిన డబ్బుతో పిల్లలకి ఫీజులు కట్టి, స్కూల్లో పుస్తకాలు, పెన్సిళ్లు కొనేసాను. ఇంక నా దగ్గర డబ్బుల్లేవు. అయినా మీ అమ్మగారికి డబ్బెందుకండీ ? భోజనం, టిఫినూ, కాఫీ అన్నీ గడచిపోతుంటేనూ ?" నెమ్మదిగా పాయింటు లేవదీసింది పంకజం.

నిజమే, అమ్మకు డబ్బులెందుకు ?

టైము చూసుకున్నాడు నూకరాజు. అప్పుడే ఎనిమిదయింది. అబ్బా, అప్పుడే షాపు తెరిచే టైమవుతోంది. గబగబా తయారయి షాపుకి బయలుదేరుతున్న అతనితో తల్లి అంది.

"ఒరేయ్ రాజూ, చూడరా మీ ఆవిడ ఒఖ్ఖ రెండు రూపాయలడిగితే ..."

"అబ్బబ్బ ఏంటమ్మా, అసలే టైమయిపోతోందని కంగారు పడుతుంటే. అయినా నీకు డబ్బులెందుకు చెప్పు ? అంటూనే హడావిడిగా చెప్పులేసుకు బయట కొచ్చేశాడు. వెనక్కి తిరిగి తల్లికి నెమ్మదిగా నచ్చచెప్పి రమ్మని మనసు బాధిస్తున్నా, పరిగెడుతున్న టైము అతన్ని ముందుకే నడిపించింది.

నెలలో మొదటి వారం, షాప్ రష్‌గా వుంది. నాలుగు చేతులతో పని చేస్తున్నట్లు చేస్తున్న నూకరాజుకి ఊపిరి పీల్చుకుందుకు కూడా సమయం దొరకలేదు. పదకొండు దాటేక జనం కొంచెం పలచబడ్డారు. అమ్మయ్య అనుకుంటూ వాటర్ బాటిల్‌లో నీళ్లు తాగుదామని తలయెత్తిన అతనికి, ఆ షాపు వైపే వస్తున్న రామ్మూర్తి గారు కనిపించారు. నూకరాజు ముఖం విచ్చుకుంది. రూపాయలు, పైసల లెక్కల్తో కొట్టుకొంటున్న అతనికి రామ్మూర్తి గారితో మాట్లాడడం గొప్ప రిలీఫ్. చుట్టుపక్కల ప్రాంతంలో ఏం జరుగుతోందో తెలియనంత బిజీగా వుండే అతనికి మధ్య మధ్యలో రామ్మూర్తిగారు చెప్పే మాటల్లోనే ప్రపంచం తీరు తెన్నుల గురించి తెలుస్తూంటుంది.

రామ్మూర్తిగారు ఒక రిటైరైన గవర్నమెంటు ఆఫీసరు. మనవలతో ఆడుకుంటూ హాయిగా కొడుకింట్లో కాలం గడిపేస్తున్నారు. ఏదో హోదా గల ఉద్యోగమే చేసుంటారు. అందుకే అభిమానం, పౌరుషం గల మనిషిలా కనిపిస్తారు.

ఎప్పుడైనా ఆయన ఉద్యోగపు రోజులు గుర్తుకు వస్తే "ఏమిటోనయ్యా, ఆ రోజులే వేరు. ఎంతసేపు సిన్సియర్‌గా పనిచేసి పేరు తెచ్చుకుందామనే గాని వేరే దృష్టి ఎక్కడిదయ్యా ? ఇప్పుడేమో అంతా ఖాళీయే. ఎవరితోనన్నా మాట్లాడదామన్నా వాడి టైము పాడు చేస్తున్నానేమోనని ఫీలింగు'' అంటూ పకపకా నవ్వేస్తారు.

"మీకేం సార్. మాలా బిజినెస్ కాదు కదా ! చేసినన్నాళ్లు చేసారు. పెన్షన్ వస్తుంది. హాయిగా కొడుకు దగ్గర ఉంటున్నారు'' అంటే,

"నీకొక జీవిత సత్యం చెబుతాను వినవయ్యా నూకరాజు, ఎవరి జీవితం వాళ్లదేననుకో కాని, కొంతమంది ఇవ్వడానికే పుడతారు, మరికొంతమంది పుచ్చుకోవడానికే పుడతారు. కాలం మారుతూంటుంది కదయ్యా అదెప్పుడూ ఒక్కలాగే ఉండదు. మా తరం తల్లిదండ్రులని చూడవలసిన బాధ్యత కొడుకులది అనే నమ్మే తరం. అల్లాగే చూసాం. కాని మా కొడుకుల తరం వచ్చేసరికి, వాళ్ళింట్లో ఉంటున్నందుకు మాకొచ్చే పెన్షన్ వాళ్ల చేతుల్లో పెట్టవలసిన పరిస్థితి వచ్చేసింది. ఏం చేస్తాం ? ఈ కాలమిలా వుంది. వాళ్ల వైపు నుంచి ఆలోచిస్తే సమర్థించుకోవచ్చేమో కాని, మాతరం వాళ్లం సర్దుకోలేకపోతున్నామాయే !'' అంటూ బరువైన విషయాన్ని కూడా చాలా తేలికగా తీసుకుంటూ చెప్పేస్తారు.

రామ్మూర్తిగారు కొంచెం భోజన ప్రియులు అయి వుండాలి. గతం గుర్తొస్తే మటుకు వెంటనే ఆయన చెప్పే మాట "అప్పుడు బజార్లోకి కొత్తరకం ఏదొచ్చినా సరే తెచ్చి పిల్లలకి తినిపించాల్సిందేనయ్యా. అప్పుడు మాకు తినడానికి టైముండేది కాదు, ఇప్పుడు టైమున్నా పెట్టేవాళ్లు లేరు'' అంటూ నవ్వేస్తారు.

ఇలా మంచీ చెడూ చెపుతూ, లోకం పోకడ గురించి ముచ్చటిస్తూ ఆయన కోడలు రాసిచ్చిన సరుకుల లిస్టు, ఖాతా పుస్తకం నూకరాజు చేతికిచ్చేవారు. కావలసిన సరుకులిచ్చి, లెక్క ఖాతా పుస్తకంలో రాసే వరకు అతనేదో అడుగుతూండడం, ఆయన జవాబిస్తూండడం వాళ్లిద్దరికీ అలవాటయిపోయింది.

"ఏంటి మాస్టారూ విశేషాలు ?'' అడిగాడు నూకరాజు సరుకుల లిస్టు అందుకుంటూ.

"ఆ ! ఏముందోయ్ ... అన్నట్లు మీ పిల్లలెలా చదువుతున్నారు ?'' కుశల ప్రశ్నలు వేసారు రామ్మూర్తిగారు.

"ఏం చదువులోనండి, వీళ్లు చదివి ఏం ఉద్ధరిస్తారో తెలీదు కానండి ఫీజులు మటుకు చుక్కలంటుతున్నాయండి. పుస్తకాలు, డ్రెస్సులు, పాకెట్‌మనీ తడిసి మోపెడవుతున్నాయి'' అన్నాడు నూకరాజు.

"ఊ ! అయితే పిల్లలకి పాకెట్ మనీ కూడా ఇస్తావేమిటోయ్ ?'' అడిగారు ఆయన.

"ఏదోనండి, రూపాయో, రెండో. పక్క పిల్లలు ఏదో కొనుక్కుంటారు కదండీ, వాళ్లకి అనిపిస్తుంది కదా, మళ్లీ చిన్న పుచ్చుకుంటారనీ ...'' సమర్థించుకున్నాడు నూకరాజు.

"నిజమేనోయ్, నీకొక సంగతి చెప్పనా ? మా తాతగారంటూండేవారు ... చిన్నపిల్లలూ, ముసలివాళ్లూ ఒకటేనని. అంటే వాళ్లిద్దరి మనస్తత్వం ఒక్కలాగే వుంటుందని. ఏదో అస్తమానం తింటూండాలనిపిస్తుందనీ, చపలత్వం, చాదస్తం ఎక్కువవుతాయనీ అంటూండేవాడు. పిల్లలకే కాదు పెద్దలకి కూడా చేతిలో ఓ రూపాయుంటే ఏ గుళ్లోనో దేవుడికిచ్చుకోవాలనిపిస్తుంది కదా !'' అన్నారు ఆయన.

నూకరాజుకి వెంటనే తల్లి గుర్తుకు వచ్చింది. 'అమ్మ గుడిలో దేవుడి కోసం అడిగిందా ప్రొద్దున్నే రెండు రూపాయలు ?' ఆలోచనలు తప్పించుకుందుకు తల విదిలించి సరుకుల లిస్టు చూడడంలో మునిగిపోయాడు. సరుకుల ధరలు రాసి, మొత్తం కూడి, ఖాతా పుస్తకంలో రాస్తున్నాడు.

"నూకరాజూ"

రామ్మూర్తి గారి గొంతు నెమ్మదిగా వినిపించింది. తలెత్తాడు నూకరాజు.

"ఏదో ఒక సరుకులో రెండు రూపాయలు ఎక్కువెయ్యవయ్యా ..." నసుగుతూ అన్నాడాయన.

ఆశ్చర్యపోతూ తలెత్తాడు నూకరాజు. ఆయన అతని చూపు చూసి గబుక్కున తల దించుకున్నాడు. అభిమానంతో ఆయన నోటి వెంట వచ్చిన మాటలు "ఏం లేదయ్యా ... కొత్తరకం బిస్కెట్లేవో వచ్చాయన్నావు కదా ... ఎలా వుంటాయో రుచి చూద్దామనీ ... అంతే. ఒఖ్ఖ రెండు రూపాయలే ..."

వింటున్న నూకరాజుకి ఛెళ్లున లెంపకాయ కొట్టినట్టయింది. కళ్లమ్మట గిఝ్ఝున నీళ్లు తిరిగాయి. తమలాంటి కొడుకులందర్నీ చంపి పాతరేసినా పాపం లేదనిపించింది. పాప భారంతో ఎత్తలేని తల భూమిలోకి దించుకున్నాడు నూకరాజు ❊

**ఆంధ్రప్రభ వారపత్రిక ప్రచురణ : 2-6-2001**

కన్నడంలోకి అనువదించబడి 'సుధా పత్రిక : 11-4-2002లోనూ,
ఇంగ్లీషులోకి అనువదించబడి 'త్రివేణి' పత్రిక : జనవరి, మార్చి, 2011 లోనూ
ప్రచురించబడింది

# మూర్తిగారొచ్చేరు

"మూర్తిగారొచ్చేరు" "మూర్తిగారొచ్చేరు"

ఒక్కసారిగా అక్కడ పదిగొంతుల్లోంచి వినిపించిందీ మాట. ఆ మాట అన్న పదిమందీ కాక అది విన్న దాదాపు పాతికమంది దృష్టి ఎంట్రన్స్ వైపు మళ్ళింది. చాలా ఖరీదైన ఆడి కారు బాక్ సీట్లోంచి హుందాగా దిగేరు సదరు యమ్. మూర్తిగారు. డార్క్ చాక్లెట్ కలర్ సూట్, నీలిచారల టై, బ్రాండెడ్ షూస్ ఆయన గొప్పతనాన్ని స్పష్టంగా చూపెడుతున్నాయి. కారు దిగి, ఇటువైపెవరివైపూ దృష్టి సారించకుండా వెనకాల నెమ్మదిగా దిగుతున్న భార్య శ్రీలేఖకి చెయ్యి అందించేరు.

ఒక తటిల్లత మెరిసినట్టు ఆ చుట్టుపక్కలంతా వెలిగిపోయింది. కళ్ళు జిగేల్మనిపించేటట్టు కుందన్స్‌తో ఎంబ్రాయడరీ చేసిన చిలకాకుపచ్చ పట్టుచీరతో, మెడలో గుండెలదాకా వేళ్ళాడుతున్న వజ్రాలహారంతో, భుజాలను తాకుతున్న కర్ణాభరణాలతో సాక్షాత్తు దివినుంచి దిగివచ్చిన దేవతలాగే భర్త చేయి అందుకుని అతి సుకుమారంగా కారు దిగింది శ్రీలేఖ. అంతే ... ఒక్కసారిగా ఆయనను గ్రీట్ చెయ్యడానికి ఆయన చుట్టూ మూగిపోయేరు ఆయనతో పనున్నవాళ్ళు. అయినా ఆయనతో పనిలేనిదెవరికీ ? ఆ మహానగరంలో ఎక్కడ ఏ పని కావాలన్నా ఆయన అనుమతి తప్పనిసరి. అంత పెద్ద హోదాలో వున్నారాయన.

డబ్బుగలవాళ్ళందరూ ఇంకొంత డబ్బు చేసుకుందుకు ఆయనకి కాస్త గట్టిగానే డబ్బు ముట్టచెపుతుంటారు. ఫ్యామిలీ సెంటిమెంటు లాంటివి ఉపయోగించి పనులు చేయించుకోవాలనుకున్నా కుదిరేపని కాదాయె. ఎందుకంటే ఇక్కడ ఆయనతో కలిసి ఆయన భార్య, ఇద్దరు పిల్లలు మాత్రం వుంటారు. యమ్. మూర్తి గారి తల్లీ, తండ్రీ, అన్నదమ్ములూ అంతా విదేశాల్లోనే వున్నారాయె. అసలు మూర్తిగారి చిన్న తనమంతా విదేశాల్లోనే గడిచింది. హైస్కూల్ చదువు ముగించుకుని సరదాగా విజిట్ కోసమని ఇండియా వచ్చిన మూర్తిగారు, ఇండియాలో వున్న పరిస్థితులను చూసి కేవలం భారతదేశం మీద గల ప్రేమ, భక్తి, గౌరవాలతో తన చదువంతా ఈ దేశానికే ఉపయోగపడాలని, ఇక్కడే డిగ్రీ పూర్తిచేసి, సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసి, గవర్నమెంటులో పెద్ద అధికారిగా పదవి వెలగబెడుతున్నారు. ఒక్క డబ్బుకి తప్పితే

ఆయన మరి దేనికీ లొంగరు. అందుకని ఆయన కేవలం డబ్బుకే మాట్లాడతారని పేరొచ్చేసింది. చాలామంది యమ్. మూర్తి గారంటే మనీ మూర్తిగారని సరదాగా చెప్పుకుంటుంటారు కూడా. ఇది జగమెరిగిన సత్యం.

సదరు మూర్తిగారొచ్చేరన్న కబురు విన్న రంగనాథం పరిగెడుతున్నట్టే వచ్చేసేడు. ఆ రోజక్కడ రంగనాథం కూతురి పెళ్ళవుతోంది. ఆ నగరంలో వున్న అతి పెద్ద పారిశ్రామికవేత్తలలో ఒకడు రంగనాథం. మూర్తిగారికి, రంగనాథానికి మధ్య చాలా అండర్ స్టాండింగులున్నాయి. అందుకే రంగనాథం కూతురి పెళ్ళికి సతీసమేతంగా విచ్చేసేరు మూర్తిగారు. సాధారణంగా మూర్తిగారు చిన్న చిన్న వాటికి భార్యని తీసుకు రారు. తను వెడుతున్నచోట తనకి బ్రహ్మరథం పడతారని తెలిస్తేనే ఆయన భార్యని వెంట తీసికెడతారు. భార్య దృష్టిలో రోజురోజుకీ తన గొప్పతనం పెరిగిపోతుంటే గమనించడమంటే మూర్తిగారికి చాలా ఇష్టం. ఎందుకంటే భార్య శ్రీలేఖ గొప్పింటి నుంచి వచ్చింది. తనకున్న పేరు ప్రఖ్యాతులు పుట్టింటివారి కెక్కడా తీసిపోవని ఆమె అనుకోవాలని అలాంటి ప్రదేశాలకే భార్యని వెంటబెట్టుకొస్తారాయన.

గబగబా వచ్చిన రంగనాథం యమ్. మూర్తి గారిని, భార్య శ్రీలేఖను ఎంతో మర్యాదగా స్వాగతించి, దగ్గరుండి తీసికెళ్ళి పెళ్ళి మండపానికి ఎదురుగా ముందు వరసలో వున్న సోఫాలో కూర్చోబెట్టి, అక్కడ ఫ్రూట్ జ్యూస్‌లు అందిస్తున్న అబ్బాయి దగ్గర్నుంచి రెండు గ్లాసులు తీసుకుని తనే స్వయంగా ఆ ఇద్దరికీ అందించేడు. మూర్తిగారు కూడా అంతే మర్యాదగా అవి అందుకుని, ఒకటి భార్యకిచ్చి, మరోటి చేత్తో పట్టుకుని, "రంగనాథం గారూ, ఏర్పాట్లన్నీ ఘనంగానే చేసినట్టున్నారే ..." అని మెచ్చుకున్నారు. "హి ... హి ... ఏదో తమ దయ ..." అని నసిగేడు రంగనాథం.

ఇంతలో "బాబాయ్, నిన్ను ఆయన పిలుస్తున్నారు ..." అంటూ వచ్చేడో కుర్రాడు. "మీరు వెళ్ళండి. మేం కూర్చుంటాంలెండి ..." అంటున్న మూర్తిగారితో, "తమరు భోజనం చేసి మరీ వెళ్ళాలి. నేను మళ్ళీ మిమ్మల్ని కలుస్తాను" అంటున్న ఆయన్ని పంపించేసి తన కడగంటి చూపుకోసం నిరీక్షిస్తున్న వారివైపు దృష్టి తిప్పారు మూర్తిగారు. ఆయన చూపు తమ మీద పడడం ఆలస్యం అవకాశం వదిలిపెట్టకుండా ఒకరి తర్వాత ఒకరు వాళ్ల వాళ్ళ పనులు విన్నవించుకున్నారు అందరూ.

రంగ రంగ వైభవంగా జరుగుతోంది పెళ్ళి. ఎక్కడ చూసినా వైభవమే. మూర్తి గారి చుట్టూ ఓ పాతికమంది వందిమాగధులు చేరారు. భట్రాజుల్లా ఆయన్ని ఒకటే పొగడడం మొదలెట్టారు. మూర్తిగారు భార్య వింటోందో లేదోనని క్రీగంట చూస్తూ, వాటిని ఆస్వాదిస్తున్నారు. ఒక్కొక్కరు వచ్చి మూర్తిగారిని పలకరించి వెడుతున్నారు.

మూర్తిగారు ఆ వచ్చినవారు దేశ విదేశాల్లో ఎంత పేరూ, పలుకుబడీ వున్నవారో భార్య శ్రీలేఖకి చెప్పుకొస్తున్నారు. డబ్బూ, పేరూ, పలుకుబడీ అన్నీ వున్న అంతమంది అక్కడ చేరడం శ్రీలేఖకి కుబేరుడింట్లో జరిగే శుభకార్యానికి అధిదేవతలంతా వచ్చినట్లనిపించింది. వేదిక మీద జరిగే పెళ్ళి చూడడం కన్న వచ్చిన అతిథులు అందరూ ఒకరినొకరు పరిచయం చేసుకోవడంలో మునిగిపోయేరు.

ఇంతలో రంగనాథం "రండి ... రండి ..." అంటూ వయసులో పెద్దవారైన దంపతులని తీసుకొచ్చేరు మూర్తిగారి దగ్గరికి. వారిని చూస్తూనే మూర్తిగారి మొహం పాలిపోయింది. అప్రయత్నంగా జోడించబడుతున్న మూర్తిగారి చేతులు సగం వరకూ వచ్చి ఆగిపోయేయి.

"మూర్తిగారూ, మీరు మా వియ్యంకులి పెదనాన్నగారు సుబ్రహ్మణ్యంగారూ, ఆయన భార్య సుభద్రమ్మగారు. మా దొడ్డ మనసులెండి వీరిది. వీరి చేతుల మీదుగా ఎంతమందికి విద్యాదానం చేసేరో, ఎంతమందికి కన్యాదానం చేసేరో వీళ్లకే తెలీదు. ఈ మధ్య పెద్ద వయసొచ్చేసి కథలూ, కార్యాలకీ రావడం తగ్గించేసేరుట. కానీ, మా వియ్యంకులు గారు పిల్లలకి వీరి ఆశీర్వాదాలు కావాలని పట్టుబట్టి శ్రీకాకుళం నుండి దగ్గరుండి తీసుకొచ్చేరు" అంటూ పరిచయం చేసేరు. సుబ్రహ్మణ్యం గారు మూర్తిగారిని చూసి గుర్తుపట్టినట్టుగా పలకరించబోయి, ఆయన ముఖ కవళికలు చూసి కాస్త వెనక్కి తగ్గేరు. మూర్తిగారిని చూడగానే ఆనందంతో ఇంత మొహం చేసుకుని ఆప్యాయంగా పలకరించబోయిన సుభద్రమ్మగారిని సుబ్రహ్మణ్యం గారు వారి కనుబొమ ముడితో ఆపేసేరు. ఆదిదంపతులలా వున్న వారిని చూసి శ్రీలేఖ భక్తిగా నమస్కారం పెట్టింది. "దీర్ఘ సుమంగళీభవ ..." అని నోరారా దీవించేరు ఆ పుణ్య దంపతులు. మనసు నిండిపోయింది శ్రీలేఖకి.

రంగనాథం వారిద్దరినీ తీసుకుని ఇంకొకరికి పరిచయం చెయ్యడానికి మరో వైపు వెళ్ళేడు. వెనక్కి చూస్తూ వెడుతున్న సుభద్రమ్మ గారిని సుబ్రహ్మణ్యం గారు చేయిపట్టి ముందుకు నడిపించుకు వెళ్ళిపోయేరు. "వాళ్లని చూస్తుంటే సాక్షాత్తూ పార్వతీ పరమేశ్వరులని చూసినట్టే వుంది కదండీ" అంటూ శ్రీలేఖ మూర్తిగారి వైపు చూసింది. స్థాణువులా నిలబడిపోయిన ఆయనను చూసి, "యేమైందండీ ..." అంది ఖంగారుగా ...

"లేఖా, మనం వెళ్ళిపోదాం పద" అంటూ లేఖకి మరోమాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా చెయ్యి పట్టుకుని గేటు బైటకి తీసుకుపోయి, మొబైల్ నుంచి డ్రైవర్‌ని రమ్మని చెప్పి, అతనొచ్చే లోపల అసహనంగా నిలబడిన భర్తని చూసి ఆశ్చర్యపోయింది

శ్రీలేఖ. పెళ్ళైన పదేళ్ళలోనూ మూర్తిగారినిలా చూడడం ఆమెకదే ప్రథమం. కారణం తెలుసుకునే సాహసం చెయ్యలేకపోయిందామె.

ఇంటికొచ్చిన దగ్గర్నుంచీ మూర్తిగారి ప్రవర్తన విచిత్రంగా తోచింది శ్రీలేఖకి. పెళ్ళికి వచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పడానికి రంగనాథం ఫోన్ చేస్తే ఆయన మాట్లాడకుండా శ్రీలేఖ చేత మాట్లాడించేరు. అసలు ఆ పెళ్ళి మాట వస్తేనే చిరాకు పడిపోతున్నారు. శ్రీలేఖకి ఇదంతా ఏమీ అర్థం కాలేదు. కానీ ఒకటి మటుకు అర్థమైంది. పెళ్ళిలో ఆ పుణ్య దంపతులని చూసిన దగ్గర్నుంచీ మూర్తిగారిలా ప్రవర్తి స్తున్నారు. అందుకు కారణం వాళ్లని కలుసుకుని, వాళ్లతో మాట్లాడితే కానీ తెలీదను కుంది శ్రీలేఖ.

శ్రీలేఖ జమిందార్లింట్లో పుట్టింది. ఆమె పుట్టేటప్పటికి జమీలు పోయినా, ఆమె తాతగారికి "రాజబహదూర్" అన్న బిరుదు వచ్చి చేరింది. పొలాలూ, తోటలూ మెండుగా వున్నా వాటితో మాత్రమే సరిపెట్టుకోకుండా వాళ్ళింట్లో ఆడవారూ, మగవారూ కూడా పెద్ద చదువులు చదివి, ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. పుట్టుకతోనే పదిమంది గల కుటుంబంలో పుట్టడం, వున్న సంపదని పదిమందికీ ఉపయోగపడేలా వెచ్చించడం, వున్నదాన్ని అందరితో కలిసి అనుభవించడం శ్రీలేఖకి పుట్టుకతోనే వచ్చింది. శ్రీలేఖని మూర్తిగారికి ఇవ్వడానికి ఆమె తండ్రి తటపటా యించింది కూడా ఇందుకే. మూర్తిగారి తల్లిదండ్రులు అమెరికాలో స్థిరపడిపోయేరు. పోనీ అలాగైనా పరవాలేదనుకున్నా, వారికీ, మూర్తిగారికీ రాకపోకలు లేవు. ఎంత చదువూ, ఉద్యోగం, ప్రవర్తనా బాగున్నా ఒంటికాయ శొంఠికొమ్ము లాంటి మూర్తిగారికి పిల్లనివ్వడానికి సాహసించలేకపోయేరు. కానీ, మూర్తిగారు శ్రీలేఖతో మాట్లాడిన తీరు చూసి, శ్రీలేఖ పట్టుబట్టడంతో కాస్త అయిష్టంగానే ఈ పెళ్ళి చేసేరాయన. పెళ్ళైనప్పట్నుంచీ శ్రీలేఖ చాలాసార్లు మూర్తిగారిని అత్తమామల గురించి అడిగింది. వాళ్ళు పెద్దవాళ్ళు, మనలని ఒక మాటన్నా తప్పులేదు, వారి ఆశీర్వాదాలు మనకి కావాలి, వారితో నన్ను ఒకసారి మాట్లాడించండి, నేను వారికి నచ్చచెప్పుకుంటాను అంటూ చాలాసార్లు ప్రాథేయపడింది భర్తని. కానీ, వాళ్ల మాటెత్తితే చాలు పరమ శాంతమూర్తిలా వుండే మూర్తిగారు అంతెత్తు లేవడం చూసి ఆ ప్రసక్తి తేవడం మానుకుంది. కానీ, నలుగురిలో పుట్టి పెరిగిన శ్రీలేఖకి అత్తవారివైపు బంధువులంటూ లేకపోవడం చాలా లోటుగా అనిపించేది.

ఆ మర్నాడు మూర్తిగారు ఆఫీస్‌కి వెళ్ళేక, శ్రీలేఖ పిల్లలకి లంచ్‌బాక్స్‌లు సిద్ధం చేయిస్తుంటే ఫ్యూన్ వచ్చి "అమ్మగారూ, అయ్యగారి కోసం ఎవరో అమ్మగారు

వచ్చేరండీ'' అన్నాడు. ఆఫీసు పనుల కోసం ఇలా ఇంటికొచ్చే వాళ్లంటే శ్రీలేఖకి చికాకు. కానీ మర్యాదకోసం ఓసారి పలకరించి ఆఫీస్‌కే వెళ్లమని చెపుతుంటుంది. అందుకే "కూర్చోమను, వస్తున్నా'' అంటూ మిగిలిన పని ఏం చెయ్యాలో వంట మనిషికి చెప్పి హాల్లోకొచ్చింది శ్రీలేఖ. హాలు మధ్యలో నిలబడి గోడల మీద వున్న ఫోటోలని చూస్తోందామె. వయసు ఇంచుమించు నలభై యేళ్ళుండొచ్చు. ఆకుపచ్చ జరీ బోర్డరున్న సంపెంగ రంగు గద్వాల్ చీర కట్టుకుని, మెడలో రెండు వరసల పలకసరులతో, నుదుట ఎర్రని కుంకుమతో, నిండు ముత్తైదువలా, చూడగానే ఆహ్లాదం కలిగించేలా, ప్రశాంతంగా నవ్వు మొహంతో నిలబడి వుందామె.

శ్రీలేఖని చూడగానే ఆప్యాయంగా ... "బాగున్నావామ్మా ...'' అంటూ లోపలికి తొంగిచూస్తూ "మెతకాడు లేడా ... ?'' అనడిగింది. తెల్లబోయింది శ్రీలేఖ. శ్రీలేఖ మొహం చూసి, తనెవరో చెప్పలేదని గుర్తొచ్చి, "అయ్యో ... నేనమ్మా. మా మెతకాడి గుండక్కని ...'' అంది నవ్వుతూ. మరీ అయోమయంలో పడిపోయింది శ్రీలేఖ. మళ్ళీ ఆవిడే ... "అయ్యో మెతకాడంటే నీకు తెలీదు కదూ ... ఇదిగో ... వీడే ...'' అంటూ ఆఫీసువాళ్లతో కలిసి సూటూ, బూటూ వేసుకుని ఫోటో తీయించుకున్న మూర్తిని చూపించింది. "ఆయన ... ఆయన ... యమ్. మూర్తిగారు ...'' అంది తడబడుతూ శ్రీలేఖ.

ఒక్కసారి ఫక్కున నవ్వేసిందావిడ. "యమ్ అంటే ఏవిటనుకున్నావూ ... మెతకాడనే ...'' అంటూ శ్రీలేఖని చూసి, "ఈ సంగతి నీకు తెలీదా ... మరి "యమ్'' అంటే ఏవిటనుకున్నారూ ...'' అనడిగింది. శ్రీలేఖకి ఒక్కసారి ఈ విషయం తండ్రి అడిగినప్పుడు మూర్తిగారు చెప్పిన "మద్దూరి ...'' అన్నమాట గుర్తొచ్చింది. తర్వాత అందరూ "మనీ మూర్తిగా'' రంటుంటే అదే స్థిరపడిపోయింది. మాటరాకుండా నిలబడ్డ శ్రీలేఖని చూసి, "ఎవ్వరేమన్నా నోట్లో ముద్దెట్టుకున్నట్టు నోరిప్పేవాడు కాదు చిన్నప్పుడు. అందరూ అందుకే మెతక మూర్తి అనేవారు. స్కూల్లో ఇంటిపేరు రాయమంటే అందుకే మా నాన్న "యమ్'' అని రాసేరు. స్కూల్లో వాణ్ణి వెనకాల కాచుకుంటూ, వాణ్ణి ఎవరైనా ఏదైనా అంటే వాళ్ల మీద విరుచుకు పడిపోయేదాన్ని నేను. అందుకే స్కూల్లో అందరూ నన్ను "గుండక్క'' అనేవారు. మా ఇద్దరి పేర్లూ స్కూల్లో ఇవే ...'' అంటూ చిన్నప్పటి సంగతులు గుర్తు తెచ్చుకోవడం వల్ల వచ్చిన ఆనందంతో పకపకా నవ్వేసిందావిడ. ఆవిడ మాటల చాతుర్యానికి వెంటనే నవ్వు వచ్చినా, అంతకన్న ఎక్కువగా మూర్తిగారికి చిన్నతనం బంధువులంటూ ఒకరు రావడం శ్రీలేఖకి అమితానందాన్ని కలిగించింది. ఒక్క ఉదుటన ఆవిడ దగ్గరకెళ్ళి, రెండు చేతులూ

పట్టేసుకుని, సోఫాలో కూర్చోబెడుతూ, "మూర్తిగారు మీకు తమ్ముడౌతారాండీ'' అనడిగింది. "ఊఁ ... మా ఇంట్లోనేగా వుండేవాడూ ... ఆ మెతకాడు ఏమీ చెప్పలేదా ... ఇప్పటికీ అలాగే వున్నాడా ... ఈ ఇల్లూ, ఆర్భాటం చూస్తే మరి బాగానే సంపాదించి నట్టున్నాడే. మరింకా నోరు లేవకపోవడం ఏంటబ్బా ...'' ఆశ్చర్యపోయిందావిడ.

శ్రీలేఖ ఆవిడ పేరు వజ్రమ్మ అని తెలుసుకుని, లోపలికి తీసికెళ్ళి, కాఫీ, ఫలహారాలిచ్చి మర్యాద చేసింది. వాళ్ళిద్దరి మధ్య జరిగిన సంభాషణలో శ్రీలేఖకి తెలిసినదేవిటంటే మూర్తిగారు ఎనిమిదేళ్ళుండగా ఒక కట్టెల అడితిలో పనిచేసేవారుట. వజ్రమ్మ తండ్రి సుబ్రహ్మణ్యంగారు నీళ్ల పొయ్యిలోకి కట్టెలు అక్కడి నుంచే తెప్పించు కునేవారట. వీళ్ళింటికి కట్టెలు తెచ్చినప్పుడల్లా సుభద్రమ్మగారు మూర్తికి ఆ టైముకి ఏదుంటే అది భోజనమో, టిఫినో పెట్టేదిట. అలాంటప్పుడు ఒకరోజు ఆ కట్టెల అడితి కాలిపోయిందిట. ఆ యజమాని వ్యాపారం మానేసి, పట్నంలో వుంటున్న కొడుకింటికి వెళ్ళిపోయేడుట. ఆ సంగతి తెలిసిన సుబ్రహ్మణ్యం గారు అనాథగా రోడ్డు మీద నిలబడ్డ మూర్తిని తన ఇంటికి తీసుకొచ్చేరుట. అసలు "మూర్తి'' అనే పేరు కూడా ఆయనే పెట్టేరుట. ఏ దిక్కు కెళ్ళాలో తోచక రోడ్డు మధ్యలో నిలబడి పోయినవాణ్ణి "నీపేరేంటి ?'' అనడిగితే, గుడ్లప్పచెప్పి చూసేట్ట కానీ, నోటమ్మట ఒఖ్ఖ ముక్క రాలేట్ట. అలా బొమ్మలా నిలబడిపోయేడని సుబ్రహ్మణ్యంగారే ఇంటికి తీసుకొచ్చేరుట. వజ్రమ్మ చదువుతున్న పుస్తకాలని ఆసక్తితో చూస్తుండడం చూసి, "మూర్తి'' అనే పేరుతో స్కూల్లో చేర్చేరుట.

చదువు మటుకు మూర్తి చాలా కసిగా చదివేవాడుట. తలయెత్తి ఎవ్వరితోనూ మాట్లాడేవాడు కాదుట. అతనికి ఏం కావాలో ఏవిటో అన్నీ వజ్రమ్మే చూసేదిట. సుబ్రహ్మణ్యంగారే డిగ్రీ అయ్యేదాకా ఫీజులవీ కట్టి చదువు చెప్పించేరుట. సర్వీస్ కమిషన్ పరీక్షలకి కూడా ఆయనే డబ్బు కట్టేరుట.

ఒకరోజు సర్వీస్ కమిషన్ నుంచి మెతకాడికి ఒక కవరు వచ్చిందిట. అది చూసుకుని, అయ్యగారికి చెప్పొస్తానంటూ ఇంట్లోంచి వెళ్ళిన మనిషి మళ్ళీ ఇంటికి రాలేదుట. ఎక్కడే ప్రమాదంలో చిక్కుకున్నాడోనని పాపం సుబ్రహ్మణ్యం గారు చాలా వాకబులు చేసేరుట. ఏమీ లాభంలేకపోయిందిట. సుభద్రమ్మగారయితే ఈ మెతకాడి గురించి ఎంతమంది జ్యోతిష్కులనో ప్రశ్నలడిగేరుట. అందరూ కూడా అబ్బాయి ఎక్కడో అక్కడ బాగానే వున్నాడని చెప్పేక కానీ ఆవిడ ప్రాణం కుదుట పడలేదుట. ఈలోపల వజ్రమ్మకి పెళ్ళవడం, అత్తారింటికి వెళ్ళిపోవడం, నెమ్మది నెమ్మదిగా మెతకాడి విషయం మరుగున పడిపోవడం జరిగిందిట. ఆ తర్వాత పదిహేను సంవత్సరాలకి మళ్ళీ ఇప్పుడే చూడడంట.

"నిన్న పెళ్ళిలో చూసేను ఆ మెతకాణ్ణి. గబగబా వచ్చి మాట్లాడదామనుకునేంతలో వెళ్ళిపోయేడు. అందుకే ఇవాళ ఆడపెళ్ళివారి నడిగి వాడి అడ్రస్ కనుక్కుని ఈ అక్కనెలా మర్చిపోయేవురా ... అని అడుగుదామని వచ్చేను."

వజ్రమ్మ చెప్పిందంతా సంభ్రమాశ్చర్యాలతో వింటుండిపోయింది శ్రీలేఖ. ఇదంతా నమ్మశక్యంగా లేదు. అంటే మూర్తిగారు అనాథా ? అమ్మా నాన్నా అమెరికాలో వుంటారని చెప్పింది అబద్ధమా. మరయితే స్వంత పిల్లాడిలా ఇంట్లో పెట్టుకుని చదివించిన ఆ పుణ్యాత్ములను ఎలా మర్చిపోయేరు మూర్తిగారు. ఇదంతా నిజమా. ఈ వజ్రమ్మ ఒకరిని చూసి ఒకరు అనుకోటం లేదు కదా. "మనం ఒకసారి మీ నాన్నగారి దగ్గరికి వెడదామా ... ?" అనడిగింది వజ్రమ్మని. "ఊ ... పద పద. మా అమ్మా నాన్నా ఎంత సంతోషిస్తారో నిన్ను చూసి. అవునూ, పిల్లలు ఇంకా అప్పుడే రారా స్కూల్ నుంచి. వాళ్ళని కూడా తీసుకొస్తే ఇంకా బాగుంటుంది" అంటూ శ్రీలేఖతో కలిసి రంగనాథం గారింటికి వచ్చింది వజ్రమ్మ.

వజ్రమ్మ వస్తూనే ... "మన మెతకాడు కనిపించేడు నాన్నా నిన్న పెళ్ళిలో. ఇవాళ వాడి అడ్రస్ పట్టుకుని వాళ్ళింటికి వెళ్ళేను. ఇదిగో ఈ శ్రీలేఖే మన మెతకాడి భార్య ..." అంటూ తల్లిదండ్రులిద్దరితో ఆనందంగా చెప్పింది. వజ్రమ్మతో పాటు వచ్చిన శ్రీలేఖని చూసి ఆశ్చర్యపోయేరు సుబ్రహ్మణ్యం గారు, సుభద్రమ్మ గారు. శ్రీలేఖ నెమ్మదిగా ఆ ఇద్దరూ కూర్చున్న సోఫా దగ్గరికి నడిచి, వంగి వాళ్ళకి పాదాభి వందనం చేసింది.

"నాకు తెలీలేదండీ. లేకపోతే నిన్ననే మీ ఆశీర్వాదాలు తీసుకునేదానిని ..." అంది గద్గదంగా. సుభద్రమ్మగారు శ్రీలేఖని లేవనెత్తి అక్కున చేర్చుకున్నారు. శ్రీలేఖ సుబ్రహ్మణ్యం గారి వైపు చూసి, "ఆయన తరఫున నేను క్షమార్పణలు అడుగుతున్నాను. మూర్తిగారు నాకు ముందుగా ఈ విషయం చెప్పకపోవడం వల్ల జరిగిన పొరపాటుకి బాధపడుతున్నాను. మమ్మల్ని క్షమించి మీరిద్దరూ మా ఇంటికి రండి" అంది.

"వాడేం చెప్పేడమ్మా నీకూ ?" అడిగేరు సుబ్రహ్మణ్యంగారు. "ఆయన తల్లిదండ్రులు అమెరికాలో వున్నారనీ, ఇద్దరి మధ్యా వున్న విభేదాల వల్ల కలుసుకోలేమనీ చెప్పేరు. "అపరాధభావం గొంతులో పలుకుతుంటే జవాబిచ్చింది శ్రీలేఖ. "మరింకేం ... వాళ్లని అలాగే అమెరికాలోనే వుండనీ" చిన్నగా నవ్వుతూ అన్నారాయన. "అదెలాగండీ ? కన్నతండ్రిలా పెంచి, విద్యాబుద్ధులు చెప్పించిన మీరు కళ్ళెదురుగా వుంటే ..."

"ఎవరన్నారు అలాగనీ ... ?" మధ్యలో ప్రశ్నించేరాయన. "ఇప్పుడే మీ అమ్మాయి చెప్పేరు."

"మా అమ్మాయి చెప్పేదాకా నీకు తెలీదు కదా ... ఇక్కడందరికీ వాడి అమ్మా నాన్న అమెరికాలో వున్నారనే అనుకుంటున్నారు కదా. వాడెందుకు అలా చెప్పేడో. మనం ఎందుకు కాదనాలీ. అలానే వుండనీ." కోపంలాంటిది వచ్చేసింది శ్రీలేఖకి. బలవంతాన ఆపుకుంది. "అది న్యాయమెలా అవుతుందండీ. మీ నుంచి ఇలా పారిపోవడం ఆయన చేసిన తప్పుకాదా ... ?"

సుబ్రహ్మణ్యం గారు చిన్నగా నవ్వేరు. "చూడమ్మా. అలా అనుకోవడం నీలో వున్న సంస్కారం. కానీ మీ ఆయనకి తను ముందు గడిపిన జీవితం తల్చుకుందుకు కూడా ఇష్టపడడం లేదని దీనివల్ల తెలుస్తోంది. ఆ జీవితాన్ని అతనెంత అసహ్యించు కున్నాడో, అవకాశం రాగానే దానిని కప్పెట్టి, కొత్తకథ సృష్టించి పదిమందిలోనూ తన గౌరవాన్ని ఎలా పెంచుకున్నాడో తెలుస్తోంది కదా. అటువంటప్పుడు మేం వచ్చి తగుదునమ్మా అని వాడు పెంచుకున్న గౌరవాన్ని కూలద్రోయడం బాగుంటుందా చెప్పు ?"

"మీకు కృతజ్ఞులుగా వుండవలసిన అవసరం ఆయనకి లేదంటారా ?" సూటిగా అడిగింది శ్రీలేఖ.

"చూడమ్మా మేం ఏదో చేసేసేమనీ, మా వల్లే మూర్తి ఇంత గొప్పవాడయ్యాడనీ, అతను అస్తమానం ఆ విషయం పదిమందితో చెప్పి, మమ్మల్ని అందలం ఎక్కించాలని అతనికి సాయపడలేదమ్మా. ఆ సమయంలో అతను దిక్కులేకుండా వీధిన పడితే ఇంట్లో ఆశ్రయం ఇచ్చి, అన్నం పెట్టేం. చదువు వస్తోంది కదా అని ఫీజులు కట్టి చదివించేం. అంతే. అంతవరకే. అది అస్తమానం గుర్తు చేసుకుంటూ మమ్మల్ని పొగడాలని మేమెప్పుడూ ఆశించలేదు."

"మీరు ఆశించకపోవచ్చుండీ. కానీ, ఆయనకి ఆ సంస్కారం ఉండొద్దూ ..."

"కొంతమంది అలా చిన్నప్పుడు ఎంత కష్టపడ్డారో, ఎవరెవరింట్లో వారాలు చేసుకునేవారో చెప్పుకుంటారమ్మా. అలా చెప్పుకుందుకు వాళ్ళేమీ సిగ్గు పడరు. కానీ మరికొంతమంది వుంటారు. వాళ్ళు అలా గడిపిన జీవితాన్ని మళ్ళీ గుర్తు చేసుకోవాలనుకోరు. నలుగురిలో చిన్నతనమని భావిస్తారు. అది ఒక పీడకలలా మర్చిపోవడానికి ప్రయత్నిస్తారు. అలాంటివాడే మీ ఆయన కూడా. అందుకే అమెరికాలో లేని అమ్మానాన్నల్ని సృష్టించి, ఆ అందమైన భ్రమలో అందర్నీ వుంచేడు. నిన్న పెళ్ళిలో వాడి ముఖం చూడగానే నాకీ విషయం అర్థమైపోయింది. అందుకే

ఆప్యాయంగా పలకరించబోయిన మా ఆవిణ్ణి కూడా ఆపేసేను. ఇప్పుడు వజ్రమ్మ మీ ఇంటికి వెడుతున్నట్టు మాకు తెలీదు. తెలిస్తే వెళ్ళొద్దని చెప్పేవాళ్లం.''

సుబ్రహ్మణ్యం గారి పెద్దమనసుకి శ్రీలేఖ నివ్వెరపోయింది. ఆపుకోలేక ఆయన కాళ్ళమీద పడి భోరున ఏడ్చేసింది. సుభద్రమ్మగారు శ్రీలేఖని లేవదీసి పక్కన కూర్చో బెట్టుకున్నారు. చాలా మామూలుగా మాట్లాడుతూ పిల్లల గురించీ, శ్రీలేఖ పుట్టింటి గురించీ అడిగి తెలుసుకున్నారు.

చాలాసేపు వాళ్లతో అలా మనసు విప్పి మాట్లాడితే కాని శ్రీలేఖ మనసు కుదుట పడలేదు. ఇంక పిల్లలు స్కూల్ నుంచి వచ్చే టైమయిందని తప్పక వెళ్ళడానికి లేచింది. వీధిగుమ్మం వరకూ వచ్చిన సుభద్రమ్మగారు నెమ్మదిగా శ్రీలేఖతో అన్నారు. "చూడమ్మా. నువ్వీ విషయం ఇక్కడే మర్చిపో. మెతకాడిని నువ్వు మా గురించేమీ అడగకు. నీకు ఈ విషయం తెలిసిందనుకుంటే వెర్రివెధవ నీ ముందు చిన్నబోతాడు. వాడినేమీ అడగవుకదూ'' అంటూ చేతిలో చెయ్యి వెయ్యమన్నట్టు చెయ్యి చాపేరావిడ. ఏం మాట్లాడాలో తెలీకుండా నిలుచున్న శ్రీలేఖ చేతిని ఆవిడే తన చేతిలో వుంచుకుని మాటిచ్చినట్టు గట్టిగా నొక్కి వదిలేసేరు.

భక్తులు అడక్కుండానే వరమిచ్చే అమ్మవారిలాగా నిలబడ్డ ఆవిడని వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ బైటకి నడిచింది శ్రీలేఖ ❊

**స్వాతి మాసపత్రిక : డిసెంబర్, 2015**

# మేడిపండ్లు ...

**కా**కినాడ నుంచి సికిందరాబాదు చేరే గౌతమీ ఎక్స్‌ప్రెస్ రావలసిన టైమ్‌కి అయిదునిమిషాల ముందుగానే ప్లాటుఫారం చేరింది. రిజర్వుడు కంపార్ట్‌మెంటు లోంచి నెమ్మదిగా దిగింది డెబ్బైయేళ్ళు పైబడ్డ తులసమ్మ. పచ్చటి ఛాయా, పూర్తిగా నెరిసిన జుత్తూ, ప్రయాణం వల్ల అలసట సూచిస్తున్న కళ్ళూ, నుదుట చెదిరిపోతున్న విభూదిరేఖా, చిక్కిన శరీరం లోంచి పైకి తేలి కనపడుతున్న నరాలూ, కాస్త వంగిన నడుమూ, గుంటూరు జరీచీరతో వున్న ఆవిడ చేతిలో చిన్న సంచీతో రైలు దిగి కొడుకు కోసం ప్లాటుఫారమంతా కలయచూసింది.

సరిగ్గా అదే సమయానికి ఆవిడ కొడుకు కృష్ణమూర్తి ఇంటి దగ్గర కాఫీ తాగుతూ మధ్యమధ్యలో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు.

"రామారావుగారా ! గుడ్‌మార్నింగ్ సర్. నిన్నటినుంచి మీ కోసం ట్రై చేస్తున్నాను. అహ ... ఏం లేదు ... ఈరోజు మా మనవడి పుట్టింరోజు. సర్దాగా వైస్రాయ్‌లో డిన్నర్ ఏర్పాటు చేశాం. అసలు నేను పర్సనల్‌గా వచ్చి మిమ్మల్ని పిలుద్దా మనుకున్నాను. కాని మొన్ననే చుట్టాలింట్లో పెళ్ళికని రాజమండ్రి వెళ్ళిన మా అమ్మగారు ఇవాళ గౌతమీలో వస్తున్నారు. స్టేషన్‌కి వెళ్ళాలి. మీకు తెలుసుకదా ... మా అమ్మగారి ఆశీర్వాదం లేందే మేం అడుగు కూడా వెయ్యం. స్వయంగా రాలేకపోతున్నందుకు ఏమీ అనుకోకండి. మీరు మీ ఫ్యామిలీతో రాత్రి డిన్నర్‌కి తప్పక రావాలి.

అలాంటి మాటలే చెపుతూ మరో నలుగురైదుగురికి ఫోన్ చేసేడు కృష్ణమూర్తి. పక్కనే కాఫీ తాగడానికి అతనికి కంపెనీ ఇస్తున్న ఇంటి యజమానురాలు గిరిజ "ఇంకా ఎంతమందికి చెయ్యాలండీ బాబూ ... అన్నీ లాస్ట్ మినిట్ దాకా పెట్టుకుంటారు" అంది.

"అందరూ చాలా బిజీ మనుషులోయ్. నాల్రోజుల్నించి ట్రై చేస్తుంటే ఇంత పొద్దున్నే కనక దొరికేరు. వాళ్ళతో మనకి చాలా పన్లున్నాయి."

"అయినా ఇప్పుడు పనికట్టుకుని మీ అమ్మగార్నెందుకండీ రమ్మనడం ? వట్టి చాదస్తం మనిషి."

"అలాగంటే ఎలాగోయ్ ? నలుగురూ వచ్చినప్పుడు అమ్మేదని అడగరూ ?

ఫంక్షన్‌లో ఆవిడ కనపడకపోతే వున్న పరువుకాస్తా పోదూ ? అయినా రేపెలాగూ వెళ్ళిపోతుంది కదా ! ఒక్కరోజుకేదో సర్దుకో.''

"సర్లెండి. స్టేషన్‌కి ఎవర్ని పంపుతారో చూడండి. రాము ఇంకా రాలేదు. దాసు కోడలి స్నేహితురాలి కోసం బస్టాండు కెళ్ళేడు. మరి మీరు వెడతారో, రఘుని పంపుతారో చూసుకోండి.''

"నేనా ! ఇంత పొద్దున్నే స్టేషన్‌కా ? దాసు బస్టాండు నుంచి వచ్చాక పంపుదాంలే.''

"మరి అప్పటికి గౌతమీ వచ్చేసుంటుందేమో !''

"వచ్చేస్తే ఆవిడ స్టేషన్‌లో కూర్చుంటుందిలే. ఇంటికొచ్చి మటుకు ఏం చెయ్యాలి కనుక ... ఆ ... అవును ... కార్లు రెండూ అట్టిపెట్టు. పంపకు. ఆవిణ్ణి ఆటోలో తీసుకురమ్మని దాసుతో చెప్పు. మళ్ళీ పిల్లలు లేచి కారు కావాలంటే ఇబ్బంది అవుతుంది.''

"అలాగే ...''

వంటింట్లో టిఫిన్ తయారుచేస్తున్న వంటమనిషి దేవమ్మకి ఈ మాటలన్నీ వినపడుతూనే వున్నాయి. ఆ ఇంట్లో మనుషులు చెప్పే మాటలకీ, చేసే పనులకీ పొంతన కనిపించడం లేదావిడకి. అయినా తనకెందుకు ? తనలాంటివాళ్ళు ఇటువంటి ఇళ్ళల్లో జరిగే సంఘటనలకి కళ్ళూ, చెవులూ, నోరూ మూసుకుంటే తప్పితే రోజు గడవదు అనుకుంది.

కృష్ణమూర్తి పెద్ద హోదాలో వున్న ప్రభుత్వోద్యోగి. హైద్రాబాద్‌లో ఆనందనగర్ కాలనీలో పెద్దమేడ కట్టుకున్నాడు. ప్రభుత్వోద్యోగిగా పెద్ద హోదాలో వుండడంతో జీతం కాక మామూలుగా అతనికి అందే వాటా అతని కందుతూనే వుంటుంది. అదికాక అతని తెలివితేటలతో రెండు చేతులతోనే కాకుండా రెండు నాల్కలతో కూడా సంపాదిస్తాడు. భార్య గిరిజ అతనికి సరైన జోడీ. ఇద్దరూ కలిసి ఏదైనా ఇంట్లోకి తెచ్చుకోవడం తప్పితే పూచికపుల్ల కూడా బైటకి పోనీరు. ఇద్దరికీ ఆడంబరాలు ఎక్కువే. వాళ్ళింట్లో వాళ్ళు మిరపకాయ మాడ్చుకునే తింటారు. కాని ఎవరింటి కయినా వెడితే మటుకువాళ్ళు మూడుపూటలకు బదులు అయిదు పూటలు తింటారు. వాళ్ళకిద్దరు పిల్లలు. అబ్బాయి, కోడలు లండన్ నుంచి వచ్చేరు. అమ్మాయి, అల్లుడు అమెరికా నుంచి వచ్చేరు. మనవడి పుట్టిన్రోజు హోటల్ వైస్రాయ్‌లో ఘనంగా చేస్తున్నాడు కృష్ణమూర్తి. ఇంత డబ్బు ఖర్చుపెడుతున్నాడూ అంటే ఇంతకింత లాభం వచ్చే ప్లానేదో అతనికి తప్పకుండా వుండే వుంటుంది.

కృష్ణమూర్తి అన్నయ్య రాజారావు ఆ ఊళ్ళోనే బిజినెస్ చేస్తున్నాడు. డబ్బు విషయంలో అక్షరాలా కృష్ణమూర్తికి అన్నయ్యే ! బిజినెస్ మాన్ కనక అతనికి వ్యాపారంలో అన్నీ న్యాయబద్ధమే. ఎదుటివాడిని చంపి వాడి సమాధి మీద మేడ కట్టగల సమర్థుడతను. అన్నదమ్ములిద్దరికీ అందుకే అంత అన్యోన్యత. వాళ్ళ సంభాషణ ఎప్పుడూ ఈవారం మనం ఎంత సంపాదించామనే లెక్కలమీదే వుంటుంది. ఆఖరికి ఆరోజు వూర్నుంచి తల్లి వస్తుందని తెలిసి కూడా, పని కట్టుకుని పొద్దున్నే తమ్ముడింటికివెళ్ళి ఆవిడని చూడాలాయేంటీ, పెట్రోలు దండగ, రాత్రికెలాగూ హోటల్లో కలుస్తాను కదా అనుకునే మనిషి. అతని భార్య వనజ కూడా స్వభావంలో గిరిజకి సరిగ్గా అక్కే అవుతుంది. భగవంతుడు ఇటువంటివాళ్ళని భలేగా ఒకదగ్గరికి చేరుస్తాడేమో అనిపిస్తుంది.

టైము తొమ్మిదవుతోంది. పొద్దున్న ఏడవకుండా రైలు దిగిన తులసమ్మ ప్లాటుఫారం మీద నిలబడి నిలబడి కాళ్ళు లాగి గేటు కనపడేలా వున్న బెంచీ చూసుకుని దానిమీద కూర్చుంది. రాజమండ్రిలో ఎప్పుడో మొగుడు కట్టించిన ఇంట్లో ఒక వాటా అద్దెకిచ్చి మరొక వాటాలో వుంటూ ఆవిడ బతుకు ఆవిడ బతుకుతోంది. ఈ ముసలివయసులో కొడుకులు తనని దగ్గర పెట్టుకోలేదని ఆవిడ ఏనాడూ అనుకోలేదు. కృష్ణమూర్తి ఫోన్‌చేసి మనవడి పుట్టిన్రోజుకి రమ్మని చెప్పినప్పుడు కూడా ఆవిడ చెప్పింది. "ఇదేమయినా పెళ్ళా ? ఒడుగా ? అవయితే ఎలాగూ వస్తాను. పుట్టిన్రోజు మీరంతా సర్దాగా చేసుకోండి ..." అని. కృష్ణమూర్తి ససేమిరా వినలేదు.

"ఎంతమ్మా ... ఇవాళ గౌతమీలో రావడం, మర్నాడు గౌతమీలో వెళ్ళిపోవడం. ఆ మర్నాడెలాగూ మేం నార్తిండియా టూర్ వెడుతున్నాం కదా ... నువ్వింక మాట్లాడకుండా బయల్దేరు. నేను నిన్ను స్టేషన్‌లో దింపుకుంటాను. సరేనా !" అంటూ ఫోన్ పెట్టేసేడు. అందుకే కొడుకు సూచించినట్టే తిరుగు ప్రయాణానికి కూడా టిక్కెట్టు కొనుక్కుని మరీ బయల్దేరిందావిడ.

స్నానంచేసి తులసికోటలో నీళ్ళు పోస్తే కానీ ఆవిడ పచ్చి మంచినీళ్ళు కూడా గొంతులో పోసుకోదు. నరాలు పట్లు సడలుతున్నట్లనిపిస్తున్నాయి. స్వయంగా ఆటో చేసుకుని కొడుకింటికి వెడదామా అంటే ఎన్నిసార్లు వెళ్ళిన ఇల్లయినా ఆ అడ్రసు పట్టుకోగలదో లేదోనని భయం. ఎంట్రెన్సు వైపు చూసీ చూసీ ఆవిడ కళ్ళు నెప్పులు పెట్టడం కూడా మొదలైంది.

దాసు బస్టాండు నుంచి కోడలు స్నేహితురాలు రమని తీసుకుని ఇంటి దగ్గర దింపి, మళ్ళీ తులసమ్మ కోసం సికింద్రాబాదు స్టేషన్ కొచ్చేడు. స్టేషన్‌కి వెళ్ళేటప్పుడు

బస్‌లో వెళ్ళమనీ, వచ్చేటప్పుడు తులసమ్మని తీసుకుని ఆటోలో రమ్మనీ అందుకు సరిగ్గా సరిపడ డబ్బులు మాత్రం ఇచ్చింది గిరిజ అతనికి. అందుకనే బస్ కోసం ఎదురుచూసి అది వచ్చేక దానిలో రావడంతో దాసు స్టేషన్‌కి వచ్చేసరికి తొమ్మిది దాటింది. దాసుని చూడగానే తులసమ్మకి ప్రాణం లేచొచ్చింది. ఆవిణ్ణి ఆటో ఎక్కించి, ఇద్దరూ కలిసి ఇల్లు చేరేటప్పటికి టైము దాదాపు పదవుతోంది.

ఇంట్లో అందరూ తులసమ్మని పలకరించేరు "హాయ్ ..." అంటూ. వెంటనే "బాయ్ ..." అంటూ తమ తమ పనులమీద వెళ్ళిపోయేరు. అందరి పలకరింపులూ అయ్యేక వంటింట్లో కొచ్చిందావిడ. దేవమ్మని పలకరించి నిత్యకృత్యంలో పడింది.

డిన్నర్ రాత్రి ఏడుగంటలకని అందరికీ చెప్పేరుకానీ, కృష్ణమూర్తి ఇంట్లో వాళ్ళందరూ తెమిలేసరికే ఏడున్నర దాటింది. ఒకరు మనిషిని అప్పటికప్పుడు డ్రైక్లీనింగ్ షాప్‌కి పంపితే, మరొకరు మేచింగ్ బ్లౌజ్ ఇంకా రాలేదని మరో మనిషిని టైలర్ దగ్గరికి పంపేరు. ఇంట్లో వున్న పనివాళ్ళతో పాటు ఆఫీసు ప్యూన్లు కూడా దేనికో దానికి ఇంట్లోకీ బైటకీ హడావిడిగా తిరుగుతూనే వున్నారు. వాళ్ళ హడావిడిలో అడ్డమెందుకని తులసమ్మ ఏడుగంటలకల్లా కాస్త మొహం కడిగేసుకుని, జుట్టును వేళ్ళతో సరిచేసుకుని వేలిముడి వేసుకుని, జరీచీర కట్టుకుని, ఎప్పుడు రమ్మంటారా అని ఎదురుచూస్తూ హాల్లో సోఫాలో కూర్చుంది.

లోపలికి బైటకి హడావిడిగా తిరుగుతున్న కృష్ణమూర్తి తల్లిని చూసేడు. వెంటనే భార్యని పిలిచేడు.

"నీకసలు మతుందా ? ఆవిడా నూలుచీర కట్టుకుని వస్తుందా ? నలుగుర్లో నాకెంత అనుమానం ?"

అన్న భర్త మాటలకి వెంటనే గిరిజ బీరువా అంతా తిరగేసి తను ఈ మధ్య కట్టుకోవడం మానేసిన పాతపట్టుచీర ఒకటి బైటకి తీసింది.

"అత్తయ్యా, ఇదిగో, ఈ పట్టుచీర కట్టుకోండి. మీకు బాగా నప్పుతుంది" అంది ఆవిడతో.

"నాకెందుకమ్మా పట్టుచీర ? బరువుగా వుంటుంది. కాసేపటికే కాళ్ళు లాగేస్తాయి. ఇదయితే తేలిగ్గా సుఖంగా వుంటుంది" తులసమ్మ సమాధానం చెప్పింది.

"అదికాదత్తయ్యా, నలుగుర్లో బాగుండదంటున్నారు మీ అబ్బాయి" అంది గిరిజ.

"పెద్దదాన్ని. నేనేం కట్టుకుంటేనేంటమ్మా. మీరు మంచివి కట్టుకోండి" అన్న

తులసమ్మ మాటలు విన్న కృష్ణమూర్తి, "అమ్మా, ఎన్నిసార్లు చెప్పించుకుంటావ్ ? ఇచ్చిందిగా పట్టుచీర, కట్టుకోడానికేం ?'' అంటూ గట్టిగా అరిచేడు.

మరింక మాట్లాడలేదు తులసమ్మ. చీర మార్చుకుని వచ్చింది. ముత్యాలు, పగడాలు కలిపి చుట్టించిన రెండుపేటల గొలుసొకటి ఆవిడ చేతికిచ్చింది గిరిజ. మారుమాట్లాడకుండా వేసుకుంది తులసమ్మ. ఆఖరికందరూ తెమిలి హోటల్ వైస్రాయ్ చేరేసరికి రాత్రి ఎనిమిదయింది.

హోటల్ ముందు కారు దిగినదగ్గర్నుంచీ ఫోటోలూ, వీడియోలూ ప్రవాహంలా తియ్యడం మొదలుపెట్టేరు. లాన్‌లో ఒకవైపు స్టేజిని ఎంతో కళాత్మకంగా అలంకరించేరు. సిటీలో వున్న పూలరకాలన్నీ అక్కడే వున్నాయా అన్నట్టు స్టేజిమీద మయూరంషేపులో వున్న సింహాసనం లాంటి కుర్చీని తాజాపూలతో ఎంతో అందంగా తీర్చిదిద్దేరు. ఆ అందాన్ని ద్విగుణీకృతం చేస్తూ వాటి అందాల్ని ప్రతిఫలిస్తున్న రంగు రంగుల బల్బుల అమరిక చూస్తుంటే రెండుకళ్ళూ చాలవనిపిస్తోంది. ఆ పూలకున్న సహజమైన సువాసనే అనిపిస్తున్నట్టున్న సెంటువాసనలు ఆ పరిసరాల్ని కమ్మేసాయి. అసలా లాన్‌లో అడుగుపెట్టగానే ఒక మత్తయిన పరిమళం ఆహుతులందరినీ సమ్మోహ పరుస్తోంది. ఆ సింహాసనం మీద యువరాజులా కూర్చున్నాడు పుట్టిన్రోజు పెళ్ళి కొడుకు, కృష్ణమూర్తి మనవడు మూడేళ్ళవాడు. తళుకు తళుకు తారలమధ్య చంద్రుడిలా, వన్నె చిన్నెల గోపికల మధ్య చిన్నికృష్ణుడిలా వెలిగిపోతున్నాడా చిరంజీవి. వచ్చిన అతిథులందరికీ లాన్‌లో విశాలంగా డిన్నర్ ఏర్పాట్లు చేయించారు.

స్టేజిమీద మనవడి పక్కన నిలబడ్డ కృష్ణమూర్తి, గిరిజ తులసమ్మని కూడా తమ పక్కనే వుంచుకున్నారు. వచ్చినవాళ్ళు తెలిసున్న వాళ్ళయితే తులసమ్మ వాళ్ళవీ, పిల్లలవీ క్షేమ సమాచారాలు కనుక్కుంటోంది. తెలియనివారిని వారి వారి హోదాలతో సహా తల్లికి పరిచయం చేస్తున్నాడు కృష్ణమూర్తి. అతిథుల్లాగే వచ్చి పలకరించిన పెద్దకొడుకూ, కోడళ్ళ పలకరింపు తృప్తిగా అనిపించలేదు తులసమ్మకి. వాళ్ళని దగ్గరగా కూర్చోబెట్టుకుని మనవళ్ళ గురించి పేరు పేరునా కనుక్కోవాలని ఎంతో ఆశపడింది. కానీ ఆవిడకా అవకాశం రాలేదు.

కానీ వనజ, గిరిజ మటుకు అత్తగారంటే ఎంతో గౌరవం వున్నట్టు ప్రతి చిన్నదానికీ "అత్తయ్యా, ఏవంటారూ ... ?'' అని ఆవిణ్ణి అడుగుతుండడం, చాలా వినయంగా ఆవిడ దగ్గర మసలుకోవడం జరుగుతోంది. కృష్ణమూర్తి అయితే మరీనూ. అతిథులందరూ ఇది చూసి ముగ్ధులయ్యేరు.

"చూడండి ... అంత డబ్బూ, హోదా వున్నా కూడా ఆయన వినయం ? ఆ

తల్లిని ఎంత నెత్తిమీద పెట్టుకుంటున్నాడో. అందుకే ఆయన అంత పైకెదుగుతున్నాడు. మొత్తానికి అదృష్టమంతా ఆ తల్లిది. గీటుదాటని గజాల్లాంటి కొడుకుల్ని కన్న ఆవిడ ఎంత అదృష్టవంతురాలో. ఆ కోడళ్ళు మటుకు ! ఆ వినయం ... ఆ వందనం ... ఆవిడకి పెద్దరికం కట్టబెట్టడం ... అదీ గొప్ప. కొడుకులకేం లెండి ... వాళ్ళు ఆవిడ పిల్లలే. కానీ బైటనుంచి వచ్చిన కోడళ్ళు కూడా అలా వుండడం ఆవిడ అదృష్టమే ...'' అనుకున్నారు అందరూ.

కొందరు వాళ్ళ పిల్లలతో చెపుతున్నారు ... "చూసేరా అంకుల్‌ని. తల్లినెలా గౌరవించాలో ఆయన్ని చూసి నేర్చుకోండి ...'' అంటూ.

రాత్రి తొమ్మిదయింది. పదయింది. మనవడొకసారి, వాళ్ళ అమ్మా, నాన్న ఒకసారి, కృష్ణమూర్తి, భార్య మరోసారి ... ఇలా అంచెలంచెలుగా ఒక్కొక్కరూ ఒక్కొక్క సారి వెళ్ళి డిన్నర్ ముగించుకుని వచ్చేరు. తులసమ్మకేం చెయ్యడానికీ పాలు పోవడం లేదు. అక్కడుండాలో తెలీదు, అఖ్ఖర్లేదో తెలీదు. స్టేజిదిగి కిందకెడితే మళ్ళీ ఎవరికైనా పరిచయం చెయ్యాల్సొచ్చి పిలుస్తారేమో ? రాత్రంతా ప్రయాణం చేసిన బడలిక. మధ్యాహ్నం ఇంట్లో పిల్లలకోసమని అన్నీ మసాలా కూరలు వండించింది గిరిజ దేవమ్మచేత. అవన్నీ తులసమ్మ తినదు. కాస్త మజ్జిగ అన్నం మాత్రం తింది. నీరసంగా అనిపిస్తోందావిడకి. దానికితోడు ఈ పట్టుచీర బరువొకటి. ఆ బరువుకి నిలబడి నిలబడి కాళ్ళు లాగేస్తున్నాయి. ఎరువు తెచ్చి వేసుకున్న రెండు పేటల గొలుసు మాటిమాటికీ బరువెక్కుతున్నట్టుంది. పోనీ తెగించి కిందకి వెళ్ళి ఏమైనా తిందామా అంటే కిందకి దిగితే ఏమంటారో ? ఒకవేళ దిగివెళ్ళి ఏమైనా తిందామన్నా అక్కడ తను తినగలిగేవి వున్నాయో ... లేదో ? అయినా అంతమంది మధ్యలోకి వెళ్ళి ప్లేటు పుచ్చుకుని కనీసం పెరుగన్నమయినా వేసుకుందామన్నా, ఆ అన్నం ప్లేటుని ఎలా పట్టుకు తినాలో ఆవిడకి అర్థంకావటం లేదు. జనాలు ... జనాలు ... మందలు ... మందలు. కొంతమంది నాలుగురోజులుగా తిండిమొహం చూడనట్టు ఆత్రంతా తింటుంటే, మరికొంతమంది ప్లేటులో వేసుకున్న ఒక్కో అయిటమ్ సగం తిని పడేస్తున్నారు.

పోనీ పెద్దకొడుకుని పిలిచి ఏమైనా అడుగుదామని అతనికోసం కలియ చూసిందావిడ. చాలా దూరంగా ఎవరితోనో ఎంతో మర్యాదగా మాట్లాడుతున్నట్టు కాస్త ముందుకి వంగి మాట్లాడుతూ కనిపించేడు. లాభంలేదు ... తన పిలుపు వినిపించదనుకుంది.

తులసమ్మ కింక నీరసంతో కళ్ళు తిరిగినంత పనవుతోంది. మొహమాటం

చంపుకుని ప్లేటు పుచ్చుకుని కాస్త మజ్జిగన్నం తిందామన్నా అక్కడసలు అన్నముంటుందో లేదో కూడా ఆవిడకి తెలీలేదు. భగవంతుడావిడ మొర ఆలకించినట్టు, ఆఖరి అతిథిని కూడా పంపించి కృష్ణమూర్తి కిందనుంచి తల్లిని కేకేసేడు. అందు కోసమే ఎదురుచూస్తున్న తులసమ్మ స్టేజిదిగి కొడుకు దగ్గరికెళ్ళి "ఇక్కడ అన్నముం టుందిరా అబ్బాయ్ ... ?" అనడగబోయింది.

"తొందగా రామ్మా. మరో రెండు ట్రిప్పులేస్తే కానీ అవదు ..." అంటూ గబ గబా కారువైపు నడిచేడు. మారుమాట్లాడకుండా కారెక్కిందావిడ.

ఇంటి కొచ్చేటప్పటికి రాత్రి పదకొండవుతోంది. బరువుకి కాళ్ళు లాగేస్తున్న ట్టుగా వున్న ఆ పట్టుచీర మార్చి జాగ్రత్తగా మడతపెట్టి, మెళ్ళో గొలుసు కూడా తీసి, రెండు మనవరాలి చేతిలో పెట్టి, తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది తులసమ్మ. కాస్త మొహమాటంగానే వంటగదిలో కెళ్ళింది. మర్నాడు పొద్దున్నే టిఫిన్‌కి కావల్సిన ఏర్పాట్లు పూర్తిచేసుకుని, వంటిల్లంతా సర్ది, ఓపక్కగా చాప పరుచుకుని పడుకుందుకు సిద్ధపడుతోంది దేవమ్మ. తులసమ్మని చూడగానే "ఏం కావాలమ్మా ?" అనడిగింది. ఆ సమయంలో దేవమ్మని ఇబ్బంది పెట్టడానికి మనస్కరించలేదు తులసమ్మకి.

"ఆహా ... ఏంవద్దు ... కాసిని మంచినీళ్ళు ..."

దేవమ్మకి అర్థమైపోయింది. పొద్దున్నే ఇంటిదగ్గర కూడా ఆవిడ ఒక్క మజ్జిగ అన్నం మాత్రం తిన్నారు. డిన్నరంటూ తీసికెళ్ళిన ఆ హోటల్లో ఆవిడేమీ తినలేదని అర్థం చేసుకున్న దేవమ్మ, "పోనీ కాస్త మజ్జిగిమ్మంటారా ?" అనడిగింది.

"వద్దు. ఈ టైములో ఇంక మజ్జిగ కూడా మంచిదికాదు. కాసిని మంచినీళ్ళు తాగి పడుకుంటాను."

దేవమ్మ ఆవిడకి మంచినీళ్లందించింది. డైనింగ్ టేబిల్ దగ్గర కుర్చీలో కూర్చుని కొంచెం కొంచెంగా నీళ్ళు తాగుతోందావిడ. ఈలోపల గిరిజ వంటింట్లోకొచ్చి, "దేవమ్మగారూ, అన్నం తిన్నారా ?" అనడిగింది. అక్కడే వున్న అత్తగారిని చూసి, "అన్ని రూముల్లోనూ అందరూ వున్నారత్తయ్యా. రేపెలాగూ మీ ప్రయాణమే. ఈ ఒక్కరాత్రికీ హాల్లో సోఫాలో పడుకోండి ..." అంటూ వెళ్ళిపోయింది.

తల్లిలాంటి అత్తగార్ని అన్నం తిన్నారో లేదో అనయినా కనుక్కోకుండా వంటమనిషైన తన భోజనం సంగతి కనుక్కున్న గిరిజ మనస్తత్వం అర్థంకాలేదు దేవమ్మకి. పెద్దింటివాళ్ళు, ఏం మాట్లాడితే తన నౌకరీకి ఏం ముప్పో అనుకుని కూడా మాట్లాడకుండా వుండలేకపోయింది.

"అమ్మగారూ, తప్పుగా అనుకోకండికానీ మీ కోడళ్ళిద్దరికీ మీ నెమ్మదితనం లేదు. అయిందాకుల్లోనూ కాంది కంచాల్లోనూ పెడతారు."

తులసమ్మ నొచ్చుకుంది. "మన బంగారం మంచిదవాలికానీ పరాయమ్మ కన్న పిల్లల్నెందుకమ్మా అనుకోవడం ?" దేవమ్మ తెల్లబోయింది.

"మరి దీన్నేమంటారమ్మా ? వాళ్లంతా ఇంత ఆస్తీ, అంతస్తూ అనుభవించడానికి మూలం మీరేకదమ్మా. మరి మీరు భోంచేసేరో లేదో కనుక్కోకుండా వంటమనిషిని, జీతానికొచ్చినదాన్ని నన్నడగడం ఏం న్యాయం చెప్పండి ?" నవ్వింది తులసమ్మ.

"నువ్వీపూట భోంచెయ్యకపోతే రేపులేచి వాళ్ళకి కావలసినవి వండిపెట్టలేవు. అందుకనే నీ భోజనం వాళ్ళకి ముఖ్యం. నావల్ల వాళ్ళకి విగ్రహపుష్టి తప్పితే పనేం జరగదుకదా ! ఎలాగూ రేపు వెళ్ళిపోతాను. అందుకని నన్నడగవలసిన అవసరం వాళ్ళకి లేదు. ఎవరి స్వార్థం వాళ్ళది."

"అయినాకూడా అయిన మనిషి మీరు తిన్నారో లేదో చూడకుండా ..."

"చూడు దేవమ్మా ! నీకర్థమయ్యే భాషలో చెప్పాలంటే, నువ్వు వంటకాల్లో వేసే ఉప్పులాంటిదానివి. అన్నిచోట్ల డబ్బు పెట్టి కొనుక్కుంటే దొరికే వస్తువు లాంటి దానివి. ప్రతి వంటకానికీ నువ్వు కావాలి కనక ఇంట్లో నువ్వున్నావో లేదో చూసుకోవలసిన అవసరం వాళ్ళకుంది. కాని ... నేనో ... కరివేపాకులాంటిదాన్ని. బోల్డు డబ్బు పెట్టి రోజూ దానిని కొని వాడకపోయినా రోజు గడిచిపోతుంది. కాని పండగలకీ, ఫంక్షన్లకీ కరివేపాకు పరిమళం వుండితీరాలి. దాని పరిమళాన్నే ఆస్వాదిస్తారు తప్పితే తర్వాత దాన్ని ఏరేసి పక్కన పెడతారు. అల్లాగే నేనూను. నలుగురిలోనూ తల్లిని గౌరవిస్తున్నట్టు అందరికీ తెలియాలి. దానివల్ల నలుగురిలో వాళ్ళకి విలువ పెరుగుతుంది. కాని రోజూ ఒక కరివేపరెబ్బ ఆహారంలో వాడుకుంటే కడుపుకి మంచిదని వాళ్ళకి తెలీదు ... పాపం."

తులసమ్మ విశ్లేషణకి తెల్లబోయింది దేవమ్మ.

"మరి ఇన్ని విషయాలు తెలిసున్న మీరు వాళ్ళు పిలవగానే ఎందుకొచ్చేరమ్మా?"

తులసమ్మ గ్లాసు టేబిల్ మీద పెట్టి లేచి వెడుతూ వెనక్కి తిరిగి దేవమ్మతో అంది.

"వాళ్ళు నా పిల్లలమ్మా !" ❋

**రచన - ఇంటింటి పత్రిక : జులై, 2005; కథా ప్రహేళిక**

# మీరే నేర్పాలి ...

పక్కన కూర్చుని కొడుకు చేత హోమ్‌వర్క్ చేయిస్తున్న మాధవి చిరాగ్గా లేచి ఇవతలిరూమ్‌లో కొచ్చేసింది. "ఛీ ... ఛీ ... వెధవ సిలబస్సులూ వీళ్ళూను ... పిల్లాడి పక్కన కూర్చుని హోమ్‌వర్క్ చేయించలేకపోతున్నాం'' అంటూ విసుక్కుంది.

డైనింగ్ టేబుల్ దగ్గర కూతురు శాంతకి లెక్కలు చెబుతున్న శివరాం మాధవిని చూసి "ఏమైంది మధూ ... ?'' అనడిగాడు.

"ఏవుందీ ... ? మన రవిగాడు యెయిత్ క్లాస్‌లో వున్నాడు. తెలిసీ తెలీని వయసు. హెచ్.ఐ.వి. పాజిటివ్ అంటే ఏమిటి అని ప్రశ్న ... ఎందుకొస్తుంది ... ఎలా వస్తుంది ... వచ్చేక ఎలాంటి ట్రీట్‌మెంట్ తీసుకోవాలీ ... లాంటి ప్రశ్నలు. ఎదుగుతున్న పిల్లాడికి తల్లినైన నాకే కొన్నింటికి జవాబులు చెప్పడానికి ఇబ్బందిగా వుంటే ... మరి పాపం టీచర్లు ... కాసుల్లో యీ పాఠాలు ఎలా చెప్తున్నారో ...'' వాపోయింది మాధవి. శివరాంకి మాధవి మాటలకి ఏం చెప్పాలో తోచలేదు.

"ఇదివరకు ఇలాంటి పాఠాలు వుండేవి కాదు. ఇప్పుడెందుకు పెట్టేరో ఇవన్నీ ...'' మళ్ళీ చిరాకుపడింది. శివరాంకి మాధవి బాధ అర్థమయింది. అన్ని సబ్జెక్టులలోనూ మార్కులు బాగా వస్తేనే కాని రవికి మంచి టోటల్ రాదు. టోటల్ మార్కులు బాగులేకపోతే క్లాసులో రవి ర్యాంకు తగ్గిపోతుంది. పాపం మాధవి అనిపించింది శివరాంకి. పిల్లాడికి ఇలాంటి విషయాల్లో అవగాహన ఎంతవరకూ అవసరం అన్నది వాళ్లకు తెలీలేదు. ఈ సమస్య పరిష్కారం కోసం ఇటువంటి విషయాలు బాగా వివరిస్తాడని ఆ ఆదివారం శివరాం, మాధవీ కలిసి మాధవి బాబాయి పరశురాం ఇంటికి వెళ్ళారు.

"అసలెందుకు బాబాయ్ ఈ కొత్త సిలబస్ పిల్లలకి ? మేవంతా ఇదివరకు చదువుకోలేదా ? ఇవి చదవనందువల్ల మాకేం ఇబ్బందొచ్చింది ? తెలిసీ తెలీని వయసులో వున్న పిల్లలకి ఇలాంటి సబ్జెక్ట్ పెట్టడం ఎందుకు ? తెలిసీ తెలీని వయసులో ఇలాంటివి చదివితే రేప్పొద్దున్న వాళ్ళ ప్రవర్తన ఎలాగుంటుందో ... ఎలాంటి రోగాల బారిన పడతారో అని భయంగా వుంది బాబాయ్ ...'' సూటిగా అడిగేసింది మాధవి.

బాబాయ్ నవ్వేసేరు.

"మధూ, నువ్వు కాలేజీలో చేరి డిగ్రీ వరకు చదువుకున్నావ్. మరి మీ అమ్మా ... హైస్కూల్ దాటకుండానే పెళ్ళి చేసేసుకుంది. దానినే కాలం మారడం అంటారు. కాలంతో పాటు మనిషి జీవన విధానాలు, పద్ధతులూ కూడా మారుతూ వుంటాయి. ఒకప్పటి కుటుంబ జీవన విధానానికీ, ఇప్పటి కుటుంబ జీవన విధానానికీ ఎంత తేడా వుందో చూడు ... ఇదివరకు భర్త సంపాదించి తెస్తే భార్య ఇంటి విషయాలు చూసుకునేది. ఒకరిమాట నొకరు మన్నించుకుంటూ భార్యాభర్తలిద్దరూ పిల్లల అభ్యున్నతే ధ్యేయంగా కుటుంబాన్ని నడిపించేవారు. కాని యిప్పుడూ ... ఉమ్మడి కుటుంబాలు ఎప్పుడో పోయాయి. ఉద్యోగరీత్యా కుటుంబాలు విడిపోయినా నలుపో తెలుపో నలుగురు పిల్లలుండేవారు. కాని ఎప్పుడయితే ప్రభుత్వం కుటుంబాన్ని నియంత్రించుకుందుకు ప్రోత్సాహకాలు ఇవ్వడం మొదలుపెట్టిందో అప్పట్నించి కుటుంబమంటే "మేమిద్దరం ... మాకిద్దరూ ..." అన్న పద్ధతిలోకొచ్చేసింది. కాని ఈమధ్య ఆలుమగలు మరో అడుగు ముందుకేసి "మాకు ఒక్క పిల్లే ముద్దు ... ఇంకో పిల్ల వొద్దు ..." అంటున్నారు. ఎందుకనడిగితే ఒక్కళ్ళని పెంచి, పోషించి, చదివించడానికే మా ఇద్దరి సంపాదనా చాలట్లేదు. ఇంకోళ్ళని కనే ఓపిక, డబ్బూ మా దగ్గర లేవు అంటున్నారు. అలా ఎందుకంటున్నారంటావ్ ?"

"మరిప్పుడు స్కూళ్ళ ఫీజులు వేలల్లో కదా మామయ్యగారూ. అలా అనక ఇంకెలా అంటారూ ... ?" ప్రశ్నించాడు శివరాం. నవ్వారు బాబాయ్.

"అదే అంటున్నాను. మనుషుల జీవన విధానాలతోపాటు వారిలో వుండే విలువలు కూడా మారేయి. కుటుంబ నియంత్రణ పాపమన్న భావన ఏనాడో పోయింది. ఇప్పుడు నాకు కావల్సినప్పుడు కనొచ్చు, లేనప్పుడు మానొచ్చు అనే ధోరణి వచ్చేసింది. మెడికల్ సైన్స్ అభివృద్ధి చెందింది. శిశుమరణాలు తగ్గాయి. కానీ శాస్త్రం ఎంత అభివృద్ధి చెందిందో మనిషి పాటించే విలువలలో అంత తిరోగతి కనిపిస్తోంది."

"అదేంటి బాబాయ్ అలా అంటావ్ ... ?" మాధవి అడిగింది.

"అంతేనమ్మా ... అదే నిజం. ఇప్పుడు మీ ఇద్దరూ ఇలా పిల్లల గురించి ఆలోచించి నా దగ్గర కొచ్చేరంటే నాకెంత సంతోషంగా వుందో తెల్సా ... ఇలా ఆలోచించేవాళ్ల సంఖ్య ఇప్పుడు బాగా తగ్గిపోయింది. నేనుండే సమాజం బాగుండాలి అన్న నానుడి నుంచి, నా కుటుంబం బాగుంటే చాలు అన్న మాట కూడా దాటి, మేమిద్దరం బాగుండాలి అన్న చిన్న హద్దు కూడా దాటి ప్రస్తుతం ఓ వ్యక్తి "నేను బాగుంటే చాలు ..." అన్నంత స్వార్థానికి వచ్చేసింది. భార్యాభర్తలిద్దరికీ ఒకరంటే

ఒకరికి పడదు ... ఎందుకు ? నామాటే నెగ్గాలనే అహంకారం వల్ల. కలిసి మెలిసి జీవించాలనే ఆలోచన లేకపోవడం వల్ల.''

"మేం అడిగినదానికీ, నువ్వు చెప్పేదానికీ ఏమన్నా సంబంధముందా బాబాయ్ ... ?'' మాధవి నిలదీసింది పరాశరం బాబాయ్‌ని.

"ఎందుకులేదు ! ఏదైనా సమస్య వస్తే అది వచ్చిన మూలకారణం కనుక్కుంటే కానీ పరిష్కారం దొరకదు. ఇదీ అంతే. దెబ్బ తగిలాక మందు రాసుకోమని చెపుతున్నారు వీళ్ళందరూ. కాని అసలు దెబ్బే తగలకుండా చూసుకోమని మన వాళ్ళెప్పుడో చెప్పారు ...''

"మనవాళ్ళు దీని గురించి కూడా చెప్పారా ... ?'' ఆశ్చర్యంగా అడిగింది మాధవి.

"అవును ... దీనికంతటికీ కారణం మనిషి ప్రవర్తనలో వచ్చిన విశృంఖలత్వం. ఈరోజు మనిషి ప్రవర్తనకి ఏ నియమనిబంధనలూ లేవు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వాడికి యాక్సిడెంట్ పాలబడక ఎలా తప్పదో అలాగే కొన్ని నియమాలు పాటించని మనిషి ఇలాంటి వాటి పాలబడక తప్పదు. ఈ నియమాలు ప్రభుత్వం పెట్టదు. మనవే మన కుటుంబంలో నేర్చుకుంటాం. అలాంటి నియమాలనే "విలువలు'' అంటారు.

ఇప్పుడా విలువల గురించి ఎంతమందికి తెలుసు ? ఈరోజు మీ అబ్బాయి కోసం మీరింత ఆత్రపడుతున్నారంటే మీలో ఇంకా ఆ విలువల పట్ల నమ్మకం ఉన్నందువల్లే అనుకోవాలి. ప్రతి వ్యక్తికీ మొదటి గురువు తల్లి ఎలాగో అలాగే మొదట చదివే పాఠశాల ఇల్లు అని చెప్పుకోవచ్చు. పిల్లలు తల్లిదండ్రులని అనుకరిస్తారని ఈరోజు ఏదో పెద్ద శాస్త్రం చెపుతోందంటారే ... అంతకన్నా ముందే నువ్వే నీ పిల్లలకి మార్గదర్శివి అని కుటుంబ పెద్దకి బాధ్యత అప్పగించినట్టు మనవాళ్ళెప్పుడో చెప్పారు. ఈరోజుల్లో ఎంతమంది తండ్రులకి పిల్లల గురించి ఆలోచించే సమయ ముందంటావ్?''

"అదేంటి మావయ్యగారూ అలాగంటారు. ఈమధ్య చాలామంది పేరెంట్స్ ప్రతి వీకెండూ పిల్లల్ని ఔటింగ్‌కి తీసికెడుతున్నారు. ప్రత్యేకం పిల్లలకోసమని యేడాది కోసారి సెలవులు పెట్టుకుని మరీ వాళ్ళకి చూడదగ్గ ప్రదేశాలన్నీ చూపిస్తున్నారు ...'' అంటూ శివరాం అన్న మాటలకి పరాశరం బాబాయ్ గట్టిగానే జవాబిచ్చాడు.

"ఔటింగ్ అంటే ఎక్కడికి తీసికెడుతున్నారు. నేనూ చాలా మందిని చూసేను. ఏదో సినిమాకి తీసికెళ్ళడం, అక్కడ్నించి బైట ఏదో తిని వచ్చెయ్యడం ... అదే కదా వాళ్ళు చేసేది. ఈ నాలుగ్గోడల మధ్యనుంచి, మరో నాలుగ్గోడల మధ్యకి వెడుతున్నారు.

ఇంట్లో అయితే ఒక అమ్మా నాన్నల ప్రవర్తనే చూస్తారు పిల్లలు. కాని ఇలా బైట కెళ్ళినప్పుడు నాలుగు రకాల వ్యక్తుల ప్రవర్తన చూస్తారు. సహజంగా పిల్లలకి యాక్షన్ ఆకర్షిస్తుంది కనక డిష్యుం డిష్యుంలవైపే మొగ్గు చూపుతారు. అదే అలవాటు చేసుకుంటారు.''

"మన చుట్టూ సమాజం అలా వుంటే మనం ఒక్కళ్లం మటుకు ఏం చెయ్యగలం బాబాయ్ ... ?'' మాధవి అడిగింది.

"ఎందుకు చెయ్యలేరు. చుట్టూ ఇన్ని రకాల ఆకర్షణలున్నా కూడా మీరు మీ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించి నా దగ్గరికి రాలేదూ ? మీలాంటివాళ్ళు చాలామంది వున్నారు. ఎటొచ్చీ వాళ్లకి ఎవరిని, ఎలా అడగాలో తెలీటంలేదంతే'' అంటూ తనని తాను కాస్త సర్దుకుని,

"సరే ... మనం అసలు విషయానికొద్దాం. ఈ ఎయిడ్స్ అన్న వ్యాధి గురించీ, దానిని ఎలా గుర్తించాలీ, ఎలాంటి చికిత్స తీసుకోవాలీ, ఆ వ్యాధిగ్రస్తులను సమాజం ఎలాంటి దృష్టితో చూడాలీ అన్నవి చాలామంది మేధావులూ, నిపుణులూ ఇప్పటికే చెప్పారు. అదంతా ఇప్పటికే తెలిసో, తెలీకో ఆ వ్యాధి బారిన పడ్డవారికి పనికొచ్చేది. కాని నేను మీలాంటి తల్లిదండ్రులు ఇంకా చాలామంది వుంటారు. వాళ్లందరినీ దృష్టిలో పెట్టుకుని చెపుతున్నాను ... ఎందుకంటే ... మరో అయిదారు సంవత్సరాలకి మీ పిల్లల వయసు వారందరూ యువకులౌతారు. అప్పుడు వారికి ఈ వ్యాధి బారిన పడకుండా మీరు ఇప్పట్నుంచీ వాళ్లను తయారుచెయ్యాలి.''

శివరాం, మాధవి బాబాయ్ చెప్పేది శ్రద్ధగా వినడానికి ముందుకు వంగారు. బాబాయ్ చెప్పడం మొదలుపెట్టారు.

"ఒక కాయో, పండో పుచ్చిపోతే దానికి మందు వేస్తున్నట్టుంది ఇప్పటి పరిస్థితి. కాని మందు వెయ్యవలసింది ఆ కాయకీ, పండుకీ కాదు చెట్టు మొదట్లో. అప్పుడే ఆ చెట్టు నుంచి వచ్చే పండుకి పురుగుపట్టదు. ఆ సంగతి ఎవరూ పట్టించు కోవటం లేదు'' బాబాయ్ మాటని మధ్యలోనే అడ్డుకుంది మాధవి.

"అదేంటి బాబాయ్ అలాగంటావ్. ఇప్పుడు పిల్లల సిలబస్ ఎంత కష్టంగా వుందో తెలుసా ... కంప్యూటర్సనీ, టెక్నాలజీ అనీ, సైన్స్ ఎంత అభివృద్ధి చెందిందో .... అంతా వీళ్ల బుర్రల్లో కెక్కించేస్తున్నారు.''

వెంటనే అందుకున్నారు బాబాయ్.

"అక్కడే వచ్చింది చిక్కంతా ... అభివృద్ధి చెందిన విజ్ఞానాన్నంతా చాలా బాగా

చెపుతున్నారు. కాని దానిని ఎంత విలువగా వాడుకోవాలో చెప్పటంలేదు. ఆ విజ్ఞాన శాస్త్రం మనిషి ఎంత సుఖంగా జీవించవచ్చో చెప్పినచోట మనం ఆగిపోతున్నాం తప్పితే సంతోషంగా జీవించడానికి దానిని మనం వాడుకోవడం లేదు. ఆ శాస్త్రానికిచ్చిన విలువ మనం బతకవలసిన విలువల కివ్వడం లేదు.

"అంటే ... ?"

"అంటే ... చిన్నపిల్లాడి చేతికి మారణాయుధం యిస్తే దానిని ఎవరిమీద ఎలా ప్రయోగించాలో తెలిసే పరిణతి లేకపోవడం వల్ల ఒక్కొక్కసారి థ్రిల్ కోసం దానిని ఎవరిమీదైనా ప్రయోగిస్తాడు. పిల్లలకి మంచి పద్ధతులు, విలువలు ఇంట్లో అమ్మా, నాన్నా చెప్పాలి. పెద్దలను గౌరవించమనీ, పరాయి సొమ్ముకు ఆశించవద్దనీ ... ఇలాంటి మాటలు ఈ రోజుల్లో ఎవరైనా పిల్లలకి చెపుతున్నారా ? అలా చెప్పమంటే పెద్దవాళ్ళే నవ్వుతారు. ఇప్పుడు నువ్వున్నట్టే లోకంలో బతకాలి కదా అంటారు. కాని ఇలాంటి విలువలు పిల్లలకి చిన్నతనం నుంచీ నేర్పించిన తల్లులున్నారు. ఆ పిల్లలు ఎప్పటికీ చరిత్రలో పూజనీయులే" కాస్త ముందుకు వంగారు బాబాయ్.

"మీకు తెలీదా ... శివాజీ మహారాజు ఆడవారినందరినీ తల్లిలా భావించడానికి కారణం ఆయన తల్లి జిజియాబాయి ఉగ్గుపాలతో నేర్పిన విలువ కాదంటారా ..."

శ్రద్ధగా వింటున్నారు శివరాం, మాధవీ.

"మన విలువల ప్రకారం వివాహం అంటే సంతానం కోసం మాత్రమే అని స్పష్టంగా చెప్పేవారు. కాని ఇప్పుడా భావన లేదు. పెళ్ళంటే సంసార సుఖం కోసమే అనే అభిప్రాయం వచ్చేసింది. మనిషి పరాయి ఆడదానిని కోరుకోవడం పాపమన్న భావన పోతోంది. "నా ఇష్టం, నాకిష్టం ...." అన్నమాట చాలామంది నోట వినిపిస్తోంది.

మహాత్మాగాంధీ ఏమన్నారు ? కుటుంబాన్ని నియంత్రించుకోవాలంటే ఇద్దరు పిల్లలు పుట్టాక భార్యాభర్తలు బ్రహ్మచర్యం పాటించాలి అన్నారు. అంటే నిగ్రహంతో వుండమని. ఆ నిగ్రహం ఎలా వస్తుంది ? చిన్నప్పటినుంచీ పెద్దవాళ్ళు చెప్పిన విలువలు వారి మనసులో ముద్రపడితే అప్పుడు నేను ఈ పనిచెయ్యడం తప్పు అని వాళ్లకనిపిస్తుంది. అప్పుడు వాళ్లకి నిగ్రహించుకునే శక్తి వస్తుంది. అటువంటి శక్తి మనిషిలో వున్నప్పుడు మరింక మనిషి ప్రవర్తనలో విశృంఖలత్వం ఎందుకుంటుందీ ... పరాయి ఆడదాని కోసం ఎందుకు వెడతాడూ ... ఇలాంటి జబ్బును తను అంటించు కోడమే కాకుండా అమాయకురాలైన భార్యకీ, పిల్లలకీ కూడా ఎందుకు అంటిస్తాడు?" కాస్త ఊపిరి పీల్చుకున్నాడు బాబాయ్.

"అంటే ఇప్పుడు మేమేం చెయ్యాలి బాబాయ్ ... ?" అడిగింది మాధవి.

"పిల్లలతో మనసు విప్పి మాట్లాడండి. వాళ్ళు చెప్పేది వినండి. ఔటింగ్ అంటే హోటళ్లకెళ్లడం, వూళ్ళు తిరగడం కాకుండా కాస్త చుట్టూ ప్రకృతిని పరిచయం చెయ్యండి. కష్టపడడంలో వున్న ఆనందాన్ని చెప్పండి. చేతనైనంతలో నలుగురికి సాయపడడం నేర్పండి. ప్రతి చిన్నదానికీ ఖంగారు పడిపోకుండా తనను తాను నిలుదొక్కుకోవడం చెప్పండి. విజయమైనా ఓటమైనా ఒక్కలాగే తీసుకోవడం ఎలాగో చెప్పండి. స్థితప్రజ్ఞత నేర్పండి. చాలు ... చూస్తుండగా మీ పిల్లలు పెద్దవాళ్లవుతారు. ఇవన్నీ అప్పుడు పనికొస్తాయి. అస్సలు అదుపు తప్పి ప్రవర్తించరు. మీ పిల్లలకేమీ కాదు."

పరాశరం బాబాయ్ చెప్పిన మాటలను తూచా తప్పకుండా ఆచరించడానికి నిర్ణయించుకున్నారు పిల్లల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకున్న శివరాం, మాధవీ ❇

**"ఆశాదీపం" ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి సంకలనం : 2014**

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారు నిర్వహించిన కథల పోటీలో ఎన్నికయిన ఉత్తమ కథలలో ఒకటి

# కలికి కాత్యాయిని

పొద్దున్నే విజయవాడ నుంచి అన్నయ్య ఫోన్. ఖంగారుపడుతూ ఎత్తింది కాత్యాయిని.

"ఏమైందిరా ? అంతా బాగున్నారు కదా ..."

"ఆ ... అంతా బాగానే వున్నాం. నాన్నగారి షష్టిపూర్తి అనుకున్నాం కదా ... అది ఈ నెల ఇరవైయ్యారుకి చేద్దామనుకుంటున్నాం. పిల్లల్ని తీసుకుని రెండ్రోజుల ముందే వచ్చెయ్యి. బావగారికి కూడా చెప్పు."

"ఏమిటీ ... ఈ ఇరవైయ్యారే. ఇంక పదిరోజులేకదురా వుందీ ... కాస్త నెల్లాళ్ళ ముందు చెప్పమన్నాను కదా. నాకు సెలవు దొరకాలి, పిల్లలకి చూసుకోవాలి ..."

కాత్యాయిని మాట పూర్తి కాకుండానే అవతల్నుంచి రాజారావు "ఇది తప్పితే తర్వాత రోజులు అస్సలు బాగాలేవుట. నిన్ననే ఖరారు చేసేం. అందుకే పొద్దున్నే చేస్తున్నా. అన్నీ చూసుకుని రెండ్రోజుల ముందే వచ్చెయ్యి. కాంతి అమెరికా నుంచే చంటిపిల్లాణ్ణి చంకనేసుకుని వచ్చేవారం వచ్చేస్తుంటే నీకేవిటే ..." అవతల ఫోన్ పెట్టేసిన శబ్దం విని కాసేపు ఆలోచనలు స్తంభించి అలాగే నిలబడిపోయింది కాత్యాయిని. పదిరోజుల్లో ఢిల్లీ నుంచి విజయవాడ ప్రయాణం అంటే ఏవనుకుంటున్నాడూ ... పైగా కాంతి అమెరికానించి వస్తోందిట ... రాదూ మరీ ... దాని మొగుడు అది నించోమంటే నించుంటాడు, కూర్చోమంటే కూర్చుంటాడు ... టిక్కెట్టు కావాలంటే ఆకాశాన్ని దింపైనా సాధిస్తాడు.

అలాగ తనకెలా కుదుర్తుందీ ... తన పిల్లలు రవి యెయిత్ క్లాస్, రేఖ సిక్స్త్ క్లాస్ చదువుతున్నారు. రోజూ స్కూల్‌లో ఏదో ఒక టెస్ట్ పెడుతూనే వుంటారు. అదికాక ట్యూషన్. పదిరోజులు ట్యూషన్ మానేస్తే వీళ్ళు వెనకబడిపోరూ ...

ఇవాళప్పుడే పదహారో తారీకు. మరో నాల్రోజుల్లో ఢిల్లీ నుంచి విజయవాడకి టిక్కెట్లు దొరుకుతాయా ? అసలు తనకి సెలవు దొరుకుతుందా ... తన మాట అలా వుంచితే అన్నాళ్ళు సెలవివ్వడానికి పిల్లల స్కూల్ ప్రిన్సిపల్ ఒప్పుకుంటాడా ... రానూ పోనూ కలిపి నాల్రోజులు ప్రయాణానికి సరిపోతుంది. అక్కడ రెండ్రోజులు వున్నా కూడా కనీసం వారం రోజులు సెలవు కావాలి. వీకెండ్ కలిసొచ్చినా బాగుండేది

... గబ గబా కేలండర్ చూసింది కాత్యాయిని. ఇరవైయ్యారో తారీకు గురువారమైంది. వారం మధ్యలో. ఛ ... అన్నల మీద పీకల్దాకా కోపం వచ్చేసింది కాత్యాయినికి.

ఇప్పటికి నాలుగు నెలల్నించి నాన్నగారి షష్టిపూర్తి జరపడానికి చర్చలు జరుగుతున్నాయి. ముందు అసలు షష్టిపూర్తి చేసుకుందుకు నాన్నగారు ససేమిరా ఒప్పుకోలేదు. అన్నలిద్దరూ, తమ్ముడూ, అక్కా, చెల్లెళ్ళిద్దరూ ఇలా పిల్లలందరూ కలిసి పట్టుబడితే తప్పక ఒప్పుకున్నారు.

అప్పుడే కాత్యాయిని అన్నలతో చెప్పింది. వారాంతం కలిసివచ్చేలా ముహూర్తం పెట్టమనీ, కనీసం నెల్లాళ్ళముందైనా తనకి చెప్పమనీను. ఇప్పుడిలా సడన్‌గా పదిరోజుల్లో అంటే ...

ఒక్కసారి నీరసం వచ్చినట్లై కూలబడిపోయిందామె.

సలహా చెప్పడానికైనా భర్త రాజేంద్ర ఆఫీస్ పనిమీద ఆగ్రా వెళ్ళాడు. రాత్రికి గాని ఇల్లు చేరడు.

ఇప్పుడెలాగ ?

ఆలోచనల్లో పడిన కాత్యాయిని పిల్లలిద్దరూ ఒకరిమీదొకరు అరుచుకుంటుండడంతో ఈ లోకంలోకి వచ్చింది. టైమ్ చూస్తే ఎనిమిది చేరుకుంటోంది. గట్టిగా అక్కడ్నుంచే పిల్లలని ఒక్క కేక పెట్టి వంటింట్లోకి పరిగెట్టింది.

పోనీ ... మానేస్తే ... అయ్యో ... మానెయ్యడవా ... నాన్నగారి ఫంక్షన్ ... తమని ఎంత గారంగా పెంచారూ. ఎప్పుడూ పరుషవాక్యం అనకుండా "అమ్మా, తల్లీ ..." అంటూ తప్పితే మరోలా పిలవకుండా, అందరికీ చదువులూ, సంగీతాలు చెప్పించేరు. " నా పిల్లలే నా ఆస్తి ..." అని అందరికీ గర్వంగా చెప్పుకునేవారు. అటువంటి నాన్నగారికి పండుగ చేస్తుంటే తను వెళ్ళకపోతే ఎలాగ ? పిల్లల్ని కూడా తీసికెళ్ళాలి.

ఏదేదో ఆలోచిస్తున్న కాత్యాయిని తీస్తున్న చింతపండు పులుసు కాస్తా కూరలో బదులు పక్క స్టౌ మీదున్న పప్పులో పోసేసింది. అరెరె ... అనుకుంటూ ... పోనీలే పప్పు పులుసు పోపెట్టేస్తే సరిపోతుంది అని సర్దుకోబోతుంటే ... ముందరి గదిలోంచి రేఖ ... "అమ్మా ... నా ఇంగ్లీష్ నోట్సేదీ ... ?" అని కేకపెట్టింది. అసలే ఒళ్ళు మండిపోతున్న కాత్యాయిని "ఇప్పుడే పులుసులో వేసేసేను ..." అని అంతకన్న గట్టిగా జవాబు చెప్పింది.

అమ్మ మూడ్ అర్థమైపోయిన రేఖ మరింక మాట్లాడకుండా తన పుస్తకాలేవో తనే చూసుకోవడం కాకుండా అన్నకి కూడా పుస్తకాలు సర్దుకోడంలో సాయం చేసింది.

పిల్లలిద్దర్నీ స్కూల్ బస్ ఎక్కించి, ఆఫీస్‌కి బయల్దేరుతూ ఇంటికి తాళం వేస్తోంది కాత్యాయిని. పక్క ఫ్లాట్‌లో వున్నాయన ఆఫీస్‌కి వెడుతుంటే వాళ్ళావిడ తలుపు దాకా వచ్చి సాగనంపి లోపలికెళ్ళడం చూసింది. ఆవిడ కూడా కాత్యాయినిని చూసింది. ఒక్క క్షణం కాత్యాయిని మనసులో అసూయలాంటి భావం తొంగిచూసింది. "ఎంత అదృష్టవంతురాలో ... మొగుడు ఆఫీస్ కెళ్ళగానే తను కూడా ఇంత తినేసి ఎంచక్కా తనకిష్టమైన పుస్తకం చదువుకుంటుందేమో ... ఏమో ... టీ.వి. సీరియల్స్ కూడా చూస్తుండొచ్చు ... ఇంకా ఫ్రెండ్స్‌కి ఫోన్ చేసి ఎంచక్కా కబుర్లు కూడా చెప్పు కుంటుందేమో ..." ఒక్కసారి తన ఆలోచనలకి తనకే నవ్వొచ్చింది. సరిగ్గా తనలాగే ఆవిడ కూడా తనని చూసి అసూయ పడొచ్చు కదా ...

"ఎంచక్కా రోజుకో గంజిపెట్టిన ఇస్త్రీ చీర కట్టుకుని ఈవిడ ఆఫీసుకి వెడుతుంది. ఎంత అదృష్టమో ... రూపాయికీ, పావలాకీ మొగుణ్ణి డబ్బులు అడగక్కర్లేదు కదా ..." అనుకుంటుందేమొ ... అంతే ... దూరపు కొండలు ఎప్పుడూ నునుపే ... పడేవాళ్ళకి తెలుస్తాయి అందులో సాధకబాధకాలు.

ఆఫీస్‌కి వెడుతున్నంతసేపూ షష్టిపూర్తికి వెళ్ళడమెలాగా అన్న ఆలోచనే కాత్యాయినికి.

ఒక్కసారి చిన్నప్పుడు పాడుకునే పాట గుర్తొచ్చింది.

"కలవారి కోడలు కలికి కామాక్షి ... కడుగుతున్నది పప్పు కడవలో పోసి

అంతలో వచ్చెనూ ఆమె పెద్దన్న ... కాళ్లకూ నీళ్ళిచ్చి కన్నీళ్ళు నింపె"

అలా కన్నీళ్ళు పెట్టిన చెల్లెల్ని చూసి ...

"ఎందుకూ కన్నీళ్ళు ఏమి కష్టాలూ ... తుడుచుకో చెల్లెలా ముడుచుకో కురులూ

ఎత్తుకో బిడ్డనూ ఎక్కు అందలమూ ... చేరి మీవారితో చెప్పిరావమ్మా ..."

అంటారు అన్నగారు. అప్పుడా ఉమ్మడి కుటుంబంలో వున్న కలవారి కోడలు అత్తగారూ, మామగారి నుంచి వరసగా అందరినీ పుట్టింటికెళ్ళడానికి అనుమతి కోరుతుంది.

ఒక్కసారిగా నవ్వులాంటిది వచ్చింది కాత్యాయినికి. అది నవ్వో ఏడుపో కూడా అర్థం కాలేదామెకి. ఆరోజుల్లో ఉమ్మడి కుటుంబాల్లో అత్తవారింట్లో కోడళ్ళని అదుపాజ్ఞల్లో వుంచేవారనీ, స్వేచ్ఛా స్వతంత్రాలు లేకుండా ఆడవాళ్ళు కుటుంబ సాంప్రదాయాల్లో నలిగిపోయేవారనీ అందరూ తెగ బాధపడేవారు. ఇప్పుడు ఆ ఉమ్మడి కుటుంబాలు పోయేయి. ఒక ఊళ్ళో వుంటున్నా పెళ్ళయ్యేక ఎవరిల్లు వారిదే.

అన్నదమ్ములు కాదు ... తల్లిదండ్రులు కూడా పిల్లల్ని వేరేగా కాపురాలు పెట్టించేస్తున్నారు. మరిప్పుడు అలాంటి ఆంక్షలేమీ లేకుండా ఆడపిల్ల అనుకోగానే పుట్టింటికి వెళ్లగలుగుతోందా ?

ఈ చదువులూ, ఉద్యోగాలూ వచ్చేక వారి పని పెనం మీంచి పొయ్యిలో పడ్డట్టే అయ్యింది. తగిలించుకున్న బంధాలు. తగులుకున్న బాధ్యతలు. మనసు మథనపడుతున్నా మెదడు పనిచేయక తప్పని పరిస్థితుల్లో ఆడవారికి అప్పుడూ ... ఇప్పుడే కాదు. అసలెప్పుడైనా స్వేచ్ఛా, స్వతంత్రం వుంటాయా ?

ఆఫీస్‌లో అత్తగారి లాంటి ఆ మహంకాళిని సెలవడగడానికి ఎంత ధైర్యం కావాలో ...

పిల్లల స్కూల్ ప్రిన్సిపాల్ ఆంటోనీ ఖచ్చితంగా రూల్స్ పాటించే మామగారి లాంటివాడు. ఆయనకేం చెప్పాలో ...

పిల్లల ట్యూషన్ టీచర్ ఇంటి పెత్తనం చెలాయించే పెద్ద తోడికోడల్లాంటిది. ఆవిడేం అడ్డుపుల్లేస్తుందో ...

ఇప్పుడు ఈ షష్టిపూర్తికి తను వెళ్ళాలంటే ముందు అత్తగారిలాంటి తన బాస్‌ను ఒప్పించాలి.

కాత్యాయిని బాస్ నిక్కచ్చయిన మనిషి. పనిలో ఒక పట్టాన దేనికీ సర్దుకుపోదు. అన్నీ ఖచ్చితంగా ఉండాల్సిందే. ఆ ఆఫీస్‌లో అందరూ ఆవిడని "అత్తగారు ..." అని హడలిపోతూ పిలుచుకుంటారు. ఇప్పుడింతకీ ఆ అత్తగారు సెలవిస్తుందో ఇవ్వదో ... ఆ మధ్య మొగుడూ, పిల్లలూ చాలా సరదా పడ్డారని వేసవి సెలవుల్లో ఒక పదిరోజులు టూర్ ప్రోగ్రామ్ కోసం సెలవడిగితే, పనిచేసే వయసులో పనే చెయ్యాలనీ, విహారాలూ గట్రా రిటైరయి ఖాళీగా తోచనప్పుడు వెళ్ళాలనీ గంటసేపు నిలబెట్టి కడిగేసింది. అందులోనూ ఆవిడకి ఇటువంటి సంప్రదాయాలూ, వేడుకలూ అస్సలు తెలీవేమో ఎవరైనా ఇటువంటివి చెపితే జాతీయాదాయాన్నంతా ఈ సంప్రదాయాల పేరున తగలేస్తున్నారని లెక్చర్లిస్తుంది.

ఆవిడ పేరు సుగుణ. కాని ఆవిడ నిరంకుశ ధోరణికి బలైపోతున్న ఆఫీస్‌లో పనిచేస్తున్న వాళ్ళందరూ దుర్గుణ అని పిలుచుకుంటారు. అందుకే భయపడుతూనే ఆఫీస్‌కి వెళ్ళేక కాస్త ధైర్యం తెచ్చుకుని ఆవిడ కాబిన్‌లోకి అడుగుపెట్టింది కాత్యాయిని.

"గుడ్ మార్నింగ్ మేమ్ ..." "యెస్ ..." ప్రశ్నార్థకంగా చూసింది.

"నాకు నెక్స్ట్‌వీక్ లీవ్ కావాలి మేమ్ ..." గొంతులో అర్థింపు. "యెనీథింగ్ సీరియస్ ?"

విషయం చెప్పింది కాత్యాయిని. అంటే ఏమిటన్న ఆవిడకి షష్టిపూర్తి అంటే ఏవిటో వివరంగా చెప్పింది. ఆ దుర్గుణ కనుబొమలు ముడిపడ్డాయి.

"అసలు మీకేమైనా బాధ్యతంటూ వుందా ? అసలే దేశం ఇంత క్లిష్ట పరిస్థితుల్లో వుంటే మీరు అరవయ్యో సంవత్సరాల పుట్టినరోజులూ, పండగలూ చేసుకుంటారా ? ఎంత డబ్బు వేస్ట్ ... ఎంత శ్రమ వేస్ట్ ... ముఖ్యంగా ఎంత టైమ్ వేస్ట్ ... అక్కడికెడితే నీ పనెంత పేరుకుపోతుందీ ... మిగిలినవారికన్న ఎంత వెనకుంటావ్ ? అక్కడికి వెళ్ళకుండా ఆ వారంరోజులూ పనిచేస్తే నీ పెర్సనల్ రిపోర్ట్ ఎంత బాగుంటుందీ ... ఇవన్నీ ఆలోచించుకుని అడుగు ..." అంటూ ఆకుకి అందకుండా పోకకి పొందకుండా మాట్లాడి పంపించేసింది. ఆవిడ లీవ్ ఇస్తానందో, ఇవ్వనందో మటుకు కాత్యాయినికి అర్థం కాలేదు.

ఈలోపల లంచ్ టైమ్ అవనే అయింది. గబగబా పిల్లల స్కూల్‌కి పరిగెట్టి వాళ్ల ప్రిన్సిపల్‌ని కలుసుకుని లీవ్ కోసం లెటర్ ఇచ్చింది.

అది పుచ్చుకుని ఆయన సీరియస్‌గా చూసి,

"ఇప్పుడు యియర్ మధ్యలో స్టూడెంట్స్ క్లాసెస్‌ని మిస్ అయితే వెనకపడి పోతారు. అటెండెన్స్ ప్రాబ్లెమ్ కూడా రావచ్చు ..."

"మా పిల్లలకి పూర్తి అటెండెన్స్ వుందండీ ..." మధ్యలో అందుకుంది కాత్యాయిని.

"అయినా కూడా ... టెస్ట్‌ మిస్ అయిపోతారు. మళ్ళీ మళ్ళీ టీచర్స్ పెట్టలేరు. రేంక్ తగ్గిపోతుంది ..."

కాత్యాయిని ఏమీ మాట్లాడలేకపోయింది. అవునూ ... కాదూ అనకుండా ఆయన ... "సరే ... క్లాస్ టీచర్‌కి పంపిస్తాను ..." అనేసేడు.

సాయంత్రం ఆఫీసవగానే పిల్లల ట్యూషన్ టీచర్ దగ్గరికి పరిగెట్టింది. నాలుగు సబ్జెక్ట్స్‌కీ నలుగురు మెరికల్లాంటి వాళ్లని చేర్చుకుని కోచింగ్ సెంటర్ నడుపుతోంది ఆవిడ. ఆవిడ పేరు దుర్గ. దుర్గామాతా అంటారు. ఆ దుర్గామాతకి భయపడినట్టే అందరూ ఆవిడంటే గడగడ వణికిపోతుంటారు. పాఠాలు చెప్పేవాళ్ళూ, చెప్పించుకునే వాళ్ళూ, వాళ్ల పేరెంట్సూ అందరూ ఆవిడ ముందు వంగిపోయి మాట్లాడతారు. ఆవిడ కనక పిల్లలని అంత బాగా చదివిస్తోందని ఆవిడతో పాటు అందరూ అనేసు కుంటుంటారు. మళ్ళీ ఆవిడకి పెద్ద చదువేమీ లేనేలేదు. ఒక్కొక్కరి అదృష్టం అలా వుంటుందేమో ... ఇంట్లో పెత్తనం చెలాయించే పెద్ద తోడికోడల్లాగా కనిపిస్తుందావిడ కాత్యాయిని కళ్ళకి.

ఆవిడ దగ్గర కూడా కాత్యాయిని పిల్లలకి పదిరోజుల సెలవు కోసం అర్జీ పెట్టుకుంది. అది చూసి ఆవిడ కాత్యాయినిని ఒక పురుగుని చూసినట్టు చూసింది. మహాపరాధం చేసినట్టు తలొంచేసుకుంది కాత్యాయిని.

"చూడండీ ... మీ పిల్లల్ని కావాలంటే తీసికెళ్ళొచ్చు. కానీ తర్వాత మార్కులు తక్కువొచ్చేయేవిటండీ అని నన్నడగొద్దు" అంటూ ఆ కాగితాన్ని పక్కకి పడేసిందావిడ. అక్కడుండాలో అక్కర్లేదో తెలీక ఓ నిమిషం అలాగే కూర్చుని ఆ దుర్గామాత ఏదో యింతలావు పుస్తకాన్ని తీసి చూస్తుంటే ఇంక అక్కణ్ణించి లేచి వచ్చేసింది.

వస్తూ వస్తూ ఇంటికొచ్చే దార్లోనే వున్న పిల్లలు సంగీతం నేర్చుకునే సంగీతం మాస్టర్‌ని కూడా కలిసింది కాత్యాయిని. ఆయన ఉమ్మడి కుటుంబంలో గంభీరంగా వుండే పెద్ద బావగారిలాంటాయన. మనసులో ఏముందో ఎవరికీ తెలీదు. కాని ఎక్కువ మాట్లాడకుండా కనుసైగలతోనే చాలా పనులు చేయించేసుకుంటుంటారు. కాత్యాయిని అడిగినదానికి ఆయన అవునూ కాదు అనకుండా తన ప్రథమ శిష్యుని వైపు చూసారు. ఆ శిష్యుడు పిల్లలు క్లాసులకి రావడం మానేసినా మాస్టార్‌కి మటుకు జీతం మామూలుగానే యివ్వాలనే పచ్చి నిజాన్ని తెలియపరిచేడు. డబ్బులు తలుచుకుంటే కాత్యాయినికి కడుపులోంచి బాధలాంటిది వచ్చినా ఏదో కాస్త నయమే కదా అనుకుంటూ నీరసంగా ఇంటికి చేరింది.

ఇంటికి రాగానే తనకి తెలిసిన ట్రావల్ ఏజెంట్‌కి టిక్కెట్ల కోసం ఫోన్ చేసింది. తత్కాల్‌లో ప్రయత్నించాలి తప్పితే ఇప్పుడైతే టిక్కెట్లేవీ లేవని ఖచ్చితంగా చెప్పేసా డతను.

ఉదయం నుంచీ జరిగినది తల్చుకుంటుంటే కాత్యాయినికి ఒక్కసారిగా నీరసం లాంటిది వచ్చేసింది. వెధవ జన్మ ... వెధవ జన్మాని. అసలు నేనెందుకు పుట్టానో ... పుట్టాను సరే ఆడదానిగా ఎందుకు పుట్టానో ... పుట్టినంతలో తగుదునమ్మా అని పెళ్ళెందుకు చేసుకున్నానో ... పెళ్ళయితే అయింది పిల్లల్నెందుకు కన్నానో ...కంటే కన్నాను కాని వాళ్లనెందుకు చదివించాలనుకున్నానో ... కాత్యాయినికి ఉడుకు మోత్తనం లాంటిది వచ్చింది. ఈ పిల్లల గురించి నేనే ఎందుకింత తాపత్రయపడాలీ ... నా ఒక్కరి పిల్లలేనా ... రాజేంద్ర పిల్లలు కూడా కదా ... రానీ ... కాసేపట్లో వస్తాడు కదా ... పెళ్ళైనప్పట్నుంచీ అతనికీ అతని పిల్లలకీ ఇంత చేస్తోందే ... ఒక్కసారి నా తండ్రి షష్టిపూర్తికి వెళ్ళాలంటే ఇన్ని అడ్డంకులా ...

ఒక్కసారి కలవారి కోడలు పాట గుర్తొచ్చింది కాత్యాయినికి. అందరూ వాళ్లనడుగూ, వీళ్లనడుగూ అంటూ ఆఖరికి నీ భర్తనే అడుగూ ... అంటారు.

అప్పుడా కలికి కామాక్షి "రచ్చలో కూర్చున్న రాజేంద్రభోగీ ... మా అన్న లొచ్చారు మమ్మంపుతారా ... ?" అనడుగుతుంది. అంతే ... ఎంతైనా మొగుడు స్టాంప్ వేస్తే గాని ఏదీ జరగదు ... వస్తాడుగా కాసేపట్లో ... ఆ రచ్చలో రాజేంద్ర భోగి ఏం చేస్తాడో చూస్తాను ... అనుకుంది.

ఆ రాజేంద్ర భోగి రానే వచ్చాడు. భార్యామణి గోడు విన్నాడు. ఆమె పడ్డ బాధ చూసాడు. వెన్నలా కరిగిపోయేడు.

"ఎందుకోయ్ అంత బాధ ... మీ ఆఫీస్‌కి మెడికల్ లీవ్ పెట్టెయ్యి. అంతగా అయితే నీకు వచ్చే బెనిఫిట్స్ తగ్గుతాయంతే ..." అని తేల్చేసేడు.

"మరి పిల్లల స్కూలూ ... ?"

"అటెండెన్స్ వుంది కదా ... మహా అయితే ఆ తర్వాత యూనిట్ టెస్ట్‌లో కాసిన్ని మార్క్స్ తగ్గుతాయ్ ... కారణం మనకి తెలిసిందే కదా ... ఏం ఫర్వాలేదు."

మనసులో భారం కాస్త తగ్గుతున్న కాత్యాయిని "మరి ట్యూషనో ..." అంది.

తేలిగ్గా తీసేసేడు రాజేంద్ర. "ఆ ... దాందేవుంది. ఎప్పుడో ట్వెల్త్ తర్వాత వెళ్ళే ఎంట్రన్స్‌కి రవిని ఇప్పట్నుంచీ ప్రిపేర్ చేస్తున్నావ్. ఒక్కసారికి మార్క్స్ తక్కువొచ్చినా ఫర్లేదులే ..."

రాజేంద్ర మాటలకి కాత్యాయిని మనసు దూదిపింజెలా తేలిపోయింది. కళ్ళల్లోకి చెప్పలేని కళ వచ్చేసింది.

"వుండుండు నీకు మంచి కాఫీ తెస్తాను ..." అంటూ వంటింట్లోకి వెళ్ళి కాఫీ కలుపుతుంటే టిక్కెట్ల మాట గుర్తొచ్చింది. అంతే మళ్ళీ అంతలోనే అంత సంతోషమూ ఆవిరైపోయింది.

గబుక్కున హాల్లోకొచ్చేసి, "మరి టిక్కెట్లు లేవుగా ... తత్కాల్‌లో దొరుకుతాయో ... లేదో ..." అని వాపోయింది. దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వలేదన్నట్లున్న కాత్యాయిని మొహంలో భావాలు చూసి, చేయి లాగిపెట్టి తన పక్కన కూర్చోపెట్టుకుని, లాప్‌టాప్‌లో తను చూస్తున్న సైట్ చూపించాడతను. అది ఆన్‌లైన్‌లో విమానం టిక్కెట్లు అమ్మే సైట్. అందులో పిల్లలకీ, కాత్యాయినికీ కొన్న టికెట్ల వివరాలు చూపించే డతను.

"ఎయిర్‌లోనా ... ? చాలా అయిపోతుందేమో ..." బాధ్యత ఆమెని జాగ్రత్త పడమంది.

రాజేంద్ర చిన్నగా నవ్వాడు. "ఇక్కడ ఫంక్షన్‌కి వెళ్ళడం చాలా ముఖ్యమైనది.

నాకు రావడం కుదరదు. నువ్వూ, పిల్లలూ సుఖంగా వెళ్ళి, హాయిగా ఎంజాయ్ చేసి రండి. మిమ్మల్ని చూసి మీ నాన్నగారు, అమ్మగారు చాలా సంతోషిస్తారు.''

ఆమెకి ఒక్కసారిగా చిన్నప్పుడు పాడిన పాటలోని ఆఖరు పదాలు గుర్తువచ్చేయి.

"నీ భర్తనే అనుమతి అడుగు ...'' అని తోడికోడలు చెప్పగానే ఆ కలికి కామాక్షి భర్తని

"రచ్చలో కూర్చున్న రాజేంద్రభోగీ, మా అన్నలొచ్చారు ... మమ్మంపుతారా ...'' అనడుగుతుంది.

అప్పుడా భర్త "పెట్టుకో సొమ్ములు కట్టుకో చీర

పోయిరా సుఖముగా పుట్టినింటికినీ ...'' అంటాడు.

అది గుర్తు తెచ్చుకుంటూ కళ్ళు విప్పార్చుకుని రాజేంద్రని చూసింది కలికి కాత్యాయిని ❊

**కథాకేళి మాసపత్రిక : ఏప్రిల్ 2014**

కథాకేళి, వేదగిరి కమ్యూనికేషన్స్ సంయుక్తంగా నిర్వహించిన
కథల పోటీలో ప్రత్యేక బహుమతి

# ఇస్తినమ్మ వాయినం ... పుచ్చుకుంటినమ్మ వాయినం

"ఏవండోయ్ ... మిమ్మల్నే ... అలా చదివిన పేపరే చదువుతూ కూర్చోపోతే ఆ లైటేదో తెచ్చేరు ... దాన్ని సెట్ చెయ్యొచ్చుకదా !"

నా ప్రమేయం లేకుండానే నా చెవిలో దూరాయి మా ఆవిడ మాటలు.

"అయినా ఆ సరదా సంతోషం ఆ మనిషి కుండాలి కానీ ఎంతరిస్తే మటుకు కదుల్తారా ఏవన్నానా ? నాకేమో ఈ వంటింట్లో పని తెమిలే చావదయ్యే. ఈ బతుక్కొక సరదానా, సంతోషమా, పెళ్ళా, పేరంటవా !"

ముప్ఫై ఏళ్ళపైనుంచీ అవే డైలాగులకి అలవాటుపడ్డ నాకు పేరంటం అన్న మాట చెవిన పడగానే గుర్తొచ్చింది. అవునూ ... ఇవాళ పేరంటమేదో వుంది కదూ ! శ్రావణ మంగళవారమో ఏదో వుంది మొత్తానికి. వెంటనే నేను చెయ్యాల్సిన పని గుర్తొచ్చింది. టైము చూస్తే అయిదయిపోయింది.

పరిగెట్టినట్టే లేచి కంప్యూటర్ వున్న రూమ్‌లోకి వెళ్ళి, సిస్టమ్ ఆన్‌చేసి, వెబ్ కేమ్ కనెక్ట్ చేసి, ఫోకస్ సరిగ్గా ఎదురుగా కుర్చీలో కూర్చున్నవారి మొహం మీద పడేలా పొద్దున్నే కొని తెచ్చిన లైట్‌ని సరైన చోటు చూసి పెట్టి, ఇంటర్నెట్ కనెక్ట్ చేసి, అన్నీ సరిగ్గా వున్నాయా లేదా అని జాగ్రత్తగా చూసాను. అంత జాగ్రత్త ఎందుకంటే మొన్న ఉగాది రోజు సాయంత్రం మా ఆవిడ ఇక్కడ కంప్యూటర్ ముందు కూర్చుని అమెరికాలో వున్న మా కోడలిచేత ఉగాది పూజ చేయించింది. అప్పుడు లైట్ ఫోకస్ సరిగ్గా లేక మా ఆవిడగారు కట్టుకున్న చీర బాగుందని మా కోడలు కామెంట్ చెయ్యలేదు. దానికి కారణం నేను తనని సరిగ్గా ఫోకస్ చెయ్యకపోవడమేనని ఈవిడగారు తర్వాత వారం రోజులపాటు నన్ను సాధించింది. అది బాగా గుర్తుంది. ఇవాళ మళ్ళీ మొన్న కొన్న కెంపుల సెట్ పెట్టుకుని సిస్టమ్ ముందు కూర్చుంటుంది. ఆ నెక్లెస్ బాగా కనిపడాలంటే మా ఆవిడ మెడమీద లైట్ బాగా పడాలి. అందుకని మళ్ళీ నా మొహం వాచిపోకుండా వుండడానికి ముందు జాగ్రత్తగా లైట్ తెచ్చి, దాన్ని

చక్కగా సెట్ చేసాను. అన్నీ సరిగ్గా వున్నాయని సంతృప్తి పడి హాల్లో కొచ్చేటప్పటికి ఇంటిముందు కారాగింది.

అందులోంచి దిగి ఇంట్లో కొస్తున్నవాళ్ళు సాక్షాత్తూ నా భార్య చెల్లెలూ, నాకు మేనమావ కూతురు అయిన మీనాక్షీ, ఆమె భర్త, నా తోడల్లుడూ అయిన రామ్మూర్తీనూ.

ఇంక నా పనింతే అనిపించిందొక్క క్షణం. అసలే మా ఆవిడ కామాక్షి నాకు మేనమావ కూతురు. "మేనత్త కొడుకూ ఓ మొగుడేనా !" అన్న ధోరణిలో వుంటుం దెప్పుడూను. మరింక ఈ మరదలు కూడా కలిసిందంటే ఇద్దరూ కలిసి నామీద కురిపించే వేళాకోళాలకి అంతుండదు. నేనేం తక్కువ్వాడినా ? అందుకే మీనాక్షి కనక వచ్చిందా ... మరింక మా ముగ్గురికీ నోళ్ళు మూతలు పడవు ... కబుర్లూ, దెప్పుళ్ళూ, చమత్కారాలూ ... అన్నీ మాటల్లో దొర్లిపోతుంటాయి. అందులోనూ కారెక్కితే గంట దూరంలో వున్నారేమో అక్కాచెల్లెళ్ళిద్దరూ ఎప్పుడు కావాలంటే అప్పుడు అటూ ఇటూ ట్రిప్పులు వేస్తూనే వుంటారు.

సంతోషంగా వాళ్ళకి ఎదురెళ్తూ లోపలికి వినపడేలా అరిచాను. "ఏవోయ్ ... నీ పక్క వాయిద్య మొచ్చింది ..." అంటూ ...

ఇంట్లోకి వస్తున్న మీనాక్షి, వంటింట్లోంచి వచ్చిన కామాక్షీ నామాట విన్నారు. యుగాల తర్వాత ఒకళ్ళనొకళ్ళు కలుసుకున్నట్టు, ఆ సంతోష సమయంలో నేనన్న మాటకి నన్ను క్షమించేసినట్టు, నావైపో చూపు పడేసి, ఇద్దరూ వంటింట్లో కెళ్ళిపోయారు. ఒక చెవటు పడేసి, నా తోడల్లుణ్ణి సోఫాలో కూర్చోమని, గ్లాసుతో మంచినీళ్ళందించాను. అవి తాగి చేతిలో వున్న లావుపాటి పుస్తకం విప్పాడతను.

ఈ ఆడవాళ్ళకి అదేంటో వంటింట్లో ఎన్ని కబుర్లూరిపోతాయో ! శ్యామల పిన్ని కొత్తగా చేయించుకున్న గొలుసు డిజైన్ పాతదిలాగే వుండడం, చిదానందం బాబయ్య ఎవరితోనో విజయవాడలో మరో కాపరం పెట్టడం, చిరంజీవి చీఫ్ మినిస్టర్ అవుతాడా లేదా అని తర్జన భర్జన, కొత్తగా వచ్చిన హీరోయిన్ ఎంత తక్కువగా బట్ట లేసుకుందోనని ఆశ్చర్యం, పిల్లల సెల్ ఫోన్ బిల్లుల మోత, మజ్జిగ పులుసులో నేతి పోపయితేనే ఘనంగా వుంటుందన్న తీర్మానం, బంగారం ధర చుక్కల నంటుతున్న వైనం, అమెరికా ప్రెసిడెంటుగా ఒబామా వస్తాడా రాడా అని తర్కం ... అసలు వాళ్ళకి అఖ్ఖర్లేని విషయం ఈ ప్రపంచంలో వుంటుందా అనిపించింది. దృష్టి రామ్మూర్తి వైపు తిప్పాను. అతని చదువూ, ఉద్యోగమూ కూడా ఆంధ్రాలో కాకుండా పరాయి రాష్ట్రాల్లోనే జరిగాయి. వాళ్ళ కిద్దరాడపిల్లలు. కాలేజీ చదువులకొచ్చేరని, వి.ఆర్.ఎస్. తీసుకుని వాళ్ళిద్దర్నీ విజయవాడలో రెసిడెన్షియల్ కాలేజీలో జేర్పించి, అక్కడికి దగ్గర్లోనే వున్న

సొంతూరులో కొత్తగా ఇల్లు కట్టుకుని, కాలక్షేపానికన్నట్టు ఆ వూళ్ళోనే వున్న కాలేజీలో లెక్చరర్‌గా జేరాడు. పుస్తకం హస్తభూషణమన్నట్టు అతని చేతిలో ఎప్పుడూ పుస్తక ముంటుంది.

ఎదురుగా కూర్చుని "రామ్మూర్తీ ..." అని పిలిచాను. పుస్తకం మూసి నావైపు చూసాడు.

"శ్రావణమాసంలో ఆడవాళ్ళు నోములు నోచుకుంటారు తెలుసా ?"

"విన్నానండి. కానీ, ఎప్పుడూ చూడలేదు."

మంచిశ్రోత. నాలో ఉత్సాహం ఉరకలు వేసింది. ఇతనికి మొదట్నించీ చెప్పాలి. నెమ్మదిగా చెప్పడం మొదలుపెట్టాను.

"ఇంచుమించు ముప్ఫై సంవత్సరాల క్రితం ... అవి మగవారి పాలిట ముఖ్యంగా మొగుళ్ళ పాలిట బంగారు రోజులు. ఆషాఢమాసంలో నడిచే మేఘసందేశాలు (అవే ఉత్తర సందేశాలు) శ్రావణమాసంలో నిలిచిపోయి నోముల మాసంగా మారిపోయేది. మంగళవారం సాయంత్రం మొగుళ్ళకి ఆటవిడుపు. రోజూ సాయంత్రం తొందరగా ఇంటికి రమ్మనే భార్యలు ఆరోజు భర్తలకి స్వేచ్ఛ నిచ్చేసేవారు. స్నేహితులతో కలిసి సరదాగా సినిమాకో, షికారుకో వెళ్ళే అవకాశం వారికుండేది. తర్వాత మారిన కాలంతో పాటు ఆడవారూ ఉద్యోగస్తులయ్యారు. నెమ్మది నెమ్మదిగా పేరంటాళ్ళని ఇళ్ళకి పిలవడం మానేసి పొద్దున్నే పూజ అవగానే వాళ్ళే లెక్క ప్రకారం ముత్తైదువల ఇళ్ళకి వెళ్ళి వాయినా లిచ్చేసి, నోము పూర్తి చేసుకుని ఉద్యోగాల కెళ్ళిపోయేవారు. అలాగ నోముల్ని నోచే పద్ధతి రోజుల్నిబట్టి మారుతూ, ప్రస్తుతం హైటెక్ లెవెల్లో నోములు నోచే స్థితికొచ్చారు.

"నువ్వు మరీ చెప్తావు బావా ... హైటెక్ లెవల్లో నోములేంటీ మరీ విడ్డూరం కాకపోతే ..." అప్పుడే అక్కడికొచ్చిన మీనాక్షి అడిగింది.

"అంటే హైటెక్నాలజీ ఉపయోగించి నోచుకునే నోములన్నమాట. ఈరోజుల్లో పిల్లలకి నోములు నోచుకోవాలని వున్న తపనే ఈ నోములకి నాంది." "అంటే ..."

"నీకర్థమయ్యేలా చెప్తాను కూర్చో. ఇప్పుడు మీ పిల్లలే వున్నారు. హాస్టల్లో వుండి చదువుకుంటున్నారు. రేప్పొద్దున్న ఉద్యోగాల్లో చేర్తారు. ఆపైన పెళ్ళిళ్ళూ అవుతాయి. అప్పట్నించీ వాళ్ళ అమ్మలు, అత్తలు "అయ్యో ! పెళ్ళయ్యేక శ్రావణ మంగళవారం నోమైనా చేసుకోపోతే ఎలాగే ?" అంటారు. పాపం ఆపిల్లలక్కూడా నోచుకోవాలనే వుంటుంది. కాని అవి ఎలా చెయ్యాలో వాళ్ళకి తెలీదు. వాళ్లకి

తెలిసిందల్లా ఒక్కటే. ప్రతి చిన్నదానికి ఇంటర్నెట్ లోకి వెళ్ళి సెర్చ్ చెయ్యడం. లేదూ ... అమ్మాస్.కాం లాంటివాళ్ళని అడుగుతుండడం.''

మీనాక్షి శ్రద్ధగా వినడం చూసి మరీ వుత్సాహం తెచ్చుకున్నాను.

"నాకు తెల్సుగా, మావాడికీమధ్యనే పెళ్ళైంది. కోడలు వెంటనే వాడితో అమెరికా వెళ్ళిపోయింది. అక్కడింకా తెలుగువాళ్ళెవరూ పరిచయం కాలేదు. ఈరోజుల్లో చాలామంది ఆర్కుట్‌లో మెంబర్స్ కదా ! భలే వుంటుందిలే. వాళ్ళు ప్రతి చిన్న విషయాన్నీ అందరిముందూ చర్చకి పెట్టేస్తారు. అలాగే మా కోడలు కూడా ఫోరమ్‌లో తనకిలాగ శ్రావణ మంగళవారం నోము నోచుకోవాలని వుందనీ, అక్కడ దానికి తగ్గ సహాయం ఎక్కడ దొరుకుతుందో ఎవరైనా చెప్పగలరా అని అడిగిందిట. ఆ ప్రశ్నకు ఎవరో ఒకబ్బాయి సమాధానమిస్తూ అమెరికాలో వుంటున్నా నోము నోచుకోవాలన్న మా కోడలికున్న ఆసక్తిని, ఉత్సాహాన్ని మెచ్చుకుంటూ, ఆ నోము గురించికాని, ఆ విషయం తెలిసున్న వాళ్ళు కాని తనకెవరూ తెలీదనీ, కావాలంటే ఆన్‌లైన్‌లో వాయినం తీసుకుందుకు అతనికేమీ అభ్యంతరం లేదని చెప్పాట్ట ...''

"అంటే మగవాళ్ళు వాయినం తీసుకోరని అతనికి తెలీదంటారా అన్నగారూ?''

"అదేకదా అనుకోవాలి. వాళ్ళకి వాటి గురించి తెలుసుకునే అవకాశం మన మెక్కడిచ్చాం ? ఎంతసేపూ పోటీ చదువులూ, ఊపిరాడని ఉద్యోగాలూ ... ఇవేకదా వాళ్ళకి తెలిసినవి. అన్ని పనులూ ఆన్‌లైన్‌లో జరిగిపోతాయనే ఉద్దేశ్యం వున్న వాళ్ళాయె మరీ ...''

"ఇంతకీ చెప్పొచ్చేదేంటంటే అతను చెప్పింది విన్నాక మా కోడలికి ఫ్లాష్ లాంటి ఐడియా వచ్చి, వాళ్ళత్తగారితో ... అదే మీ అక్కతో చర్చించి ఎవరినైనా ముత్తైదువల్ని ఇక్కడికి పిలిస్తే అక్కడ్నించి ఆన్‌లైన్‌లో వాయినం అందిస్తానని చెప్పింది.''

"మీ అక్క సంగతి తెలుసుగా. మొన్న ఉగాదిరోజు ఇక్కణ్ణించే మంత్రాలు చదివేసి అక్కడ కోడలిచేత పూజ చేయించేసింది. కోడలి ఐడియా వినగానే మహానందంతో ఇక్కడ ఏర్పాట్లన్నీ చేసేసింది. ఇప్పుడు నిన్ను పనికట్టుకుని రమ్మన్నది కూడా అందుకే, మా కోడలి చేత నీకు వాయినం ఇప్పించడానికన్నమాట. అర్థమైందా?''

"అదేంటి బావా ? అక్కడ్నించి వాయినం ఎలా అందుకోడం ?''

ఇంతలో మా ఆవిడ పట్టుచీర కట్టుకుని, కెంపుల నెక్లెస్ సవరించుకుంటూ వచ్చింది.

"కాదే మీనా. ఇదివరకు పురోహితులు వచ్చి ఇంట్లో ఆడాళ్ళచేత వ్రతాలు

చేయించేవారు. కొన్నాళ్ళకి వ్రతాల పుస్తకాలు వచ్చాయి. అవి చదువుకుని పూజలు చేసుకునేవాళ్ళం. ఆపైన కేసెట్లు వచ్చాయి. అవి పెట్టుకునీ చేసుకున్నాం. ఇప్పుడు సీడీలు వస్తున్నాయి. అవీ వాడుకుంటున్నాం. అలాగే లేటెస్ట్‌గా ఇంటర్నెట్ సౌకర్యాన్ని వుపయోగించుకుంటున్నామన్నమాట.''

మధ్యలో మా తోడల్లుడు అందుకున్నాడు.

“అదికాదండీ. వాయినాలు అన్నవి పవిత్రంగా ఎదురెదురుగా వుండి పుచ్చుకోవాలనుకుంటాను కదండీ.''

నేను అందుకున్నాను.

“అసలు పద్ధతైతే అదే. కానీ, ఇక్కడ, సముద్రాలు దాటి వెళ్ళి కూడా వ్రతం చేసుకోవాలన్న వాళ్ళ కోరిక ఎంత బలంగా వుందో చూడాలి మనం.''

“అది నిజవే ననుకోండి అన్నగారూ. కానీ ఇలా చెయ్యడం వల్ల ఆ పూజకి టెక్నాలజీ వాడుకుని దాని పవిత్రతని పోగొట్టడం లేదంటారా ?''

“పవిత్రత అంటే ఏంటో ఎన్ని పుస్తకాలు చదివినా మనం చెప్పడం కష్టం. ఇలాంటప్పుడు మన పెద్దవాళ్ళు ఏం చెప్పారో దాన్ని ఫాలో అయిపోవడం మంచిది. ఏ పనికైనా మనసు, సంకల్పం ముఖ్యమని వాళ్ళు అన్నారు. ఈ పిల్లల మనసులో మానకుండా వ్రతం చేసుకోవాలన్న సంకల్పమే అసలైన పవిత్రత కావచ్చు. ఏదో విధంగా నోము నోచుకోవాలన్న వాళ్ళ తపన చూస్తుంటే ఇది మన తరంతో ఆగిపోకుండా కొనసాగిస్తున్నందుకు పిల్లల్ని మనం మెచ్చుకుతీరాలి.''

ఇంకా ఏదో చెప్పబోతున్న నాకు గోడ గడియారం ఆరుగంటలు కొట్టడం వినిపించింది. వెంటనే మా ఆవిడ, “అన్నీ చెప్తాను, అప్పుడే అక్కడ ఎనిమిది దాటుంటుంది. మీనా, తొందరగా మొహం కడుక్కుని పట్టుచీర కట్టుకురావే ...'' అని చెల్లెల్ని తొందర పెట్టింది.

మీనాక్షి వచ్చేలోపల మా ఆవిడ ఫోన్ తీసి, “హలో, సత్యవతిగారేనా ? అవునండీ, కామాక్షినే. మా చెల్లెలు వచ్చింది పూర్ణించి. ఇంకో ముత్తైదువకి కూడా వాయినం పంపించండి. లెక్క సరిపోతుందా ?'' అనడిగి, “ఓకే ...'' అని పెట్టేసింది. నా తోడల్లుడు తెల్లబోయి చూస్తున్నాడు.

“అదేనయ్యా, ఇందాక చెప్పానుగా నోముకి వాయినా లివ్వాలని ... ఇక్కడ ఒకళ్ళు ఆ సర్వీసు పెట్టారన్నమాట. దూరప్రాంతాల్లో వుంటూ నోములు నోచుకునే వారు వాళ్ళకి ఆర్డరిచ్చి డబ్బులు కట్టేస్తే ఇక్కడ వాళ్ళు చెప్పిన అడ్రసులకి చెప్పిన

వాయినాలు పంపిస్తారన్నమాట. అంటే ఆన్‌లైన్‌లో నోముకి అటెండ్ కావడం, కొరియర్ ద్వారా వాయినం అందుకోడం, అదే ఈ హైటెక్ నోముల పర్వం ...'' నాకు తోచినట్టు వివరించాను.

అక్కడేవుండి వింటున్న రామ్మూర్తి, పట్టుచీర కట్టుకుని వచ్చిన మీనాక్షి తెల్లబోయి చూస్తున్నారు.

మరికాస్త వివరించాను.

"అదే, ఇక్కడ పేరెంట్స్ పుట్టినరోజులకి అమెరికాలో వున్న వాళ్ళ పిల్లలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి, సరిగ్గా పుట్టినరోజుకి అందేలా వాళ్ళకి కేకులు, బొకేలూ పంపటంలేదూ ? అలాగన్నమాట ...''

"అవి వేడుకలు. కానీ ఇవి అలాంటివికాదే ... నోములంటే మరి ...''

"అవన్నీ తర్వాత, టైమైపోతోంది. ముందు రావే మీనా ... అంటూ చెల్లెల్ని, "రండి మరిదిగారూ ...'' అంటూ మా తోడల్లుణ్ణీ కంప్యూటర్ వున్న రూమ్‌లోకి తీసుకెళ్ళింది. బుద్ధిగా వాళ్ళని అనుసరించాను.

అక్కడ అప్పటికే నేను కంప్యూటర్‌కి వెబ్‌కేమ్ కనెక్ట్ చేసి లైటు కరెక్టుగా ఫోకస్ చేసి వుంచడం చూసి, ఆన్‌లైన్‌లో పిల్లలతో మాట్లాడడం అలవాటున్న మా ఆవిడ ఇంటర్నెట్ కనెక్ట్ చేసింది.

ఓహ్ ... అద్భుతం. ఎర్రటి జరీబోర్డరున్న ఆకుపచ్చ పట్టుచీర కట్టుకుని, కెంపుల నెక్లెసు పెట్టుకుని, ముడిచుట్టూ సన్నజాజుల మాల చుట్టుకుని, ముక్కుకున్న రవ్వల ముక్కుపుడక తళుక్ మంటుంటే సిస్టమ్ ముందు కూర్చుని కీబోర్డ్ మీటలు నొక్కుతున్న కామాక్షిని చూడగానే అర్జంటుగా ఒక్క స్టిల్ తీసేసుకోవాలన్నంత ముచ్చటేసింది. అలా చూస్తూ నిలబడిపోయాను.

కామాక్షి యాహూ మెసెంజర్ లోకి వెళ్ళగానే మా కోడలు ఆన్‌లైన్‌లో వున్నట్టు కనిపించింది. వెంటనే వెబ్‌కామ్, స్పీకర్ ఆన్ చేసింది.

అక్కడ పొద్దున్న తొమ్మిదవుతోందనుకుంటాను. కోడలు ప్రభ మా వాడిని ఆఫీసుకి పంపించి, పట్టుచీర కట్టుకుని, నగలు పెట్టుకుని, పూజకన్నీ సిద్ధం చేసుకుని కూర్చుంది.

"హాయ్ అత్తగారూ ...'' మర్యాదగా విష్ చేసింది. ఈవిడగారేం తక్కువ తిందా ? అసలే హైటెక్ అత్తగారయ్యె.

"హాయ్ ప్రభా ... అన్నీ రెడీగా వున్నాయా ?'' అనడిగింది.

"వున్నాయండీ ... మీరు చెప్పినట్టే జ్యోతులు, తోరాలు చేసాను. శెనగలు నానబెట్టాను."

"అయితే మరి పూజ మొదలెట్టు ..."

ఇక్కణ్ణించి అత్తగారు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే అక్కడ ప్రభ సీడీ ఆన్ చేసి, అందులో చెపుతున్న ప్రకారం శ్రావణ మంగళవారం నోము చేసుకుంది. మధ్య మధ్యలో అత్తగార్ని అడిగి కొన్ని సందేహాలు తీర్చుకుంది. అక్షింతలు చేతిలో పట్టుకుని కథంతా శ్రద్ధగా వింది. మీనాక్షి, రామ్మూర్తి డెస్క్‌టాప్ మీద కనపడుతున్నదంతా శ్రద్ధగా చూస్తున్నారు. పూజ పూర్తయింది. మరింక వాయినం అందివ్వాలి.

"ముందర గౌరీదేవికి వాయినం అందించమ్మా ..." అంది మా ఆవిడ. అలాగే చేసింది ప్రభ.

తర్వాత, 'ఇదిగో, మా చెల్లెలొచ్చింది. దానికి అందించు ..." అంటూ తను కూర్చున్న కుర్చీలోంచి లేచి అందులో మీనాక్షిని కూర్చోపెట్టింది.

స్క్రీన్ మీద మా కోడలు శెనగలున్న గిన్నె చేత్తో పెట్టుకుని, "యిస్తినమ్మ వాయినం ..." అంది. ఇక్కడ మా మరదలు చేతులు చాపి, "పుచ్చుకుంటినమ్మ వాయినం ..." అంది. అలా ఇద్దరూ మూడుసార్లన్నాక "నాచేతి వాయినం అందుకున్నది ..." ఎవరా అన్నట్టడిగింది కోడలు. "నేనమ్మా గౌరీమహాదేవిని ..." స్పష్టం చేసింది మరదలు.

అదికూడా మూడుసార్లన్నాక "కోరితి వరం ..." అని అట్నుంచి, "ఇచ్చితి వరం ..." అని ఇట్నుంచి డైలాగులు మారాయి. అవికూడా శాస్త్ర ప్రకారం మూడుసార్లన్నాక మా కోడలు అక్షింతలు చేతిలోకి తీసుకుని, అందుకోమన్నట్టు చెయ్యి చాపింది. ఇక్కడ మా ఆవిడ మా మరదలు చేతిలో అక్షింతలు పెట్టింది. నానబెట్టిన శెనగలు, పళ్ళు తాంబూలం మా మరదలి కిస్తున్నట్టు చెయ్యిచాపి దేవుడి దగ్గర పెట్టింది కోడలు. తర్వాత కాటుక తీసుకున్నట్టు అభినయించి, ఆ వేలితో కంటికి కాటుక దిద్దినట్టు దిద్దుకుంది మరదలు. అక్కడ్నించే కాళ్ళకి దండం పెడుతున్నట్టు వంగి నేలని తాకి కోడలు దండం పెట్టింది భక్తిగా. ఆఖర్న కోడలు లెంపలేసుకుంటూ, "భక్తి తప్పినా ఫలం తప్పకూడదు. వ్రతం చెడ్డా ఫలం దక్కాలి" అని అపరాథం చెప్పుకుంది. మా ఆవిడ చాలా సంతోషపడిపోయి కోడలితో చెప్పింది.

"మొదటివారం చేసుకున్నావు కదా. తర్వాత రెండు వారాలూ చేసుకోపోయినా ఫర్వాలేదు. మళ్ళీ ఆఖరి వారానికి అన్ని ఏర్పాట్లూ చేసుకో ..." అంది మెడలో కెంపుల

నెక్లెసు సవరించుకుంటూ. కోడలు తెలివైందే. అత్తగార్ని అడగనే అడిగింది. "నెక్లెస్ బాగుందత్తయ్యగారూ ... కొత్తదా ?" అంటూ. మా ఆవిడ మొహం వెలిగిపోయింది.

"అవునే ... మొన్న నాకెందుకిప్పుడు వద్దు వద్దన్నా వినకుండా మీ మావగారే డిజైన్ బాగుందని కొన్నారు ..." అంది మా ఆవిడ.

"అమ్మ కామాక్షీ ..." అనుకున్నాను. ఆ నెక్లెస్ కోసం తను చేసిన యుద్ధం నన్ను నాలుగు షాపులకి తిప్పడం అన్నీ గుర్తొచ్చాయి. గబుక్కున గుటకేసి అన్నీ గుండెలోకి దింపేసుకున్నాను.

"మరింక కాస్త ప్రసాదం తిని రిలాక్సవమ్మా. పొద్దుట్నించీ అలిసిపోయుంటావు" అని కోడలికి అప్పటికి శెలవిచ్చి, మళ్ళీ చెప్పింది. "ఈ నైవేద్యం పెట్టిన శెనగలు ఇలాగే పెట్టకు మావాడికి. వాడొచ్చేటప్పటికి గ్రైండ్ చేసి వేడిగా వడలు వేసిపెట్టు. ఆకలి మీదొస్తాడు పాపం ..." అని ఆర్డరేసింది.

కోడలు వడలు చేసి పెడుతుందో లేదో తెలీదు కానీ అత్తగారి ఆజ్ఞకి మాత్రం తలొంచి వినయంగా, "అలాగేనండీ ..." అని చెప్పి 'బై' చెప్పేసింది.

మా ఆవిడ కూడా వెబ్‌కేమ్ ఆఫ్ చేసి, ఇంటర్నెట్ డిస్కనెక్ట్ చేసి, చెల్లెలి వైపు, మరిది వైపు గర్వంగా చూసింది.

పాపం మా తోడల్లుడు, సినిమా చూస్తున్నాడో లేకపోతే నిజంగా జరిగింది చూస్తున్నాడో అర్థంకాని పరిస్థితిలో వున్నాడనిపించింది. మరదలయితే వెంటనే తేరుకుంది. అసలే బుర్రలో ఆలోచనలు యమ స్పీడుగా వుంటాయి. వాళ్ళక్కని అడగనే అడిగింది. "అక్కా, మరి వాయినం ఎలా వస్తుందే ?" అంటూ.

"ఇక్కడ కొత్తగా ఒక సర్వీస్ పెట్టారే. ఇలాంటి ఎన్నారైలు ఎవరు ఎలాంటి నోము నోచుకున్నా, అక్కణ్ణించి ఆర్డరు పంపిస్తే ఇక్కడవాళ్ళు, వాళ్ళు చెప్పిన అడ్రసులకి వాయినం అందించేస్తారు."

ఆ కాసేపట్లోనే బుర్రలో ఎన్ని లెక్కలేసుకుందో ... "అక్కా, అయితే అలాంటిది మా ఊళ్ళో నేను కూడా ఒకటి పెడతానే. అక్కడ కూడా ఎన్నారైలు చాలామందే వున్నారు. మనం ఇల్లు కదలక్కర్లేకుండా ఓ కుర్రాణ్ణి వాయినాలు పంపించడానికి పెట్టుకుంటే చాలు. మనం శెనగలు నానబొయ్యడం తప్ప ఇంకేమీ చెయ్యక్కర్లేదు. ఏవంటావే ?"

మా ఆవిడ మొహం వెలిగిపోయింది. "నిజమేనేవ్. నీ ఐడియా చాలా బాగుంది. పని తక్కువ, రాబడి ఎక్కువ. మంచి బిజినెస్. సత్యవతమ్మగార్నడిగితే ఏం చెయ్యాలో,

ఎలా చెయ్యాలో చెప్తుంది. మీ ఊళ్ళో ఇలాంటివి మొదలెట్టేది నువ్వే కనక బిజినెస్ చాలా బాగుంటుంది. మరిదానికి పేరేం పెడతావ్ ?''

మీనాక్షి వెంటనే, "ఏవుందీ ... ఇస్తినమ్మ వాయినం ... పుచ్చుకుంటినమ్మ వాయినం ... అని పెడ్తే అందరికీ అర్ధమౌతుంది కదే ...'' అంది.

"నిజమేనేవ్ ... పేరు కూడా బలే కేచింగ్‌గా వుంది. అదేదో సినిమాలో చెప్పినట్లు వైబ్రేషన్స్ బాగున్నాయి. కింద బ్రాకెట్లో "ఇచ్చట అన్ని రకాల నోములూ నోపించ బడును ...'' అని పెట్టొచ్చు.'' మరదలికి సందేహం వచ్చింది.

"సరేకానీ, మరి దీనికి పబ్లిసిటీ ఎలాగంటావ్ ?''

"అదులో కష్టమేం వుంది ? అన్ని తెలుగు వెబ్‌సైట్లలోనూ ఒక యాడ్ ఇచ్చేస్తే చాలు. బోల్డు ఆర్డర్లు వచ్చి పడతాయి. అందులోనూ మీ ఊళ్ళో నువ్వు అందరితోనూ కలివిడిగా వుంటావాయె. మరింక పబ్లిసిటీకి కష్టమేవుందీ ? ఇంతకీ ఎప్పుడు పెడతానంటావ్ ?

"ఎప్పటిదాకానో ఎందుకక్కా ... రేపు వరలక్ష్మి శుక్రవారానికి మొదలు పెట్టేద్దాం''.

"వెరీగుడ్ ... శుభం ...''

అక్కాచెల్లెళ్ళిద్దరి మాటలు వింటూ తోడల్లుళ్ళిద్దరం ముక్కుమీద వేలులేని శిలాప్రతిమలయిపోయాం ❊

**రచన - ఇంటింటి పత్రిక ఆహ్లాదకర కథ : మార్చి, 2009**

# డిజైనర్ ఫుడ్

**సీ**తాపతి అతని భార్య సీత ఇద్దరూ కూడా ఆరోజు చాలా సంతోషంగా వున్నారు. అతనితో పోటీ పడేవాళ్ళు ఇంకా నలుగురుండగా ఒక్క సీతాపతికి మాత్రమే ప్రమోషన్ వచ్చింది. ఆ ఆనందాన్ని వాళ్ళు తనివితీరా అనుభవిస్తున్నారు.

"సీతా, మా బాస్ నా పేరు అనౌన్స్ చెయ్యగానే ఆ బాచీగాడి మొహం ఎలా మాడిపోయిందో తెల్సా ..."

సీత పరవశంగా వింటోంది.

"ఆ కాంతారావుగాడైతే మరీనూ. నాకన్నా సీనియర్ కదా. కష్టపడి పనిచేస్తాడు. ఎక్కడా ఒక్క బ్లాక్ మార్క్ కూడా లేదు. అందరూ ఈ ప్రమోషన్ వాడికే వస్తుందనుకున్నారు. కాని పనెవడిక్కావాలి సీతా, బాస్‌ని పడగొట్టడం కావాలి కాని. అది చేసింది మనం" గర్వంగా కాలర్ ఎగరేసుకున్నాడు.

"సర్లెండి ... చేసింది మీరేం కాదు ... నేను ... ఆ రోజు మీ బాస్‌నీ, భార్యనీ భోజనానికి పిల్చిన రోజు నడుం విరిగేలా బోల్డన్ని చేసి పెట్టాను."

భర్తకి తన సాయం కూడా వుందని ఖచ్చితంగా తేల్చి చెప్పింది సీత.

"నిజమేనోయ్ ... కాదన్నానా ... ఆరోజు నువ్వు పడ్డ కష్టం నాకు తెలీదా ? అందుకేగా అందరికంటే ముందు ఆఫీసర్ భార్య ననిపించుకున్నావ్ ..."

ఇద్దరూ మళ్ళీ ఒకసారి ఆనాటి కష్టాన్ని గుర్తుతెచ్చుకున్నారు. సీతాపతి ఆఫీస్‌లో సీనియర్ పోస్ట్ ఒకటి ఖాళీ అయింది. దానిని ఎవరికివ్వాలో తేల్చవలసింది నూటికి నూరుపాళ్ళూ వాళ్ళ బాసే. అభ్యర్థులు నలుగురు. ప్రమోషన్ ఎవర్ని వరిస్తుందా అని అందరికీ టెన్షనే. అటువంటప్పుడే సీతాపతి బుర్ర పాదరసం కన్న వేగంగా పని చేస్తుంది. బాసు భోజన ప్రియుడు. ఇంటికి భోజనానికి పిలిచి సంతోషపెడితే ప్రమోషన్ వచ్చే అవకాశం వుంది. అందుకే బాస్‌ని, ఆయన భార్యనీ ఆ ఆదివారం లంచ్‌కి పిల్చాడు.

మొహమాటపడుతూనే ఒప్పుకున్నాడు బాసు. అస్మదీయులని పట్టుకుని ఆయన వేటిని ఇష్టంగా తింటారో తెలుసుకున్నాడు సీతాపతి. ఖర్చుకి చూసుకోకుండా అందుకు కావలసిన సరుకులన్నీ తెచ్చాడు. సీత కూడా చాలా శ్రమపడి చాలా

రకాల అయిటమ్సే అమర్చింది భోజనంలోకి. మామిడికాయ పప్పు, గుత్తి వంకాయ కూర, పనసపొట్టు ఆవపెట్టి కూర, ములక్కాడ సాంబారు, మామిడికాయ కొబ్బరికాయ పచ్చడి, ఖీరా పెరుగు పచ్చడి, బొబ్బట్లు, కొత్తిమీర సన్నగా తరిగి పైన అలంకరించిన పెరుగు గారెలు లాంటివన్నీ కాస్త భారీగానే చేసింది. అప్పడాలు, వడియాలు కూడా వేయించి పెట్టింది. ఆ మధ్య అక్క కూతురి దగ్గర నేర్చుకున్న బాదంఖీరు కూడా చేసి చల్లగా వుండడం కోసం ఫ్రిజ్‌లో పెట్టి వుంచింది. సీతాపతి స్వీట్‌షాప్ నుంచి బాదంబర్ఫీ, జీడిపప్పు వేసిన సమోసాలను పట్టుకొచ్చాడు. హిమాయత్‌నగర్ దాకా వెళ్ళి సుగంధభరితమయిన మిఠాయి కిళ్ళీలని స్పెషల్‌గా కట్టించుకొచ్చాడు. ఇవన్నీ చెయ్యడానికి వాళ్ళెంతో శ్రమ పడ్డారు.

బాసు మటుకు ఏ మాత్రం మొహమాటం లేకుండా అన్నీ బాగున్నాయని మెచ్చుకుంటూ అంతకు వెయ్యిరెట్లు సుష్ఠుగా భోంచేసాడు. ఆయన భార్య వద్దు వద్దంటూనే ఇంటికి వెడుతూ అన్ని రకాలూ ప్యాక్ చేయించుకుని మరీ కూడా తీసుకెళ్ళింది. మొత్తానికి వాళ్ళ శ్రమ ఫలించింది. అందరికన్న ముందు సీత ఆఫీసరు గారి భార్య అయింది. అలాగ ఎక్కడి పథకం అక్కడ వేస్తూ, ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ సీతాపతి తొందరలోనే ఆ జిల్లా మొత్తానికి పెద్ద అధికారయి కూర్చున్నాడు. ఇప్పుడు విందులు ఇవ్వడం కాదు. విందులకి వెళ్ళవలసిన హోదా కల్పించుకున్నాడు. అసలే రకరకాల రుచులను ఆస్వాదించే సీతాపతి తన కింద పనిచేసేవాళ్ళు తనని ఎప్పుడు భోజనానికి పిలుస్తారా అని ఎదురుచూడడం అలవాటు చేసుకున్నాడు.

ఆ సందర్భం రానే వచ్చింది. అతని కింద పనిచేస్తున్న సుగుణాకర్ ఆ ఆదివారం సీతాపతినీ, సీతనీ భోజనానికి పిలిచాడు. సీతాపతి కాస్త ముందు చూపున్న వాడవడం వల్ల వెంటనే ఒప్పుకోకుండా ముందు సుగుణాకర్ గురించీ, అతని భార్య గురించీ భోగట్టా సేకరించాడు. సుగుణాకర్ భార్య అందమైనదీ, చురుకైనదీ, చదువుకున్నది. ఆ చదువు కూడా హోమ్‌సైన్స్‌లో మాస్టర్స్ చేసింది. భేషుగ్గా వుందనుకున్నాడు సీతాపతి. సీత కూడా ఆనందపడింది. హోంసైన్స్ చదివిన అమ్మాయి ఇంటికి భోజనానికి వెడితే ఇంకా ఎన్ని రకాల కొత్త వంటలు తెలుస్తాయో అని సంబరపడింది.

ఆదివారం లంచ్ ప్రోగ్రామ్ అనుకున్నాక శుక్రవారం లంచ్‌టైమ్‌లో సుగుణాకర్ సీతాపతి కేబిన్‌లో కొచ్చాడు. యేమిటన్నట్లు చూసాడు సీతాపతి.

"సర్, మా ఆవిడ కొన్ని విషయాలు అడిగి రమ్మంది సర్ ..."

"యేమిటవి"

వెంటనే చొక్కా చేబులోంచి ఒక పొడుగాటి కాగితం తీసాడతను. అందులో

ఏవో టైప్ చేసి వున్నట్టు కనపడింది సీతాపతికి. చేతిలో పెన్ రెడీగా పెట్టుకుని ఒక్కొక్కటీ అడగడం మొదలుపెట్టాడు.

"మీరు వెజిటేరియనా, నాన్ వెజిటేరియనా ... అని ..."

ఎంత శ్రద్ధ ... ముచ్చటేసింది సీతాపతికి.

"ఫక్తు శాకాహారులమయ్యా బాబూ ..."

కాగితంలో నోట్ చేసుకుని మళ్ళీ అడిగాడతను ...

"మీరూ, మేడంగారూ యే ఫుడ్ యిష్టపడతారు సర్ ..."

"అంటే ..."

అదేనండీ ... నార్తిండియనా, సౌతిండియనా ... కాంటినెంటలా ... చైనీసా ... ఇటాలియనా అని ..." ఆలోచించాడు సీతాపతి.

"నార్తిండియనూ, సౌతిండియనూ యెప్పుడూ తింటూనే వుంటాం కదయ్యా. వేరేదేదైనా సరే ..." కాగితం చూసి ఇంకో ప్రశ్న వేసాడతను.

"మీకూ, మేడం గారికీ షుగరూ, బీపీ లాంటివేమీ లేవుకదండీ ... మరోలా అనుకోకండి సర్ ... మా ఆవిడ ఆరోగ్యాన్ని గురించి చాలా శ్రద్ధ తీసుకుంటుంది. కాస్త జాగ్రత్తగా చేద్దామనీ ..."

తమ భోజనం గురించి అంత శ్రద్ధ తీసుకుంటున్న సరోజ గొప్ప మనసుకి మురిసిపోయాడు సీతాపతి.

"అబ్బే ... మాకలాంటివేమీ లేవయ్యా ... మీ ఆవిడ యేం చెయ్యాలనుకున్నా చెయ్యొచ్చు ..."

మళ్ళీ కాగితం చూసి మరో ప్రశ్న వేసాడు.

"సర్, మీకు యే కూరగాయలకీ అలర్జీ ల్లాంటివేమీ రావుకదా ..."

బిత్తరపోయాడు సీతాపతి ఆ ప్రశ్నకి. తేరుకుని, "లేదయ్యా, మేం అన్ని కూరలూ శుభ్రంగా తింటాం" క్లారిఫై చేశాడు.

"సర్, మీరు బఫే ఇష్టపడతారా ... వడ్డించాలా ..." అనడిగి, సీతాపతి చూపు చూసి సర్దుకున్నాడు సుగుణాకర్.

"మరేంలేదు సర్, అందుకు సరిపోయే ఏర్పాట్లు చేద్దామనంతే ..."

మరింక మొహమాటపడి లాభం లేదనుకున్నాడు సీతాపతి.

"డైనింగ్ టేబిల్ దగ్గర కుర్చీల్లో కూర్చుని, ఏమున్నాయో చూసి, అన్నీ వడ్డించమని అడిగి, వడ్డించుకుని, కడుపునిండా తింటామయ్యా ... మీ ఆవిడనేం ఖంగారు పడొద్దని

చెప్పు ...'' ఇంకా ఇలాంటి చిన్న చిన్న ప్రశ్నలు వేసి, సీతాపతి ఇచ్చిన జవాబులతో తన క్వశ్చనీర్ లాంటి దానిని పూర్తిచేసుకుని తృప్తిగా వెళ్ళిపోయాడు సుగుణాకర్.

సీతాపతి ఇంటికి వచ్చి ఇదంతా భార్యకి వివరించాడు. సీతకిదేమీ అర్థం కాలేదు.

"ఇవన్నీ ఎందుకండీ అడగడం ?''

"మనకి డిజైనర్ ఫుడ్ పెడదామనుకుంటున్నారన్న మాట వాళ్ళు. అందుకని మనకేం కావాలో అడుగుతున్నారు.''

"డిజైనర్ ఫుడ్ అంటే ?''

అమాయకంగా అడుగుతున్న భార్యని జాలిగా చూశాడు. అమెకర్ధమవడానికి అదంటే ఏమిటో చక్కగా వివరించాడు.

"చూడు సీతా, మనం ఎవరికైనా భోజనానికి పిలిచేమనుకో ... మంచి పిండి వంటలనుకున్నవీ, ఆ సీజన్‌లో అరుదుగా దొరికేవీ, బాగా ఖరీదుగా అనిపించేవీ చాలా రకాలు చేస్తాం. వచ్చిన అతిథులు వాటిలో వారికేదిష్టమో అది తింటారు. కాని ఈ డిజైనర్ ఫుడ్ అంటే అలా కాదు. అసలు ఆ వచ్చే అతిథులకి ఏదిష్టమో తెలుసుకుని అదే చెయ్యడం. అంటే వాళ్ళ కిష్టమైనవీ, వాళ్ళకి అలర్జీలు రాకుండా వుండేవీ, వారి శరీర తత్వానికి సరిపడేవీ లాంటివి వాళ్ళకి కావల్సినట్టు చేసి పెట్టడం. ఫరెగ్జాంపుల్ షాప్‌లకి వెడితే డిజైనర్ షర్ట్స్, డిజైనర్ శారీస్ అంటారు చూడు అలాగన్నమాట. ఎవరి డిజైన్ వారిదే ... అంత శ్రద్ధగా చెయ్యడమన్నమాట.''

అంతా విన్నాక కూడా సీతకి అదేంటో పూర్తిగా అర్థంకాలేదు. తినబోతూ రుచెందుకన్నట్టు ఎలాగూ వెళ్ళినప్పుడు చూస్తాం కదా అనుకుని వూరుకుంది.

భార్యాభర్తలిద్దరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ఆ ఆదివారం రానే వచ్చింది. సరోజ పడే కష్టానికి న్యాయం చెయ్యాలని ఇద్దరూ కాఫీ కూడా చెరొక కప్పు మాత్రమే తాగారు. పన్నెండు గంటలదాకా తీరుబడిగా కూర్చుని టీ.వి.లో వచ్చే కార్యక్రమాలన్నీ చూశారు. ఆ తర్వాత బయల్దేరి సుగుణాకర్ ఇంటికి వెళ్ళారు. ఇద్దరిళ్ళ మధ్యా దూరం పావుగంటే. వీళ్ళని చూడగానే సుగుణాకర్, సరోజ ఎంతో హడావిడిపడుతూ ఆహ్వానించారు. ఆ హడావిడి ఇద్దరికీ బాగా నచ్చింది. కొత్తగా కవర్లు మార్చిన సోఫాలో ప్రత్యేకంగా కూర్చోబెట్టారు.

"మంచినీళ్ళు కావాలండీ ... ?'' వినయంగా అడిగింది సరోజ.

"కొంచెం ఇవ్వమ్మా ...'' అనగానే,

"చల్లటి నీళ్ళాండీ ... లేక మామూలువా ...'' అనడిగింది.

"కాస్త చల్లటివే ఇవ్వమ్మా ..." చనువుగా అంది సీత.

"ఫ్రిజ్‌లోవాండీ ... కుండలోవా ..." మళ్ళీ అడిగింది.

"ఏవోకటి ఇవ్వమ్మా ..." చిరాకు పైకి కనిపించకుండా అంది సీత.

"అదికాదండీ, మీకు ఫ్రిజ్‌లో నీళ్ళు తాగే అలవాటుంటే అవే ఇస్తాను. లేదనుకోండి అవి తాగితే గొంతు పట్టేస్తుంది అందుకని అడిగాను.

ఆమె ముందు చూపుకి మురిసిపోయాడు సీతాపతి. నీళ్ళు తాగితే భోజనం పాడవుతుందనే ఉద్దేశంతో ... "ఇప్పుడేవీ వద్దులేమ్మా" అని చెప్తూ భార్య వైపు అర్థం చేసుకో అన్నట్టు చూశాడు. సీత అర్థం చేసుకుంది.

హాలంతా పరిశీలించడం మొదలుపెట్టింది. ఎక్కడ వుండాల్సిన వస్తువు లక్కడ అందంగా అమర్చబడి వున్నాయి. సరోజకి కాస్తంత కళోపాసన కూడా వుందేమో అన్నీ ఆకట్టుకునేలా వున్నాయి. సోఫాలలో వేసిన కుషన్లూ, కిటికీలకు పెట్టిన కర్టెన్లూ చక్కగా మేచ్ అయ్యాయి. అక్కడక్కడ అమర్చిన ఫోటోలు, పెయింటింగ్స్ కూడా ఆకట్టుకునేలా వున్నాయి. శ్రద్ధగా చుట్టూ పరిశీలిస్తున్న సీత సీతాపతి మాట గట్టిగా వినిపించటంతో అటు తిరిగింది.

"ఇప్పుడా ... ?" అంటున్నాడు గట్టిగా ...

"ఏంటండీ ... ?"

సరోజ వివరించింది. "ఏమీలేదు మేడమ్, అప్పిటైజర్‌గా పనీర్ టిక్కానా ... లేక ఆలూ టిక్కానా ... లేక ఇంకేదైనానా అనడుగుతున్నానండి ..."

"అవెందుకిప్పుడు ?"

"అంటే లంచ్ తినే ముందు ఇలాంటివి తినడం ఈ మధ్య పెద్ద హోటళ్ళలో అలవాటుగా అయిందండి. ఇవి తిని ఏమైనా తాగితే డైరెక్ట్‌గా లంచ్ తినేదానికన్న మంచిదని అలా చేస్తారన్నమాట ... మీరు ఫ్రూట్ పంచ్ తీసుకుంటారా ... లేక వేరే జ్యూస్ లేమైనా తెమ్మంటారా ... ?"

ఇదేదో కొత్తగా అనిపించి ఆ పనీర్ టిక్కా ఏదో బాగానే వుందనిపించి అదే తెమ్మంది సీత.

సరోజ ఎంతో విధేయురాలిలా తలూపి, అక్కడే వున్న డబల్ డోర్ ఫ్రిజ్ తీసి అందులోంచి పనీర్ పేకట్ తీసింది. అది చూసి సీత ఆపుకోలేక అడిగేసింది. "అంటే ఇప్పుడు చేస్తావా ... ?" అనడిగేసింది మరి మొహమాటం లేకుండా.

"ఎంతసేపాంటీ ? మీరు మాట్లాడుకుంటూండండి.. ఫ్రెష్‌గా చేద్దామని ఆగాను" అంటూ పేకట్ పుచ్చుకుని కిచెన్‌లోకి వెళ్ళిపోయింది.

"ఇహిహి ...నవ్వాడు సుగుణాకర్, "మా ఆవిడ అన్నీ ఫ్రెష్‌గానే చేసి పెడుతుందండీ ..." గొప్పగా చెప్పాడు. ఇంతలో లోపల్నించి "సుగూ ... ఓసారిలా వస్తావా ..." అని వినిపించింది. వెంటనే లోపలికి పరిగెత్తాడు సుగుణాకర్.

"సుగూ, సుగూ అంటూ ఆ పిలుపేంటండీ కట్టుకున్న మొగుణ్ణీ ... ?" అనడిగింది సుగుణాకర్ లోపలికి వెళ్ళాక నెమ్మదిగా సీత, సీతాపతిని.

"అదా ... ఈమధ్య మొగుడూ పెళ్ళాలు అలాగే పిల్చుకుంటున్నారులే ... అంటే వాళ్ళకి ఒకళ్ళంటే మరొకళ్ళకి అంత ముద్దన్నమాట."

"నా మొహంలా వుంది, ముద్దంటే పిల్లల మీదుండాలి కాని మొగుళ్ళూ, పెళ్ళాల మీద కాదు. మొగుడికీ, పెళ్ళానికి ఒకరంటే ఒకరికి ప్రేమ, గౌరవం వుండాలి" గొప్ప సత్యం కనిపెట్టినట్టు చెప్పింది.

మళ్ళీ ఇంకో అనుమానం వచ్చింది సీతకి.

"ఇంతకీ వంట కూడా ఇప్పుడు మొదలెడుతుందంటారా ... ?" అనడిగింది నెమ్మదిగా.

"నీకు మరీ అనుమానం. వంట ఎప్పుడో అయిపోయుంటుంది. ఇదొక్కటే మనం ఏం తాగుతామో తెలీక ఆగుంటుంది" సీత మాట కొట్టి పడేసాడు.

లోపల్నించి రకరకాల వాసనలు వస్తున్నాయి. ఓ పావుగంట సేపు ఇద్దరూ మొహమొహాలు చూసుకుంటూ కూర్చున్నాక కిచెన్‌లోంచి భార్యాభర్తలిద్దరూ ఒక ట్రాలీ లాంటి దాన్ని తోసుకుంటూ వచ్చారు. వీళ్ళిద్దరూ కూర్చున్న సోఫా ముందు సెంటర్ టేబిల్ మీద ముందుగా ఒక గాజు వాటర్ బాటిల్, పక్కన చిన్న ట్రేలో రెండు గాజు గ్లాసులు పెట్టారు. ఒక పెద్ద గాజుప్లేట్‌లో నాలుగు చిన్న చిన్న ముక్కల్లాంటివి ఎర్రగా నూనె కారుతూ కనిపిస్తున్నాయి. వాటి చుట్టూ గుండ్రంగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, ఖీరా ముక్కలు, కేరట్ ముక్కలూ, యింకా ఏవో సీతకి కూడా తెలీని ముక్కలూ అందంగా అమర్చింది సరోజ. పక్కన చిన్న ప్లేట్లో సూర్యుడి లాగ గుండ్రంగా పేర్చిన టూత్‌పిక్స్, ఆ పక్కన పొడుగాటిదాంట్లో అందంగా మడిచి పేపర్ నేప్కిన్స్ అన్నీ జాగ్రత్తగా అమర్చారు. అవేంటో వాటినెలా తినాలో తెలీలేదు సీతకి. పక్కన మరో ట్రేలో ఏదో ద్రవ పదార్థం వుంది. బహుశా దానిని ఫ్రూట్‌పంచ్ అంటారనుకుంది సీత. సీతాపతి తెలివైనవాడు. చుట్టూ అమర్చిన వాటిని బట్టి అవెలా తినాలో అర్థం చేసుకున్నాడు. టూత్‌పిక్ తీసుకుని ఆ ఎర్రని ముక్కలలో గుచ్చి పైకి తీసి తిన్నాడు. అర్థం చేసుకున్న సీత అతన్ని ఫాలో అయిపోయింది.

సరోజ ముందుకు వంగి ఎంతో వినయంగా అడిగింది. "మీరు ఇటాలియన్ ప్రిఫర్ చేస్తారా ... లేక మెక్సికనా ... ?" అని.

"ఏదైనా ఫరవాలేదమ్మా ... అంటే ఇప్పుడు వండాలా ..." ఆపుకోలేక అడిగేసింది సీత.

"పెట్టేదేదో మీకు నచ్చేది పెట్టాలి కదండీ ... అయినా ఎంతసేపు లెండి ... మీరు ఇవి తినేటప్పటికి అయిపోతుంది ..." అంటూ ఒక పుస్తకం తీసుకొచ్చింది.

"ఇందులో లంచ్‌కి ఏం కావాలో చెపితే అవి చేసేస్తానండి."

ఆ పేర్లన్నీ కాస్త కొత్తగా వున్నా ఈ మధ్య టీ.వి.లో వంటల ప్రోగ్రామ్స్ చూస్తున్న జ్ఞానం వల్ల కొన్ని మాటలు అర్థమయ్యాయి సీతకి. సీతాపతి తన అజ్ఞానం బైట పడకుండా "మాకు ఏవి బాగుంటాయో నువ్వే ఆలోచించి చెయ్యమ్మా. నీకు అన్నీ తెలుసుగా ..." అంటూ తెలివిగా సమాధానమిచ్చాడు.

"అయితే పాస్తా చేస్తానండీ. మరి వెజిటబుల్స్ ఏం వెయ్యమంటారు ?"

"ఏం బాగుంటాయో అవి వెయ్యమ్మా ..." మళ్ళీ తెలివిగా తప్పించుకున్నాడు. సరోజ ఫ్రిజ్‌లోంచి కూరల ట్రే తీసుకుని కిచెన్‌లోకి వెళ్ళిపోయింది.

సీత భర్తని హెచ్చరించింది. "ఆ పాస్తాలు అవీ మనం తినలేమండీ ..."

సీతాపతి ఒప్పుకోలేదు. "అస్తమానం ఒక రకమేనా ... ఇదీ చూద్దాం ..."

సరోజ కిచెన్‌లోకి హాల్లోకి తిరుగుతూనే వుంది. కిచెన్‌లోకి వెళ్ళినప్పుడు సుగుణాకర్‌ని లోపలికి పిలుస్తూనే వుంది. పాపం సుగుణాకర్ బాస్ ముందు ఏం మాట్లాడాలో తెలీని మొహమాటంతో ఒకవైపు, సరోజ పిలుపులకి లోపలికి వెళ్ళి కావల్సిన సాయం చేసి వస్తూ మరోవైపూ తెగ నలిగిపోతున్నాడు. అరగంట గడిచింది. సరోజ కిచెన్‌లోంచి చేతిలో పళ్ళెంతో వచ్చింది. ఇద్దరూ ఆత్రంగా ఆ పళ్ళెం వైపు చూశారు.

అందులో ఒక పొడవాటి ఆనపకాయ పడవ ఆకారంలో కనిపిస్తోంది. దానిని జాగ్రత్తగా డైనింగ్ టేబిల్ మీద వున్న ఒక వెడల్పాటి గాజు ట్రే మధ్యలో రెండు కర్రపుల్లల మీద పడవ ఆకారంలో షేప్ చేసిన ఆ ఆనపకాయని అడ్డంగా నిలబెట్టింది. దానికి మధ్య మధ్యలో కిటికీలు, గుమ్మాల్లాగ ఖాళీలు ఖాళీలుగా కట్ చేసి వుంది. దానిపైన ఒకవైపు పొడుగ్గా, మరోవైపు పొట్టిగా సన్నటి పుల్లలు గుచ్చి వున్నాయి. సరోజ కాస్త పెద్దగా, వెడల్పుగా వున్న కాబేజీ ఆకులను తెచ్చి ఆ పుల్లలకి గుచ్చి, దారాలతో పడవకు తెరచాప లాగ అమరేటట్టు చేస్తోంది. సుగుణాకర్ సరోజ ఎటు నిలబడమంటే అటు నిలబడి, దారం పట్టుకోమంటే దారం, కాబేజీ ఆకు పట్టుకోమంటే అదీ పట్టుకుంటూ ఆపసోపాలు పడిపోతున్నాడు.

ఆఖరికి ఒక పావుగంట వాళ్ళిద్దరూ శతవిధాలా ప్రయత్నించాక ఆ కాబేజీ ఆకుకి తెరచాప ఆకారం వచ్చింది. సరోజ, సుగుణాకర్ ఇద్దరూ కాస్త రిలీఫ్‌గా ఫీలయి, ముందుకీ వెనక్కీ నడుస్తూ ఆ కళాఖండాన్ని అన్ని కోణాల్నించీ చూసుకున్నారు. సరోజ ఓ అడుగు ముందుకేసి దాని యాంగిల్ కాస్త మారుద్దామనుకుంది. సుగుణాకర్ గబుక్కున అడ్డువచ్చాడు. "నో స్వీటీ ... ఇలాగే బావుంది ..." అంటూ.

"అరె ... చాలా బాగుందోయ్ ... మీ ఆవిడ గొప్ప ఆర్టిస్టన్నమాట ..." అది మళ్ళీ వూడి పడిపోయేలోపున సీతాపతి గట్టిగా మెచ్చుకున్నాడు.

"ఈ ప్రజంటేషన్‌కి సరోజకి క్లాస్‌ఫస్ట్ వచ్చిందండీ ..." సుగుణాకర్ గర్వంగా చెప్పాడు. సరోజ హుందాగా సిగ్గుపడింది.

"ఆ పాస్తాయో ఏదో స్టౌ మీద పెట్టావామ్మా ... ?" అనడిగింది.

సరోజ వెంటనే, "అయిపోయిందాంటీ ... ఒకటి చెప్పండి. మీకు పాస్తాలో కేరట్లు పొడుగ్గా ముక్కలు చేస్తే తింటారా లేక పొట్టిగానా ?"

"అంటే ఇప్పుడింకా కేరట్లు తరగాలా ?"

"ఎంత సేపాంటీ ? ఫుడ్ ప్రాసెసర్ వుంది కదా" అంటూ, "సుగూ, ఆపైన పెట్టేసాం అట్టపెట్టెలో, కాస్త దాన్ని తీద్దూ ..."

ఎంతో విధేయంగా ఆ అట్టపెట్టె దింపాడతను. అది పుచ్చుకుని మళ్ళీ ఇద్దరూ కిచెన్‌లోకి వెళ్ళిపోయారు.

సీతకి పెద్ద అనుమానం వచ్చింది. లోపలికి వెళ్ళినవాళ్ళకి వినపడకుండా నెమ్మదిగా "ఇప్పుడు మనం ఆ ఆనపకాయ తినాలాండీ ?" అనడిగింది.

"నీ మొహం. దానిని టేబుల్ డెకరేషన్ అంటారు. డైనింగ్ టేబుల్ మీద అందంగా కనిపించటానికి అలా అమరుస్తారు. కొన్ని పెద్ద పెద్ద హోటల్స్‌లో అయితే కాకరకాయల్ని మొసళ్ళ ఆకారంలో చేసి పెడుతూంటారు. దీనినే వెజిటబుల్ కార్వింగ్ అంటారన్నమాట" తన పరిజ్ఞానాన్ని చాటుకున్నాడు సీతాపతి.

"తినడానికి పనికిరానిది డైనింగ్ టేబుల్ మీద ఎందుకండీ ? పైగా దాన్ని మీరు మెచ్చుకోడం కూడాను ..." చిరాకు పడింది.

"అలా అనకు. కంటితో చూడ్డానికి బాగుంటేనే తినడానికి టేబుల్ దగ్గరకు వస్తారని వాళ్ళ వుద్దేశమన్న మాట. నేను మెచ్చుకోలేదనుకో. మనకి కళా హృదయం లేదనుకుంటారు. నా మెప్పుదలకి చూశావా ఆ అమ్మాయి ఎంత సంబర పడిపోయిందో."

"ఏం సంబరవో ఏంటో ... అసలు లోపల ఏం వండుతోందో నాకేమీ తెలీటం లేదు. అసలు పోపు వాసనలే రావట్లేదేంటండీ ... ?"

సీతకి, సీతాపతికి కడుపులో గుడగుడలు మొదలయ్యాయి. టైం చూస్తే ఒకటిన్నర. కాసేపట్లో కళ్ళు కూడా తిరగొచ్చు అనిపించింది ఇద్దరికీ. మరింక మొహమాటపడి లాభం లేదనుకుని సీత కిచెన్‌లోకి జొరబడి అక్కడి దృశ్యం చూసి తెల్లబోయింది. స్టౌ మీద ఒక పెద్ద స్టీలు గిన్నెలో నీళ్ళు మరుగుతున్నాయి. పక్కన పళ్ళెంలో కొన్ని కూరలేవో కనపడుతున్నాయి. సుగుణాకర్ ఆ ఫుడ్ ప్రాసెసర్ సరిగ్గా అమర్చడానికి నానా తంటాలూ పడుతున్నాడు. సరోజ సుగుణాకర్‌ని జాగ్రత్తగా గమనిస్తోంది. కిచెన్‌లోకి వచ్చేసిన సీతని చూసి ఇద్దరూ కాస్త ఖంగారుపడ్డారు.

సరోజే ముందు తేరుకుంది. "ఏం కావాలాంటీ ... మంచినీళ్ళా ... అక్కడే వున్నాయాంటీ" అంది.

"కాదమ్మా, వంట ఎంతవరకూ వచ్చిందో చూద్దామని వచ్చాను" తేల్చేసింది. సుగుణాకర్‌కి అర్థమైపోయింది. "వాళ్ళకి ఆకలేస్తోందేమో సరోజా" అన్నాడు ధైర్యం తెచ్చుకుంటూ. "అయిపోయిందండీ ..." అంటూ ఆ మరుగుతున్న నీళ్ళలో పాస్తా వేసింది సరోజ.

వంటిల్లంతా ఒక లుక్కేసింది సీత. అన్ని సామాన్లూ ఎక్కడ వుండవలసినవి అక్కడ వున్నాయి. వండిన వంటకాలు మటుకు ఎక్కడా కనిపించలేదు. అప్పటివరకూ తరిగిన కూరముక్కల్ని ఒక గాజు బౌల్‌లో వేసి మైక్రోవేవ్‌లో పెట్టింది సరోజ. "మీరు కూర్చోండి ఆంటీ, నిమిషంలో తెచ్చేస్తా ..." అంటూ సీతని హాల్లోకి పంపేసింది.

హాల్లో కొచ్చిన సీతని ప్రశ్నార్థకంగా చూశాడు సీతాపతి. మొహంలో ఏ భావమూ కనిపించనివ్వకుండా అతన్ని అంధకారంలో వుంచేసింది సీత.

మరో సుదీర్ఘమైన నలభై నిమిషాలు గడిచాక సరోజ, సుగుణాకర్ ఇద్దరూ చేతుల్లో రెండు ట్రేలు పట్టుకుని వచ్చి డైనింగ్ టేబుల్ మీద పెట్టారు.

మరింక పిలుపుల కోసం చూడకుండా టేబుల్ వైపు నడిచారు సీతా, సీతాపతీను. అప్పటికే టైము రెండు గంటలు దాటి మూడుకి దగ్గరవుతోంది మరి. తీరా వెడితే అక్కడేమున్నాయి తినడానికి ... జావలా కారిపోతున్న సేమ్యాల్లాంటివి, మధ్య మధ్యలో చిన్న చిన్న కూరముక్కలతో, అదో రకమైన మసాలా వాసనతో టేబుల్ మధ్యలో ఆనపకాయ పడవ పక్కన పెట్టి వున్నాయి. "దేనికైనా దంతసిరి వుండాలి" మనసులోనే నిట్టూర్చాడు సీతాపతి.

మరో పావుగంటకి వెనక్కి తిరిగి వెడుతూ సీతని అడిగాడు సీతాపతి.

"వెళ్ళగానే కుక్కర్‌లో అన్నం పెడితే ఎంతసేపటికి అవుతుందంటావ్ ... ?"

చురుక్కుమంటున్న సీత చూపుల్ని తప్పించుకుంటూ, "యేంటో ... కడుపు ఖాళీగా అనిపిస్తోందోయ్ ..."

సీత వూరుకోలేదు ...

"ఇంత చక్కటి డిజైనర్ ఫుడ్ తిన్నాక కూడానా ..."

"తప్పేముంది ... వాళ్ళ డిజైనర్ ఫుడ్ వాళ్ళు పెట్టారు. మన డిజైనర్ ఫుడ్ మనం తిందాం."

"ఇంతకీ తమ డిజైనర్ ఫుడ్ ఏమిటో ... ?" వెక్కిరింపుగా అడిగింది.

"నీకు తెలీనట్టు కొత్తగా అడుగుతావేంటి ? మన తెలుగువారికి ఎప్పటికీ డిజైనర్ ఫుడ్ అనేవి రెండే ... ఎవర్‌గ్రీన్ వేడి వేడి అన్నంలోకి ఆవకాయ, గోంగూర .... కాదంటావా ."

"ఎందుకు కాదంటాను ? జై ఆవకాయ, జై గోంగూర అంటాను."

"జై కాదోయ్ ... జయహో అను ... ఆస్కార్ అవార్డు కూడా రావచ్చు ..." ❊

**కౌముది - అంతర్జాల పత్రిక : జనవరి, 2011**

# పాతసీసాలో కొత్తసారా ...

శుభలేఖ పైనే "జిడ్డు వారి పెండ్లి పిలుపు ..." అని చూసి రోజు రోజుకీ మారుతున్న పెళ్ళిళ్ళ విధానాలకి అలవాటు పడిపోతూ శుభలేఖ తెరిచేడు రఘుపతి. జిడ్డు వారి అమ్మాయిని నేతి వారి అబ్బాయికి ఇస్తున్నారు. "ఇహనేం ... శుభం ... అనుకుంటూ పెళ్ళెప్పుడో, ఎక్కడో చూస్తుంటే వచ్చింది అతని అర్ధాంగి అలివేలు "ఎవరి పెళ్ళండీ ..." అంటూ ... "ఎవరో జిడ్డు వారుట ... మీ చుట్టాలేమో ..." అన్నాడు వ్యంగ్యంగా. అలివేలు వాళ్ల పుట్టింటారికి బంధుప్రీతి ఎక్కువ. ఎక్కడెక్కడి వాళ్లనీ మావాళ్ళే అని కలిపేసుకుని తిరుగుతుంటారు. అలివేలు ఎన్నిసార్లు ఆ చుట్టరికాలు చెప్పినా రఘుపతికి అర్థంకాదు. ఎందుకంటే రఘుపతి కేవలం అతని అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళని మాత్రమే గుర్తుపెట్టుకుంటాడు. మిగిలిన వాళ్ల గురించి ఆలోచించి బుర్రని చెత్తబుట్ట చెయ్యడం అతని కిష్టముండదు.

అతని సంగతి తెలిసిన అలివేలు పోనీ పాపం అని వూరుకోదు. ఊళ్ళో చుట్టాలందర్నీ కలిపేసుకుని తిరిగేస్తుంటుంది. శుభలేఖ తీసి చూస్తూనే ... "అయ్యో, ఇది మా రెండో మావయ్య తోడల్లుడి చెల్లెలి పెళ్ళండీ.

వైజాగ్‌లో ... అరే వచ్చే నెలే ... అన్నట్టు మొన్ననే ఫోన్ చేసి చెప్పేడు. నేను చెప్పడం మర్చేపోయేను. అయిదురోజుల పెళ్ళిట. ఇప్పుడందరూ పాత రోజుల్లోలాగ మూడురోజుల పెళ్ళిళ్ళూ, అయిదు రోజుల పెళ్ళిళ్ళూచేస్తూ, పాత తంతులన్నీ మళ్ళీ పైకి తీస్తున్నారండీ ..." ఒక్కటడిగితే పది చెప్పే అలివేలు ఈసారి ఇంకా ఆవేశ పడిపోయింది.

అసలే అలివేలు ఎక్కడైనా మావిడితోరణం కట్టారంటే పరిగెట్టేస్తుంది. అలాంటిది ఇంత దగ్గరి చుట్టం పెళ్ళికి వెళ్ళకుండా వుంటుందా ... తను వెళ్ళడవే కాదు, రఘుపతిని బలవంతంగా బయల్దేరదీసింది. తప్పుతుందా ... హోంమినిస్టర్ గారి ఆదేశం.

అయినా ఎంతో కష్టపడి మరీ అయిదు రోజులు కాకుండా మూడు రోజులకి ఒప్పించగలిగేడు రఘుపతి.

ఆరోజు ఉదయాన్నే వైజాగ్‌లో పెళ్ళి జరగబోతున్న హోటల్‌కి చేరుకున్నారు

రఘుపతి, అలివేలూను. అక్కడ రిసెప్షన్‌లో వీళ్ళ పేర్లు చెప్పుకుని, శుభలేఖ చూపించగానే కౌంటరులో వున్నతను బెల్ కొట్టాడు. వెంటనే సన్నజాజిమొగ్గల్లాంటి అమ్మాయి లిద్దరు పసుపు, కుంకుమ, పూలతో స్వాగతం చెప్పేరు. “రండి మావయ్యగారూ, రండి అత్తయ్యగారూ ...'' అంటూ వీళ్ళిద్దరినీ లిఫ్ట్‌లో రెండో అంతస్తుకి తీసికెళ్ళి, ఓ రూమ్ తలుపు తీసి, “ఇదిగోండి మావయ్యా, ఇది మీ రూమ్. తొందరగా ఫ్రెష్ అయి కింద డైనింగ్‌హాల్‌కి వచ్చెయ్యండి. టిఫిన్లు రెడీగా వున్నాయి. అవునూ .. బావ రాలేదా ?'' అనడిగి, తెల్లమొహం వేసిన వాళ్లనక్కడే వదిలి వెళ్ళిపోయేరు. “మనని చూసి ఎవరనుకుందో పాపం'' అన్నాడు రఘుపతి. “మరే ... బావ రాలేదా అంటోంది పాపం ఎవరనుకుందో ...'' అంది అలివేలు కూడా అయోమయంగా.

“ఇంతకీ మీ మావయ్య తోడల్లుడి ... అదే అదే వాళ్ళెవరూ కనపడరేం ?'' అయోమయంగా అడిగేడు రఘుపతి.

“అయ్యోరామా ... ఈరోజుల్లో ఇంతేనండీ. మనల్ని ఇబ్బంది పెట్టకూడదని ... మనం ఫ్రెష్ అయ్యేక వచ్చి కలుస్తారు. ఈ పిల్లలు వాళ్ళ తాలూకే కదా ... మీరు మరీనూ'' అంది అలివేలు.

రఘుపతికి కాస్త తేడాగా అనిపించింది. మామూలుగా పెళ్ళింటికి వెళ్ళగానే ... “హా హా ... రండి రండి ... ప్రయాణం బాగా జరిగిందా ? అడ్రెస్ సరిగ్గా తెలిసిందా ... ?'' అంటూ పెళ్ళికొడుకు బాబయ్యో, మావయ్యో, కాదూ కూడదంటే స్వయంగా తండ్రో ఆహ్వానిస్తారు ... కాని ఈ పిల్లకాయలేంటీ ...

రఘుపతిని ఇంక ఆలోచించనివ్వలేదు అలివేలు. “త్వరగా తెవలండి ... టిఫిన్లు రెడీగా వున్నాయని చెప్పిందిగా ఆ పిల్ల ...'' అంటూ తొందర పెట్టేసింది.

రఘుపతీ, అలివేలూ రెడీ అయి డైనింగ్ హాల్ కొచ్చి, అక్కడ వున్న టిఫిన్లలో వీళ్ళకి కావల్సినవి తీసుకుంటుంటే ఇందాకా వీళ్ళని రూములోకి తీసికెళ్ళిన అమ్మాయి మరో దంపతులను తీసుకొచ్చి, “కూర్చోండి బాబయ్యగారూ, అన్నయ్య రాలేదా ... ? అయినా అన్నయ్య ఎప్పుడూ ఇంతే ... ఎక్కడికీ రాడు ... కదా పిన్నీ ...'' అంటూ వాళ్ళని కూడా ఇంకో టేబిల్ దగ్గర కూర్చోబెట్టింది.

అప్పుడు తట్టింది అలివేలుకి. “అయ్యో ... వాళ్ళు ఈవెంట్ వాళ్ళండీ ... అందర్నీ అలాగే వరసలు పెట్టి పిలుస్తారు.'' రఘుపతికి చిరాకేసింది. “ఈవెంట్ వాళ్లయితే మర్యాదలు బాగా చెయ్యాలి కానీ ఇలా వరసలు పెట్టి పిలవడమేంటీ ...'' అన్నాడు.

“అయ్యో ... అలా పిలిచి కూర్చోబెడితేనే మనం మన చుట్టాలింటికొచ్చినట్టు

అనిపిస్తుంది. ఈమధ్య పెళ్ళిళ్లలో మర్యాదలన్నీ వీళ్ళే చేస్తున్నారు. అందులోనూ మా అన్నయ్య మర్యాదలంటే మరీ పడి చస్తాడు. ఇంత తేడా వచ్చినా ఊరుకోడు. నిన్న చెప్పేడు నాతో ... ఈ పెళ్ళిలో అన్నీ పాతకాలం నాటి పెళ్ళిళ్ళలాగే జరగాలని మగపెళ్ళివారు పట్టుపట్టారుట. అందుకే ఎనభైయేళ్ళు దాటిన మా సుబ్బమ్మత్తని ప్రత్యేకం కారు పంపించి దగ్గరుండి తీసుకొచ్చేరుట. ఆవిడకి ఈ పద్ధతులన్నీ కొట్టిన పిండనుకోండి ...''

"ఇవన్నీ నీకెప్పుడు తెలిసేయి ... ఇంకా వాళ్ళెవరూ కనిపించలేదుగా ...''

"అయ్యో ... అక్కడే ఫోన్లో అన్నీ చెప్పేరండీ బాబూ ... ఎన్నాళ్ళయిందో ఇలా పెళ్ళిళ్ళలో మర్యాదలు చూసి ...'' ఉబ్బిపోతున్న అలివేలు నోటికి ఇంక ఆపడం అంటూ లేకపోయింది. వింటున్నట్టు నటిస్తున్న రఘుపతి చుట్టూ ఒకసారి దృష్టి సారించేడు.

తెలిసిన మొహం ఒక్కటీ కనిపించలేదు. అలివేలు కూడా పాపం తీర్థంలో తప్పిపోయిన దానిలా అంతమంది జనంలోనూ తెలిసినవారి మొహాల కోసం వెతుకుతోంది. ఎవరు కనిపించేరో ఏమో చేతిలో ప్లేటు ఆ పళాన్నే పట్టుకుని "శాంతమ్మొదినా ... నువ్వా ... బాగున్నావా ... ఎప్పుడొచ్చేవ్ ... ?'' అంటూ ఓ మూల కూర్చుని బిక్కు బిక్కుమంటూ చూస్తున్న దంపతులవైపు పరిగెడుతున్నట్టే వెళ్ళింది. వాళ్ళు అలివేలుని చూడగానే చాటంత మొహాలు చేసుకుని, పాయసంలో జీడిపప్పు కనిపిస్తే చటుక్కున తీసి నోట్లో పెట్టుకున్నట్టు అలివేలుని చేయిపట్టి లాగి వాళ్ల దగ్గర కూర్చోబెట్టేసుకున్నారు.

హతాశుడయ్యేడు రఘుపతి. అయినా ధైర్యం కోల్పోలేదు. అతనికిది అలవాటే. పుట్టింటివాళ్ళెవరు కనిపించినా రఘుపతిని అక్కడికక్కడే మర్చిపోతుంటుంది అలివేలు.

ఓసారిలాగే హైద్రాబాదులో అలివేలు చుట్టాలింట్లో పెళ్ళికెడితే, వాళ్ళు పెళ్ళికూతురికి తోడుగా అలివేలుని పెళ్ళికూతురితో పాటు అత్తారింటికి సాయంగా పంపడానికి అప్పటికప్పుడు నిర్ణయించుకుని, దుర్ముహూర్తం వచ్చేస్తోందని తొందర పెట్టేసి అలివేలుకి రఘుపతితో చెప్పే టైమ్ కూడా ఇవ్వకుండా పెళ్ళికూతురితో పాటు, నాచారంలో వున్న నోమా కల్యాణమంటపం నుంచి, మెహిదీపట్నంలో వున్న మగపెళ్ళి వారింటికి కారులో ఎక్కించి పంపించేసేరు. తర్వాత వాళ్ళు కూడా సామాన్లు సర్దుకునే హడావిడిలో చాలా కన్వీనియంట్‌గా రఘుపతితో చెప్పడం మర్చిపోయేరు.

పాపం రఘుపతి అలివేలు కోసం చూసి, చూసి అందరి సామాన్లు వెళ్ళిపోయేక, అన్ని రూమ్‌లూ వెతుక్కుని, ఎక్కడా అలివేలు కనపడక దార్లో పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టిద్దావా అనుకుని కూడా, పోనీ తెల్లారనీ ... అనుకుంటూ, ఇంటికొచ్చి, రాత్రంతా నిద్రపట్టక అలివేలే గుర్తొస్తుంటే తమ పెళ్ళి ఫోటోల ఆల్బం చూసుకుంటూ గడిపేసేడు.

అక్కడ మగపెళ్ళివారింట్లో ఉదయం కాఫీ తాగుతున్నప్పుడు కానీ అలివేలుకి రఘుపతి గుర్తురాలేదు. వెంటనే ఫోన్ చేసి విషయం చెప్పింది. రాత్రంతా టెన్షన్ పడ్డ రఘుపతి ఫోన్‌లో గట్టిగా అరవబోయేడు. రఘుపతి సంగతి తెలిసిన అలివేలు తెలివిగా "అయినా నాకు తెలీదాండీ మీరెంత మంచివారో. ఇక్కడ మగపెళ్ళివారితో మీ గురించే చెపుతున్నాను. మీరు ఆడవాళ్ళకి ఎంత స్వేచ్ఛా, స్వతంత్రం ఇస్తారో అంటుంటే వాళ్ళు మిమ్మల్ని చూడాలంటున్నారండీ ... రారూ .." అంటూ అతని ముందరి కాళ్ళకి బంధం వేసేసింది. ఇంకేం చేస్తాడూ ... అంత దూరమూ వెళ్ళి సాయంత్రానికి అలివేలుని ఇంటికి తెచ్చుకున్నాడు. ఆ అనుభవం అయినప్పట్నించీ రఘుపతి ఇలా అలివేలు తరపు బంధువుల ఇళ్లకి వచ్చినప్పుడు చాలా ముందు జాగ్రత్త పడుతున్నాడు. అలివేలుని అస్సలు తన దృష్టి నుంచి తప్పించుకో నివ్వటం లేదు.

ఇప్పుడు కూడా అలా మూల టేబిల్ దగ్గర వాళ్లతో మాట్లాడుతున్న అలివేలునే చూస్తూ కూర్చున్న రఘుపతి పక్కన ఓ పెద్దాయన వచ్చి కూర్చున్నాడు. "ఎవరి తాలూకు బాబూ నువ్వు ..." అంటూ.

"నేనూ ... అలివేలు మొగుణ్ణండీ" అన్నాడు. మళ్ళీ వెంటనే గుర్తొచ్చింది. అలివేలుని వాళ్ళ చుట్టాలందరూ "చంటీ ..." అని పిలుస్తుంటారు. అందుకని, "చంటి మొగుణ్ణండీ" అని అతి వినయంగా చెప్పేడు. "ఏ చంటీ ... పెద్దబ్బులు గారి చంటా? చిన్నబ్బులు గారి చంటా ?" ఆయన మళ్ళీ అడిగేడు. ఈ సంగతి రఘుపతికి తెలీదు. బిక్కమొహం పెట్టుకుని, ఇదేవిటో సరిగ్గా కనుక్కుందామని అలివేలున్న వైపు చూస్తే ... అక్కడ అలివేలేదీ ... లేదు. అలివేలూ లేదు, ఆ ముసలాళ్ళూ లేరు.

ఖంగారుపడుతూ గబుక్కున లేచి హాల్ బైటకి వచ్చి చూస్తే అక్కడ ఓ పెద్ద గుంపులోకి జేరుతూ కనిపించింది అలివేలు. రఘుపతి అలా చూస్తూనే వున్నాడు. ఆ గుంపులోంచి గట్టి గట్టిగా మగవాళ్ళ ఈలలూ, కెవ్వుకెవ్వుమంటూ ఆడవాళ్ల కేకలూ విన్పించేయి.

ఏమైపోయిందోనని ఖంగారుపడుతూ చూస్తే, కాశీయాత్ర కెడుతున్న పెళ్ళి కొడుకుని నలుగురు పెద్ద మనుషులు అమాంతం ఎత్తుకుని, మోసుకుంటూ, ఊరేగింపుగా గ్రౌండ్ అంతా తిరుగుతున్నారు. చుట్టూ వున్న మగాళ్లందరూ ఈలలేస్తుంటే, ఆడాళ్లందరూ వెర్రికేకల్లాంటివి పెడుతున్నారు.

"ఏమైందండీ ..." పక్కనున్న పెద్దమనిషిని అడిగేడు రఘుపతి.

ఆ పెద్దాయన చాలా పెద్ద నిట్టూర్పు విడిచేడు. "ఏం చెప్పమంటారు ?

ఇదివరకు రోజుల్లో బలగం వుండేది. డబ్బుండేది కాదు. ఇప్పుడు ఎక్కడ చూసినా డబ్బే. కావలసిన మనుషులు మటుకు కనపడడం లేదు. అందుకని ఆ డబ్బు చూపించుకుందుకు ఈ మధ్య పెళ్ళిళ్ళు ఇలాంటి ఈవెంట్ మేనేజర్స్ చేతుల్లో పెడుతున్నారు. కాశీయాత్రలో వున్న విశిష్టత, అది పెళ్ళికొడుకు చేత చేయించడానికి కారణాలు ఏవీ తెలీకుండా చక్కగా డెకరేట్ చేసిన ఓ గొడుగిచ్చి పెళ్ళికొడుకుని గ్రౌండ్‌లోకి తెచ్చి, ఆ బ్రాహ్మడు ఏవో మంత్రాలు చదవగానే అతన్ని అలా ఎత్తుకుని తిప్పుతున్నారు. ఎంత గట్టిగా కేకలు పెడితే అంత బాగా జరిగినట్టన్నమాట.''

ఆ పెద్దమనిషి చెప్పినమాట అక్షరసత్యం అనిపించింది రఘుపతికి.

హు ... ఏం పెళ్ళిళ్ళో ... ఎవరెవరు చుట్టాలో తెలీదు. ఏ రకం చుట్టరికమో తెలీదు. మధ్యలో ఇలా బైటవాళ్ళు కల్పించేసుకుని మావయ్యా, బాబయ్యా అని పిలిచేస్తుంటే అసలు నిజంగా వరసైన వాళ్ళు పిలిచినా కూడా బైటవాళ్ళే అనుకోవచ్చు అనుకున్నాడు.

ఏమాట కామాటే చెప్పాలి. పెళ్ళి మటుకు చాలా అట్టహాసంగా జరిగింది. ఏ చిన్న కార్యక్రమం తప్పకుండా వీడియోవాళ్ళు, ఫోటోల వాళ్ళూ జనాన్ని ఛేదించేసుకుని మరీ ఫిల్ముల్లో బంధించేసేరు.

కాశీయాత్ర, అంకురార్పణ, సుముహూర్తం, సూత్రధారణ, తలంబ్రాలు, దండలు మార్చుకోడాలూ, బిందెలో ఉంగరాలు తీయడాలూ, అల్లుడి అలకపాన్పూ, నలుగులూ, పళ్ళు తోమించడాలూ, బొట్టుపెట్టెలూ, నిలువుబొట్లూ, అడ్డబొట్లూ, అప్పడాలతో హారాలూ, వడియాలతో ఉంగరాలూ, మెరుపు కాగితంతో చీరెలూ, నాగవల్లి తగవులు, సదస్యం, స్థాళీపాకం అన్నీ ఇటు సుబ్బమ్మత్త చెప్పినట్టు శాస్త్రోక్తంగానూ, అటు ఆహుతులైన ఆఫీస్‌వాళ్ళూ, ఫ్రెండ్సూ మెచ్చేట్టు ఈవెంట్ మేనేజ్‌మెంట్ వారి చక్కటి పర్యవేక్షణతోనూ సవ్యంగా, అందంగా, ఆనందంగా, హుందాగా జరిగేయి.

ప్రతి చిన్న తంతునీ ఎంతో గొప్పగా వర్ణించి, దాని అర్థం, అది చెయ్యడంలో గల పరమార్థం పెళ్ళికి ముందే ఒక చిన్న అందమైన పుస్తకంలో అచ్చు వేయించి, ఆ శాస్త్రం తెలియని ఆఫీస్‌వాళ్ళకీ, ఫ్రెండ్స్‌కీ ఇవ్వడం వల్ల వాళ్ళు కూడా ప్రతి చిన్న కార్యక్రమంలోనూ ఉత్సాహంగా పాల్గొని, ఆనందించేరు.

హమ్మయ్య ... మూడురోజులూ అయిపోయాయి. ఇంక ఈవేళ అప్పగింతలు పూర్తి చేసేస్తే అమ్మాయిని అత్తవారింటికి పంపెయ్యొచ్చు అని కన్యాదాత అనుకున్నట్టే రఘుపతి కూడా హమ్మయ్య ... ఇంక ఈ సాయంత్రానికి బండెక్కెయ్యొచ్చు అని అనుకున్నాడు. ఎందుకంటే ఈ రెండు రోజుల్లోనూ అతనికి అలివేలు దర్శనమే

కాలేదు. వచ్చినరోజు రూమ్‌లో ఇద్దరూ కలిసి దిగేరు అంతే. ఇంక ఆ డైనింగ్ హాల్లో ఎవర్నీ కలిసిందో కాని, మళ్ళీ రఘుపతి కళ్లబడలేదామె. రూమ్ కీస్ తన దగ్గరే పెట్టుకుంది కనక రోజుకో పదిసార్లొచ్చి చీరెలు మటుకు మార్చుకుని వెళ్ళేది. రఘుపతి పడుకుందుకు రూమ్ తాళాలకోసం రిసెప్షన్‌లో మాస్టర్ కీ తీసుకుని తన పని కానిచ్చుకునేవాడు.

అందుకే ఆ రోజు మధ్యాహ్నం భోజనాలయ్యేక ఇంక రూమ్ కెళ్ళి కునుకు తియ్యకుండా హాల్లోనే కూర్చున్నాడతను. ఇంతలో అతని పక్కకి ఓ యాభైయేళ్ళ పెద్ద మనిషొచ్చి, “నువ్వు పెళ్ళికూతురికి ఏమవుతావు బాబూ ...” అనడిగేడు ఏమవుతాడో అతనికి తెలిస్తే కదా ఆ వచ్చినాయనకి చెప్పడానికి ... అందుకని ఏ ప్రశ్నకైనా సరే తనకి తెలిసున్న ఒకే ఒక సమాధానం రాసే విద్యార్థిలాగా ... “నేను చంటి మొగుణ్ణండీ ...” అన్నాడు. ఆ మాట విని ఆయన మనసులో ఏవో లెక్కలు కట్టేసుకుని, “అయితే బావవే నన్నుమాట” అని సంబరపడిపోతూ, “ఒరేయ్ చిన్నా, ఇక్కడ దొరికేడురా” అని అరుచుకుంటూ వెళ్ళిపోయేడు. తనని ఏ దొంగతనంలోనైనా ఇరికించరు కదా అని రఘుపతికి భయం లాంటిది వేసింది.

అదేవిటో. ఆ తరవాత అరగంటకోసారి ఎవరో ఒకరు వచ్చి “చంటి మొగుడు మీరేనాండీ ...” అనగడం, రఘుపతి నిలువుగా బుర్రూపడం, వాళ్ళేమో “భలే చేసేరండీ” అంటూ మెచ్చుకోలుగా తల వూపో, షేక్‌హేండిచ్చో ఇతన్ని మెచ్చుకుంటూ వెళ్లడం మొదలైంది.

సాయంత్రం టిఫిన్లు కూడా అయిపోయేయి. రఘుపతి దగ్గరకొచ్చేవారి సంఖ్య పెరగడంతో పాటు అడిగే ప్రశ్నలు కూడా మారేయి. కొంతమంది అతన్ని చూసి ముసి ముసినవ్వులు నవ్వితే, ఇంకొంతమంది “భలే దాచేసేరండీ ...” అని ఎదురుగానే మెచ్చుకున్నారు. ఎవరో మరి. చూడ్డానికి బాగున్నాడు. రఘుపతి వయసతనే ఒకతను వచ్చి తనని తాను రాజారావుగా పరిచయం చేసుకుని, “ఊ ... ఇంతకీ ఏం కావాలనుకుంటున్నారూ ... ?” అన్నాడు. రఘుపతి తెల్లబోయి చూసాడతని వైపు. “నాకు బొత్తిగా చెల్లెలి వరసైపోయిందండీ. అందుకే మీరు కొట్టేసేరీ ఛాన్స్ ...” అన్నాడు. రఘుపతి చటుక్కున ఆ రాజారావు చేతులు పట్టుకుని, “బాబ్బాబు, మీకు పుణ్యముంటుంది. అసలు విషయమేంటో చెబుదురూ. టెన్షన్‌తో చచ్చిపోతున్నాను. కొంపదీసి వీళ్లందరూ కలిసి నన్నెందులోనైనా ఇరికించెయ్యట్లేదు కదా ...” అన్నాడు. అతను ఆశ్చర్యంగా చూసి “అయితే మీకు తెలీదా ... ?” అన్నాడు ... అడ్డంగా బుర్రూపేడు రఘుపతి.

ఆ రాజారావు రఘుపతి పక్కన కూర్చుని స్థిమితంగా చెప్పడం మొదలెట్టేడు.

"పెళ్ళిళ్లలో ఆఖరున ఇంక అప్పగింతలు చేసి పిల్లని అత్తవారింటికి పంపే సమయం వచ్చినప్పుడు ఈ తంతు వుంటుందండీ. దీనిని "మరదలి మాడ" అంటారు. పెళ్ళికూతురికి వరసకి బావ అయ్యే అతను, అంటే మేనబావ కావచ్చు, అక్క మొగుడు కావచ్చు లేకపోతే ఏ వరసలోనైనా బావ అయితే చాలు ... అతను పెళ్ళికూతురిని దాచేస్తాడు ..."

"దాచేస్తాడా ..." కెవ్వున రాబోయిన కేకని బలవంతాన ఆపుకున్నాడు రఘుపతి.

రాజారావు నవ్వేడు. "అవునండీ ... ఎక్కడో దాచేస్తాడు. పెళ్ళికొడుకు పెళ్ళికూతురిని వెతికి పట్టుకోవాలన్నమాట. అలా వెతికి పట్టుకున్నాక కన్యాదాత ఆ బావకి "మరదలి మాడ"గా ఏదైనా ముట్టచెప్పి, అప్పుడు అప్పగింతలు చేసి కూతుర్ని అత్తారింటికి పంపుతాడు. ఇవన్నీ ఇదివరకు పెళ్ళిళ్ళలో వుండేవి. ఆమధ్య కాలంలో ఒక్కరోజు పెళ్ళిళ్ళే అవడంతో ఇలాంటి సరదా తంతులు లేకుండా పెళ్ళిళ్ళు కానిచ్చేసేవారు. కాని ఈ మధ్య అందరూ మళ్ళీ పాతకాలం గుర్తుచేసుకోడం ఫ్యాషన్ అవడం వల్ల అవన్నీ బైటకి తీసి, జరిపిస్తున్నారు. అందులో తంతే ఈ మరదలి మాడ తంతు. మీరు పెళ్ళికూతురికి బావగారి వరసయ్యేరు కదా ... అందుకే మీకే ముడుతుంది మరదలిమాడ ..."

"కానీ ... కానీ ... నేనా అమ్మాయిని ఎక్కడా దాచలేదే ... అసలు పెళ్ళి కూతురిని దగ్గర్నుంచి కూడా నేను చూడలేదు."

ఏడుపు మొహం పెట్టేసేడు రఘుపతి.

"అక్కర్లేదండీ ... అన్నీ ఈవెంట్ వాళ్ళు చూసుకుంటారు. మీరలా కూర్చోండి చాలు. మొత్తానికి అదృష్టవంతులండీ. పెళ్ళికూతురి తండ్రి బోల్డు సంపాదించేడు. మీరు ఏదడిగినా ఇచ్చేస్తాడు" కాస్త ఈర్ష్య ధ్వనించింది అతగాని మాటల్లో.

రాజారావు చెప్పింది విన్న రఘుపతికి ఏం చెయ్యాలో తోచలేదు. పరాయి వాళ్ళెవరైనా అతనికోసం రూపాయి ఖర్చుపెడితే మళ్ళీ వాళ్లకి పది రూపాయలిచ్చేదాకా అతని మనసూరుకోదు. అలాంటివాడతను. అలివేలు కూడా అస్తమానం దెప్పుతుంటుంది. "మీరెక్కడి అల్లుడండీ ... మావగార్ని ఏదీ అడగరూ ..." అంటూ. అలాంటి రఘుపతి ఇప్పుడిలా మరదలిమాడ అనేదేదో భూతంలాగ అతని మీద వచ్చి పడిపోడంతో ఉక్కిరిబిక్కిరయిపోయేడు.

"బాబ్బాబూ, నాకివేవీ తెలీదు. నా బదులు ఇంకెవర్నైనా చూసుకోమని చెబుదురూ వాళ్లకి ..." అని బతిమాలుకున్నాడు రాజారావుని.

"అబ్బే ... ఇంకెవరూ లేరండీ. అందరికీ ఒక్కళ్ళూ, ఇద్దరే పిల్లలవడంతో ఈ చుట్టరికాలకి చాలా షార్టేజ్ వచ్చేసింది. లక్కీగా మీకు వరస కుదిరింది. అయినా మీకేం కష్టం లేకుండా అంతా ఈవెంట్ వాళ్ళు చూసుకుంటున్నారుగా ... మీకు కావల్సినది అడిగి పుచ్చుకోండంతే ..." విషయం తేల్చేసి అక్కణ్ణించి వెళ్ళిపోయేడు రాజారావు.

రాజారావు అలా వెళ్ళేడో లేదో ఇట్నుంచి పెళ్ళికొడుకు, అతని అక్క వచ్చేరు. "కాస్త క్లూ ఇవ్వండి అన్నగారూ ..." అని హాస్యంగా అంటూ రఘుపతి భుజం మీద చెయ్యి వేసి పక్కన కూర్చున్నాడు పెళ్ళికొడుకు.

"ఎటువైపు రూములో చెప్పండి చాలు. మేమే వెతుక్కుంటాం." వాళ్ళక్క కలుపుగోలుగా అడిగింది. "నాకు తెలీదండీ ..." అంటూ బిక్కమొహం పెట్టేడు రఘుపతి. అతన్ని అనుమానంగా చూస్తూ ఇద్దరూ మళ్ళీ పెళ్ళికూతురిని వెదకడానికి వెళ్ళిపోయేరు. వాళ్ళటు వెళ్ళగానే ఇటు కన్యాదాత వచ్చి రఘుపతి పక్కన కూర్చుని తన గోడు వెళ్ళబోసుకున్నాడు. "బాబూ, నువ్వేం కావాలంటే అదిస్తా. మా పిల్లని ఎక్కడ దాచావో కాస్త తొందరగా చెప్పు బాబూ. ఇవాళ అప్పగింతలయి, రాత్రికి ఫ్లైట్ అందుకోపోతే అవతల నా జాబ్‌లో చాలా ఇంపార్టెంట్ మీటింగ్ మిస్సయిపోతాను" అంటూ అలవాటులేని జారిపోతున్న పైమీద కండువాతో చెమటలు తుడుచుకుంటూ వెళ్ళిపోయేడు.

రఘుపతి బేజారెత్తిపోయి అలివేలు కోసం అన్ని చోట్లా వెతకడం మొదలెట్టేడు. మెయిన్ హాల్, డైనింగ్ హాల్, పక్కనే వున్న రూములు రెండూ, వెనకున్న స్టోర్ రూమూ ఇలా అతను వెతుకుతుంటే నెమ్మదిగా అతని వెనకాల ఓ గుంపు తయారైంది. కాసేపటికి కానీ దాన్ని అతను గమనించలేకపోయేడు. రఘుపతి ఏ రూమ్‌లోకి వెడుతున్నాడో చూసి, అతను అందులోంచి బైటకి రాగానే ఆ గుంపు ఆ రూమ్‌లో దూరడం, వెంటనే వెర్రిముఖాలేసుకుని బైటకి రావడం చూసిన అతనికి అర్థమై పోయింది. బహుశా తను పెళ్ళికూతురిని దాచిన చోటుకి వెడుతున్నాననుకుని, వాళ్ళు తన వెంట పడుండొచ్చని.

"అలివేలూ ..." అని సినిమాలోలా గట్టిగా ఒక కేక పెట్టేదామనుకున్నాడు కానీ మర్యాదస్తుడు కనక తనని తాను సంబాళించుకుని, ఇక తన రూమ్‌కి వెళ్ళిపోడానికి నిశ్చయించుకుని రిసెప్షన్‌లో మాస్టర్ కీ కోసం అడిగేడు. ఇతన్ని ఫాలో అవుతున్న గేంగ్ కూడా వెనకే వున్నారు. రూమ్ తాళం తీసి లోపలికి రాగానే రఘుపతి ఎదురుగా అలివేలూ, ఆ పక్కన పెళ్ళికూతురూ కనిపించారు. రఘుపతిని చూడగానే మరింక

మాట్లాడనీకుండా అతన్ని ఓ పక్కకి తోసేసి, "కనిపెట్టేసేరా ... నేను ఈ ఈవెంట్ వాళ్ళు కలిసి ఇంకో రూమ్‌లో దాచేస్తాంలెండి దీన్ని. అంత తొందరగా దొరకనివ్వను. అట్టే మొహమాటాలకి పోకుండా ఓ ఐపాడో ... టచ్‌స్క్రీన్ ఫోనో అడగండి ..." అని హుకుం జారీ చేసేసి, రఘుపతికి ఏం జరుగుతోందో అర్థమయ్యేలోపల పెళ్ళికూతురి చెయ్యి పట్టుకుని బైటకి లాక్కుపోయింది అలివేలు.

"అలివేలూ, ఇవాళ రాత్రే మన బండి. ఇంకో గంటలో బయల్దేరాలి ..." అని ఆమెకి అర్థమవాలని గట్టిగా చెప్తూ వాళ్ల వెనకాల పడ్డాడు రఘుపతి. రఘుపతి వెనకాల పెళ్ళికొడుకూ, అతని అక్కా, ఆ వెనకాల కన్యాదాత, ఆ వెనకాల పెళ్ళికొచ్చిన ఆఫీస్‌వాళ్ళు, ఫ్రెండ్సూ, ఆ పైన ఈ సీన్‌ని చూడ్డానికి బహు పసందుగా వుందని హోటల్‌వాళ్ళు ... అలా ఒకరి వెనకాల ఒకరు ఆ రెండో అంతస్తులో రూముల ముందున్న కారిడార్‌లో ఓ పెద్ద ఊరేగింపులా వెళ్ళడం మొదలెట్టేరు. అంతా గందరగోళంగా వుంది. అందరూ అరిచేస్తున్నారు. గొంతెత్తి గట్టిగా ఏవేవో మాట్లాడేస్తున్నారు. ఒకరిమాట ఒకరు వినడం లేదు. ఎవరి గోల వాళ్ళదనే ధోరణిలో అలా కారిడార్ చుట్టూ తిరుగుతున్నారు.

కింది రిసెప్షన్ నుంచి, రెండో అంతస్తులో కనిపిస్తున్న మరదలిమాడ అనే ఈ అద్భుతమైన సీన్‌ని వీడియోవాళ్ళూ, ఫోటోల వాళ్ళూ ఎంతో చాకచక్యంగా వాళ్ల ఫిల్ముల్లో బంధిస్తున్నారు ❋

**స్వాతి వార పత్రిక : 1-8-2014**

**హాస్య కథల పోటీలో రూ. 10,000/- బహుమతి**

# వెట్టిబాగుల వదిన వ్రతకథ ...

"మీ వదిన ఉత్తి వెట్టిబాగుల్ది స్వర్ణ ..." అని అన్నయ్య తన పెళ్లైన పాతికేళ్లలోనూ కనీసం వెయ్యిసార్లైనా అనుంటాడు నాతో. నా ఇన్నేళ్ళ అనుభవంలో వదిన వెట్టిబాగుల్దో, అన్నయ్య వెట్టిబాగులవాడో తేల్చుకోలేకపోయేను.

అవడానికి అన్నయ్య దొడ్డమ్మ కొడుకే అయినా ఒకే ఊర్లో వుండడం వల్ల మా మధ్య రాకపోకలు బాగానే వున్నాయి. నిజం చెప్పొద్దూ ... వరసకు వదినయ్యే ఈ వదినని చూసి చాలా నేర్చుకోవాలి. ఎందుకంటే మా వదిన మాట మొదలు పెట్టేముందు ... "మీ అన్నయ్య ..." పూర్తిచేస్తూ ... "మీ అన్నయ్య ..." అంటుంది. మా అన్నయ్యంటే మా వదినకి ఎంత ఇష్టమో, ఎంత గౌరవమో అని చాలా సంతోషిస్తుంటాను. అలాంటి వదిన ఎన్నెన్ని పూజలూ వ్రతాలూ చేసేస్తుంటుందో. నాకు నోరు కూడా తిరగని నోములు చాలా నోచింది.

ఓరోజు వదిన మా ఇంటికొచ్చినప్పుడు ఇంకో గంటలో భోజనాల టైమ్ అవుతోంది కదా అని "భోంచేసి వెళ్ళు వదినా ... అన్నయ్యని ఆఫీసునుంచి యిటే వచ్చెయ్యమను ..." అన్నాను. కలుపుగోలుగా వుండే వదిన "అంతకన్నానా" అంది.

వంట చేస్తున్నంతసేపూ మా అన్నయ్య రుచుల గురించే మాట్లాడింది. కూరలో పోపేస్తున్నా, పులుపు కారాలు వేస్తున్నా మా అన్నయ్యకి ఎలా వుంటే ఇష్టమో చెప్పి అలాగే చేయించింది. అన్నం తినకూడదు. ఉపవాసమంటూ ఫలహారం కూడా చేయించింది. "అదేవిటి ... ఇవాళ శనివారం కాదుకదా, బుధవారం కదా ..." అని ఆశ్చర్యపోతే ... వారంరోజుల పాటు పగలూ, రాత్రీ కూడా ఫలహారమేనని మొక్కుకుందిట. అందుకని గోధుమరవ్వతో ప్రత్యేకంగా ఉప్మా చేయించింది.

ఆలస్యమైపోతోంది. అన్నయ్యెంతకీ రావట్లేదు. "పోనీ ... మనం తినేద్దాం వదినా ..." అంటే "అబ్బే ... మీ అన్నయ్య తినకుండానా ..." అంటుంది. ఆఖరికి రెండు గంటలు దాటాక వచ్చాడు మా అన్నయ్య. అప్పటికయ్యాయిట పాపం వాడి పనులు. ఏం చేస్తాం ... రోజులలా వున్నాయి అనుకుంటూ ఇంక ఆలస్యం ఎందుకని వెంటనే వడ్డన మొదలుపెట్టేసేను.



❇ జి.ఎస్. లక్ష్మి ❇

కానీ ... ఆశ్చర్యం ... మా అన్నయ్య కోసం పెట్టిన కంచంలో మా వదిన ఏదీ వెయ్యనివ్వదే ... చేతులడ్డం పెట్టేసిందంతే ... నాకు ఏమీ అర్థంకాలేదు.

"మీ అన్నయ్య అన్నం తినరు. ఫలహారం మాత్రమే చేస్తారు ..." అంటూ విడిగా నాచేత చేయించిన గోధుమరవ్వ ఉప్మా అన్నయ్య ప్లేట్‌లో వేసింది. తను మటుకు మా అందరితో సమంగా రుచిగా వండిన అన్ని ఆధరువులూ వేసుకుంది.

నేను వుండబట్టలేక ... "ఏదో మొక్కుకున్నానన్నావు కదా వదినా ..." అని సగంలో ఆపేసేను.

మా వదిన తలూపుతూ, "ఊ వారం రోజుల పాటు అన్నం ముట్టకూడదని ..." అంది అన్నంలో కొత్తావకాయ కలుపుకుంటూ.

"మరి అన్నం తింటున్నావుగా ..." నాకు మాట ఎలా పూర్తి చెయ్యాలో తెలీలేదు.

మా వదిన నాకు బాగా అర్థం అయ్యేలా వివరించింది.

"ఆమధ్య నాకు బాగులేదుకదా ... అందుకని బాగైతే వారం రోజుల పాటు మీ అన్నయ్య అన్నం ముట్టరని మొక్కుకున్నాను" అంది చల్లగా ...

వదిన చెప్పింది అర్థం చేసుకోడానికి నాకు కాస్త సమయం పట్టింది. అంటే ఆవిడ ఆరోగ్యం కోసం ఆవిడే అన్నయ్య అన్నం మానేస్తాడని మొక్కుకుందా ... నాకు తెలిసినంతవరకూ ఎవరైనా వాళ్ళే ఉపవాసాలుంటామని మొక్కుకుంటారు కానీ, మరీ బొత్తిగా ఇలా తమకోసం మొగుళ్ళు ఉపవాసాలుంటారని మొక్కుకుంటారా ...

అదే అడిగాను వదినని. "నువ్వు ఉపవాసం చేస్తానని మొక్కుకోవాలి గానీ నీకోసం అన్నయ్య చేస్తాడని మొక్కుకోవడం ఏంటీ ?" అంటూ.

అప్పుడు నాకు వదిన చేసిన గీతోపదేశం ఏమిటంటే ... "ఏ వ్రతమైనా భర్త చేస్తే అందులో సగం పుణ్యం భార్యకి వస్తుందని పెద్దలు చెపుతారు కదా. అదే భార్య చేస్తే భర్తకి ఏమీ రాదు. దానిప్రకారం మీ అన్నయ్య ఉపవాసాలు చేస్తే ఆయనకీ, నాకూ ఇద్దరికీ పుణ్యం సరిసమానంగా వస్తుంది. మరి మీ అన్నయ్యకి కూడా కొంచెమైనా పుణ్యం రావాలి కదా అందుకని ఆయన ఉపవాసాలు చేస్తారని నేను మొక్కుకున్నానన్నమాట ..." అంది అన్నంలో మీగడపెరుగు కలుపుకుంటూ. నేను అన్నయ్య వైపు చూసాను. వదిన తనకి సంపాదించి పెట్టే పుణ్యం తల్చుకుంటూ ఉప్మాని ఎంతో ఇష్టంగా తింటున్నాడు. "హోరి వెఱ్ఱిబాగులవాడా ..." అని నోట్లోంచి రాబోతున్న మాటని గొంతులోనే ఆపేసాను.

అలాంటి వెఱ్ఱిబాగుల వదిన ఒకసారి శ్రావణమాసంలో వరలక్ష్మి వ్రతం కలిసి

చేసుకుందాం రమ్మని పిలిచింది. ఎలా కాదనగలను ? ఆవిడ అసలు ఆడపడుచు లిద్దరూ విదేశాల్లో వుండడం వల్ల ఈ వదిన ఏ నోము నోచినా వరసకి ఆడపడుచుని కదా అని నన్ను ముత్తయిదువుగా పిలిచి, చీరా, సారె పెట్టి పంపిస్తుంటుంది. పసుపు కుంకుమలకి పదామడలు వెళ్ళమన్నారనే సామెత గుర్తొచ్చి వదిన పిలవగానే బయల్దేరతాను.

వరలక్ష్మీవ్రతం రోజున తెల్లారకట్ట అనగా లేచి, ఇంట్లో పనులన్నీ చేసుకుని, పూజ, నైవేద్యం ముగించుకుని, ఆఫీసులకి, కాలేజీలకి వెళ్ళేవాళ్ళని పంపించి, అంబర్ పేట నుంచి అన్నయ్య వుండే అమీర్‌పేటకి వచ్చేసరికి పదకొండు గంటలు అవనే అయింది. "నీకు ఆలస్యం అయిపోలేదు కదా వదినా ..." మొహమాటపడుతూ అడిగేను. "లేదు ... లేదు ... ఇప్పుడే నా వంట అయింది. ఇద్దరం కలిసి పూజ చేసుకుందామని అన్నీ రెడీ చేస్తున్నాను" అంటూ పూజ గదిలోకి తీసికెళ్ళింది. వదినతో పాటు పూజ గదిలోకి వెళ్ళిన నేను సంభ్రమంగా అలా నిలబడిపోయేను. అమ్మవారిని వదిన ఎంత బాగా అలంకరించింది.

మందిరం అంతా మల్లెపూలు, కనకాంబరాలు, మరువాలతో కట్టిన మాలల తోరణాలు, అమ్మవారికి మెరుస్తున్న జరీఅంచుతో వున్న ఎఱ్ఱటి పట్టుచీర, మెడలో నల్లపూసలతో కలిపి చుట్టిన మంగళ సూత్రాలు. సాక్షాత్తూ ఆ వరలక్ష్మీదేవే వచ్చి ఆ ఇంట్లో కొలువైనట్టుంది.

ఎంతైనా వదిన దగ్గర చాలా నేర్చుకోవాలి అనుకుంటుంటే ... "పూజ మొదలు పెడదామా ?" అంటూ వదిన అడిగిన ప్రశ్నకి ఈ లోకంలో కొచ్చేను. "వంట కూడా అయిపోయిందా ?" అనుమానంగా అడిగేను. "అన్నీ అయిపోయేయి. పూజకు కూడా అన్నీ రెడీ. నువ్వు కాళ్ళూ చేతులూ కడుక్కురా ..." అంది వదిన.

వదిన నేనూ కలిసి సంప్రదాయబద్ధంగా సంకల్పంతో మొదలుపెట్టి అమ్మవారి పూజ భక్తిప్రపత్తులతో చేసుకున్నాం. నవకాయ పిండివంటలూ అమ్మవారికి నైవేద్యం పెట్టి, మనసారా మంగళహారతి కూడా పాడేసుకున్నాం. ఇద్దరం చేతులకి తోరణాలు కట్టుకుని, వ్రతకథ చెప్పుకుని, నెత్తిమీద అక్షింతలు వేసుకుని, వ్రతం చెడ్డా ఫలం దక్కాలనుకున్నాం. అంతా అయి టైమ్ చూసేటప్పటికి మధ్యాహ్నం రెండు గంటలు దాటిపోయి మూడుకి చేరుకుంటోంది సమయం. అప్పుడు గుర్తొచ్చింది ఇద్దరికీ కడుపులో ఆకలి.

"అన్నయ్య ఎప్పుడొస్తాడొదినా ?" అనడిగేను. ఎందుకంటే అన్నయ్య తినకుండా వదిన భోంచెయ్యదు. వదిన తినకుండా నేను మటుకు ఎలా తినగలను?" "ఇవాళ పండగ కదా. తొందరగానే వచ్చేస్తానన్నారు. వుండు. కాస్త కాఫీ కలుపుకొచ్చి

మీ అన్నయ్యకి ఫోన్ చేస్తాను'' అంటూ మా వదిన మా ఇద్దరికీ కమ్మటి కాఫీ చెరో పెద్ద గ్లాసులోనూ తీసుకొచ్చి కూర్చుని తాగుతూ అన్నయ్యకి ఫోన్ చేసింది.

"అలాగైతే ఎలాగండీ. మీరు పొద్దుట్నించీ ఏమీ తినలేదు కూడానూ. ఇవాళ పండగని ఆ బాస్‌కి చెప్పండీ. పొద్దున్నే పూజ కూడా చేసుకున్నానా. సూర్యాస్తమానం అయ్యేలోపల నేను భోంచేసెయ్యాలి మరి. మీకు పెట్టకుండా నేనెలా తింటానూ ? మీకోసం చూస్తుంటాం. స్వర్ణ కూడా వచ్చింది'' అని ఫోన్‌లో అన్నయ్యతో వదిన అంటున్న మాటలు వింటున్న నేను "వదినా, అన్నయ్య పొద్దున్నే ఏమీ తినకుండా వెళ్ళేడా ?'' అని అడిగేను.

"ఊఁ. నువ్వు పూజ చేసుకుంటున్నావు కదా. నేను కూడా అదయ్యేకే తింటానూ. ఒంటిగంటకల్లా వచ్చేస్తాలే అన్నారు. కానీ, ఇప్పుడు పైవాడెవడో వచ్చేడంటున్నారు. వాణ్ణి పంపించి కానీ రావడం కుదర్దుట. ఎలాగోలా రమ్మని చెప్పేనులే. వచ్చేస్తారు'' అంది. ఇద్దరం కాసేపు ఆమాటా ఈమాటా మాట్లాడుకున్నాం. నాలుగైంది. తాగిన పెద్దగ్లాసుడు కాఫీ ఏ మూలకీ చాలలేదేమో మాకు నీరసాలొచ్చేస్తున్నాయి. వదినకి అన్ని సాంప్రదాయాలూ తెలుసు కదా. అందుకని వదిన "స్వర్ణా, మనం పూజ చేసుకున్నాం కదా. కాస్త ప్రసాదం తినొచ్చేమో. తినొచ్చేమో ఏంటి. మహరాజులా తినొచ్చు. తినకపోతే తప్పు కూడాను. సత్యనారాయణ వ్రతకథలో చెపుతారు కదా'' అంది. నేను వెంటనే సరే నన్నాను. ఇంకేం. ఇద్దరం కలిసి ఒక్కొక్కళ్ళం ఓ రెండు బొబ్బట్లూ, రెండు బూరెలూ, రెండు గారెలూ, రెండు ఆవడలూ, రెండు సొజ్జప్పాలూ, ఓ దోసెడు పులిహోరా, ఓ నాలుగు బజ్జీలూ, ఓ పెద్దకప్పుడు దద్యోజనం అమ్మవారి కిష్టమైన పులగం, పరవాన్నంతో కలిపి లఘువుగానే ప్రసాదం పుచ్చుకున్నాం.

అప్పుడు టైమ్ చూసేసరికి సాయంత్రం అయిదయింది. అన్నయ్య ఉరుకులూ పరుగులతో వచ్చేడు. వదినని చూడగానే, "సారీ వరం. అక్కడికీ ఎయిర్‌పోర్ట్‌కి నేను వెళ్ళకుండా సూర్యారావుని పంపించేసి నేనిటొచ్చేసేను. నీకాలస్యం అవలేదు కదా. సూర్యాస్తమానానికింకా టైముంది కదా. వడ్డించెయ్ మరి'' అంటూ హడావిడి పడిపోయేడు.

చద్దన్నం తిన్నమ్మ మొగుడాక లెరగదన్నట్టు "అయ్యో. స్నానం చెయ్యకుండానా ... ఓ రెండు చెంబులు దిమ్మరించుకు రండి. ఇట్టే వడ్డించేస్తాను'' అంది వదిన. అన్నట్టుగానే గబగబా ఒళ్ళు తడుపుకుని వచ్చేడు అన్నయ్య. డైనింగ్ టేబిల్ మీద వెండి కంచం పెట్టి, శ్రద్ధగా అన్ని ఆధరువులూ వడ్డించింది వదిన అన్నయ్యకి. "మీరూ వచ్చెయ్యండి. ఇప్పటికే ఆలస్యమైపోయింది'' అన్నాడన్నయ్య.

మీరు తిన్నాక కానీ నేను తినకూడదండీ. ఇవాళ అమ్మవారి పూజ చేసుకున్నాను

కదా. మీదయ్యాకే నేను తినాలి'' అంది పరమ పవిత్రత మా వదిన. "మరి సూర్యాస్తమానం అయ్యే లోపల తినెయ్యాలన్నావు ?''

"అవునండీ. ఇందాక కేలండర్లో చూసేను. ఇవాళ అయిదున్నరకే సూర్యాస్తమయం అని రాసాడు'' అంది వదిన అర్థం చేసుకోమన్నట్టు.

అన్నయ్య వెంటనే టైమ్ చూసేడు. అప్పటికే అయిదుంపావయింది. తను తినాలి. తను తిని లేచేక వదిన తినాలి. ఇంకో పదిహేను నిమిషాల్లోపల. కంచం వైపు చూసేడు. నిండుగా బోలెడన్ని ఆధరువులు నోరూరించేస్తున్నాయి. కాని తినడానికి టైమేదీ. అంతే. తలొంచుకుని గబగబా పప్పు అన్నం కలిపేసుకుని, అందులోనే కూర, పులుసు కలగలిపి, రెండు నిమిషాల్లో కడుపులోకి తోసేసేడు. పూరీ, కూర లాగ బొబ్బట్లలో పులిహార నంచుకుని తినేసేడు. ఓవైపు గారెలు నములుతూ, మరోవైపు సొజ్జప్పాలు ఎక్కించేసేసేడు. మధ్యలో మంచినీళ్ళు తాగినట్టు కప్పులో పాయసం గొంతులోకి వొంపేసేడు. ఓ గుప్పెడు అన్నం పెట్టుకుని, "పెరుగేసై ...'' అన్నాడు. అన్నయ్య తింటున్న తీరుని నేను గుడ్లప్పచెప్పి చూస్తుండిపోయేను. పాపం అన్నయ్య. వదినంటే ఎంత ప్రేమ అనుకున్నాను. ఒక్కసారిగా లేచి నించున్నాడన్నయ్య. చెయ్యి అడ్డంగా తిప్పేస్తూ, నోటమ్మట మాట కూడా రాకపోతుంటే మమ్మల్నిద్దర్నీ తొందరగా తినెయ్యమని టైమ్ చూపిస్తూ సైగలు మొదలెట్టేడు. నాకు భయమేసింది. అన్నయ్య గొంతులోది కడుపులోకి తొందరగా దిగితే బాగుణ్ణనుకుంటుంటే వదిన డైనింగ్ టేబిల్ మీద తనకీ, నాకూ కంచాలు పెట్టి వడ్డించసాగింది. అప్పటికే పుచ్చుకున్న ప్రసాదం కడుపులో బరువుగా కదులుతుంటే ఇంకేం తింటాం. కానీ పైకి చెప్పుకోలేముగా. గొంతులో మాటని గొంతులోనే నొక్కేసి ఇద్దరం ఓ గుప్పెడు మెతుకులు పెట్టుకుని, పెరుగు వడ్డించేసుకున్నాం. నేనింకా అపసోపాలు పడుతూ ఒక్కొక్క మెతుకూ కెలుకుతూనే వున్నాను. అయిదున్నర అవగానే వదిన కంచంలో మిగిలిన మెతుకులు వదిలేసి చెయ్యి కడుక్కుందుకు వెళ్ళింది.

అన్నయ్య నా దగ్గరకొచ్చి నెమ్మదిగా, "చూసేవా స్వర్ణా మీ వదిన. ఇప్పటిదాకా నాకోసం చూస్తూ కూర్చుంది. తీరా ఇంకిప్పుడు తినాలన్నా టైమ్ అయిపోయింది. ఇంకివాల్టికి పస్తే. వట్టి వెఱ్ఱిబాగుల్ది పాపం'' అన్నాడు.

నేను తెల్లబోయేను. అన్నయ్య, వదిన లిద్దరిలో వెఱ్ఱిబాగుల వాళ్ళెవరో తెలీక నేను వెఱ్ఱిమొహం పెట్టుకుని కూర్చుండిపోయేను. మీకైనా తెలిస్తే చెప్పరూ ... ! ✻

**స్వాతి వారపత్రిక : 4-12-2015**

# జయహో వదినా ...

ఇవాళ వీరనారి మా వదిన చేసిన సాహసం గురించి మీతో ముచ్చటించకుండా వుండలేకపోతున్నాను. అసలేం జరిగిందంటే ...

హైదరాబాదులో ఉస్మానియా యూనివర్శిటీ రోడ్‌లో వున్న గిఫ్ట్ షాప్ నుంచి ఓ పెద్ద గిఫ్ట్ పేకెట్ పట్టుకుని రోడ్డు మీదకొచ్చి ఆటోకోసం చూస్తున్నాం నేనూ, మా వదిన. అప్పటికే పెళ్ళికి వెళ్ళడం ఆలస్యమైందనుకుంటున్నాం ఇద్దరమూ. అంతలో మమ్మల్ని దాటి వెళ్ళిపోతున్న ఆటోని "ఆటో ..." అంటూ గట్టిగా పిలిచాను. కాస్త ముందుకు వెళ్ళి ఆగింది ఆటో. పరిగెడుతున్నట్టే వెళ్ళి, "శ్రీనగర్ కాలనీ, సత్యసాయి నిగమాగమానికి వస్తావా ..." అనడిగాను.

ఆ ఆటోవాలా నా మొహం కూడా చూడకుండా "మూడొందలవుతుంది ..." అన్నాడు. వెయ్యాల్సిన మీటర్ వెయ్యకుండా ఆటోవాళ్ళు బేరాలాడడం తెలిసిన నేను అడుగు వెనక్కేసాను. మహా అయితే నూట డెబ్బై రూపాయలవుతుంది అక్కడికి. పోనీ వదిన్ని ఒప్పించేసి రెండొందలకైనా ఎక్కేద్దామనుకుంటూంటే ఏకంగా మూడొందలా ... ఊహు ... అనుకుంటూ వెనక్కి తిరిగిన నేను "ఎక్కు, ఎక్కు ..." అంటూ వదిన తోసేస్తుంటే ఆటోలో వెళ్ళిపడ్డాను. వెనకాలే వదిన ఎక్కింది. "పోనీ ..." అంది ఆటోవాలాతో. వాడు స్టార్ట్ చేసి ముందుకి పోనిచ్చాడు. "వదినా ... మూడొందలుట ..." అంటున్న నన్ను ఆపి, "మీటర్ వెయ్యి బాబూ ..." అంది. అప్పటికే ఆటో సిగ్నల్ దగ్గరకొచ్చి ఆగింది.

"మీటర్ ఖరాబయింది. మూడొందలవుద్ది ..." స్పష్టంగా అన్నాడు వాడు.

"నువ్వు మీటర్ వెయ్యి. నువ్వన్న డబ్బులకి మేము రాము ... నీ ఆటో దిగము" అంది అంతకన్నా స్పష్టంగా మా వదిన. నేను తెల్లబోయి చూసాను వదిన వైపు. నన్ను మాట్లాడొద్దన్నట్టు కళ్ళతోనే సైగ చేసింది. అమ్మో ఆటోవాలాతో గొడవే. వాడు నలుగురిలోనూ ఎంత అల్లరి పెట్టేస్తాడూ అనుకుంటుంటే ...

"ఏంటమ్మా నీ కిరికిరి. ముందు ఆటో దిగుండ్రి ..." అన్నాడు వాడు కర్కశంగా.

"మేము దిగము. ఏం చేస్తావో చేసుకో ..." అంటూంటే సిగ్నల్ పడి ముందు

వున్న బళ్ళన్నీ వెళ్ళిపోయాయి. వెనకాలున్న బళ్ళు చెవులు చిల్లులు పడేలా హారన్ కొట్టడం మొదలెట్టాయి.

ఆటోవాలా విసుగ్గా ఆటోని సిగ్నల్ దాటించి పక్కకి ఆపి, "దిగుంగ్రి ..." అన్నాడు చిరాగ్గా. నాకైతే వాడి చూపు చాలా కంపరంగా అనిపించింది. కానీ మా వదిన మటుకు మరింత సర్దుకుని కూర్చుంటూ "మేం దిగం. నువ్వు మర్యాదగా మీటర్ వేసి మేము తీసికెళ్ళమన్న చోటుకి తీసికెళ్ళు" అంది.

"లేకుంటే ఏంచేస్తవ్ ..."

"పాట పాడతా ..." అని నెమ్మదిగా వదిన ఇచ్చిన జవాబుకి ఆటోవాలా, నేనూ కూడా తుళ్ళిపడ్డాము.

"ఏం చేస్తవ్ ..." అర్థంకాక మళ్ళీ అడిగాడు.

"చూడూ, నువ్వు మర్యాదగా మీటర్ వేసి, ఆటోలో మేం చెప్పిన చోటుకి తీసికెళ్ళు. అలా తీసికెళ్ళవో నీ ఆటో దిగకుండా ఇక్కడే కూర్చుని మాకొచ్చిన పాటలన్నీ గట్టిగా పాడేస్తాం" వాడు షాక్ నుంచి కోలుకున్నట్టున్నాడు ...

"ఏందమ్మా నీ లొల్లి ... మీటర్ ఖరాబైందంటున్న గద ... దిగుంగ్రి ..."

"మేం దిగం. ఖరాబయిన మీటర్‌తో రోడ్డుమీదకి ఎందుకొచ్చావ్ ? నేను పాట మొదలెట్టనా ... మీటర్ వేసి, బండి పోనిస్తావా" అంటూ వదిన తన హాండ్ బేగ్‌లోంచి ఓ కాగితాల బొత్తి తీసింది. ఆ బొత్తిలోంచి ఓ పేజీ బైటకి పీకి గొంతు సవరించుకుంది. నాకు ఖంగారొచ్చింది.

మా వదిన పాటలు బాగానే పాడుతుంది కానీ పిచ్చెక్కువ ... అదేనండీ శృతి పైస్థాయి అన్నమాట. హైపిచ్. పాట మొదలెట్టిందంటే ఇంకేమైనా వుందా ... అసలే మేము మైన్ రోడ్ మీద వున్నామాయె ...

ఇంతలో ఆటోలోంచి ఆడవాళ్ల గొంతు వినిపించో ఏమో అక్కడున్న కొందరు బాధ్యతాయుతమైన పౌరులు మా ఆటో వైపు రావడం మొదలుపెట్టారు. అది చూసిన ఆటోవాలా గబుక్కున ఆటో స్టార్ట్ చేసేసి ముందుకు దూకించేడు. అంతే ... మా వదిన చేతిలో కాగితం సరిచేసుకుంటూ హై పిచ్చితో ఎత్తుకుంది.

"రింఝిం రింఝిం హైదరబాద్ ... రిక్షావాలా జిందాబాద్

మూడు చక్రములు గిరగిర తిరిగితే మోటరుకారూ బలాదూర్ ...

"రింఝిం రింఝిం హైదరబాద్ ... రిక్షావాలా జిందాబాద్"

ఆటోవాలా చెయ్యి అకస్మాత్తుగా వణికి ఆటో రోడ్డు మీద అటూ ఇటూ డేన్స్

చెయ్యడం మొదలెట్టింది. నాకు నోట మాట రాలేదు. ఆర్.టి.సి. క్రాస్‌రోడ్స్ నుంచి ఇందిరాపార్క్ వైపు వెళ్ళే మెయిన్‌రోడ్. కిక్కిరిసిన వాహనాల మధ్యలో ఒక ఆటోలోంచి ఆడగొంతుతో అంత గట్టిగా హైద్రాబాదు మీద పాట వినిపిస్తుంటే కార్లమీద వెళ్ళేవాళ్ళు అద్దాలు దింపుకుని చోద్యం చూస్తున్నారు. మోటార్ సైకిళ్ళ మీదా, స్కూటర్ల మీదా వెళ్ళేవాళ్ళు పూర్తిగా ఇటువైపు తిరిగిపోయి, కొంతమంది బేలన్స్ తప్పి పడబోయారు. రోడ్డు క్రాస్ చేయడానికి అటూ ఇటూ నిలబడ్డ మనుషులు వాహనాలకి అడ్డం పడిపోయారు. ఒక్కసారిగా అన్ని వాహనాల హారన్లూ హోరెత్తి మోగసాగాయి. మొత్తానికి నానా గందరగోళంగా అయిపోయింది ఆ రోడ్డు. వదిన మొదలెట్టిన పాట చరణాలతో సహా పూర్తయ్యాయి. కాగితం మూసిన వదిన్ని చూసి నేను తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను. షాక్ నుంచి కాస్త తేరుకున్న ఆటోవాలా బింకంగా “నేనిట్ల రోడ్లన్ని తిప్పుత. ఏటిసేస్తవ్ ?” అన్నాడు వదిన్ని బెదిరిస్తూ.

వదిన మొహం మరింత కఠినంగా మారిపోయింది. బొత్తిలోంచి మరో కాగితం పీకింది. అంతే.

“చల్ చల్ రె మేరీ సాథి ...

హమ్ బన్గయి హైదరబాదీ

తన ఒడిలో చోటిచ్చే ఈ హైదరబాదికి సాటింకేదీ ...” అంటూ హాపీ మూవీలో పాటందుకుంది.

అసలే అది హుషారుగా డాన్స్ చేసే స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ పాట. పైగా మా వదినది హైపిచ్చి. చుట్టూ వున్న వాహనాల రణగొణధ్వని వదిన పాటకి ఆర్కెస్ట్రా అయింది. లోయర్ టాంక్‌బండ్ రోడ్డు దాటి ఆటో నెక్లెస్ రోడ్లోకి ప్రవేశించింది. రెండు చరణాలూ పూర్తిగా పాడిన వదిన పాట పూర్తైంది. మళ్ళీ హమ్మయ్య అనుకోవాలా వద్దా అనుకుంటున్నంతలో ఆటోవాలా బ్రతిమాలుతున్నట్టుగా మీటర్‌ని చూపిస్తూ

“మీటర్ ఖరాబైంటున్న గదమ్మా ...” అన్నాడు.

వీరనారి వదిన వాడి మాట పట్టించుకోకుండా బొత్తిలోంచి మరో కాగితం తీసింది. అదేమిటా అని భయపడుతున్న నాకు వదిన మరింత శృతిపెంచుతూ, ఆ కాగితంతో ఆ ఖరాబయిన మీటర్ మీద కొడుతూ ...

“ఎవరికోసం ... ఎవరికోసం ... ఈ ప్రేమ మందిరం ... ఈ శూన్య నందనం ఎవరికోసం ... ఎవరికోసం ...” అంటూ అందుకుంది. నాకు దడ మొదలయ్యింది.

ఆటోవాలాకి స్పృహ తప్పుతుందేమో ననిపించింది. అంత పెద్ద పాట పూర్తయేసరికి ఆటో విశ్వేశ్వరయ్య స్టాట్యూ దాటి పంజగుట్ట రోడ్డు పట్టింది.

ఏదో మర్యాదస్తులమని పిలిపించుకుంటున్న వాళ్లం. నగరం నడిబొడ్డున ఇలా అరిచినట్టు పాటలు పాడుతూ ఊరేగుతుంటే తెలిసినవాళ్ళెవరైనా చూస్తే ... నాకు గాభరాలాంటిది వచ్చింది. వదిన చెయ్యి పట్టుకుని బతిమాలుతున్నట్లుగా "వదినా, అందరూ యిటే చూస్తున్నారు ..." అన్నాను.

ఆవేశంతో నా చేతిని వదిలించుకుంటూ బొత్తిలోంచి మరో కాగితం తీసి ఇంకా గట్టిగా "జయమ్ము నిశ్చయమ్మురా ... భయమ్ము లేదురా ... జంకు గొంకు లేక ముందు సాగిపొమ్మురా ... సాగిపొమ్మురా ..." అంటూ ఎత్తుకుంది. నాకు ఏం చెయ్యాలో తోచక బిగుసుకుపోయి కూర్చుండిపోయాను.

దారంతా మా ఆటోలోకి తొంగి చూస్తున్న వాళ్ళనూ, మా ఆటోకి అడ్డం పడిపోతున్న వాళ్లనూ తప్పించుకుంటూ నడపడానికి ఆటో అబ్బాయి మహా తిప్పలు పడుతున్నాడు. దానికి తోడు వెనక సీటులోంచి వస్తున్న అనంతమైన పాటలకి అతని బుర్ర పనిచెయ్యడం కూడా మానేసింది. వదినకేమీ కాలేదు కదా ... నాకు భయం వేసింది. నాకు నేనే ధైర్యం తెచ్చుకుని నెమ్మదిగా వదిన చేతిమీద చెయ్యి వేసి, "వదినా, అన్నయ్యకీ విషయం తెలిస్తే కోప్పడతాడు ..." అన్నాను.

మా వదిన మహా పతివ్రత. మా అన్నయ్య గీచిన గీటు దాటదు. అన్నయ్య మాట గుర్తుచేసి ఆమెని ఆపేను కదా అనుకున్నంతసేపు పట్టలేదు నాకు, వదిన కవర్‌లోని కాగితాల బొత్తిలోంచి ఇంకో కాగితం తీసింది. "ఎవ్వరికోసం ఎవరున్నారూ పోండిరా పోండి ... నా కాలం ఖర్మం కలిసొస్తేనే రండిరా రండీ ..." అని మొదలెట్టింది.

ఇంక అన్నయ్య మాట మీద కూడా ఆశ వదిలేసుకున్నాను. ఆ పాట పూర్తయ్యేసరికి ఆటో సత్యసాయి నిగమాగమం ముందు ఆగింది. ఆటోని ఆపగానే ఆటోవాలా దూకుతున్నట్టే ఆటో దిగేసి, మా వదినకి దండం పెట్టేస్తూ "అమ్మా, దిగండమ్మా ..." అన్నాడు. హమ్మయ్య అనుకుని దిగబోతుంటే వదిన నన్ను ఆపి, "మీటర్ వెయ్యి" అంది ఆటోవాలాతో. వాడికి మళ్ళీ మతిపోయింది.

"మీరు దిగుతానన్నది ఈడేనమ్మా ..." అన్నాడు బలవంతంగా మాటలు కూడదీసుకుంటూ. "ముందు నువ్వు ఎక్కి ఆటో స్టార్ట్ చేసి మీటర్ వెయ్యి. అప్పటి దాకా దిగను" అంది వదిన స్థిరంగా. నేను అయోమయంగా చూసాను. ఆటోవాలా కళ్ళు తుడుచుకుంటూ ఆటో ఎక్కి స్టార్ట్ చేసి మీటర్ వేసాడు. మీటర్ తిరగడం మొదలయ్యింది. మా వదిన మొహం విచ్చుకుంది. పదడుగులు వెళ్ళగానే "ఆపు"

అంది. టక్కున ఆపాడు వాడు. అప్పుడు ఆటోలోంచి దిగి, మీటర్ ఎంతయిందో అన్నట్టు దానినోసారి తొంగి చూసి, పర్స్‌లోంచి మినిమమ్ ఫేర్ తీసి ఆటోవాలా చేతిలో పెట్టింది. గిఫ్ట్ పేకెట్ అందుకుందుకు నావైపు చెయ్యి చాపింది. వదినకి గిఫ్ట్ అందిస్తున్న నా చేతిలో నూటయాభై రూపాయలుంచి ఆటో అబ్బాయి కిమ్మన్నట్టు సైగ చేసింది. ఆటోలోంచి దిగిన నేను అతని మొహం చూడాలని వున్నా అంత ధైర్యం చెయ్యలేక అతని చేతిలో వదిన ఇచ్చిన డబ్బు పెట్టేసి, విజయగర్వంతో పెళ్ళి మంటపంలోకి వెడుతున్న వదిన్ని కలవడానికి అడుగులు గబగబా ముందుకే వేసాను❊

**యామిని - అంతర్జాల పత్రిక : జులై, 2015**

క్రిస్టినీ ఫెయిర్ అనే అమెరికన్ వనిత హైదరాబాద్ వచ్చినప్పుడు ఆటోవాలా మీటర్ వెయ్యనంటే బోలెడు హిందీ పాటలు పాడేసి అతని చేత మీటర్ వేయించిందన్న వార్తకు స్పందించి ...

**జి.ఎస్. లక్ష్మి**





# రచయిత్రి పరిచయం

పూర్తిపేరు గరిమెళ్ళ సుబ్బలక్ష్మి. శ్రీమతి పద్మావతి, శ్రీ పిడపర్తి సుబ్బయ్య శాస్త్రి గార్ల ద్వితీయ పుత్రికను. చిన్నతనం నుంచి సంగీత సాహిత్యాలపై ఆసక్తి కలిగించారు మా నాన్నగారు. వివాహమయ్యాక మావారు నన్ను అన్ని విధాలుగానూ ప్రోత్సహించారు. మావారు గరిమెళ్ళ విశ్వనాధంగారు. హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా చేసారు. ఇద్దరు పిల్లలు. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి.

నేను బి.ఎ. (లిట్), ఎమ్.ఎ. (సోషియాలజీ), డిప్లొమా ఇన్ మ్యూజిక్ (కర్నాటక సంగీతం, వీణ) చేసాను.

గత పన్నెండు సంవత్సరాల నుంచీ వరసగా కథలు రాస్తున్నాను. నా కథలకు బహుమతులిచ్చి నన్ను ప్రోత్సహించారు పత్రికా సంపాదకులు. ఇప్పటి వరకూ డెబ్భైకి పైగా కథలు వివిధ ప్రింటు, అంతర్జాల పత్రికలలో ప్రచురించబడ్డాయి.

"ఒక ఇల్లాలి కథ" అన్న నవల 6 సెప్టెంబర్, 2007 నుండి 17 జనవరి, 2008 వరకు 20 వారల పాటు ఆంధ్రభూమి పత్రికలో ధారావాహికంగా ప్రచురించబడింది.

"నాన్నలూ.. నేర్చుకోండిలా." మినీ నవలగా నవంబర్, 2011 ఆంధ్రభూమి మాసపత్రిక లో ప్రచురించ బడింది. కొన్ని కథలు కథావాహిని, ఆటా (అమెరికన్ తెలుగు అసోసియేషన్) జ్ఞాపకసంచిక, కథాకేళి, ప్రమదాక్షరి కథాసంపుటాలలో చోటు చేసుకున్నాయి. ఇరవై సంవత్సరాల నుండి ఆకాశవాణిలో పలు ప్రసంగాలు, కదంబ కార్యక్రమాలూ ప్రసారమయ్యాయి.